TIGHT BINDING BOOK

# THE BOOK WAS DRENCHED

UNIVERSAL
LIBRARY
OU_204055
UNIVERSAL
LIBRARY

# అబలాసచ్చరిత్రరత్నమాల

ద్వితీయ సంపుటము

ఇది

శ్రీమతి భండారు అచ్చమాంబ ప్రణీతము

[illegible] వేయి

వేద[illegible] కంపెనీ, ముద్రాక్షరశాల

౧౩, [illegible] వీధి

మద్రాసు

౧౯౧౮

సర్వస్వామ్య సంకలితము

వెల రు. ౧-౪-౦

# అంకితము

ఎవరి యపూర్వ కృపాకటాక్షంబుచే నాకీగ్రంథంబు వ్రాయునంత

శక్తియు స్వాతంత్ర్యంబును గలిగెనో, నా శరీరమునందలి

చర్మంబుచేఁ బాదరక్షల నిర్మించి జన్మజన్మంబులకును

కాళ్లకుఁ దొడిగినను నెవరిఋణంబుదీరదో నేను

యింతవఱకు నే సుఖము ననుభవించితినో, యెవరు

నాకు దేవాది దేవునికంటె నధిక

తమమగుచున్న దేవుండో

యట్టి నాప్రియభర్త

యగు

మ-రా-రా-శ్రీ భండారు మాధవరావుగారి

దివ్యపాదపద్మములకు

నీ గ్రంథంబు సమర్పించి

యాంకితం బొనర్చుచున్న దాసను.

భండారు-అచ్చమాంబ.

Printed & Published
Through
UTTAMAGRANDHALAYAM
145, Mint Street, Madras.

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| రాణీసంయుక్త | ... | ... | పేజి ౧ |
| ఉమాబాయిదాభాడే | ... | ... | ౧౨ |
| [illegible] | ... | ... | ౧౬ |
| [illegible] | ... | ... | ౨౧ |
| [illegible] | ... | ... | ౨౪ |
| [illegible] | ... | ... | ౨౮ |
| [illegible] | ... | ... | ౩౬ |
| మొల్ల | ... | ... | ౪౪ |
| [illegible] | ... | ... | ౪౮ |
| [illegible] | ... | ... | ౫౧ |
| [illegible] | ... | ... | ౫౭ |
| [illegible] | ... | ... | ౬౦ |
| [illegible] | ... | ... | ౬౭ |
| [illegible] | ... | ... | ౭౪ |
| [illegible] | ... | ... | ౮౬ |
| [illegible] | ... | ... | ౯౦ |
| మహారాణి [illegible]లక్ష్మీబాయి | ... | ... | ౧౧౭ |
| విమలదేవి | ... | ... | ౧౪౪ |
| లీలావతి | ... | ... | ౧౪౭ |
| [illegible] | ... | ... | ౧౫౦ |
| మహారాణీ త్రిపురసుందరి | ... | ... | ౧౫౭ |
| సావిత్రీబాయి [illegible] | ... | ... | ౧౬౦ |
| [illegible] | ... | ... | ౧౬౫ |
| [illegible] | ... | ... | ౧౭౦ |

| | | | |
|---|---|---|---|
| రాణీసాహేబ్‌కువరు | ... | ... | ౧౭౭ |
| కమలాదేవి | ... | ... | ౧౮౨ |
| తారాబాయి | ... | ... | ౧౮౬ |
| గన్నోరుసంస్థానపురాణి | ... | ... | ౧౯౩ |
| జసకేర్వరి | ... | ... | ౧౯౭ |
| జోధపురపురాణి | ... | ... | ౨౦౭ |
| విమల | ... | ... | ౨౧౩ |
| పద్మావతి | ... | ... | ౨౨౦ |
| కృష్ణాకుమారి | ... | ... | ౨౩౨ |
| మైనలదేవి | ... | ... | ౨౩౮ |
| రఖమాబాయికేసు | ... | ... | ౨౪౨ |
| నాచి | ... | ... | ౨౪౭ |
| సరసవాణి | ... | ... | ౨౫౦ |
| చాందబీబీ | ... | ... | ౨౬౧ |
| ధనలక్ష్మి | ... | ... | ౨౭౦ |
| విద్వత్కుటుంబము | ... | ... | ౨౭౯ |
| మహారాణిస్వర్ణమయి | ... | ... | ౨౮౪ |
| వనలతాదేవి | ... | ... | ౨౯౦ |
| గౌరాంబ | ... | ... | ౨౯౫ |

# పీఠిక

కీర్తిశేషురాలైన శ్రీమతి. బండారు అచ్చమాంబగారు రచించిన అబలాసచ్చరిత్ర రత్నమాలలో కొన్ని చరిత్రములు ఇదివరలో నేను ఎచ్. వి. కృష్ణలో భాగస్థుడుగా నుండగా మొదటి సంపుటముగా ప్రకటించితిని. ఇట నే వర్ణింప నవసరముకాని కొన్ని కారణములచే రెండవ సంపుటము నింత కాలము దనుకను ప్రకటింపజాలనైతిని. ఆంధ్రలోక మీ రెండవ సంపుటమునకై యెదురు చూచుచున్నదని నే నెరుగనివాడను కాను కావున నిప్పుడు యుద్ధ సమయమే యైనను గ్రంథములకు వలయు సర్వోపకరణములు మిక్కిలి ధర హెచ్చియున్నను సాహసించి పనిబూని నేటికీ గ్రంథమును వెలియిడ గలిగితిని. అవ్యాజభ్రాతృ వాత్సల్యమున నాకిట్టి ప్రకటనా స్వాతంత్ర్యము ననుగ్రహించియుండు మాకొమఱ్ఱాజు లక్ష్మణరావు ఎం. ఏ. గారికి హృదయపూర్వక కృతజ్ఞతను తెలియజేయుచున్నాడ. ఇంకను అచ్చమాంబగారు వ్రాసిన చరిత్రములు బాగుగా తెలియని సతీమణుల వృత్తాంతములును వారు రెండవ భాగముగా తలపెట్టి కొంతవరకు సాగించిన పురాణకాలపు స్త్రీలచరిత్రములును ప్రకటితములు కావలసియున్నవి. దీనిని మూడవసంపుటముగా ప్రకటింపనున్నాను. ఈ రెండవసం

పుటముద్రణమున అచ్చుచిత్తుల దిద్దుటలోను మరి యితరవిధము
నునాకత్యంత సహాయకుడైన బైసాని. నరసింహేశ్వర గుప్త
గారికి నాయభినందనము లర్పించుచున్నాను. ఆంధ్రలోక మెప్పటి
వలె నాప్రయత్నము నెడల నభిమానము జూపినను కృతజ్ఞు
నోనర్చుగాక యని ప్రార్థించుచున్నాను.

3, న్యాపంగి శాఖవీధి,
చింతాద్రిపేట.

ఇట్లు, గ్రంథకర్త, సంపా.,
గా-హరిసర్వోత్తమరావు.

# అబలాసచ్చరిత్రరత్నమాల.

## రెండవభాగము.

## రాణీసంయుక్త.

౧౨వ శతాబ్దమునందు రాథోడ్‌వంశీయుఁడగు జయచంద్రుఁడు కనోజ (కాన్యకుబ్జ) రాజ్యమును, చహ్వాణవంశోద్ధారకుఁడగు పృథివీరాజు ఢిల్లీరాజ్యమును పాలించుచుండిరి. ఈయసామాన్యపరాక్రమవంతు లిరువురిలో సంయుక్త జయచంద్రునకుఁ గూఁతురును పృథివీరాజునకు భార్యయు నయ్యెను. కాన నా రెండువంశములును నామెవలనఁ బవిత్రము లయ్యె ననుటకు సందేహము లేదు.

జయచంద్రునకు సంయుక్త యొక్కతయే కూఁతు రగుట వలన జయచంద్రుఁడు సంయుక్త నెక్కువ గారాబముతోఁ బెంచెను. సంయుక్త స్వభావమువల్లనే సద్గుణవతిగానఁ బెరిఁగినకొలఁది ననేకవిద్యల నేర్చి మిగుల నుతి కెక్కెను. ఆమె సద్గుణములను లావణ్యమును గనిన ప్రజ లందఱుఁ దమజన్మము సార్థక మయ్యెనని తలఁచి సంతసించుచుండిరి. ఇట్లీమె కొన్నిదినములు బాల్యావస్థయందుఁ గడపి యౌవనావస్థం దాల్చెను.

ఇట్లు యుక్తవయస్కురా లగుబిడ్డకుఁ దగినవరుఁ డెవఁడా యని జయచంద్రుఁడు చింతింపసాగెను. సంయుక్త రూపలావణ్యములకీర్తి సకలదిక్కులను వ్యాపిం నందున ననేకరాజపుత్రు

లామెను దమ కిమ్మని కోరుచు వర్తమానము లంపిరి. ఢిల్లీపతి యగు పృథివీరాజా జామె రూపగుణములను విని యామెను నెటులయినఁ జేపట్ట నిశ్చయించెను. సంయుక్తయు ననేకపర్యాయములు పృథివీరాజు పరాక్రమములను విని రూపము చూచి యున్నందువలన నాతని నే వరించెదనని మనంబున నిశ్చయించుకొనియెను జయచంద్రుఁడు తనకూఁతునకుఁ దగినవరుఁడు దొరకవలయునని స్వయంవరము చేయనెంచెను. పుత్రికవివాహమునకుఁ బూర్వము రాజసూయము చేయ నిశ్చయించి సకల దిక్కుల రాజులకును వర్తమానము లంపెను. జయచంద్రుఁడు పరాక్రమవంతుఁ డగుట వలన నితరమాండలిక రాజు లందఱాయన పిలిచినదినమునకు వచ్చి కనోజనగరము నలంకరించిరి. పృథివీరాజు మాత్రము జయచంద్రునితోఁ గల పూర్వవైరమువలన నా యుత్సవమునకు రాకుండెను. అందునకు జయచంద్రుఁడు మిగుల కోపించి యాతనితోఁ గలవైరమువలన, పృథివీరాజు ప్రతిమ నొకదానినిఁ జేయించి యాప్రతిమను ద్వారపాలకుని స్థలమునందుంచి, తనపగ సాధించెను. యజ్ఞము విధిప్రకారము జరిగినపిదప స్వయంవరోత్సవ మారంభమయ్యెను. అప్పు డనేక దేశాధీశులొకచోట నానందముగాఁ గూడినందున కనోజపట్టణము మిగుల నందముగాఁ గానిపించెను.

రాజాజ్ఞప్రకారము మంత్రులు మండపము నలంకరించి రాజుల నందఱిని వారి వారికిఁ దగుస్థానములఁ గూర్చుండఁబెట్టిరి. అటుపిమ్మట సంయుక్త చేతఁ బుష్పమాలను ధరియించి సఖీసహితయయి యామండపమునకు వచ్చెను. రాజకన్య సభకు రాఁగానే రాజపుత్రు లందఱి చూపులు నామెవైపునకే మరలెను. ప్రతి

భూపతియు నామెతనను వరియింపవలెననికోరుచుండెను. సంయుక్త మిగుల గంభీరదృష్టితో రాజలోకమునంత నొకపారి కలయఁ జూచెను. తన కిష్టుఁడగు పృథవీరాజచటికి రాలేదనియు ఆయనను బరిహాసించుటకొరకాయన ప్రతిమ నొకదానిని జేసి ద్వారమునం దుంచిరనియు నామె కంతకుఁ బూర్వమె తెలిసియుండెను. అందువలన నాబాల యొకగడియవఱకే యోచించి తుదకు దృఢనిశ్చయురాలయి చిన్నఁగా నడిచి ఢిల్లీశ్వరప్రతిమను సమీపించి యామూర్తికంఠమునందుఁ బుష్పహారమును వేసెను. దాని గనినతోడనే సభయందంతట నొకకల్లోల మయ్యెను. జయచంద్రుఁ డిట్టియవమానమును సహింపఁజాలక కోపావేశపరవశుఁడై "దుష్టురాలగు దీనిని గారాగృహమునం దుంచుఁ" డని యాజ్ఞాపించెను. అంత రాజు లందఱు నిరాశను బొంది తమతమనగరములకుఁ జనిరి. ఇదియే యీదేశమున జరిగిన కడపటి స్వయంవరము.

ఈసంగతి యంతయు విని పృథవీరాజు పరమానందభరితుఁడయ్యెను, జయచంద్రుఁడు తనను బఱచిన యవమానమును సంయుక్త తనయందుఁ గనఁబఱచిన ప్రేమయు నేకీభవించి తన్నుఁ ద్వరపెట్టఁ బృథవీరాజు జయచంద్రునిపై యుద్ధయాత్ర వెడలెను. ఇట్లాయన శూరులగు యోధులతోఁ గనోజపట్టణము సమీపమున విడిసెను. అచట నున్న కాలముననే యొకరాత్రి మిగుల రహస్యముగాఁ బృథవీరాజు సంయుక్తను గలిసి గాంధర్వవిధిచే నామెను వరియించెను.

వీరివివాహవార్త యొకరిద్దఱు దాసీలకుఁ దప్ప నితరుల కేంతమాత్రముఁ దెలియదు. పృథవీరాజు వచ్చి తనగ్రామముబైల

విడియుట విని యాతనినిఁబట్టి తెండని జయచంద్రుఁడు మూఁడు వేలసైన్యము నంపెను. కహారకంఠీరుఁ డనువాని ముందిడుకొని శత్రుసైన్యములు తమవైపునకు వచ్చుటఁ గని పృథివీరాజును వారితోఁ బోరుటకు సిద్ధముగా నుండెను. తదనంతర మారెండుసైన్యంబు లొండొంటిం దాఁకి మిగుల ఘోరంబుగాఁ బోరసాగెను. అందుఁ బృథివీరాజు సేనానియగు ఆతతాయిని జయచంద్రుని సైన్యాధిపతియగు కహారకంఠీరునకును ద్వంద్వయుద్ధంబు ప్రాప్తించెను. ఆశూరు లిరువురును సింహనాదములు చేయుచు నొండరులతో నెక్కుడు పంతంబులు పలుకుచు నొకరినొకరు నొప్పించుచుండిరి. అంతఁ గొంత సేపటికి భటుల యొక్కయు, గుఱ్ఱములయొక్కయు, నేనుఁగులయొక్కయు, దేహములనిండ కారురక్తము ప్రవాహమయి పాఱఁదొడఁగెను. అట్టిసమయమున కహారకంఠీరుని రోషావేశ మధిక మయినందున నాతఁడు తనరథంబుడిగ్గి ఆతతాయిని తనఖడ్గమునకు బలియిచ్చి పృథివీరాజు కంఠముఁ దెగ నేయ నుంకించెను. కహారకంఠీరుని శౌర్యమున కోడి పృథివీరాజు బలంబులు చెదరి పాఱసాగెను. అట్టిసమయంబునం దాకస్మికముగా నొకశౌర్యనిధి యచటికవచ్చి పృథివీరాజు కంఠముపైఁ బడ నున్నఖడ్గమును దునియలుచేసి యాతనిఁ గాపాడెను. ఈపరాక్రమవంతుఁ డెవఁడో యొకరాజపుత్రుఁడని చదువరులు భ్రమపడవలదు. అట్లు తన సాహసమువలనఁ బృథివీరాజును గాపాడినది యాతనిపత్నియు జయచంద్రునికూఁతురు నగు సంయుక్తయే. ఆమె తనభర్తను గలసి యాతనితో వెళ్ళవలయునని బహుప్రయాసముతోఁ గారాగృహము వెడలి యతియోగ్యమైన సమయమున నాస్థలము

ప్రవేశించెను. తానెన్నఁడును సంగ్రామముఁ జూడనిదైనను ఆమె జంకక సమయసూచకత గలదియై తానును యుద్ధము చేసి తనభర్త ప్రాణములఁ గాపాడెను.

సంయుక్త వచ్చినపిదప పృథ్వీరాజు బలములు మరల చేరుకొని జయచంద్రుని సేనల నోడించెను. తదనంతరము పృథ్వీరాజు భార్యాసహితుఁడయి ఢిల్లీనగరమున కరిగెను. ఈదంపతు లిరువురును గొంతకాలమువఱకు పరస్పరానురాగము కలవారయి ప్రజలను తమబిడ్డలవలెఁ బాలించుచుండిరి.

ఇచ్చట జయచంద్రుఁడు పృథ్వీరాజు తనసైన్యము నోడించి తనకూఁతునుఁ గొనిపోవుటవలన సంతప్తహృదయుఁడయి పగతీర్చుకొన సమయము వేచియుండెను. ఇట్లీ దేశపురాజులలో నన్యోన్యద్వేషములు కలిగినసమయమున 'శాహాబుద్దీన్ మహమ్మద్ గోరీ' యనుమహమ్మదీయుఁడు హిందూదేశముపై దండువెడలెను. నాఁడిటికి వచ్చి దేశమంతను మిగుల నాశము చేయసాగెను. అనేక దేవాలయములఁ బడఁగొట్టియు జనుల నన్యాయముగాఁ జంపియు స్త్రీలపాతివ్రత్యములఁ జెఱచి వారిని తనదాసులను చేసికొనియు మహాక్రూరత్వమును జూపఁ దొడఁగెను. వానిపాపము సోఁకినచోటెల్లను నాశమొందుచుండెను. కాన నట్టివాని నోడించి పతివ్రతల పాతివ్రత్యమును, మఠమందిరములను గాపాడనెంచి పృథ్వీరాజు గోరీని శిక్షింపవెడలెను. అప్పుడు జయచంద్రుఁ డొకఁడు దక్క నితరరాజులందఱు ఆతనికిఁ దోడుపడిరి. కోపమే ప్రధానముగాఁ గల జయచంద్రుఁడు దేశక్షేమమును గోరి పృథ్వీరాజునకుఁ దోడుపడకున్నను దేశీయుల దురదృష్ట

ఖురాను ముదరనందున నప్పటికిమాత్రము గోరీకి సహాయుఁడు గాకుండెను.

పృథివీరాజు మహాశౌర్యముతోఁ దిలావడీయను ఎడారి యందుఁ గోరీసైన్యముల పలుమాఱు నోడించెను. పృథివీరాజు పరాక్రమమున కోర్వఁజాలక తుదకుగోరీ బహుకష్టముతో పలాయితుఁ డయ్యెను. పృథివీరాజును విజయానందముతో నితర సామంతులతోఁ దననగరుఁ బ్రవేశించెను.

పృథివీరాజున కయినజయమువలన జయచంద్రున కధికవ్యసనము గలిగి యాతని మనం బెప్పుడును పృథివీరాజు చెఱుపునే కోరుచుండెను. అందువలన నాతఁ డెట్టి నీచోపాయమువలననయి నను బృథివీరాజునకుఁ జెఱుపుజేయ నిశ్చయించెను. అందువలన నాతఁడు తనదూతనంపి పాఱిపోవుచున్న గోరీని మరల మనదేశమునకుఁ గొనివచ్చెను. ఇట్లురప్పించి యాకుత్సితుఁడు తానతనికిఁ దోడుపడుటయే గాక యితరరాజుల ననేకులను నీకుఁ దోడు తెత్తునని నమ్మికఁ దోఁపఁబలికి యాతనిని మరల పృథివీరాజుపైకి యుద్ధమునకుఁ బురికొల్పెను.

జయచంద్రుని సహాయమువడసి మిగుల ధైర్యముతో గోరీ మరల ఢిల్లీనగరముపై దండువెడలెను. జయచంద్రుఁడు తానన్నప్రకార మితరరాజుల ననేకులను దనవెంటఁదీసికొని యాతురుష్కునికిఁ దోడుపడెను. ఇట్లుచేసి పృథివీరాజుల కిఁక జయము దొరకదని యాదీర్ఘక్రోధి సంతసించుచుండెను. దుర్జనులు తమ కార్య మీడేరుటవలన, దేశమునకంతకును నష్టము కలుగునని తెలిసినను వెనుకదీయరుకదా?

కాలిందీనదీతీరమునందు జయచంద్రుఁడు తనసేనలతో దిగి యొకదినము తనశిబిరంబులోఁ గూర్చుండి రాబోవుస్థితిని దలఁచుకొని సంతోషించుచుండెను. ఇంతలో నొకసేవకుఁడు తమవైరిసైన్యములోనుండి యొకరాయబారి తమతో మాటలాడ వచ్చెననియుఁ దమసెలవయినయెడల నాతని నిటకుఁ దోడ్కొని వత్తుననియుఁ జెప్పెను. అందు కాతఁ డాపరిచారకునితో నీ వావల నేయుండి యాతనిని నావద్దికిఁ బంపుమని చెప్పి తాను తనఖడ్గము చేతఁగొని కూర్చుండెను.

అంతఁ గొంతసేపటికి నొకతరుణుఁడచటికివచ్చి జయచంద్రునిపాదముల కెరగెను. ఆవచ్చినయోధుఁడు పురుషుఁడు గాక మనకథానాయికయగు సంయుక్తయే. కాన జయచంద్రుఁడు తనకోమార్తెను గుర్తించి నీ వేమికోరెదవని యడిగినంతోడనే యామె యిట్లనెను. "నాయనా! నేను తమయనుజ్ఞను బొంది మనదేశమునకు శత్రువగుగోరీని జంపఁగోరివచ్చితిని. ఈసమయమునందుఁ బెద్దల యాశీర్వచనముపడసిచనిన తప్పక జయము కలుగును." జయచంద్రుఁడు కూఁతుమాటలు విని కొంతతడ వేమియుఁ దోఁచకుండి పిదప "ఓసిస్వేచ్ఛాచారిణీ! ముందుజరుగఁబోవు ప్రజాక్షేమమున కంతకును నీవేకదా మూలమయినదానవు. పొమ్ము నీ విచటికి వచ్చి నాక్రోధమును హెచ్చించితివేగాని వేరులాభము లేదు" అని కోపముతో ననెను. అందుపై సంయుక్త మిగులవినయముతో "ఓ నాయనా! మీరు జన్మభూమిపై ఇంచుక దృష్టిసారింపుఁడు. నిరాశ్రితురాండ్రగు ననేకస్త్రీలమానమును గాపాడుఁడు. మన మెంతో భక్తితోఁ గొలుచు విగ్రహముల నాశమునకుఁ దోడుపడకుఁడు. మన

స్వాతంత్ర్యసుఖమును చెఱుపఁ బ్రయత్నించినయెడల సిదప విశేషదుఃఖము కలుగును." అని విన్నవించుకొనెను. ఇంతలో జయచంద్రుఁడు రోషారుణలోచనుఁడయి "నోరుమూసుకొని వెస్స్వ, నావద్ద నీవంటి దుష్టస్త్రీలు మాటలాడఁదగరు." అని ధిక్కరించెను. "ఇటులైన నాప్రార్థన యంతయు వృథపోయెనా?" యని యాకాంతాలలామ రౌద్రరూపము వహించి తండ్రి వంక జూచి యిట్లనియె. "పూర్వులార్జించిన సత్కీర్తిని నాశము చేసి మీదుష్కీర్తిని శాశ్వతపఱచుటకుఁ బూర్వమే నీకుమార్తైనయిన సన్మి యపకీర్తి వినకుండ నేల చావవైతివి? నీవు నాతండ్రివిగాన నేనింతగాఁ జెప్పవచ్చితిని కాని నీ యభిప్రాయ మెఱిఁగిన పిదప స్వదేశద్రోహికూతుఁ రనిపించుకొని బ్రతుకుట కంటెఁ జావు మేలని తోఁచుచున్నది."

ఆఁడుసింగమువలె నెదిరించి మాటాడుకూఁతున కేమియుఁ జెప్పఁ జాలక జయచంద్రుఁడు మెల్లఁగా నావలకరిగి యశ్వము నెక్కి యాతురకసైన్యములోని కేఁగెను. ఇచట సంయుక్త తండ్రి లోపలకువచ్చునని కొంతసే పెదురుచూచి యాతఁడు వచ్చుజాడగానక నిరాశతో మరలి తనపతిచెంత కేఁగెను ఉతడవ తమవైపున నల్పసైన్యమును పగఱవైపున నమితసైన్యమును గలదుగాన తన కపజయమే యగునని పృథ్వీరాజెఱిఁగి యాసంగతి సంయుక్తకుఁ దెలిపెను. ఆదంపతు లిరువురును ఇనుమంతయు ధైర్యము విడువక నొకరికొకరు తగునీతుల నుపదేశించుచు నుత్సాహయుతులై యుండిరి. వారిరువురి యాలోచనప్రకారము యుక్తమనితోఁచఁగా నామెఢిల్లికి ప్రయాణమయ్యెను. ఆమనసమయమునం దామె భర్తను నమస్కరించి

"ప్రాణేశ్వరా! తమరుక్షత్రియులుగాన మీశస్త్రాస్త్రములను కాపాడుకొని యుద్ధమునకు సిద్ధమగుడు, క్షత్రియులు తమదేశముయొక్కయు వంశముయొక్కయు ప్రతిష్ఠలకొఱకు ప్రాణములను విడిచిన నది మృతియనంబడదు. మనుజుఁడు జన్మించినందుకు ఫలముగా సత్కృత్యములఁజేసి సత్కీర్తినిబొంది యమరుఁడు కావలయును. తమకు జయము దొరకిన మరల మన మిరువురును సుఖమనుభవింతుము. లేనిపక్షమున నేనును తమతో స్వర్గసుఖ మనుభవించుటకు శీఘ్రముగ నేవత్తును." అని ధీరోక్తులు పలికెను. అందుకుఁ బృథివీరాజు తనభార్యను కౌఁగిలించుకొని "తీమణీ! నాదేహములోఁ బ్రాణము లుండునంతవఱకు నేను శత్రువులకు వెన్నియ్యనని దృఢముగా నమ్ముము. నా సైనికులును కీర్తికాములేగాన నా రెప్పుడును పరాజయముఁ బొంది మరల తమముఖము లితరులకుఁ జూప నిచ్ఛయింపరని నేను నమ్మెద" నని చెప్పెను. ఆవాక్యములు విని సంయుక్త "స్వామీ! ఢిల్లిలోని స్త్రీలు తమ్ముఁదాము రక్షించుకొనుటకు నసమర్థురాండ్రుగాన నే నిపు డచటి కరిగి వారి కందఱకును ధైర్యము చెప్పెదను. నే నిచటనే యుండిన నాకాంత లేమియుఁ దోఁచక యుండెదరు. ఏది యెట్లయినను మిమ్మును గెలిచి యామ్లేచ్ఛుఁడు ఢిల్లీకిఁ వచ్చెనా వానికి రాజపుత్రస్త్రీ యొకతయయిన జీవముతోఁ దొరకనేరదు." అని యామె ఢిల్లీకిఁ బోయెను. అచట నామె మిగుల నియమముతోఁ బరమేశ్వరుని తనభర్తకు విజయము నిమ్మని ప్రార్థన సేయుచుండెను. ఆమెయుపదేశము విని యానగరమునందలి యువతులందఱామెవలెనే ఢిల్లీశ్వరునకు

విజయము కలుగవలయునని పరమేశ్వరు ననేకవిధముల వేడు కొనుచుండిరి.

తుద కొకదినమున నాసైన్యములు రెండును నొండొంటిం దాఁకె నాయుభయ సైన్యములలోని వీరులును దమతమ సంగ్రామకౌశలములు మీఱ ఘోరంబుగాఁ బోరఁ దొడంగిరి. వా రట్లు పోరుటచే నాకాశమంతయు ధూళిగ్రమ్మి సూర్యుని మఱుఁగు పఱచెను. అంతఁ గొంతవడికి నాధూళి యడఁగి రక్తనదులుఁ బాఱఁజొచ్చెను. పీనుఁగులవెంట లనేకములు పడెను. ఇట్టి రణరంగమునందు పృథివీరాజునకు నపజయము కలిగెను. కాని యాతనిసైనికులలోఁ శత్రునకుశరణు చొచ్చినవాఁడేని యుద్ధభూమినుండి పాఱిపోయినవాఁడేని కానరాకుండెను. పృథివీరాజుకుగూడ నాయుద్ధమునందే మడిసెనని కొందఱు చెప్పెదరు. గోరీవిజయుఁడయి పృథివీరాజును చెఱఁబట్టి గ్రుడ్లు తీసివేసి యాతనిపాదములకు మిక్కిలి బరువు లయినలోహపుబేడీలను వేసి కారాగృహమునందుంచెననియు, నీసంగతి యంతయు విని పృథివీరాజుమంత్రియు, నతనిచరిత్ర లేఖకుఁడను, మహాకవియునగు చాందభట్టు గోరీయాస్థానమున కరిగికొన్నిదినము లచటనుండి యాతనికృపకుఁ బాత్రుఁడై పృథవీరాజును చూచుటకనుజ్ఞవడసెననియు, అట్లు సెలవంది కారాగృహమున కరిగిపృథివీరాజును పలుకరింపఁగా నాతఁడు కన్నులు లేకున్నను మాటను గుర్తించి యాభట్టును కౌగిలించుకొనెననియు, అచట వారిరువురు నొకయుక్తివలన నాతురష్కునిఁ జంప నిశ్చయించుకొనిరనియు, అందుపై చాందుభట్టు గోరీయొద్దికివెళ్లి ప్రసంగరీత్యా పృథివీరాజుయొక్క బాణనైపుణ్యమును వర్ణించుచు నాతఁ డిపు

డు కన్నులు లేకున్నను శబ్దముజాడపట్టి సూటిగా బాణము వేయు నని చెప్పఁగా గోరీ యావిచిత్రమును గనుటకై యొకసభ చేసి యాసభకు పృథివీరాజును బిలిపించి యతనికి నతనివిల్లు బాణము లిచ్చి చమత్కారమే మయినఁ జూపుమని యజ్ఞాపించెననియు, అమాటసూటినిబట్టి బృథివీరాజాతనిపై బాణము వేయ నాతఁడు (గోరి) మృతినొందెననియు, తదనంతరము చాందుభట్టు పృథివీ రాజు లిరువురును మరకలచేఁ బడక యాసభయందే యొకరినొకరు పొడుచుకొని జీవములను విడిచిరనియు మఱికొందఱు చెప్పెదరు. పైనిజెప్పఁబడిన శరసంధానమహోత్సవ మంతయు మనదేశముననే జరిగినదని యొకరును, తురకదేశమున జరిగెనని ఇంకొకరును వక్కాణించెదరు. వీనిలో నేదినిజమో మనము చెప్పఁజాలము.

గోరీకి జయముకలిగి వాఁడు ఢిల్లీకి వచ్చుచున్నవాఁ డనిన వార్త వినఁగా పట్టణములోని స్త్రీలందఱితో సంయుక్త యగ్ని ప్రవేశము చేసెను. గోరీ ఢిల్లీకివచ్చి చూచునప్పటికి గ్రామమంతటు భస్మరాసులవిచ్ఛిన్నముగాఁ గానవచ్చుచుండెను.

# ఉ మా బా యి దా భా డే.

ఈయుమాబాయి మహారాష్ట్ర రాజ్యసంస్థాపకుండగు ఛత్రపతి శివాజీగారిమనుమండగు శాహురాజు కాలమునం దుండినట్లు తెలియవచ్చుచున్నది ఉమాబాయి మామగారగు ఏసుపాటిల్ దాభేడేయను నాతండు శివాజీగారివద్ద నొక భృత్యుం డుగానుండెను. కాని శివాజీ రెండవకుమారుండయిన రాజా రాముగారి పరిపాలనదినములలో నాతండును అతనిపుత్రు లిరువురును స్వహితము నెంచక స్వామికార్యము నిర్వహించినందువలన నాటినుండియు రాజు మెచ్చివారికి సేనానిత్వ మొసంగెను. ఈయేసుపాటిలు పెద్దకుమారునిపేరు ఖండోజీ. ఖండోజీగారి భార్యపేరు ఉమాబాయి.

శాహుమహారాజుగారుఢిల్లీనుండి స్వరాజ్యమునకు వచ్చిన వెనుక మరల మహారాష్ట్రులరాజ్య మించుక యున్నతావస్థం బొంద నారంభించెను. ఇట్టిసమయమునందు ఖండేరావు దాభాడే తనశౌర్యమువలన ననేక సంగ్రామములంలో జయమును సంపాదించి మిగుల నుతికెక్కెను. బాలాజీ విశ్వనాథపేష్వాగారును, ఖండేరావును ప్రాణస్నేహితులుగానుండిరి. కాని వారిరువురి యనంతరమునందు వారియుద్యోగముల కర్తలైన వారిపుత్రులైన ప్రథమబాజీరావు పేష్వాగారికిని త్రియంబకరావు సేనాపతికిని తండ్రుల నాటిస్నేహాభావము లేక వైరముప్రాప్తించెను! బాజీరావు ఉత్తరహిందూస్థానమును దాభాడే ఘూర్జర దేశము నపహరింపం దలంచిరి. అప్పు డాయిరువు రొకరిపై నొక

రనేక కారణముల నారోపించి యుద్ధసన్నద్ధులైరి. ఆయుద్ధము నందు దాభాడే తన యసమానశౌర్యముం గనుపఱుప నాతని గెలుచుట దుస్తరమని తలంచి బాజీరావు మిగుల నన్యాయముగా నాశౌర్యనిధిని సంగ్రామంబునం గూలనేసెను. ఈసంగతి త్రియంబకరావు తమ్ముఁడగు యశవంతరావు దాభాడేకుఁ దెలియఁగా నాతఁ డధికరోషాయత్తచిత్తుఁడయి బాజీరావు నంత మొందింపక యన్నగారిక్రియలు జరుపనని ప్రతినపట్టెను. అందుకు ఉమాబాయియు సమ్మతించి తానును యుద్ధమునకు వచ్చెదనని చెప్పెను. ఆవార్తవిని బాజీరావు మిగుల దైన్యము బొంది శాహును మధ్యస్థునిగ రమ్మని వేఁడుకొనెను. అప్పుడు శాహు మహారాజాతనిం దనవెంటఁగొని తళేగామను గ్రామమునందు ఉమాబాయినింగని బాజీరావు నాయమపాదములపైఁ బడవేసి "ఖండేరావు దాభాడేగారును, బాలాజీ విశ్వనాథరావును అన్నదమ్ములవలె నుండిరి. కాన నీకీబాజీరావును పుత్రసమానుఁడు. కాన నీతని యపరాధము మన్నించి రక్షింపుము." అని రాజడుగఁగా నుమాబాయి తనమనముననుండిన వైరముఁ బాఱదోలి శరణాగతునకభయ మొసఁగెను.

తదనంతరమునందు మఱికొన్నిదినముల కీమె పుత్రుల నిద్దఱిని శాహుమహారాజుగారు అహమదాబాదు ఠాణాగెలుచుటకు వెళ్ళుఁడని యాజ్ఞాపించెను. పుత్రులు బాలురనియు, వారిరువు రీకార్యమును నిర్వహింపఁ జాలరనియు నెఱిఁగినదై ఉమాబాయి వారితోఁ దానును ప్రయాణమయ్యెను. ఆమె వీరపత్నియు, వీరమాతయు నగుటవలన నామెకు యుద్ధమనిన నింటిపనివలె సాధారణమై యుండెను. ఇంతలో ఉమాబాయి యిరు

వురుపుత్రులతోఁడఁదనను గెలువవచ్చుచున్న దనినవార్త అహమదాబాదఠాణేదారుఁడగు జోరావరఖాన్ బాబీయను నాతఁడు విని ఉమాబాయి కిట్లు వర్తమాన మంపెను. "నీవు అనాథవు; స్త్రీవి; నీపిల్ల లిరువురును అల్పవయస్కులు; గాన నీవు సైన్యసహితముగాఁ దిరిగి వెళ్లుటమంచిది. లేకున్న మేము మాతురకలప్రతాపముఁ జూపకమానము." ఈవార్తగల యుత్తరమును గని యుమాబాయియొక్క శౌర్యాగ్ని మరింత ప్రజ్వరిల్లెను. అంత నామె యీమ్లేచ్ఛుని గర్వమడఁచిననేగాని నేను భోజనము సేయను; అని ప్రతినపట్టి తనయొద్ది సరదార్లనందఱిని బిలిపించి యొకసభ చేసెను. సభ కందఱును వచ్చుటకుఁ బూర్వమే యామె పసపు, కుంకుము, గాజులును తెప్పించి సభామధ్యంబున నుంచెను. సభికు లందఱు వచ్చినపిదప నామెజోరావరఖాన్ బాబీ వ్రాసినయుత్తరము వారికి వినిపించి యిట్లు వక్కాణించెను. "ఇందుపైని అహమదాబాదు కిల్లాను జయించి యచటనే భోజనము చేయుదుననినిశ్చయించితిని. మీరందఱును నేటివఱకు నాయన్నము దినుచుండినవారలు; గాన నాప్రతినయందు నాదరమును అభిమానమును గలవారేని మరణమునకు భీతిల్లవలదు. తత్క్షణమే మీాతల నఱచేత నుంచుకొని నాతో యుద్ధభూమికిఁ జనుదెంచి మ్లేచ్ఛులతోఁ బోరాడుటకు సన్నద్ధులగుఁడు. లేక ప్రాణ భయముచే భీతిల్లెదరేని ఇచటనున్న పసపు, కుంకుమ పెట్టుకొని చేతికి గాజులు తొడుగుకొని మీామీాగృహముల కరిగి బ్రతుకుఁడు." ఇట్టివాక్యములు వినినపిదప యుద్ధమునకు జంకువాడాసభయం దొకఁడును కానరాఁడయ్యెను. కాన వారందఱాక్షణముననే యుద్ధసన్నద్ధులై పగఱపై దండువెడలిరి.

అప్పుడు ఉమాబాయియుఁ దనయంబారీచుట్టును చిక్కు-తెరలు కట్టించుకొని యాయుధహస్తయై గజారోహణముఁ జేసెను. ఆమెపుత్రు లిరువురును తల్లిపార్శ్వములఁ గూర్చుండిరి. ఈప్రకారము ఉమాబాయి సైన్యసహితముగా సంగ్రామరంగము నలంకరించెను. చూచితిరా యీమెధైర్యము! ఇదే కదా నిజమైనసాహసము.

ఇట్లు పరాక్రమవంతురాలగు ఉమాబాయి ఢిల్లీపతి సేనకుఁడగు జోరవరఖాన్ అను యోధుని నోడించుటకు సిద్ధముగా నున్న సమయమునందు వాఁడును పదివేలసైనికులతో నామె నెదిరించెను. అంత నాయుభయసేన లొండొంటిం దాకి పోరఁ దొడంగెను. ఇట్లు కొంతవడి సంగ్రామంబు జరిగినపిదప ఉమాబాయి సంగ్రామచాతుర్యము వలన తురకలకు నపజయము కలిగెను. అంత వాఁడు నగరునకుఁ బాఱి నగరద్వారములను మూసికొనెను. యుద్ధము అహమదాబాదుపొలిమేరనే జరుగుచుండినందున, నుమాబాయి సైనికులు వెంటనే పీనుఁగుమీఁద పీనుగును పేర్చి ప్రహారి నెక్కి అహమదాబాదులోనికిఁ బ్రవేశించిరి. సత్యప్రతిజ్ఞయగు నుమాబాయియు అహమదాబాదు కిల్లాలో నాఁడు భోజనము చేసెను.

# అర్గళ సంస్థానాధీశ్వరి.

"సాహసంబెజయము సంకటము."

ఈమె విహారదేశమునందు బక్సరుపట్టణసమీపమునందున్న అర్గళసంస్థానాధీశ్వరునిభార్య. ఈమె నామము తెలియుమార్గము లేనందున కొంతయుఁ జింతిల్లవలసి యున్నది. ఈ కాంతారత్నమును భార్యనుగాఁ బడసిన సంస్థానపతి పేరు గౌతముఁడు. ఆయన ఢిల్లీశ్వరునకుఁ గప్పము కట్టనందువలన ఢిల్లీపతి కాయనపై నధిక కోపమువచ్చి ఆయన నోడించి యతని రాజ్యమును వశపఱుచుకొనుమని అయోధ్య నవాబునకు ఢిల్లీశ్వరుఁ డుత్తరువు చేసెను. అంత నానవాబు సైన్యసహితముగా గౌతమరాజుపై యుద్ధసన్నద్ధుఁడై రాఁగా గౌతముఁడు సామాన్యుఁడు కానందువలన తా నొక చిన్న సంస్థానాధీశ్వరుఁడైనప్పటికి, శత్రువులకు జంకక వారితోఁ బోరి వారిని పరాజితులఁ గావించెను. ఇట్లు విజయముఁ బొంది విజయోత్సవములతో రాజంటికి వచ్చినందున నాఁడాపట్టణమునందంతట నుత్సవము లనేకములు జరుగుచుండెను.

ఇట్టిసంతోషకాలమునందు రాణీగారికి గంగాస్నానము చేయవలయునని యిచ్ఛపొడమెను. గంగాప్రవాహ మర్గళపట్టణసమీపముననే యున్నను, పరాజితు లయిన శత్రువు లచ్చట దాఁగియున్నందున నచటికి స్నానమునకుఁ బోవుట యతికష్టతరమై యుండెను. అయినను ఎట్టులనైన గంగాస్నానము చేయవలయునని రాణీగారు నిశ్చయించుకొనినందున తనవేషమును

మూర్చికొందఱు దాసీలను వెంటఁగొని, యొరు లెవ్వరెఱుఁగ కుండ గంగాస్నానమునకు బయలుదేఱెను. ఆమె చేరువు రేవు నకుఁ బోయి తానిట్టిదని యితరు లెఱుఁగకుండునటుల మిక్కిలి జాగరూకతఁ గలిగి స్నానము చేయుచుండెను. కాని యసమానసౌందర్యవతియగు రాజయువతి యెట్టివేషము వేసినను దాఁగుట దుర్లభముగాన, నెవరో యొకరాజస్త్రీ సమీపమునఁ గలరేవున జలకమాడ వచ్చిన దనినవార్త క్షణములో నా గంగాతీరమున వ్యాపించెను. అంత నచటికి సమీపముననున్న యయోధ్యానవాబున కీసంగతి తెలిసెను. పరాజితుఁడై మరలి పోవుచున్న సమయమున శత్రుస్త్రీ తనచేత ననాయాసముగా దొరకు నన్నమాట విని, తురుష్కనవాబునకుఁ బట్టలేని సంతోషము గలిగెను. వెంటనే తన సమీపమునందున్న కొందఱు భటులను గని యాస్త్రీని తెండని నవాబు వారి కుత్తరువు చేసెను. అచట రాణి దాసీసమూహముతోఁ దనపురికిఁ బోవు చుండఁగా మధ్య నవాబు పంపిన భటులు వారిని నడ్డగించిరి. తురకసైన్యము తమ్మాకట్టుటఁ గని రాణి యెంత మాత్రమును ధైర్యమును విడువక యుండెను. ఆసమయమును వర్ణించుచు నొకానొకకవి క్రిందియర్థము గల హిందీపద్యములను వ్రాసి యున్నాఁడు.

గీ॥ యవనవీరులు ఘోరులై యాక్రమించ
భీతియింతయు లేక యావీరవనిత
క్రోధసందీప్తయై నిల్చెఁ గోమలాంగి
యరులతోఁబోర నుద్యుక్తయై రయమున.

క. సఖులును దాసును విమల
ప్రఖరమహాస్త్ర తేజబలయుతలై సత్
శిఖులను బోలి వెలింగిరి
యఖిలజనంబులును జూడ నాసమయమునన్.

రాణియు నామెతోడ నున్న ప్రతిదాసియు, నొక్కొ-క్కొ-మడకత్తి నడివలికే తమయొద్ద దాఁచియుంచుకొని నందునఁ బ్రతిపక్షులను గనినతోడనే వారంద అాకత్తులను దీసి పోరాడసాగిరి. కాని యుద్ధకళానిపుణు లయిన యవనవీరులతో స్త్రీలెట్లు దీర్ఘకాలము పోట్లాడఁ గలరు? రాణిగారీసంగతి తెలిసియే శత్రువులతోఁ దనవల్లనైనంత పోరాడుచు యుద్ధముఁ జూడ నచ్చట మూఁకలుగట్టి నిలుచున్న ప్రజలవంకఁ జూచి యిట్లనియె:--

క. హిందువు లెవ్వరు లేరా
యిందు స్వధర్మాభిమాన మెఱిఁగినవారల్
హిందూభగినీజనులకుఁ
గుందక సాయంబుఁ జేయఁ గోరుమహాత్ముల్.

గీ. ఇట్టివారలు గలరేని యీక్షణంబె
వచ్చి సాయంబు చేయుఁడు వనితలకును
రాకపోయిన శపథంబు మీకుఁ గలదు
మమ్మురక్షించు సర్వభారమ్మమీఁద.

ఇట్లత్యంతమర్మభేదకము లగువాక్యములు రాణిగారి వాక్కు-నుండి రాఁగా విని, అభయచందు నిర్భయచందులను బిరుదులు గల యన్నదమ్ము లిద్దఱును కొంతసేనతోడ వచ్చి

తురుష్కులపై శరపరంపరల నిగుడింపసాగిరి. 'హరహరమహాదేవ*' యనుశబ్దము చేయుచు శత్రువుల శిరఃకమలములు మహాదేవున కర్పింపసాగిరి. ఇట్లు వారు శత్రుసేనలతోడఁ బోరుచు, రాణీగారిని సమీపించిరి. రాణిగారును, పరిచారికలును శత్రువులతోఁ బెనఁగుచు నాత్మసంరక్షణము చేసికొనుచుండిరి. హిందూసైనికులు తమకు సహాయులగుటఁ గని యాశూర స్త్రీల ధైర్యము రెట్టింపఁ దమమహాద్భుతశౌర్యముచే విద్యుల్లతలవలె మెఱవసాగిరి. రాణీగారిని మధ్యనుంచుకొని, చుట్టును సంరక్షకులను నియమించి యాస్త్రీపురుష మిశ్రమమైనస్వల్ప హిందూసేన శత్రుసైన్యమునుండి మెల్లమెల్లఁగా త్రోవ చేసికొని ముందు నడువసాగెను. కాని ప్రతియడుగునకును హిందూవీరుల సైనికులు శత్రువులచేహతు లగుచుండిరి. ఇట్లత్యంతశ్రమతో వారు కొంచెముదూరము నడుచునప్పటి కాసంగతి రాజునకుఁ దెలిసి రాణి సహాయార్థ మొకగొప్ప సైన్యమువచ్చెను. అందువలన రాణిగారి కేమాత్రమును భయము లేక యామె రాజమందిరము ప్రవేశించెను. నిర్భయచందు యుద్ధములో మడిసెను. అభయచందు శౌర్యధైర్యములకు రా జత్యంతానందపరవశుఁడయి తనకూఁతు నాయన కిచ్చి వివాహము చేసెను. కాని అయోధ్య నవాబుస్థితి యత్యంత శోచనీయ మయ్యెను. ఆయనపై వెంటనే గౌతమరాజు సేన నంపుటవలన భీతిచే నచటికిఁ దాను తెచ్చిన యుద్ధసామగ్రినంతయు నచటనే

---

* తురకలు దీన్ దీననుచు యుద్ధమునకు వెడలు నటులనే రజపూతులును మహారాష్ట్రులును హరహరమహాదేవ యనుశబ్దమును నుచ్చరించుచు సంగ్రామమునకు వెడలెడివారు అని తెలియునది.

వదలి యతఁడు అయోధ్యకుఁ బాఱిపోయెను. స్త్రీల నన్యాయముగాఁ జెఱఁబెట్ట యత్నించినవాఁడని ప్రజలాతని నిందింపసాగిరి. ఆనవాఁబునుగుఱించి యొకకవి యిట్లు వ్రాసియున్నాఁడు:-

గీ. స్త్రీలఁ జెఱఁబెట్ట యత్నంబుఁ జేసినట్టి
శూరవరుఁ డని లోకులు దూర నతఁడు
వృద్ధుఁడయి చాల ప్రాణముల్ విడుచువఱకు
నమిత మైనట్టి దుష్కీర్తి ననుభవించె.

# జగన్మోహిని.

(బాబు కేశవచంద్రసేనుని భార్య)

ఈమె కలకత్తాకు సమీపముననున్న అగర్ పడార యను గ్రామమున చంద్రకుమార్ ముఝుమదారు భార్యకు క్రీ. శ. ౧౮౪౭వ సంవత్సరము డిసెంబరు ౨౬వ తేదిని జన్మించెను. పుట్టినింట చిన్నతనమునందీమెను గులాబ్ సుందరియని పిలుచుచుండిరి. గులాబ్ సుందరిని తొమ్మిదవ సంవత్సరముననే బాబు కేశవచంద్రసేనుల కిచ్చి వివాహముచేసిరి. ఈ కేశవచంద్రసేనులే పిమ్మట బ్రహ్మమతావలంబియై మిగుల ప్రఖ్యాతిఁ గాంచెను. జగన్మోహిని యత్తవారియింటికి వచ్చినపిదప నామె భర్త మిగుల వైరాగ్యశీలుండయి యుండెను. ఆయన యంగీకరించిన మతమునుగూర్చి యింటనుండువా రాతనినే కాక యతనిభార్యను సహిత మనేక బాధల పఱుచుచుండిరి. జగన్మోహిని కప్పుడు ధర్మము సంగతి యెంతమాత్రమును దెలియకున్నను తనపతియందలి భక్తిని విడువక యితరులు చేయు నిందనతని చెవినిఁ బడనియ్యక పతిని సంతోషపఱుపఁ బ్రయత్నించుచుండెను. ఇట్లుండఁగాఁ దనబంధువులలోనుండి తనమతానుసార ప్రవర్తన నడుపుట దుస్తరమని తలఁచి ౧౮౬౧వ సంవత్సరము బ్రహ్మసమాజోత్సవము జరుగుచుండఁగా కేశవచంద్రసేనులు స్వగృహత్యాగముఁ జేసి యాసమాజమునందుఁ బూజ్యుఁడుగా నెన్నఁబడుచున్న మహర్షి దేవేంద్రనాథుని యింటికి

నరిగిరి. అప్పుడు జగన్మోహిని ౧౩ సంవత్సరముల దైనను పతితోడుత నుండుట యుక్తమని తలంచి తానును నతనితోడ నరిగెను. ఈ దంపతులు వారియింట నుండఁగా కేశవచంద్రసేనునకు గొప్పవ్యాధి తటస్థ మయ్యెను ఆవ్యాధిలోనే వారు కేశవచంద్రసేనునియొక్క మిత్రునియింటికి నరుగవలసిన వారైరి. ఆసమయమున జగన్మోహిని చూపినధైర్యము, పతికిఁ జేసిన సేవయు మిగుల స్తుత్యములు. తదనంతరము పరమేశ్వర కృపవలన కేశవచంద్రసేనుల వ్యాధి కుదిరి యతఁడు తనపత్ని సహాయమువలన ననేకసంస్కారణములను జేయఁగలిగెను. జగన్మోహిని బహుదినములవఱకు బ్రహ్మమతము నవలంబింపక దానినిగూర్చి పతి ననేక ప్రశ్నలు వేసి వానికి సమాధానకరములగునుత్తరములఁ బడసి తన కామతముసంగతి పూర్ణముగాఁ దెలిసినపిదపనే దాని నవలంబించెను. పిదప నీదంపతులకు పుత్రులును, పుత్రికలును గలిగిరి. వారందఱును జననియొక్క పాలనవలన సద్వర్తనము గలవారలైరి. ప్రస్తుతపు కుచ్ బిహారాధీశ్వరుని భార్య యీమెబిడ్డయే. కలకత్తాయందుజరుగు భారతాశ్రమనుసభ కీమెయే యధ్యక్షురాలుగా నుండెను. దానికే కాక స్త్రీలసభ లాగ్రామమునం దెప్పు డెచట జరగినను అధ్యక్షస్థానము జగన్మోహినికే యియ్యఁబడుచుండెను.

ఈమెభర్త మరణానంతరము సహితము బ్రహ్మసమాజమునకుఁ జాలసహాయము చేసెను. బ్రహ్మసమాజమునందలి యన్ని శాఖలవారికిని జగన్మోహినీదేవియందు మిగులపూజ్యభావము గలిగియుండెను. ఈమెకు ధర్మప్రచారకులయం దధికాదరము గలిగియుండెను. నవవిధానపక్షప్రచారకు లీదేవితో

గంటలకొలఁది సంభాషించుచుండిరి. అప్పుడామెకుఁ గల ధర్మ
బుద్ధియు, ధర్మప్రచారమునందుఁ గల ప్రీతియుఁ బ్రహ్మసమాజీ
కులందఱియందుఁ గల ప్రేమయు, నీశ్వరునియందలి యనుపమే
యమగు శ్రద్ధయుఁ గని వారి కామెయెడల నంతకంతకుఁ బూజ్య
భావము హెచ్చుచుండెను. ధర్మప్రచారకుల కెవ్వరి కేని యొక
సంకటము తటస్థించినచో వారు తల్లితుల్యురాలగు జగన్మో
హినీ దేవికడకువచ్చి తమదుఃఖముల నామె కెఱిఁగించి యామె
వలన సంకట నివారితులై చనుచుండిరి. ఈమె ౧౮౯౮ వ సం
వత్సరము మార్చి నెలలో పరలోకమున కేగెను.

# కొమఱ్ఱాజు జోగమాంబ.

క. పతిగొట్టినఁ బతితిట్టినఁ
బతినిర్దయుఁడగుచు నెట్టిబాధపఱచినన్
మతి నన్యథాత్వ మొందరు
పతిదేవత లతివ నీకుఁ బ్రతియగువారల్.

[పాండురంగవిజయము.]

ఈపతివ్రతాతిలకము రమారమి యేఁబదిసంవత్సరము లకుఁ బూర్వముండెను. కృష్ణామండలమునందలి నందిగామతాలూకాలో కంచలయనుగ్రామ మొకటికలదు. అపల్లెయందు భండారు వీరయ్యయను ఆఱువేల నియోగిబ్రాహ్మణుఁ డొకఁడు వాసముచేయుచుండెను. ఆయన దైవభక్తుఁడును, సత్ప్రవర్తకుఁడునునై యుండెను. ఆయనకు జోగమాంబయని యొకకూఁతురు జనియించెను. ఈకన్యక చిన్నతనమునందుననే బహుగుణవతిగా నుండెను. జోగమాంబ వివాహయోగ్యకాఁగా నాతాలూకాలోనిదగు పెనుగంచిప్రోలను గ్రామనివాసియగు కొమఱ్ఱాజు నాగయ్యకొమారుఁడగు రామయ్యయను నాతనికిచ్చి వివాహముచేసిరి.

ఈపెనుగంచిప్రోలు పూర్వము గొప్పపట్టణముగా నుండినందున దీనిని పెదకంచియను చుండిరనియు, పెనకంచియను దానికె పెనుగంచి·యని యపభ్రంశమయ్యె ననియుఁ జెప్ప

దురు. ఆగ్రామ మిప్పుడొక పెద్దపల్లెవలె నుండును. కానియు చటి భూమిత్రవ్విన బయలఁబడు గుళ్ళరాళ్లును, మేడలస్థంభములును, దూలములును, శిలాశాసనములును ఆపట్టణ మొకప్పుడు గొప్పపట్టణముగా నుండెనని స్థాపించుచున్నవి.

కొమఱ్ఱాజువారును పూర్వమునుండి యాపట్టణమే వాసస్థలముగాఁ గలిగియుండిరి. వీరు పూర్వము రెడ్లకాలములోను, రాజులకాలములోను, తురుష్కులకాలములోను దేశపాండ్యాగిరిచేసి మిగుల కీర్తిఁగాంచిరి. ఆంగ్లేయరాజ్య మారంభమైనది మొదలు దేశపాండ్యాగిరి పోయినందున వారాగ్రామమును విడిచి యుద్యోగముల నిమిత్తము అనేకదేశముల కరుగవలసిన వార లయిరి. అయినను వారు స్వగ్రామప్రీతిని విడువఁజాలని వారయి యచ్చట నిండ్లను కట్టుకొని కొందఱప్పుడప్పుడచటికి వచ్చి కొన్నిదినము లుండి పోవుచుందురు

జోగమాంబ భర్తయునీగ్రామమునందు గృహము గలవాఁడయి నైజామురాజ్యములో నుద్యోగము గలిగి యొక యధికారమునందుండెను. జోగమాంబ మనపూర్వగ్రంథములలోఁ జెప్పఁబడిన పతివ్రతాధర్మములను దప్పక నడిపెను. ఆమె భర్తను దేవునిగా భావించి నిత్యము నాతనిని బూజింపుచు నాతనియాజ్ఞ కానిది యామె భోజన మజ్జనశయనాదులు చేయుటలేదు. భర్తయుచ్ఛిష్టము లేనిది యామె యెన్నఁడును భుజియింపకుండెను. ఈవ్రతమువలన నామె కనేకసమయములయందునుపోష్యములు చేయుట తటస్థింపుచుండెను. ఇందునకొకదృష్టాంతము చెప్పెదను. ఒకసారి భర్త గ్రామాంతరమునకరిగి బహుదినములవఱకు రానందున నామె దాఁచి యుంచు

కొనిన యుచ్ఛిష్టము లయిన పోకచెక్కలు సమాప్తము లయ్యెను. కానభర్తయెంగిలి లేదని యామె యెనిమిదిదివసంబు లుపవాసంబు చేసెను. కాని నేను ఉపోష్యము చేసితినని యెవరికిని నామగువ తెలుపక యింటిపనినంతను జేయుచుండెను. ఇట్లు చేయఁగా నెనిమిదవదినమున నామె యాఁకలిచేఁ బీడింపఁబడి వాటఁ జేయుచు నచటనే మూర్ఛిల్లెను. ఇంతలో నామె సహోదరి యామెను గనుఁగొన నేతెంచి యదియంతయుఁ గని దాని కారణము నెఱిఁగి తత్క్షణమే తానామెభర్తకడ కేఁగి యుచ్ఛిష్టము తెచ్చి పదునేనుదినముల తదనంతర మామెకు భోజనము చేయించెను! . దీనివలన స్త్రీలు తమభర్తృప్రేమకొఱకెట్టికష్టముల నైనను నధిక సంతోషముతో సహింతురని స్పష్టమగుచున్నది. వారికిఁ గలభర్తృప్రేమ మిగుల శ్లాఘ్యమయినది. స్త్రీలుస్వాభావముచేతనే పతులయెడ ప్రేమఁ గలిగి యుందురు.

జోగమాంబ యిట్టిభక్తిఁ గలిగి పతిసేవఁ జేయుచున్నను ఆమెభర్త యగురామయ్యగారామెను మిగుల నిష్ఠురదృష్టిచేఁ జూచుచుండెననియెదరు! ఆమెను నిష్కారణముగాఁ గొట్టియుఁ దిట్టియు ననేకవిధముల బాధ పఱచెను ! కానియా సాధ్వీమణి యెప్పుడును భర్తయెడలఁ గలభక్తిని కొంచెమయినను విడువక యాబాధలను మిగుల నోపికతో సహింపుచు నెవరికిఁ జెప్పక యధిక పతిభక్తితో వర్తించెను.

జోగమాంబ పతిభక్తియందేగాక యనేకసద్గుణములలో సహితము ప్రఖ్యాతయయ్యెను. ఆమె బావగార్లబిడ్డలతన

బిడ్డలవలె జూచి వారిని పోషించుచుండెను. తోడికోడండ్రతో తగవు లాడక కలసిమెలసి యుండెను. —

ఈమె కొకకూఁతురును, ఒక కుమారుఁడును కలిగిరి. అటుపిమ్మట నీమె భర్తకంటె ముందే పరలోకమున కేగెను. ఆమెకొడుకు ప్రస్తుతము తండ్రి పనిమీఁదనే సుఖముగా నున్నాఁడు.

జోగమ్మ మాయత్తిల్లును పుట్టిల్లును పవిత్రము చేసిన యువతి యగుటవలన నేను మిగుల ధన్యనైతిని. నాతండ్రిగారి కీమె పినతండ్రిభార్య. ఈమె యిట్టిసద్గుణవతియయినను మనదేశమునందలి చరిత్రను గుఱించి గలయౌదాసీన్యమువలన నామె చరిత్రము సవిస్తరముగా వ్రాయుటకుఁ దగు సామగ్రి దొరక దయ్యెను. అయినను ఈసాధ్వీచరిత్రము సవిస్తరముగా వ్రాయుటకు నేను యత్నించుచున్నాను. ఈశ్వరకరుణవలనఁ జదువరులకుఁ ద్వరలోనే సమర్పింపఁగలను.

# పద్మిని.

పత్యనుకూలా చతురా ప్రియంవదా యాసురూపసంపూర్ణా
సహజస్నేహరసాలా కులవనితా కేనతుల్యాస్యాత్ .*

ఈపతివ్రతాతిలకము పన్నెండవ శతాబ్దారంభము నందు జన్మించెను. ఈమెతండ్రి సింహళద్వీపవాసి యగు హమీరసింహచవ్హాణుఁడు. ఈసతీరత్న మసమానరూపవతి యగుటచే జననీజనకు లామెకు పద్మిని యని పేరిడిరి. పద్మిని వివాహయోగ్య యైనపిదప రజపుత్రస్థానములోనిదైన మేవాడ్ అనుసంస్థానమున కధీశ్వరుఁడగు భీమసింహరాణాగారికి నామె నిచ్చి వివాహముఁ జేసిరి. వివాహానంతరము పద్మిని తన రూపమునకుఁ దోడు సుగుణములు సహాయపడఁగా భర్తకుఁ బ్రాణతుల్యురా లాయెను.

ఆకాలమునం దారాజ్యము రాణాలక్ష్మణసింహుఁ డను బాలరాజు పరిపాలనలో నుండెను. కాని ఆతఁడు బాలుఁ డగుట వలన నాతని పినతండ్రి యగు భీమసింహుఁడే రాజ్యతంత్రము లను నడుపుచుండెను. భీమసింహుఁడు మిగుల శూరుఁడును, చతురుఁడును నగుటవలన నాతనిరాజ్యమున కంతగా శత్రుల భయము లేక ప్రజలు సుఖముగానుండిరి. కాని వారి దురదృష్ట

* పతికి ననుకూల యైనట్టియు, ప్రియభాషిణియు సురూపవతియు నైన కులవనితతో నెవ్వరును సమానులు కారు.

మువలన స్వల్పకాలములోనే ఢిల్లీ బాదుషాయగు అల్లాఉద్దీను మేవాడ రాజధానియగు చితూరుపై దండు వెడలెను. ఈబాదుషా పద్మినియొక్క యసమాన సౌందర్యమువిని యామెయందు దృఢకాభిలాషి యయ్యెను. అసహాయశూరులగు రజపూతులతోఁ బోరి గెలుచుట దుస్తరమని తలఁచి యాబాదుషా పద్మినిని వశపఱుచుకొనఁ జూచెను. కాని ప్రథమమునం దాయన తనసైనికులతోఁ జితూరుసంస్థాన ప్రాంతభూమిని వసియించి గుప్తముగా ననేక దాసీజనులకు ద్రవ్యాశఁ జూపి వారు తనరూపము, ఐశ్వర్యము మొదలగునవి పద్మినికిఁ దెలిపి యామె తనకు వశవర్తినియగుటకు ననేకయుక్తులను బన్నునటులఁ జేసెను. కాని సతీమణియగు పద్మినియొద్ద ఇట్టినీచప్రభువుయొక్క తుచ్ఛయుక్తులెంతమాత్రమునుఁ బనికిరాక నిష్ఫలములయ్యెను. అందుకు బాదుషా మిగుల చింతించి తనకు పద్మినిపైనిఁ గలిగిన దురుద్దేశ్యమును మరల్చుకొనఁ జాలక రజపూతులతో యుద్ధము చేసి పద్మినిని జెఱఁ బట్ట నిశ్చయించెను. అల్లాఉద్దీను ఆసమయమునందు "పద్మినిని చేకొనుట యొండె ఈరాజపుతస్థానమునందే యుద్ధముచేసి ప్రాణములు విడుచుటయొండె" అని ప్రతిన పట్టెను. తదనంతరమాతఁడు తనసైన్యములతో నారాజధానిని ముట్టడించెను.

అల్లా ఉద్దీను తమనగరమును ముట్టడించుట విని యసమానశౌర్యధుర్యులగు రజపూతులు యుద్ధసన్నద్ధు లయిరి. అంత వారందఱు భీమసింహుని యాజ్ఞప్రకారము బైలువెడలి ప్రతిపక్షులతో ఘోరముగాఁ బోరఁ దొడఁగిరి. ఇట్లాయుభయసైన్యములం గలవీరులు కొన్నిమాసములవరకును యుద్ధము

చేసిరి. కాని యీరెండు తెగలవారిలో నెవ్వరును వెనుకఁ దీయ
రైరి. రజపూతు సరదార్లనేకులు రణరంగమునందు హతుల
యిరి. రజపూతు లెంత దృఢనిశ్చయముతోఁ బోరినను తురక
సైన్యములు బీరుపోవకుండుటయు, నానాటికి రజపూతు
సైన్యములు పలుచపడుటయుఁ గని భీమసింహుఁడు మిగుల
చింతాక్రాంతుఁ డయ్యెను. తుద కాతఁడు ప్రజాక్షయమున
కోర్వఁజాలక డిల్లీశ్వరునితో సంధి సేయనెంచి యందు కయి
కొందఱు మంత్రుల నంపెను. కాని యది పొసఁగినది కాదు.
సంధి దెల్పవచ్చినవారితో అల్లాఉద్దీను తనకుపద్మిని దొరకి
నంగాని రణ మాఁగదని స్పష్టముగాఁ దెలిపెను. ఈవార్త వినఁ
గానే శూరరజపూతు లందఱు పడగఁ ద్రొక్కిన సర్పములభం
గి అదరిపడి తమయందలి ప్రాణములు పోవువఱకును యుద్ధ
ముఁ జేసెదమని విజృంభించిరి. అందుపై నా యిరువాగుసైన్యం
బులుందలఁపడి యుద్ధము చేయుచుండిరి.

ఇట్లు పదునెనిమిది మాసములు యుద్ధము జరుగుచుం
డెను. కాని శూరులగు రజపూతులు బాదుషాసైనికులను బట్ట
ణములోనికిఁ బోవనియ్యకుండిరి. అల్లా ఉద్దీను వారి నిశ్చయము
గని రజపూతుల యుద్ధమునం దోడించి పద్మినిని బట్టు ప్రయ
త్నము మానుకొనవలసినవాఁ డాయెను. యుద్ధము మానుకొ
న్నను పద్మినియం దతనికిఁగల వ్యామోహ మతని నాపొలిమే
ర దాఁటి పోనియ్యకుండెను. అందువలన నతఁడు భీమసింహున
కిట్లు వర్తమాన మంపెను. "నాకు పద్మిని దొరుకునన్న యాస
లేదు. కాని యామె రూప మొకసారియయినను మీరు నా
కగుపఱచినయెడల నేను సైన్యసహితముగా డిల్లికి మరలి వె

ళ్లుదును." ఈవర్తమానము విని కొంతకోపము కలిగినను పోరు నకు విసుగు కలిగిన రజపూతు లందున కొప్పుకొనిరి. తదనంత రమా సంగతి భీమసింహుఁడు పద్మినికిఁ దెలుపఁగా నామె తాను ప్రత్యక్షముగా నాపరునికంటఁ బడనని స్పష్టముగాఁ జెప్పె ను. అందుపయి భీమసింహుఁడామెకు నామె డిల్లీశ్వరునకుఁ గనిపించని పక్షమున రజపూత్రులకుఁ గలుగు బాధల నెఱిఁగిం పఁగా నామె యద్దమునందుఁ దన ప్రతిబింబమును బాదుషాకుఁ జూప నొప్పుకొనెను. అప్పుడు "పద్మిని నీకగుపడఁజాలదు ; గాన నామె ప్రతిబింబమును జూపెద"మని చితూరునుండి అల్లా ఉద్దీనునకుఁ జెప్పి పంపిరి.

అందుపయి యుద్ధము నాపి నియమితదివసంబున నొక రిద్దఱు సేవకులతో అల్లాఉద్దీను పద్మినిని జూచుటకయి చితూరు కోటలోనికి వచ్చెను. అచట భీమసింహుఁ డాయనకుఁ దగు మర్యాదలు చేసి యాతనికి దర్పణంబున పద్మినిరూపమును జూపెను. తాను విన్నదానికంటెను పద్మిని విశేషరూపవతి యగుటఁ గనినందున బాదుషాయొక్క చిత్తచాంచల్య మిను మడించెను. దానిని మనమునం దడఁచుకొని యాతఁడు మరలిపోవునపుడు తనకృత్యమునకుఁ బశ్చాత్తాపపరుఁ డయి నటుల భీమసింహునితో నిట్టు లనియె. "భీమసింగుగారూ! నేను చేసిన నేరమును మన్నించవలయును. నేఁటాదిగా చితూరు సం స్థానీకులతో నేను సఖ్యము చేయఁ దలఁచితిని. ఇంతవఱకు మీయోగ్యత తెలియక పోవుటవలన నేవైరము తలపెట్టితిని. కాని నేఁడు మీయోగ్యత నాకన్నులార చూడఁగా మీవంటి మిత్రులు దొరుకుట నాకు మిగుల శ్రేయస్కర మని తోఁచు

చున్నది. కాన నీప్రథమదివసంబుననే తమరు నావిడిదికి దయచేసి నేచేయుపూజల నంగీకరింతురని నమ్ముచున్నాను. ఈ నా చిన్నవిన్నపము మీరంగీకరింపకతప్పదు.” బాదుషాయొక్క నమ్రత్వమును గని యాతనిమాటలను నమ్మి భీమసింహుఁడు మితపరివారముతో నాతనిశిబిరంబునకుఁ బ్రయాణమయ్యెను.

అల్లా ఉద్దీను మిగుల దుర్మార్గుఁ డగుటవలన రాజుగారిని నమ్మించి తనతోఁ దోడుకొనివచ్చి తనశిబిరసమీపమునం దాయనను సైన్యము ముట్టడించి కైదుచేయునట్లు చేసెను. రాజు పట్టుపడుటవలన మిగుల నుప్పొంగి యల్లాఉద్దిన్ చితూరున కిట్లు వర్తమాన మంపెను. “పద్మిని నావద్దకు రానియెడల భీమసింహుని ప్రాణములఁగొని మరల రజపూతులను సంహరించెదను.” ఈసంగతి విని రజపూతులందఱు నేమి చేయుటకును దోఁచక మిగుల విచారముగా నుండిరి. రాజగు లక్ష్మసింహుఁడు బాలుఁడగుటవలనను, భీమసింహునిపుత్రులు పంచ్రెండుగురును అల్పవయస్కు లగుటవలనను ఇట్టిసమయమునం దగినయుపాయము యోచించువారు కానరారయిరి. కాని పద్మినిమాత్ర మప్పుడితర స్త్రీలవలె దుఃఖింపుచుఁ గూర్చుండక మిగుల ధైర్యము వహించి భర్తనువిడిపించు నుపాయము యోచింపుచుండెను. ఆసమయమునం దేదోపనిమీఁద నామె సోదరుఁడగు గోరాసింహుఁడును, నాతనిపుత్రుఁడగు బాదలుఁడను వీరుఁడును అచటికివచ్చిరి. ఆమె వారితో యోచించి మిగుల చిత్రముగుయుక్తినిఁ బన్నెను. పద్మిని అల్లా ఉద్దీనున కిట్లు వర్తమానము చేసెను. “మీరు భీమసింహునివిడిచి ఢిల్లీకిఁ బయలుదేఱినయెడల నేను తగుదాసీలతోడంగూడి యచటికి వచ్చెదను.

కాని నాదాసీల పరువునకును రాణివాసమునకును మీ సైని
కులు భంగము సేయకుండునటుల కట్టుదిట్టములు చేయవల
యును” పద్మిని తెలిపినవార్త విని అల్లా ఉద్దీను పరమానంద
భరితుఁడయ్యెను. అంత నాతఁడామె యన్నప్రకార మొప్పు
కొని యామెకుఁ ద్వరలో రమ్మని కబురుపంపెను. బాదుషా
యొద్దినుండి తనపలుకుల కంగీకారము వచ్చుట విని పద్మిని
తాను ప్రయాణమాయెను. ఆమెతోడ వచ్చుటకు నేడువందల
మేనాలను సిద్ధపరచెను. ఒక్కొకమేనాలో ముగ్గురేసిశూరులు
ఆయుధహస్తులయి కూర్చుండిరి. ప్రతిమేనాకును నాలుగురు
వంతున గుప్తాయుధులగువీరు లాయందలములను మోయు
చుండిరి. పద్మిని తనసైన్యమునకును తనకును తోడుగా గోరా
సింహునిని, నాతనిపుత్రుఁడగు బాదలుని సహితము తనతోఁ
దీసికొనిపోయెను. ఇట్లువీరందఱు తురకలశిబిరమును సమీపిం
చి బాదుషాయాజ్ఞవలన నామేనాల నన్నిటిని శిబిరములోనికి
నిరాతంకముగాఁ గొనిపోయిరి. తదనంతరము పద్మిని భీమసిం
హుని నొకసారి చూచెదనని బాదుషాకుఁ దెలిపి భీమసింహుని
ఖైదుచేసినస్థలమునకుఁదనమేనాను బట్టించుకొనిచనెను. అంత
స్త్రీనలెనున్న యాగుప్తసైన్యమంతయు తమజనిస్వరూపమును
గనఁబఱచి శత్రుసైన్యముల దైన్యము నొందింపసాగెను. భీమ
సింహుఁడవియంతయు నేమని యడుగుచుండఁగా పద్మిని యా
తనిని త్వరపెట్టి సిద్ధపఱచి తెచ్చిన యశ్వములపై తానును భర్త
యునెక్కి యాసంగ్రామపుసందడినుండి తప్పించుకొని క్షణ
ములో చిత్తూరు ప్రవేశించెను. ఇచట గోరాసింహుఁడు సైన్యా
ధిపత్యము స్వీకరించి యాతురకల నోడించెను. కాని యద్ధున

తుల్యుఁడగు గోరాసింహుఁడును, నాతని పుత్రుఁడగు బాదలుఁడును ఆయుద్ధమునందు మృతులగుటవలన రజపూతులకు విజయానందమంతగా రుచింపదయ్యెను. అల్లా ఉద్దీను పరాజయమునకు బిసిమిల్లాయనుచుఁ దనసైనికులతో ఢిల్లీమార్గమునం దరలిపోయెను.

ఆయుద్ధానంతరము మఱికొంతకాలమునకు ఢిల్లీపతి విశేషసైన్యముతో మరల చితూరుపై దాడువెడలెను. ఈతడవ చితూరునందు శూరులు లేనందున రజపూతులకు విజయాశయంతగా లేకయుండెను. కాని యావీరు లంతటితో నిరాశనొంది యుండక ప్రాణములకుఁ దెగించి శత్రువులతోఁ బోరాడఁ దొడఁగిరి. అట్టిసమయమునం దొకకారణమువలన నారజపూతులకు జయము దొరకదని నిశ్చయముగాఁ దోఁచెను. అది యేది యనఁగా నాయుద్ధము జరుగునపు డొకదినము రాత్రి గ్రామదేవత భీమసింహుని స్వప్నమునం దగుపడి "నాకతి దాహముగా నున్నది. ఈదాహము పండ్రెండు గురురాజులరక్తము త్రాగినఁగాని తీరద"ని చెప్పెనఁట. అదేప్రకారము భీమసింహునిపుత్రులు పదునొకండుగురు శత్రువులతోఁ డం బోరి హతులయిరి. అంతటితోనైనను రజపూతులు ధైర్యమును విడువక పురమునంగల పురుషులందఱును వైరులతోఁ డంబోరి స్వర్గసుఖమంద నిశ్చయించిరి. అంత వారందఱు సిసోదియావంశము నాశ మొందుటకు వగచి భీమసింహుని కనిష్ఠపుత్రుని నొక దాదిచేతి కిచ్చి సమీపారణ్యమునకుఁ బంపిరి. పిదప వారందఱు రాజవంశమున కంకురముగలదని నిశ్చయించుకొని సమరరంగమున కరిగిరి. ఆదిన మారజపూతుల శౌర్యాగ్ని మఱెంత

ప్రజ్వలింప వారు శత్రువులకు మిగుల దుస్సాధ్యులని తోఁచిరి. కాని విస్తీర్ణమగు యవనసైన్యమునుం దల్పమగు రజపూత సైన్యమున కెట్లు జయము దొరకును? ఆసాయంకాలమువఱకు క్షత్రియ వీరులందఱు వీరస్వర్గమున కరుగఁగా జయలక్ష్మి అల్లా ఉద్దీనునే పొందెను.

భీమసింహునితోడ సకల రాజపుత్రులును యుద్ధమున మడియుట నగరమునం దుండిన స్త్రీలకుఁ దెలియఁగా పద్మినియు సకల రజపూతుల భార్యలును పాతివ్రత్య రక్షణమునకై అగ్నిప్రవేశము చేయ నిశ్చయించుకొనిరి. ఇట్లు వారు కృతనిశ్చయురాండ్రై యొకగొప్పచితిఁ బేర్చి దాని కగ్నిముట్టించిరి. అందుపై పద్మిని తాను ముందాయగ్నియందు దుముకఁగా నందఱు స్త్రీలును దుమికిరి (ఈయగ్నిప్రవేశమునే రజపూతులు జోహారు, లేక జహర్వ్రత మనియెదరు). బాదుషా విజయానందముతోఁ బురప్రవేశము చేయఁగా నాగ్రామమంతయు చితామయమయియుండెను. అందు తానింత ప్రయత్నముఁ జేసి చేకొనఁదలఁచిన పద్మినిదేహము భస్మమయి యుండఁగాఁ జూచి అల్లాఉద్దీను మిగుల వగచెను. యుద్ధమునకుఁ బ్రయాణమైనపుడు భీమసింహుఁడే స్త్రీలనందఱి నొకగుహాలోనికిఁ దోలి యాగుహను మూసి గుహాద్వారమున కగ్ని యంటించెనని కొందఱు చరిత్రకారులు వ్రాసియున్నారు.

# కృపాబాయి

ఉ. హార్తముఁ గానిగోచర మహార్తిశమున్ సుఖపుష్టి సేయు స
త్కీర్తిఘటించు విద్యను దివ్యధనం బఖిలార్థికోటికిన్.

తమవిద్యవలనను సద్గుణములవలనను భరతఖండమును నలంకరించిన యాధునిక స్త్రీలలో కృపాబాయి యొకతె యని గణింపఁబడుచున్నది. ఈమె యల్పవయస్సునందే పరలోకమున కేగినను తనకీర్తిని నాచంద్రార్కముగా భూమియందుంచిపోయెను.

కృపాబాయి ౧౮౬౨వ సంవత్సరమునం దహమదునగరమున జన్మించెను. ఈమె జనకునిపేరు హరిపంతులు; జనని పేరు రాధాబాయి. వీరు పూర్వము మహారాష్ట్రబ్రాహ్మణులుగా నుండి పిదప క్రైస్తవధర్మము స్వీకరించిరి. ఈమె చిన్నతనముననే తండ్రి పరలోకయాత్ర స్వీకరించెను. కాన కృపాబాయికి పితృసుఖ మేమియుఁ దెలియదు. అట్లయినను రాధాబాయి మిగుల దక్షతతోఁ దనసంతానముయొక్క విద్యాబుద్ధులకు లోపము జరుగకుండ చూచుచుండెను. ఆమె తాను విద్యావతి గాకున్నను సద్గుణవతిగాన విద్యావతు లయిన స్త్రీలచే విని నటుల కార్యదక్షురాలై తనబిడ్డలకు సదాసద్గుణములే యలవడునట్లు చేయుచుండెను. వారింట సదాశరీరసౌందర్యమున కనుగుణము లగుదుస్తులును ధరియించుటకంటెను శరీ

రారోగ్యకరము లగుదుస్తులను ధరియించు నలవాటు గలిగి యుండుటచే వారిపిల్లలకు విలువవస్త్రములయం దెంతమాత్రము నిచ్చ లేక వారుమిగుల వినయముతో వర్తించుచుండిరి.

ఇట్లు ధీమతి యైనతల్లిచే నన్నిరీతుల సురక్షిత యైనందున నామెకుఁ జిన్నతనమునందుఁ దండ్రిలేని లోప మంతఁగాఁ గానుపించదయ్యె. కృపాబాయి బాల్యమునుండియే మిగుల తెలివి గలది యనిపించుకొనెను. ఈమె విద్య నభ్యసించునపుడు తనసహోదరునితోడఁ గూర్చుండి చదువవలయునని కోరుచుండెనుగాని యామె తనవద్ద చదువ కూర్చుండినచో తనతప్పిదములను దిద్దునని యెంచి యట్టియవమానమున కోర్వఁజాలక యామె సహోదరుఁ డామెను దగ్గరఁ జేరనిచ్చెడివాఁడు కాఁడు. చిన్న యన్న యిట్లు చేసినను కృపాబాయియొక్క జ్యేష్ఠభ్రాత యగుభాస్కరుఁడు తనముద్దుచెల్లెలియం దధికప్రీతి కలవాఁడై యామె విద్యాభ్యాసము చక్కఁగా జరుపుచుండెను. ఆమెకు సృష్టిసౌందర్యావలోకమునం దధికప్రీతిగాన నామె నిత్యము భాస్కరునితోడఁ బోయి యనేకపర్వతములను, వనములను, ఉపవనములనుదప్పక చూచుచుండెను. అల్పవయసునందుసహిత మామెకు సృష్టిసౌందర్యముఁ గనిన మిగుల నానందము గలుగుచుండెను. ఇట్లుండఁగాఁ గొంతకాలమునకు భాస్కరుఁడును దివి కరిగెను. తనశ్రేయము నపేక్షించు ప్రాణసమానుఁ డగుసహోదరుఁడు చనిపోయినందువలన కృపాబాయియొక్కదుఃఖ మపారమయ్యెను. ఆదుఃఖమువలననే యామె దేహమునకస్వస్థత ప్రాప్తమాయెను. ఆమెదుఃఖమును మఱచవలయునని యామెను బొంబాయినగరమునందలి జనానా

మిషనరీపాఠశాలలో విద్యాభ్యాసమునకయి పంపిరి. అచటికిఁ బోవువఱకు కృపాబాయి తనతోడిబాలికలంతో సాటిగా తనకు విద్య రాదనుకొనుచుండెను. కాని యచటి కరిగినపిదప నాపాఠశాలయందలి బాలికల కందఱికంటెను ఈమెయే విద్యయం దధికురాలని నిర్ణయమాయెను. అందువలనఁ బాఠశాలాధ్యక్షుఁ డామె నేతరగతియందును జేర్చక విడిగా విద్య నేర్పున ట్లేర్పాటు చేసెను. అచట నుండుకాలములో కృపాబాయికి వైద్యవిద్యానిపుణురా లగు నొకయమెరికాస్త్రీతోడి సహవాసము కలిగెను. కాన నామె సాంగత్యమువలనఁ గృపాబాయికి వైద్యవిద్య నేర్చుకొనవలయునని యిచ్ఛపొడమెను.

కృపాబాయికిఁగల యాసక్తియుఁ దెలివితేటలును గని వైద్యవిద్యాభ్యాసము కొఱ కామె నింగ్లండున కనుపవలయునని యామె యాప్తులకుఁ దోఁచెను; గానియామెశరీరమున కాదేశపుగాలి సరిపడదని తెలిసినందున నాప్రయత్నమును మానుకొనిరి. తదనంతరము చెన్నపట్టణమునందలి మెడికల్ కాలేజియందు స్త్రీలకు వైద్యవిద్య నేర్పునట్లేర్పడినందున కృపాబాయి వైద్యవిద్య నేర్చుకొనుటకై చెన్నపట్టణమునకుఁ బోయెను. అపు డామె రెవెంటరిడైవందున నాగ్రామమునందు వసియించు రెవరెండు సత్యనాధనుగారను గృహస్థునియింట వాసము చేయుచుండెను. ఆసత్యనాథన్‌గారు మిగుల పెద్దమనుష్యులు. ఆయనభార్యయుఁ గొమాత్రైయు మిగుల మంచివారగుటచే వారుకృపాబాయి సద్గుణములను గని యామెయం దధికప్రీతి గలిగియుండిరి. అందువలన కృపాబాయికి వారింట నున్న దినము లధిక సుఖప్రదములుగాఁ గడచెను. ఇట్లీమెయొక సంవ

త్సరము చదివి సంవత్సరాంతమునందైన పరీక్షయందు సమ
స్తవిషయములలోఁ గృతార్థురాలాయెను. ఆమె తెలివి గని పరీ
క్షకుఁ డామెను మిగుల మెచ్చుకొనెను. కాని కృపాబాయి
యామెప్పున కెంతమాత్రమును గర్వపడక పూర్వమువలెనే
వినయాదిగుణము గలిగి వర్తించుచుండెను.

కృపాబాయికి విద్య నభ్యసించుటయం దధికాసక్తి కలి
గినను, ఆమె దేహము మాత్ర మాశ్రమనోర్చునంతటి దృఢ
మైనది గానందునఁ బరీక్షకై చదువునపు డామె కెంత మాత్ర
ము శ్రమదోఁచకుండినను పరీక్షానంతరము వెంటనే విశేష
ముగాఁ గాయలాపడెను. అప్పటినుండియు మరల నామె
శరీర మెప్పుడును స్వస్థపడనందున విధిలేక విద్యాభ్యాసమును
మానుకొనవలసిన దాయెను. ఇట్లు వైద్య విద్యాభ్యాసమును
విడిచినంతమాత్రమున నామె నిరుత్సాహురాలుగాక వేరువిధ
ముగా జనులకు హితముచేయ యత్నింపుచుండెను.

రెవరెండు సత్యనాథనుగారి పుత్రుఁడగు సాముఎల్
సత్యనాథనుగారు ఇంగ్లండునందలి కేంబ్రీజు విశ్వవిద్యాలయ
మునందు విద్య నభ్యసించి పరీక్షయందుఁ గృతార్థుఁడయి
౧౮౮౧వ సంవత్సరమునందు మరల స్వదేశమునకు వచ్చెను.
సాముఎల్ సత్యనాథనుగారు కృపాబాయియు నొకయింటనే
వాసము చేయుచుండినందునవా రిరువురును ఒకరి సద్గుణముల
నొకరు కని పరస్పరానురాగము గలవారైరి. తదనంతర
ము స్వల్పకాలములోనే వారికి వివాహమయ్యెను. వివాహా
నంతరము సాముఎల్ సత్యనాథనుగారిని ఉదకమండలమంద
లి యొకకళాశాలయందు ముఖ్యోపాధ్యాయునిగా నియమిం

చిరి. అందువలన నానూతనదంపతు లచటికి నరిగిరి. అచట నీలగిరిపర్వతమునందలి గాలివలన కృపాబాయిదేహ మించుక యారోగ్యముగా నుండెను.

అచట నుండుకాలమునం దామె యూరకుండక జాలక నాగ్రామమునందలి యువనబాలికలకొఱ కొకపాఠశాల స్థాపించెను. ఆపాఠశాల ప్రస్తుతము చక్కఁగా నడుచుచున్నదఁట. ఈమె యచ్చట నున్నకాలముననే యాంగ్లేయ వారపత్రికలకును, మాసపత్రికలకును వ్యాసములు వ్రాయుచుండెను. ఆమె వ్రాసిన వ్యాసము లత్యంతప్రశంసనీయము లగుటచే స్వల్పకాలముననే కృపాబాయి కీర్తి నలుగడల నల్లుకొనసాగెను.

౧౮౮౪వ సంవత్సరము మి. సత్యనాథను గారిని రాజమహేంద్రవరమునకు మార్చిరి. అచటికి వచ్చినది మొదలు కృపాబాయిగారి రుగ్ణత విశేషింపసాగెను. ఇట్లురోగగ్రస్తురాలుగ నుండియు నామె యనేకవ్యాసములను వ్రాయుచునే యుండెను. ఆమరుసంవత్సర మామె కుంభకోణమున కరిగెను. అచట నామెరుగ్ణత యించుక నిమ్మళముగా నుండెను. అచటను ఆమె వ్యాసములను వ్రాయుచునే యుండెను. కుంభకోణమునందుండు కాలముననే కృపాబాయికి కవిత్వస్ఫూర్తియు ప్రబంధరచనేచ్ఛయుఁ గలిగెను. అప్పు డామె కొన్ని పద్యములు రచియించెను. వానిని జదివినయెడలనామెకుఁ గల ఆంగ్లభాషాకవిత్వస్ఫూర్తి వెల్లడి యగునని తజ్ఞులు చెప్పుచున్నారు. ప్రబంధరచనేచ్ఛ కలిగియుఁ దనవలన నదియగుట దుస్తరమని తలఁచి యామె బహుదినము లాప్రయత్నమే చేయకుండెను.

౧౮౭౬వ సంవత్సరమునం దామెభర్తను చెన్నపట్టణమునకు మార్చిరి; యచటికి వచ్చిన యనంతరము పత్రికలకు వ్యాసములు వ్రాయుటలోనే కాలము గడపక ప్రబంధరచన చేయుట మంచిదియని యామె భర్త సూచించెను. అందుపై నామె తనబాల్యము నందలి యనేక సంగతులను జ్ఞప్తికిఁదెచ్చుకొని వానింగోఁ దన కల్పనలను గూర్చి 'సగుణమ్మ' యనుప్రబంధము నొకదాని నింగ్లీషునందు వ్రాసెను. అది ప్రస్తుతము తెలుఁగునందు భాషాంతరీకరింపఁబడియున్నది. దానిలో నీదేశపు క్రీస్తుమతస్థుల గృహస్థితులును నదీపర్వతారణ్యముల సౌందర్యమును మిగుల చక్కఁగా వర్ణింపఁబడియున్నవి. ఈ గ్రంథము వ్రాసి ముగించినపిదప నామె కొకకొమార్తె గలిగెను. ఆబిడ్డ విస్తారదినములు జీవింపక చేఁ చనిపోవుటవలనఁ గృపాబాయికి దుఃఖము ప్రాప్తమయ్యెను. అందుచే నామె కదినఱకుఁగల యుత్సాహము తగ్గిపోయెను. కాని కృపాబాయి యంతటితోఁ దనప్రయత్నమును మాని సదాదుఃఖింపుచునుండక తా నెటులనైన నితరులకు నుపకారమొనర్చి యందువలనఁ దనదుఃఖమును నుపశమింపఁ జేసికొనవలయునని సదా ప్రయత్నింపుచుండెను. ఆ సమయమునం దామె శరీరముసహితము అస్వస్థముగా నుండినందున మి. సత్యనాథనుగారామెను బొంబాయినగరమునకుఁ గొనిపోయిరి. అచటి గాలివలన నామెశరీర మించుక స్వస్థపడునని వారు తలఁచిరి; కాని ప్రయాణశ్రమవలన నారుగ్ణత హెచ్చుకాఁగా నామెను వెంటనే మరల మద్రాసునకుఁ గొనిపోవలసివచ్చెను. అచట నామె బహుదినము లాంగ్లేయవైద్యశాలలో నుంచఁ

బడినపిదప నామె దేహము కొంచెము స్వస్థపడెను. కాని యామెరోగ మసాధ్యకరమయినదని డాక్టరు లప్పుడె కనిపెట్టి యాసంగతి కృపాబాయికిఁ దెలిపిరి. అందువలన నామె యెంత మాత్రమును చింతించినది కాదు.

ఆమఱుసంవత్సర మామె యాప్తు లొకరిద్దఱు గతించుటచే నాదుఃఖమువలన నామెరుగ్ణత మఱింత హెచ్చసాగెను. ఇట్లు దేహ మస్వస్థమైనను లక్ష్యముచేయక కృపాబాయి తన లేఖనక్రమమును జరుపుచుండెను. ఆసమయమునందే యామె 'కమలా' యనుప్రబంధ మొకటి వ్రాయసాగెను. నీలగిరి యందలి చల్లగాలివలన నామె కారోగ్యము కలుగునని తలచి యామె నటకుఁ బంపిరి. కాని యచట నామెరోగము హెచ్చెను. అచట నుండునపుడే కృపాబాయి తనరుగ్ణత హెచ్చుచున్నను సరకుగొనక కమలయను ప్రబంధము వ్రాసి ముగించెను. పిమ్మట నాప్రబంధ మొకమాసపత్రికయందు ముద్రింపఁబడి ప్రచురింపఁబడియెను. అందుచేతఁ గృపాబాయికి మిగుల నానందము కలిగెను. ఆమె హిందూస్త్రీయై యుండియు నాంగ్లేయభాషయందు వ్రాసిన యీగ్రంథములు మిగుల ప్రశంసనీయములుగా నున్నవని నుడివెదరు. వానిఁ జదివినయెడల ప్రబంధరచనయందుఁ బ్రవీణుఁ డయిన యొకానొకయాంగ్లేయదేశీయునిచే వ్రాయఁబడిన వని తోఁచునఁట. ఈసాధ్వీమణి ౧౮౯౪వ సంవత్సరము ఆగష్టు ౮వ తేదిని పరలోకగమనము చేసెను. మృత్యుసమయమున కామెకు ముప్పదిరెండు సంవత్సరముల ప్రాయ ముండెను. కృపాబాయి యింకను కొన్ని సంవత్సరములు జీవించి యుండినయెడల నింకను

కొన్ని గ్రంథములు వ్రాసియుండును. కాని దేశముయొక్క దౌర్భాగ్యమువలననే యామె యాయువు క్షీణించెను. ఇఁక ముం దయినను విద్యావతులును సద్గుణసంపన్నులు నగుస్త్రీ లుద్భవించి యీదేశమును సౌభాగ్యసంపన్నముగాఁ జేయుదురుగాత మని కోరుచు నీచరిత మింతటితో ముగించెదను.

# మొల్ల

కింకులేన విశాలేన విద్యాహీనేన దేహినాం
దుష్కులం చాపి విదుషో దేవైరపి సుపూజ్యతే *

మొల్ల యాత్మకూరి కేశయసెట్టి కూఁతురు. ఈమె కులాలవంశ సంభూత యని పరంపరగా వాడుక వచ్చుచున్నది. ఆంధ్రమునందు నీమె రామాయణము రచియించి నందున నీమెకీర్తి జగములో నజరామరమయి యున్నది. ఈ యువతి ౧౬వ శతాబ్దారంభమున నున్నట్లూహింపఁబడుచున్నది.

....................గోప
వరపు శ్రీకంఠమల్లేశు వరముచేత నెఱిఁ గవిత్వంబు
చెప్పఁగ నేర్చినాను.

అని చెప్పుకొనుటచే నీమె నివాసస్థలము నెల్లూరి మండలములోని గోపవరమని తెలియుచున్నది. ఈమె రామాయణమును చదివినవా రంద ఱీమెకుఁ దెనుఁగునందత్యంతప్రావీణ్యముండెనని యొప్పుకొనక మానరు. ఈమెకవిత్వము మృదుమధురమయి, 'తేనె సోఁక నోరు తియ్యన యగురీతిఁ దోడ

---

*శ్రేష్ఠ మయినకులమునందుఁ బుట్టి విద్య లేకుండిన నేమిలాభము; నీచకులము నందుఁ బుట్టినను విద్యావంతు లయినవారు అందఱికిఁ బూజ్యులు అనఁగా కులము ప్రధానము గాదు; గుణమే ప్రధాన మన్నమాట.

నర్థమొల్లఁ' దోఁచునదియయి, 'గూఢశబ్దవితతి కొట్లాట' లేనిది యయి ద్రాక్షాపాకమయి యొప్పుచున్నది. గూఢపదగుంభనముచే నర్థకాఠిన్యము సాధించి చదువరులను బాధపెట్టుట యామె కెంతమాత్రమును ఇష్టము లేదు. కవిత్వధోరణియెట్లు లుండవలయునో యన్నవిషయమయి యీయామె సుందరమయిన మూఁడుపద్యములు వ్రాసియుంచినది. ఆమూఁడు పద్యములు కవిత్వము జెప్పువా రందఱును తమతమ హృత్పటములమీఁద వ్రాసి యుంచుకొనఁ దగినవి. అవి యేవియన:—

క. మును సంస్కృతంబు తేఁటగఁ
దెనిఁగించెడిచోట నేమి తెలియక యుండన్
దనవిద్య మెఱయఁ గ్రమ్మఱ
ఘనముగ సంస్కృతము చెప్పఁగా రుచియగునే.

గీ. తేనె సోఁక నోరు తియ్యన యగురీతిఁ
దోడ నర్థ మెల్లఁ దోఁచకున్న
గూఢశబ్దవితతి కొట్లాటపని యెల్ల
మూఁగ చెవిటివారి ముచ్చటరయ.

క. కందువమాటల సామెత
లందముగాఁ గూర్చి చెప్ప నవి తెపఁగునకుం
బొందై రుచియై వీనుల
విందై మఱికానిపించు విబుధుల కెల్లన్.

మొల్లకుఁ గవిత్వస్ఫూర్తి విశేషముగానుండినందున నామె యాశుకవిత్వము సులభముగాఁ జేయుచుండెను. మొల్ల తలయంటికొని స్నానము చేసిన పిదప రామాయణరచన కా

రంభమును జేసి తలవెంట్రుక లారులోపల నొకకాండమును ముగించెనని లోకవార్త గలదు. "అక్కడక్కడఁ గొన్ని వ్యాకరణదోషము లున్నను మొత్తముమీఁద నీమెకవిత్వము మిక్కిలి మృదువై, మధురమై రసవంతముగా నున్నది. ఈరామాయణము కొంతకాలము క్రిందటివఱకును వీధిబడులలో బాలురకు పాఠముగాఁ జెప్పుచుండిరి. ఇది పురుషులు చెప్పిన గ్రంథములలో ననేకములకంటె మనోజ్ఞమై ప్రౌఢమైయున్నది." అని కవిచరిత్రకారు లీమెకవిత్వమునుగుఱించి వ్రాసియున్నారు. మొల్ల భక్తిపూర్వకముగా రచియించిన రామాయణము మొల్లరామాయణ మను పేరిట నాంధ్రదేశమునందంతటను సువిఖ్యాతమే. ఈరామాయణములోని కొంతభాగము ప్రవేశపరీక్షకుఁ బఠనియగ్రంథముగా నప్పుడప్పుడు నియమింపఁబడియున్నది. ఇందువలన నీరామాయణ మొకశ్రేష్ఠమైన కావ్యమని స్పష్టమగుచున్నది. ఈమె కవనధోరణిఁ దెలుపుటకయి మొల్లరామాయణమునందలి కొన్నిపద్యముల నిందుదాహరించెదను.

ఉ. రాజులు కాంతియందు రతిరాజులు రూపమునందు వాహినీ
రాజులు దానమందు మృగరాజులు విక్రమకేళియందు గో
రాజులు భోగమందు దినరాజులు సంతతతేజమందు రా
రాజులు మానమందు నగరంబున రాజకుమారు లందఱున్

ఉ. సాలముపొంతనిల్చి రఘుసత్తముఁ డమ్మరిఫ్రాసి శబ్దవి
స్ఫాలముగాఁగ విల్ దివిచిముష్టియుదృష్టియుఁగూర్చిగోత్రభృ
త్తూలము వజ్రపాతహతిఁ గూలువిధంబునఁ గూలనేసెన
వ్వాలిఁ బ్రతాపశాలి మృదువందనశీలి సురాలిమెచ్చఁగన్

ఉ. పున్నమచందురుం దెగడిపొల్పెసలారెడు మోముదమ్మియుం
గన్నులు కల్వఱేకులను గాంతి జయించెడుఁ గానిరక్తిమం
జెన్నుదొలంగియుండవఱ చేతులుఁ బాదములుఁ దలంపఁగా
నున్నవి వర్ణముల్ గలిగియొప్పుంశో అంగన రాసువేశ్వరా.

ఈమొల్ల కుమ్మరకులమునం దుద్భవించియుఁ దనవిద్య వలన నుచ్చవర్ణమువారిచేఁ గూడ గౌరవింపఁబడఁ బాత్రురా లాయెను. ఇట్టివిద్య మాసోదరీమణుల కందఱకును గలిగినయెడల మనదేశ మితరదేశము లన్నిఁటికిని మాన్యస్థాన మగుననుట కెంతమాత్రమును సందియము లేదు.

# పృథివీరాజు భార్య.

---

గుణో భూషయతే రూపం శీలం భూషయతే కులం.*

ఈమె సిసోదియావంశమునందుఁ బుట్టి సుక్తావతవంశస్థాపకుఁడైనసుక్తరాజు పుత్రియు, రాఠోరువంశమునందుఁ బ్రసిద్ధుఁడగు పృథివీరాజు పత్నియునని పూర్వచరిత్రములు చెప్పుచున్నవి. ఈమె అక్బరుబాదుషాకు సమకాలీనురాలు; గాన పదియాఱవశతాబ్దారంభమునం దుండెనని తేలుచున్నది.

అక్బరుబాదుషా యితరతురుష్క ప్రభువులవలెఁ దనప్రజలను బాధింపక వారివారిధర్మములను రక్షించుటచే సర్వధర్మసముఁడని ప్రసిద్ధుఁ డయ్యెను. ఆయన సకలజనులకును, దనకును మనోరంజనము గలుగుటకై ప్రతిసంవత్సరము తననగరమునందుఁ గొన్నిదినములు గొప్పయుత్సవము జరుపుచుండెను. ఆయుత్సవపు తుదిదినమునందచట సర్వము స్త్రీమయముగానే చేయఁబడుచుండెను. ఆ స్త్రీప్రపంచములో ఆడువారును, పాడువారును, అమ్మువారును, కొనువారును, ఇతరమైన యుత్సవములఁ జేయువారును చూచువారును అందఱు స్త్రీలే! ఆరోజు పురుషులకు నాయుత్సవము జరుగుచున్న స్థలమునకు వెళ్ళుటకు ననుజ్ఞ లేకయుండెను. కాన నాఁటిదినము బాదుషా యంతఃపురమునందలి స్త్రీలును, ఇతరరాజపత్నులును ఆయుత్సవము

---

* రూపము సద్గుణముచేఁ, గులము సచ్ఛీలముచే నలంకరింపబడును.

నందమనిరాతంకముగాఁదిరుగుచుండిరి. అచటికిఁబురుషులెవ్వరును రాకుండ కట్టుదిట్టములు చేయఁబడినను అక్బరుమాత్రము స్త్రీ వేషమున నచట నితరుల కెఱుఁగ రాకుండ నటుల సంచరింపుచుండెను.

ఆయుత్సవమునకు నొకసంవత్సరము పృథివీరాజు భార్యవచ్చెను. కాని యీ యుత్సవమువలన నామె కెంత మాత్రము సంతోషము కలుగలేదు. ప్రచ్ఛన్న వేషముతో నుండిన బాదుషా యత్యంతరూపవతియగు నామెగుణనుగని మిగుల మోహితుఁడయి యామె మఱలి వెళ్లుమార్గమున నామెరాక నిరీక్షించుచుండెను. ఇంతలో నాసాధ్వీమణి మఱలి తననగరునకుఁ జనుటకై బాదుషా కాచుకొనియుండినమార్గమునఁ బోవఁదొడఁగెను. అట్లు వచ్చుసుందరిని నకస్మాత్తుగా నాఢిల్లీశ్వరుఁ డరికట్టెను. తన నరికట్టినవాఁడు అక్బరనియు, దురుద్దేశముతో నాతఁ డిట్లు చేసెననియు నాకాంత తెలిసికొనెను. అంత నామెతనవలెనే యితర స్త్రీల నెందఱినో కపట స్త్రీ వేషధారియగుబాదుషా చెఱుప యత్నించియుండునని తలఁచి క్రోధావేశపరవశురాలయి మిగుల రోషముతోఁ గన్నుల నిప్పులురాల తనగుప్తభల్లమును చేత ధరించి మిగుల ధైర్యముతో "పవిత్రమగు క్షత్రియవంశమును కలంకమయము చేయఁదలంచిన దుష్టు బారినుండి నాపాతివ్రత్యమును సంరక్షించుకొని యీద్రోహిని నాచేతిఖడ్గమునకుఁ బలియియ్యఁగలను" అని పలికెను. ఇట్లు గంభీరస్వరముతోఁ బలికిన ధైర్యవతి పలుకులు విని బాదుషా కొరతవడి చిత్రప్రతిమవలె చేష్టలు దక్కి నిలువఁబడి తదనంతర మాతఁడు విజ్ఞానవంతుఁడగు ప్రభువగుటచేఁ

దనయజ్ఞానమునకు సిగ్గుపడి యాకాంతకు నమస్కరించెను. నాఁటినుండియు బాదుషా పశ్చాత్తాపపరుఁడయి యామెను తనసహోదరినిగా నెంచుచుండెను.

## పన్నా.

క. ఇప్పుడు నయ్యుత్తమసతి నప్పురమున
నొప్పువార లతిముద మొదవం
జొప్పడఁ గీర్తనసేయుదు రిప్పరుసన్
నుండవలదె యింతులు పుడమిన్.

[చింతామణి.

మేవాడదేశపు రాజగు సంగ్రామసింహుఁడు మృతుఁడయినవెనుక నాతని పుత్రులు ముగ్గురిలో నిరువురు స్వల్పకాలమే రాజ్యము పాలించి పరలోకమున కేగిరి. మూడవవాఁడగు ఉదయసింహుఁడైదేండ్ల ప్రాయముఁ గలవాఁడయి దాది పోషణలోనే యుండెను. ఈతని దాదిపేరు పన్నా. ఈపన్నాకు రాజధాత్రిత్వము వంశపరంపరగా వచ్చుచుండెను. ఈమె సుగుణములు మిగుల విలువగలవని తెలుపుటకుఁ గాఁబోలును నవరత్నములలోని దగు* (పన్నాపచ్చ) యని తలిదండ్రు లామెకుఁ బేరిడిరి పన్నా వారిడిన నామమునకుఁ దగు గుణవతి యయ్యెను.

సంగ్రామసింహుని పుత్రు లిరువురును స్వర్గస్థులైన పిదప నుదయసింహుపేర పృథివీరాజునకు దాసీపుత్రుఁడగు బన

* ఈమెపేరు ఒకానొక తెలుఁగుగ్రంథకారుఁడు మోతి (ముత్యము) యని వ్రాసినాఁడుగాని యందు కాధారమేమియుఁ రాజపుత్రానాచరిత్రమునందుఁ గానరాలేదు.

బీరుఁడు రాజ్యము నడుపున కేర్పాటుచేయఁబడెను. బనబీరుని జన్మమువలనే గుణమును నీచమైనదియేగాన వాఁడు తాననర్హుఁడయినను అదృష్టవశమునఁ దనకు రాజ్యమును రాజపాలకత్వమును దొరకుటకు సంతసించి యుండక రాజ్యముతనకే శాశ్వతముగానుండు నుపాయము విచారింపసాగెను. ఇట్లు విచారింపఁగా రాజపుత్రుని నెటులయినఁ జంపక తనకుదొరకదని వాఁడు తెలిసికొని యెవ్వఱికి నెఱుకపడకుండ తానేయా పనిని జేయ నిశ్చయించుకొనెను. ఆనీచుఁడు తనకృత్య మించుక బైలపడిన యెడల రజపూతు సరదార్లు తనను వెగఁజూతురని యెఱిఁగినవాఁడుకాన పైకిమిగుల సత్ప్రవర్తనగలవానివలె నగుపడుచుండెను. రాజపుత్రుని నెటులయినఁ దానుచంపి యాద్రోహ మితరులపై నిడి సరదార్ల సమ్మతిచేఁ దానేరాజగు నుపాయము నాతఁడు యోచింపుచుండెను.

బనబీరుని మనమునం దిట్టిద్రోహముకలదని యేరికిని సంశయమయినను రాకుండెను; గాని యిట్టిపాపవిచారము బైలపడకుండుట దుస్తరము గాన నాతని దుష్టవిచారమంతయు సమీపమునందుండుమంగలివాఁ డొకఁడు తెలిసికొనెను. వాఁడును పన్నావలెనే ప్రభుభక్తుఁడు. వానికిఁ బనబీరుని పరిపాలనమే యసమ్మతము. బనబీరుఁడు తనదుష్టత్వ మెంతగుప్తముగా నుంచినను, పరమేశ్వరుఁడు ఆపాపమున కంతకును నీ మంగలివాని నొకనిని సాక్షిగా నియమించెను. బనబీరుఁ డేసమయమునం దేమియాలోచన చేసినను బహుయుక్తులచే నీమంగలి యప్పుడే దానిని గని పెట్టుచుండెను.

ఇట్లుండఁగా నొకనాఁటి రేయి రాజనగరమునం దంతటను నిశ్చలముగా నున్న సమయమున పన్నా రాజపుత్రునివానితో సమవయస్కుఁడగు తనపుత్రుని నిదుర పుచ్చితానుసమీపమున నేదోకుట్టుకొనుచు కూర్చుండెను. ఇంతలో ద్వారమావల నేమో కాలుచప్పుడు వినవచ్చినందున నాదాది లేచి చూచెను. అప్పుడు పైనిఁ జెప్పఁబడిన మంగలివాఁడు మిగులనాతురతతో వచ్చుటఁగని పన్నా "నీవింత తొందరగా వచ్చిపిచ్చివానివలె నాతురుఁడవయ్యెద వేల? ఏదియేని యప్రియమా?" యని యడిగెను. అందు కానాపితుఁడు "అవును మిగుల ఘాతకాఁబోవుచున్నది. ఇంక నొక గడియ కా బనబీరుఁడు రాజపుత్రునిజంప నిట కేతెంచును." ఈవాక్యములు చెవిని సోఁకగానే పన్నా దేహము ఝల్లు మన నొక యూర్ధ్వశ్వాసను విడిచి యిట్లనియె. 'నే నిన్ని దినములు వచ్చునని భీతిల్లు చుండినదే నేఁడు ప్రాప్తమయ్యెను. ఆదుష్టునిపై నాకిదివఱకే యనుమానముండెను కాని నే నాఁడుదాన నగుటచే నేమి చేయుటకును జాలకుంటిని. ఏది యెట్లయినను నిప్పుడు రాజపుత్రుని రక్షించుట మనకర్తవ్యము" అందుకామంగలి "యది బహుదుర్ఘటము. అయినను నీకేదేని యాలోచన దోఁచినచో త్వరగాఁ జెప్పుము. నీ వెట్టికార్యము చెప్పినను నేను నిర్వహింపఁగలను" అనెను. తదనంతరము పన్నా యొకించుక విచారించి "రాజపుత్రుని నొకానొకసుస్థలమునకుఁ గొని పోవుదము"ని చెప్పెను "అట్లు చేయుటకు వీలు లేదు. నేఁ డే బాలకులను రాజనగరు వెలుపలికిఁ గొనిపోవకుండ పాపాత్ముఁడు కట్టడిచేసెను. పన్నా "అటులైననీ రాజపుత్రుని నొకతట్టలోఁ బెట్టి పైన వెంట

జోసి నీ కిచ్చెదను, నీవు దానిని గొనిచని సురక్షిత మగుచో టనుంచు నంతలోనే నచటికివత్తును," మంగలి "బనబీరుఁ డింతలో నిచటికి రాఁగలఁడు. వచ్చువఱకిచట రాజపుత్రుఁడు లేకుండె నేని తత్క్షణము చారులచే వెతకించి పిల్లనిఁ దెప్పించును. అటులైన రాజపుత్రుని ప్రాణములను మనము కాపాడ నేరము." పన్నా కొంచెము యోచించి మిగులఁ గాంభీర్యముగా "ఇందు కింతగా విచారింపనేల ? వాఁడిచటికి వచ్చిన యెడల రాజపుత్రుఁ డిచట లేఁడనుమాటనే వానికి దెలియనియ్యను. రాజబాలుని నగలను బట్టలను నాబిడ్డనికి నలంకరించి యాప్రక్కమీఁదనే పరుండఁ బెట్టెదను ! నాపుత్రుని మరణమువలన మేవాడదేశపురాజును మాప్రభుఁడునగు నీబాలుడు రక్షింపఁబడును కాన నాకది యే పరమసమ్మతము." పన్నా దృఢనిశ్చయముగాఁ బల్కినవాక్యములను విని యానాపితుఁడు మిగుల నాశ్చర్యముతో నేమియు ననక నిలువఁబడి యుండెను. ఇంతలో పన్నా రాజపుత్రుని నొకతట్టలో నునిచి పైన పుల్లాకులు, పెంట మొదలయినవివోసి యాతట్టత్వరగాఁ గొని చనుమని యాసేవకుని తొందర పఱుపసాగెను. దీని నంతనుగని పన్నా ధైర్యమునకును రాజభక్తికిని వింతపడిదాని యందధిక దయగలవాఁడై యాభృత్యుఁడు "పన్నా ! నీవింత సాహసకార్య మేలచేసెదవు? ఇంకను నీమనంబునం దించుక విచారింపుము." పన్నా "విచారింపవలసిన దే మున్నది ? నాకర్తవ్యము నేను చేయుటకుఁ దగినవిచారము చేసినాను. నీవిట్టియాటంకములనే చెప్పుచు నిచట నాలస్యము సేయకుము."

ఎంత చెప్పినను పన్నా వినదని తెలిసికొని తా నాలస్యముచేసిన రాజపుత్రుని ప్రాణము దక్కదని యెఱిఁగినవాఁడగుటచే వాఁడాతట్టను నెత్తిసి నిడికొని రాజనగరు వెలుపలి కరిగె. పన్నాదాదియు రాజపుత్రుని అలంకారములను తనపుత్రునకు నలంకరించి వానిని రాజబాలుని పానుపు, పైనిదురఁబుచ్చెను. ఇటులీ రాజభక్తి గల యువతి తనపుత్రుఁడు నిదురింపుచుండ తా నాపక్కసమీపమునందుండి బనబీరుని రాక నిరీక్షింపుచుండెను. ఇంతలో నాకాలస్వరూపుఁ డచటికివచ్చి మిగుల దయగల వానివలె రాజపుత్రుని దేహము స్వస్థముగా నున్నదాయని పన్నా నడిగి వానిని జూచెద నని పక్క యొద్దికరిగెను. ఆప్రకార మచటికరిగి వాఁడు నిదురింపుచున్నవా రెవ్వరని విచారింపక నాయర్భకుని పొట్టలో కత్తిపొడిచి పాఱిపోయెను. ! వాఁ డట్టుపోవఁగా నాబాలుఁ డొక కేక వేసిప్రాణములు విడిచెను. ఆకేక రాజభవనమునం దంతటను వినఁబడి జనులనందఱిని లేపెను

ఆకేక విన్నతోడనే రాజభవనమునందలి వారందఱచటికి వచ్చిరి. వారువచ్చిచూచునప్పటికి రాజపుత్రుని దేహమంతయు రక్తమయమయి యాబాలుఁడు ప్రాణములనువిడిచియుండెను ; పన్నాదాది యాబాలుని సమీపముననే దేహము తెలియక పడియుండెను. చచ్చినవాఁడు రాజపుత్రుఁడేయని తోఁచుటచే జనులందఱు మిగులదుఃఖించిరి. పన్నా సేదదేఱిన పిదప రాజపుత్రుని జంపినవా రెవ్వరని యడుగఁగా "నొకనల్లటి పురుషుఁ డెవఁడో చంపెన"ని చెప్పెను. రాజపుత్రుని జంపినవా రెవరో యని యనేకులు లూహించిరి. కానిసాక్షులు

లేనందున దానిని నిశ్చయింప లేకుండిరి. పన్నాదాయి యచటనుండి వెడలి రాజకుమారునిదాఁచిన స్థలమున కరిగియాబాలుఁడు ప్రౌఢుఁడగువఱకు నాతనిని పోషించెను. ఈసంగతియంతయు రజపూతులకుఁ దెలియఁగావారు ఉదయసింహుఁడు పెరిగినపిదప బనబీరుని దేశము వెడలగొట్టి ఉదయసింహునినే రాజునుగాస్వీకరించిరి. ఇట్లురాజభక్తిగల యువతివలన సంగ్రామసింహునివంశము నిలిచెను. అనేకప్రజలను గాపాడు ప్రభువుబతికెను. కావనట్టి యువతికీర్తి భరతఖండమునం దంతటను నిండియుండుట వింతగాదు. ఉదయ సింహుఁడు పన్నాను తల్లినిగా భావించి పూజింపుచుండెను.

# ఖడ్గతిక్కన భార్య.

---

అమృతం సద్గుణాభార్యా. *

ఈయువతీరత్నముయొక్క నామధేయ మయినను దెలియనందువలన నీమెభర్తంపేరటనే యీమెను జనులు గుర్తించెదరు. ౧౩వ శతాబ్దమున సూర్యవంశపు రాజగు మనుమసిద్ధి నెల్లూరిమండలము పాలింపుచుండెను. ఆయన యాస్థానమునందున్నకవి తిక్కన. కార్యతిక్కన, ఖడ్గతిక్కన యను సహోదరులలోఁ బరాక్రమవంతుఁడగు ఖడ్గతిక్కన నియోగి బ్రాహ్మణుఁడు. ఈయన తన పరాక్రమమువలన రాజుచే మిగులమన్నింపఁబడుచుండెను.

ఖడ్గతిక్కనభార్య విద్యావతియు, గుణవతియునై సదా పతిశ్రేయము నే కోరుచుండెను. ఆమెభర్త చేసినదంతయు మంచిపని యని యూరకుండక యాతఁడేదేని కానికార్యము చేయఁ దలఁచినయెడల తనచాతుర్యమువలన నాతనిచే నట్టికార్యము జరుగకుండఁ జేయుచుండెను. ఇందునకు నిదర్శనముగా నొకప్పుడామె చేసిన చాతుర్యమిం దుదాహరించెదను.

ఒకానొకసమయమున రాజగుమనుమసిద్ధిపై శత్రురాజులు దండెత్తి వచ్చిరి. అపుడు కొంతసైన్యమునుఁగూడిచ్చిరాజు ఖడ్గతిక్కనను శత్రువులతోఁ యుద్ధమున కంపెను. ఖడ్గతిక్కన

---

* సద్గుణవతి యగుభార్య అమృతమువలె హితకరురాలు.

యెంతటి శౌర్యవంతుఁ డయినను వైరులధిక సైన్య సహితులగుటచే నీతనిశౌర్య మేమియు వినియోగింప కుండెను. ఇట్లుకొంతవడి పోరాడితనకు జయము కలుగు నన్న యాస సున్నయగుటచే ఖడ్గతిక్కన యుద్ధభూమినుండి పాఱి తన గృహమునకు వచ్చెను.

పరులకోడి తనభర్త పాఱివచ్చుట విని మానవతి యగు నాతనికాంత మిగుల చింతించి సమయోచితబుద్ధి గలది యగుటచే పెనిమిటి వచ్చులోపల మఱుఁగు స్థలమునందు స్నానజలముంచి నీళ్లబిందెకు పసపుముద్ద యంటించెను. ఇట్లు స్త్రీలు స్నానముచేయుటకు నావశ్యకములగు వస్తువు లుంచుటనుంచి యామెభర్తరాఁగానే యాదరింపక తిరస్కారముగా స్నానము చేయుఁడని చెప్పెను.

తిక్కన తనభార్య ముఖమునందలితిరస్కారభావమును గని యప్పుడేమియుననక స్నానమునకరిగెను. అచట నాఁడువారి కుంచునట్లొకమంచ మడ్డముగానుంచి నీళ్ళబిందెకు పసపు ముద్ద యద్దుటఁగని తిక్కన యది తాను యుద్ధమునుండి పాఱి వచ్చినందుకు భార్య తనను దిరస్కరించుటకై చేసినపనియని తెలిసికొనెను. అయినను ఆయన యంతటితో నూరకుండక తన భార్యను బిలిచి యిది యేమియని యడిగెను. అంత నా వీరపత్ని యాతనికి పౌరుషము కలుగుటకయి యీ పద్యముఁ జదివెను.

క. పగఱకు వెన్నిచ్చినచో ।
నగరే నిను మగతనంపు నాయకులందఱ్ ?

ముగురాఁడువార మైతిమి।
వగ పేటికి జలకమాడ వచ్చినచోటన్ ?

ఇదివఱకు అత్తకోడండ్ర మిద్దఱమె యింట స్త్రీలముంటిమి. ఇప్పుడు మీరు యుద్ధము వదలి పాఱివచ్చినందున స్త్రీసమానుల రయితిరిగాన నిందు **ముగ్గురు** స్త్రీలమయినా **మన్న** యర్థముగల యీవాక్యములు చెవిసోఁకినవెంటనే ఖడ్గతిక్కన మిగుల లజ్జించి యపుడే మరల యుద్ధమున కరిగి మిగుల కీర్తి గాంచెను. కొందఱిదియంతయుఁ దిక్కన తల్లియొక్కపని యనియెదరు. ఇట్లు పూర్వమాంధ్రదేశమునందు **పూజనీయ**లగు వీరపత్నులు, వీరమాతలు వీరభగినులు అనేకులుండుట వలననే యాంధ్ర దేశములోఁ బ్రాహ్మణులలోఁగూడ క్షాత్రతేజ మత్యంత ప్రబలమయియుండెనని చెప్పుటకు సందేహము లేదు.

# తఱిగొండ వెంగమాంబ.

---

క. కందువమాటల సామెత।
లందముగాఁ గూర్చి చెప్పనవి తెనుఁగునకుం
బొందై రుచియై వీనుల।
విందై మఱి కానిపించు విబుధుల కెల్లన్. మొల్ల.

తఱిగొండ వెంగమాంబ వసిష్ఠగోత్రికుఁడును, నందవరీక బ్రాహ్మణుఁడును నగు కృష్ణయ్యయను నాతనిపుత్రిక. ఈమె వాసస్థానము కడపమండలములోని తఱిగొండయని యూహింపఁబడుచున్నది. వెంగమాంబ తెలుఁగునందు విద్వాంసురాలని యామెచే రచియింపఁబడిన గ్రంథములే వేనోళ్లఁ దెలుపుచున్నవి. వేంకటాచలమాహాత్మ్యమునం దీమె ఆశ్వాసాదిని వేసిన శ్లోకములవలన సంస్కృతమునందును నీమెకుఁ గొంత పరిచయము గలదని తోఁచుచున్నది. ఈమె బాలవితంతువు. వేదాంతగ్రంథపఠనము వలనను, గ్రంథరచనవలనను కడపమండలములోనే గాక తెనుఁగుదేశము నంతటను వెంకమ్మగారి కీర్తి విస్తరిల్లెను. కాన జనులామెయం దధికవిశ్వాసముఁ గలిగి దేశాచారప్రకార మామెపై ననేకకథలను జెప్పుకొనసాగిరి. అవి యన్నియు నిందుదాహరించుట యనావశ్యకము గాన నొకటి రెంటిని మాత్రమిందుదాహరించెదను.

వెంగమాంబ గ్రంథరచన చేయుచు నేకాంతముగా నొకగదిలో కూర్చుండుచుండెను. అచటినుండి యామె యా

వలికి రాఁగానే యామె ముఖమునం దానందమును, దేహము నందు సుగంధమును గానవచ్చుచుండెనఁట. ఇందువలననామె వదినలామెయందు దోషముకలదని తలఁచి దానిని గనిపెట్టుట కయి యాగదిద్వారముకడ కాచియుండిరఁట. అంతఁ గొంత సేపటికి లోపల నెవ్వరో పురుషుఁడు నవ్వినట్లును, నృత్యము చేసినట్లును వారికి వినఁబడెనఁట. అందుపై వారు తమభర్తలను బిలిచి తాము విన్నసంగతులను దెలిపిరఁట. అట్లందఱు గుమి గూడి వెంకమ్మను తలుపు తెఱపుమనఁగా నామె నిర్భయముగాఁ దలుపు తీసెనఁట. అప్పుడు వారాయఱనంతను శోధించి పురుషుని నెవ్వనిని గానక యామె నడుగఁగా శ్రీకృష్ణుఁడుదప్ప నన్యపురుషుఁడేల వచ్చునని పలికెనఁట. ఇవి యన్నియు నామె భక్తివిశేషమును దెలుపుకథలేగాని వేరుగాదు.

వెంగమాంబ తనజీవితకాలమునం దంతను శిరోజముల నుంచుకొనినందున జనులామె యన్నదమ్ములను బహిష్కరిం చెదమని బెదరించిరి. వారంతటితో నూరకుండక శంకర స్వాములవారు రాఁగా నాలోకగురున కీసంగతి విన్నవించిరి. అందుపై నాస్వాములవారు వెంకమ్మను బిలిచి నీశిరోజములు తీయించుకొమ్మని చెప్పెను. అందు కామె యించుకయు జంకక పరమేశ్వరుఁ డిచ్చినవి మనుజులేల తీయవలెననియు, అందువలన పరపురుషస్పర్శదోషము కలుగుననియు, ఒకపర్యాయము తీసినవవి మరల రానియెడలనది పరమేశ్వరునకు సమ్మతమనియు, అట్లుగాక మఱుదినముననే మరలవెండ్రుకలు మొలచుటచే నది పరమేశ్వరునకు నసమ్మతమని స్పష్టముగాఁ దెలియుచున్నదనియు, వాదించెను. అంతటితో నూరకుండక గురు

వాజ్ఞాపింపఁగా బంధువులామెను బట్టుకొని బలవంతముగా కేశవపనము చేయించిరనియు, అందుపై నామె నదికిపోయి స్నానముచేయఁగా వెంటనే పూర్వమువలెనే కేశములు మొలిచెననియు, అదిగని గురువులును, బంధువులును మిగుల నాశ్చర్యపడి యటుతరువాత నామెజోలి మానిరనియుఁ గొందఱు చెప్పెదరు. ఏది యెట్లున్నను వెంగమాంబగారికి వితంతుస్త్రీలకు కేశవపనము చేయుట కిష్టము లేదనుట వాస్తవము.

వెంగమాంబగారికి నిష్టములేని యీకృత్యము ఏస్త్రీలకును సమ్మతంబు కానేరదు. మన దేశమునందు నంధపరంపరగా వచ్చిన యీయాచారమునకుఁ గాదనలేక కొందఱు యువతులు సమ్మతించినటుల నగుపడినను వారి యంతరములయందు నపరిమితదుఃఖము కలిగియే యుండును. వారివారి భర్తల మరణ సమయమునకంటెను కేశవిసర్జన కాలములయందే వారధిక దుఃఖితు లగుచుందురు. వపనకర్తవలన దమకును దమభర్తలకునునిజముగాఁ బుణ్యలోకములు దొరుకునని వారికి నమ్మకమున్నయెడల వారాసమయములయందు దుఃఖించుటకు మారుగా నమితసంతోషమును బొందవలసినదే. స్త్రీలు పతివిహీనలై యలంకారరహితలై మంగళకార్యములకు దూరలై మితిమీరిన దుఃఖవహ్నిలోఁ బొరలుచుండ సుఖమునందున్నవారి బంధువులు మంచిమాటలతో వారిశోకాగ్ని నార్పుటకు మారుగా బరమేశ్వరుఁ డిచ్చినకిరీట మనఁదగిన కేశకలాపమును నేలపాలుచేసి యాదుఃఖాగ్నిలో నెయ్యిబోసి ప్రజ్వలింపఁ జేయుదురు. ఇది యెంతటి యన్యాయము! ఈ దురాచారము సహగమనమునకంటెను దక్కువ క్రూరమై

నదయినను కొందఱు యువతుల కిది సహగమనమునకన్నను విశేషభయంకరముగ నున్నదని తోఁచుచున్నది. వారిట్లువిరూపులై నలుగురిలో నవమానకరమగు నిట్టిబ్రతుకు బ్రతుకుటకంటెను సహగమనముచేసి యొకగడియ దుఃఖముతో దేహము విడుచుట నూఱురెట్లెక్కువ సులభమని తలఁచుచున్నారు. వారు సహగమనము లేకపోవుటకు విశేషచింత నొంది దాని మాన్పిన వారినే క్రూరులని నిందింపుచున్నారు. సాధారణముగ పురుషుల కయినను దుస్సహమగు నవమానము కలిగి బ్రతుకుట కంటెను మరణమే సుఖదాయకముగ నుండునని తోఁచుట సహజము. ముందుగాఁ దమకవమానము కలుగునని తెలిసి యాత్మహత్య చేసికొనిన పురుషు లెందఱో కలరు. ఇందువలన సహితము నవమానముకంటె మరణమే మేలని జనులకుఁ దోఁచునని మనకు తెలియుచున్నది. కావున స్వదేశబాంధవులందఱును మనదేశములోని స్త్రీలకుఁ గలుగుచున్న యీవ్యసనకరమగు నవమానమును తొలఁగింపఁ బ్రయత్నింతురు గాక.

ఈమె మిక్కిలి వృద్ధురాలయి కాలధర్మము నొందెను. ౧౮౭౦వ సంవత్సరము వఱకీమె జీవించియున్నట్టు తెలియుచున్నది. బాలవితంతువైనందున నీమెభర్త నామగోత్రములెచటను గానరావు. వెంగమాంబచే రచియింపఁబడిన గ్రంథములలో రాజయోగసారమను వేదాంతపరమయిన ద్విపద కావ్యమును, వెంకటాచలమాహాత్మ్యమును మాత్రము ముద్రింపఁబడి యున్నవి. వీనిలో రాజయోగసారము భాగవతము నందలి తృతీయ స్కంధాంతర్గతమైన కపిలదేవహూతి సంవాదమునుగొని మిగులరసవంతముగాను, సులభముగాను,

ద్విపదకావ్యముగా రచియింపఁబడినది. దీనిలో సామాన్య జనంబులకుఁ గూడ సులభముగా తెలియునటుల వేదాంతము వివరింపఁబడినది. వేంకటాచల మాహాత్మ్యమునందు విష్ణుమూర్తి పద్మావతిని వివాహమాడినకథ మిగుల చిత్రముగాఁ జెప్పఁబడియున్నది. కడమగ్రంథము లేవియు ముద్రింపఁబడనందున వానిని గుఱించి యేమియు వ్రాయుటకు వీలు లేదు. "ఈమె కవిత్వమునం దల్పదోషము లక్కడక్కడఁ గానవచ్చుచున్నను మొత్తముమీఁద కవన మతికఠినముగాక మృదుమధురరచనను గలదియయి యున్నద"ని కవిచరిత్రమునందు రాయబహదూరు కందుకూరి వీరేశలింగము పంతులవారీమె కవిత్వమును బొగడిరి. ఇట్టివారిచేఁ బొగడఁబొందఁ దగినవిద్యయుఁ గవిత్వశక్తియుఁ గలిగినను నీమె యించుకంతయు గర్వము లేక మిగుల వినయవతిగా నుండెనని రాజయోగసారములోని యీ క్రింది ద్విపదలు వెల్లడించుచున్నవి.

ద్వి. వినరయ్య కవులార విద్వాంసులార
వినరయ్య మీరెల్ల విమలాత్ములార
ఘనయతిప్రాస సంగతులు నేనెఱుఁగ
వరుస నాక్షేపింప వలదు సత్కృపను.

ఈమె రచియించిన గ్రంథములు తరిగొండ నృసింహస్వామి కంకితములు చేయఁబడినవి. ఈమె శృంగారరసాధిదేవత యగుకృష్ణుని భక్తురాలయినను ఆమెకుఁ దనగ్రంథములయందెక్కడను శృంగారవాక్యములను జొప్పింప నిష్టము లేకయుండెను. అందువలన నామె కృష్ణుని నిట్లు స్తుతియించెను.

శా. శృంగారా కృతితోడ వచ్చి పదముల్ శృంగార
[సారంబుతో డంగూఢంబుగ
జెప్పనీ వనిన నట్లేఁ జెప్పలే నన్ననన్ ముంగోపంబున
[జూచి లేచి యటనే మ్రొక్కంగ
మన్నించితచ్ఛృంగారోక్తులు తానే పల్కెకొను న
[శ్రీకృష్ణు సేవించెదన్

ఇందువలనఁ దన గ్రంథములయందు శృంగారవాక్యము నిముడ్చుటకుఁ దనకెంత మాత్రము నిష్టములేకుండఁగా సంద ర్భానుసారముగా నాగ్రంథములయం దక్కడక్కడ వచ్చి శృంగారపద్యములను శ్రీకృష్ణుఁడే రచియించెనని యాప తెలుపుచున్నది. ఈ విద్యావతి కవనరీతినిఁ దెలుపుటకుం ముద్రిత గ్రంథములోని కొన్ని పద్యములిం దుదాహరించి యీమె చరితము ముగించెదను.

వేంకటాచలమాహాత్మ్యము.

ఉ. రామనృపాల ఘోరతర రావణ శౌర్యవిశాల భవ్య స
త్రామసురార్య యోగిజనతాపసపాల కృపాలవాల
భూమిసుతాత్మలోల పరిపూర్ణ సుకీర్తివిశాల వాసర
స్తోమము గోడ వచ్చి మిముఁ జూచి కృతార్థుల మై
మిద్ధరన్. —ఆ. ౧

చ. విని యది భీతి నొందుచు వివేకముతోఁ ద్విజమో పు
జూచి ౧
ట్లనియెను జారకాంతను మహావిషసర్పమునంటియెన్వా

నను గడ తేరినారె నినునమ్మినభార్యను వీడి నన్నుఁ బొం
దిన నిహాముఁ బరంబు చెను ధీరతఁ ద్రోఁ జను బ్రాహ్మ
ణోత్తమా. —ఆ. ర.

## రాజయోగసారము

ప్వా. సంపద గలిగిన సామర్థ్య మనుచు
సొంపు మీఱిన తుచ్ఛసుఖ మిచ్ఛయించి
కామాంధులై తమగతిఁ గాన లేక
భామల వలలోనఁ బడి లేవలేక
తఱగని యీషణత్రయ వార్ధిలోను
మఱిమఱి మునుఁగుచు మమత రెట్టింప
నాలుబిడ్డల కని యర్థంబు గూర్చి
కాలంబు నూరకే గడపుచునుండి

*    *    *    *

పుట్టుచు గిట్టుచుఁ పొరలు చుంటేదరు.

# వీరాబాయి.

సంగ్రామే సుభటేంద్రాణాం కవీనాం కవిమండలే
దీప్తిర్వా దీప్తిహానిర్వా ముహూర్తాదేవ జాయతే.*

వీరాబాయి చితూరు సంస్థానాధీశ్వరుని భార్య. ఈమె అక్బరుబాదుషాకాలమునం దుండిన ట్లితిహాసములవలనఁ దెలియుచున్నది. కాని యీమె జన్మమరణ సంవత్సరములును, జననీజనకుల నామములును దెలియు మార్గ మేమియును గానరాదు.

వీరాబాయి స్వశౌర్యమువలన అక్బరు నోడించి తనభర్తను విడిపించెను. అక్బరుబాదుషా చితూరుపై రెండుపర్యాయములు దండెత్తినను ఫేరిస్తాయను ఇతిహాసకారుఁడు వ్రాసిన గ్రంథమునం దొకసారి దండువెడలుటయే వర్ణింపఁబడి యున్నది. స్వజాతీయుఁ డగు బాదుషాయొక్క పరాభవము నాతఁ డెట్లు వ్రాయఁ గలఁడు? ఒకానొక రజపూతస్త్రీచే నోడింపఁబడి పలాయితుఁ డైనందున బాదుషాకీర్తికి సంభవించిన కలంక మగుపడకుండుటకయి తురుష్కులైన యితిహాసకారు లెవ్వరును చరిత్రములలో నీసంగతి వ్రాయనేలేదు. కాని యీసమయ

* యుద్ధమునందు వీరుల శౌర్యాశౌర్యములును, కవి సంఘమునందు కవులయొక్క చాతుర్యా చతుర్యములును ఒకక్షణమాత్రములో వెల్లడియగును.

మునందు చితూరుదరబారునం దున్న వారప్పటి యుద్ధమును చక్కఁగా వర్ణించియున్నారు.

అక్బరుబాదుషా తనయమితసైన్యముతో చితూరుపై దండు వెడలినప్పు డచటనుదయసింగుఁ డనురాణా రాజ్యముఁ జేయుచుండెను. ఉదయసింగు రాణా యంతటి పిఱికిరాజపుత్రుఁడు మఱియొకఁ డుండఁడు. అక్బరుబాదుషా దండెత్తివచ్చిన వార్త విని రాణాగారికి భయమువలన దేహ కంప మెత్తెను. కాన ఆయన విజయు లగుతురుష్క సేనలతోడఁ బోర సాహసింప లేఁడయ్యె. అందుపై నాతని శూరులగు సరదార్లందఱు కుంభరాణా మొదలగు నాతని పూర్వుల ప్రతాపముఁ దెలిపి యుద్ధమునకుఁ బురికొల్పసాగిరి. కాని యతఁడు యుద్ధమునకు వెడలఁ డయ్యెను. రాణా సంగ్రామమునకు వెఱచుటఁ గని యాతని సరదార్లు మిగుల నాగ్రహించి "మీరు శత్రువుల నెదిరించి యుద్ధము చేయకుండినయెడల మిమ్మును రాజ్యభ్రష్టులను జేయుదుము" అనిరి.

ఇట్లందఱు నేకతీరుగాఁ జెప్పినందువలన విధిలేక భయముచే దేహము వడఁక నాయధైర్యశిరోమణి వీరులగు తనసైనికులతో యుద్ధభూమిని సమీపించెను. కానిసాగరమువలె నలుగడల నిండియున్న యవనసైన్యములంగని భీతిచేఁ గొంతవడి నేమియుఁ దోఁచక నిలుచుండెను. తదనంతర మెటులనో యారాజు తనసైన్యములకు యుద్ధమున కనుజ్ఞయిచ్చెను. రజపూతశూరసైనికు లందఱు మిగుల శౌర్యముతోడఁ బెనఁగఁ జొచ్చిరి. వారు జయకాంక్షవలన నెంతపోరినను ముఖ్యనాయకుని యధైర్యమువలనను, పరబలాధిక్యమువలనను వారికి జయము క

లుగుమార్గము కానరాకుండెను. చితూరుకోట కాపరు లెం
త శౌర్యముఁ గనఁబఱచినను అదియంతయు నిష్ఫలమై ఉదయ
సింహునకుఁ బరాభవము కలిగెను. అక్బరుబాదుషా తత్క్షణమే
యాపిచ్చికిరాజును బట్టి చెఱలో నుంచెను. అందుపైఁ జేయునది
లేక రజపూతవీరులు గ్రామమునకుఁ దిరిగిపోయిరి. వారిలో
కొందఱు తమయిండ్లకరుగఁగా వారిస్త్రీలు పరాభవము నొం
దివచ్చినభర్తలను, పుత్రులను సోదరులను లోపలికి రాకుండ
తలుపులు మూసి వారిని తిరస్కరింపుచు నిట్లనిరి "రజపూత
కులమునందు మీరేల జన్మించితిరి? సిగ్గులేక మీ మొగములు
మరల మాకుఁ జూపకుఁడు. సంగ్రామమరణముగాని, జయము
గాని దొరికిననే మీకు కీర్తియు, యశమును కలుగును."

ఉదయసింహుని తురుష్కులు చెఱఁబెట్టిరని తెలియఁ
గా రాజభవనమునందంతట నెటుచూచినను దుఃఖమయము
గానే యుండెను. అప్పుడు రజపూతు వీరులందఱు సభచేసి
"ఉదయసింహమహారాజుగారి నెట్టుల విడిపించవలెను? శత్రు
వుల నోడించుటయెట్లు" అని చింతింపసాగిరి. ఇట్టుల వారనేక
తీరుల విచారించి, తోఁచక చింతాక్రాంతులై కొంతవడి
యూరకుండిరి. ఆసమయమునందు పట్టణమంతయు మిగుల
నుదాసీనముగా నుండెను. కాని మరల క్షణకాలములో నొక
యువతి వారి నానందసాగరమునం దోలలాడించెను. ఆస్త్రీ
ఉదయసింహుని పత్ని యగు వీరాబాయియే! నాభర్తను మ్లేచ్ఛు
లు కైదుచేసిరి. రజపూతులోడిపోయిరి, చితూరింక తురకల
యధీనమగును. మనమందఱమా నీచుల స్వాధీనమగుదుమ" యను
నట్టివిచారము లనేకములామె మనంబున నుద్భవింపసాగెను.

రాజభవనమునందు నిరుపయోగములై పడియున్న యనేకశస్త్రములామె కంటఁబడఁగా నామెయందు నడఁగియున్న శౌర్యాగ్ని ప్రజ్వలింపసాగెను. అంత నామె నిలువక, యుద్ధమునకనుకూలమగు పురుషవేషముఁ దాల్చి యనేకాస్త్ర శస్త్రములను ధరియించి కాళికాదేవి ప్రత్యక్షమైనది యనినట్టుగా రాజపుత్రుల సభలోకిఁ బ్రవేశించెను.

సుకుమారమగు మేనితోఁ బురుషవేషధారిణియు, శస్త్రధారిణియునై వచ్చినవీరాబాయినిఁ గనినతోడనే యచటి రజపూతువీరు లాశ్చర్యమగ్నమానసు లయిరి. స్వాతంత్ర్యేచ్ఛయు, స్వధర్మాభిమానమును హృదయమునం దుండుటవలన నామె కాంతి మిగుల ప్రజ్వరిల్లెను. ఆమె మిగుల రోషముతో నచటఁ గూడియున్న రాజపుత్రులతో నిట్లనెను, "శూరాగ్రేసరులగు రజపూతులారా! మీరిట్లధోముఖులై చింతిల్లుచు నెవరికొఱకు నిరీక్షించుచున్నారు. మీయందలి శౌర్యధైర్యాది క్షత్రియగుణము లెటుపోయెను? చితూరుసంస్థాన మిపుడే పౌరుషహీనమయ్యెనా? అచటి రజపూతవీరులందఱు కేవలము శ్వాసోచ్ఛ్వాసము గలపురుగులై పోయిరా? వీరమాత యగు భారతవర్షము నేఁడే నిస్తేజమై పోయెనా? మీరు శూరులవంశములయం దేల జన్మించితిరి? అటుల జన్మించినవారు వైరులకు వెన్నిచ్చి యేల పాఱవచ్చితిరి? ఇప్పు డింద ఱేకీభవించి యేమిచింతించెదరు? చితూరు నలంకరించువాఁడును, మనప్రాణసమానుఁడు నగుమహారాజును శత్రువులు కారాగృహబద్ధునిఁ జేయఁగా స్త్రీలవలె చేతులకు గాజులు తొడుగుకొని యింట నుండుట కేల సిగ్గుపడకున్నారు? నేనిట్లు బాహాటముగా మి

ము నవమానపఱుపుచుండఁగా మీరు విని యెట్లు సహించె దరు? ఇంతకంటె యుద్ధముచేసి వైరులచేఁ జంపఁ బడుట సర్వో త్తమము కాదా? శూరాగ్రేసరులగు సరదారులారా! మీరిటుల నుపేక్షచేయకుఁడు ! మీకుఁ గలిగిన పౌరుషహీనతయను క ళంకమును సంపూర్ణముగాఁ గడుగుఁడు. మీకుఁగల శౌర్యధై ర్యాదిగుణముల నగుపఱుప నిదియే సమయము. లెండు నడు పుఁడు. మఱియొకరిరాకకు నిరీక్షింపనేల ? ఒరలనుండి మీ మీఖడ్గములను తీయుఁడు. "జయహర ! జయమహాదేవ," య ను రణఘోష మొనర్పుఁడు. తీవ్రగతినరిగి సంగ్రామాంగము నందు మీమీ ప్రతాపములను గనుపఱుపుఁడు! నేనిదే యుద్ధ మునకుఁ బోవుచున్న దానను."

ఇట్లని యామె యొకగుఱ్ఱము నెక్కెను. అప్పుడు రజ పూతులందఱు తమయౌదాసీన్యమును వదలి యుద్ధసన్నద్ధు లైరి. మేకలుగానున్న యావీరులు వీరాబాయి ప్రోత్సాహము చే శార్దూలములుగా మాఱిరి ! అందువలన నాభీమపరాక్ర ములందఱును నేకవాక్యతగా జయఘోష మొనర్చిరి. అపుడు వారందఱు "యుద్ధమునందు శత్రువులను జంపెదము లేక వారి చేఁ జచ్చెదమేకాని పగఱకు వెన్నియ్యము"ని ప్రయాణములు చేసిరి.

వీరాబాయియు వారియావేశమును,దృఢనిశ్చయమును గని విశేష ప్రోత్సాహముగలదియై యుద్ధమునకు వెడలెను. ఆమె తనసైన్యముతో నాకస్మికముగా నాఁకొన్న యాఁడుసిం గమువలె శత్రుసైన్యములపై నకస్మాత్తుగాఁబడెను. అందువలన విజయానంద మునం దోలలాడుచుండిన యక్బరుసైన్య మీ

ప్రళయమున కోర్వఁజాలక నలుదిక్కులకుఁ బాఱఁదొడఁగెను. వారినిఁ బోనియ్యక పట్టుకొని విరాబాయిసైనికులు కాలాంత రుద్రులభంగి యంతము నొందింపసాగిరి వారికి నిరుత్సాహకరముగా విరాబాయి తానును అనేకతురుష్కులను వీరస్వర్గమునకు నంపుచుండెను.

ప్రళయాగ్నిఁబోలిన యామె పరాక్రమము గని యక్బరత్యాశ్చర్యమును బొందెను. ఆయన జడునివలె నేమియుఁ దోఁచక నిశ్చేష్టితుఁడయి నిలువఁబడెను. అప్పు డాక్షత్రియవీరుల యుత్సాహంబు రెట్టింపయవనసైన్యము ననేకరీతుల బాధింపఁ దొడఁగిరి. బాదుషా తనకు జయము కలుగుట మాఱుగా నపజయమగుటఁ గనిచేయునది లేకసంధినిఁ దెలుపుపతాక మెత్తెను. తత్క్షణమే ఉదయసింహుని సహితము బంధవిముక్తునిఁ జేసెను. పరాక్రమవంతురాలయిన విరాబాయివలన మహాబలవంతుఁడైన అక్బరునంతటి తురుష్క ప్రభువుసహితముజయకాంక్షనుమాసి హతశేషులగువారిం గొని మరల తనపురి కేగవలసినవాఁ డాయెను. తదనంతర మారజపూతు లందఱును విజయానందముతో సింహనాదములు చేయుచు విరాబాయి ననేకవిధములఁ గొనియాడుచు విరాబాయితోడను, ఉదయసింహునితోడను పురప్రవేశముచేసిరి. అంతకుఁ బూర్వము తేజోహీనమైనచితూరుపట్టణము రాణిగారి విజయ వార్తవిని మరల తనదివ్యతేజమునుబొందెను. జనులందఱును పరమానందభరితులయిరి. విరాబాయి జయమునుగాంచి విశేష తేజస్వినియయ్యెను. పురవాసు లందఱావీరరజపూతులను, రాణాగారిని, రాణిగారిని, మంగళ వాద్యములతో నెదుర్కొని వారిపై పుష్పవృష్టి చే

యుచు రాజభవనములోఁ బ్రవేశ పెట్టిరి! ఇట్లు జన్మమం దెప్పుడునుయుద్ధ మెఱుఁగని దయ్యును ఒకక్షణములో తనశౌర్యముచే వీరాబాయి "గొప్పశూర స్త్రీ" యన్న బిరుదునుబొంది, ప్రస్తుతచరిత్రమునకు శిరోలేఖముగా నున్న శ్లోకార్థమునే స్థిరపఱచెను!

# ఆ వ డా బా యి

విద్యా దదాతి వినయం వినయా ద్యాతి పాత్రతాం.*

ఈమె మహారాష్ట్రబ్రాహ్మణ స్త్రీ. ౧౮౬౫వ సంవత్సరమునందు నీమె రత్నగిరిలో జన్మించెను. ఈమె తండ్రిపేరు రావుబహద్దరు విష్ణుమోరేశ్వరభిడే. ఆయన అసిస్టెంటు కలెక్టరు అధికారమునందుండెను. ఆవడాబాయి జన్మించిన రెండుమూడు నెలలకే యామెతండ్రిగారి నచటనుండి నాసికకు మార్చిరి. ఆవడాబాయి బాల్యమునందలి మూడునాలుగు సంవత్సరము లచటనే గడచెను. అందుపై నామె తండ్రియగు విష్ణుపంతుగారి నచటినుండి సురతు అను గ్రామమునకు మార్చిరి. సురతునందు కొద్దిదినము లుండినవెనుక నచటినీళ్ళు శరీరమునకుఁ బడనందున విష్ణుమోరేశ్వరుగారు తమకుటుంబమును పూనానగరమునకుఁ బంపిరి. నాటినుండి ఆవడాబాయి జన్మమంతయు నచటనేగడచెను. ఆవడాబాయి బాల్యమునందుఁ గొంచెము విద్యనభ్యసించెను కాని యామెయందుఁగల యపూర్వసద్గుణములన్నియు నప్పుడు పూర్ణముగా వికసించుటకు వీలులేక యుండెను. అయినను సహనశీలత, శుభ్రతమాత్ర మామెయందు నతిబాల్యమునుండియుఁ గానఁబడుచుండెను.

---

* విద్యవలన వినయము ; వినయమువలన అర్హతయుఁ గలుగును.

౧౮౮౦వ సంవత్సరమునందు సోలాపురమునందుండు దాదా సాహెబుజోగుగారి జ్యేష్ఠపుత్రుఁడగు అప్పాసాహెబు అను నాతనిని ఆవడాబాయి వివాహమయ్యెను. వివాహానంతర మాఱుమాసములలోనే యత్తమామలు లోకాంతరగతులైరి. కాన ఆవడాబాయి పాదగుణఫల మిదియని లోకు లామెను నిందింపనాగిరి. ఇట్టి నిందనలను లెక్కింపక యాయబల పరమేశ్వరుని నమ్మియుండెను. తదనంతరము ౧౮౮౬వ సంవత్సరమునం దామెకు దుఃఖసహమగు వైధవ్యము ప్రాప్తించెను. పతిమరణసమయమునం దామెకు పదియేడేండ్ల ప్రాయముండెను ఇంత చిన్నతనమునందుఁ గూఁతున కిట్టిదురవస్థ ప్రాప్తించినందున రావుబహద్దరు భీడేగారు ఆవడబాయికి విద్యనేర్పి ఆవిద్యవలనఁ గలుగు ఆనందములో నామె వైధవ్యదుఃఖమును లోపింపఁదలఁచిరి.

హిందూదేశ హితచింతకులగు సర్ విల్యమ్ వెడర్‌బర్న్ దొరగారు పూనానివాసులను ప్రోత్సాహపఱచి వారికి ననేకవిధసహాయములఁ జేసి స్త్రీలకొఱకు స్థాపించిన హాయి స్కూలులో ప్రథమమునం దావడాబాయియే విద్యార్థిని యయ్యెను. ఈమె యంతకుఁ బూర్వమె మహారాష్ట్రభాషయందు నాలుగుపుస్తకములును, ఇంగ్లీషు మొదటిపుస్తకమును ఇంటనే చదివినదేగాన, పాఠశాలాధ్యక్షురాలామెను పరీక్షించి యింగ్లీషు రెండవతరగతిలోఁ జేర్చుకొనెను. అచట విద్యనభ్యసించుకాలమునం దామె తనసత్ప్రవర్తనవలనను, విద్యాభిరుచివలనను సహాధ్యాయినులకును, ఉపాధ్యాయినులకును మిగుల ప్రియురాలాయెను.

ఆవడాబాయి ప్రతిసంవత్సరము పరీక్షలయందుఁ దేరుచు తప్పక బహుమానములను బొందుచు వచ్చెను. తాను చదివినపుస్తకము లన్నియు తనకాపీపుస్తకము లన్నియు, తనవారపరీక్షలలోని ప్రశ్నోత్తరకాగితము లన్నియు నామె తనమరణకాలము వఱకును మిక్కిలి శ్రద్ధతో దాఁచియుంచెను. శ్రద్ధయను సద్గుణము బాల్యమునుండియే యీమెయందుఁ గానుపించుచుండెను. (౧౮౮౪వ సంవత్సరమునుండి ౧౮౮౮వ సంవత్సరమువఱకు నాలుగుసంవత్సరములలో నీమె ఇంగ్లీషు నాలవపాఠపుస్తకము ముగించెను. సాధారణముగా నొక్కొక్క పుస్తకము చదువుటకు నొక్కొక్క సంవత్సరము పట్టును; గాని ఆవడాబాయి రెండవ మూడవపాఠపుస్తకముల నొక్కసంవత్సరములోనే చదివెను. ఈమె యింగ్లీషు నాల్గవ పాఠపుస్తకముతోడనే సంస్కృతాధ్యయనము ప్రారంభించెను.) ఈమె సంస్కృతమునం దనేక శ్రద్ధగలిగి పని చేయుచుండుటచేత త్వరలోనే యామెకా భాషయందు నామెకుఁ గొంత వ్యుత్పత్తిజ్ఞానము గలిగి రఘువంశము, శాకుంతలము, వేణీసంహారము మొదలయిన సంస్కృతగ్రంథము లామె చదివెను. పాఠశాలయందాంగ్లేయ సంస్కృతభాషల నభ్యసించుచుండఁగా మిగిలినకాలము నం దీమె డ్రాయింగు (చిత్తరువు, పటములువ్రాయుట) సహితము నేర్చుకొనుచుండెను. (౧౮౮౭వ సంవత్సరమునం దీమె డ్రాయింగునందొక్క ఫస్టుగ్రేడుపరీక్షయందు కృతార్థురాలయి ఫ్రీహ్యాండు, మాడెల్, డ్రాయింగులయం దధికప్రవీణురాలని బహుమానపత్రికలను బడయుటయేగాక కర్తవ్యరేఖాగణితము నందు గొప్ప బహుమతి వడసెను. రేఖాగణితము, ఫ్రీహ్యాండ్

డ్రాయింగు, ఈరెంటియం దధిక ప్రవీణురా లనియు, మాడెల్
డ్రాయింగు విషయమునం దీమెకు మిగుల చాతుర్యము గలద
నియు, పరీక్షకులు వ్రాసిరి. ౧౮౮౭వ సంవత్సరమున స్కాలర్షి
ప్పుపరీక్షకు నింగ్లీషుపరీక్షకులుగా వామన ప్రభాకరభావే
యను విద్వాంసుని దొరతనమువారు నియమించిరి. ఆసంవత్స
రము ఆవడాబాయి యింగ్లీషు అయిదవపాఠపుస్తకము చదువు
చుండెను. అప్పు డాయన వేసినప్రశ్నకు ఆవడాబాయి వ్రాసి
యిచ్చినయుత్తర మింగ్లీషునం దెంతయు రసవంతముగా నున్న
దని ఆంగ్లేయ భాషాపారంగతులు మెచ్చుకొనెదరు. అంత
యుత్తమభాషయు, సదాత్త విచారణములును గలవ్యాస
మిప్పుడు ప్రవేశపరీక్షలోఁ జేరినవారుగూడ వ్రాయఁగలరా
యని సంశయింపవలసి యున్నదంట. (ఆవ్యాసముయొక్క
తాత్పర్య మిచ్చట నాంధ్రమున వ్రాయుచున్నాను.

పరీక్షకులగు భావేగారడిగినప్రశ్న:—నీ పాఠశాలయం
దార్జించినవిద్యను గృహకృత్యములయం దెట్లుపయోగపఱ
చెదవు ?

ఆవడాబాయి వ్రాసి యిచ్చిన యుత్తరము:—" నా
కిచట నేర్పఁబడువిద్య ముందు నాకు నధికోపయోగకరముగు
నని తలంచెదను. నాసంసారపాశములఁ ద్రెంపుటకు పరమేశ్వరున
కధిక సమ్మత మయినందున నాజన్మమిఁక పరోపకారమునందే
గడపఁ దలంచితిని. ఇట్టి నాతలంపున కిపు డే నభ్యసించు విద్య
మిగుల సహాయకారి యగును. ఇంటిలెక్కలు వ్రాయుటకుఁ
దల్లికిఁ దోడుపడుదును. ఇంగ్లీషుగ్రంథములను జదివి వానియర్థ
మామెకుఁ దెలిపెదను. మహారాష్ట్రస్త్రీలకొఱ కనేకాంగ్లేయ

గ్రంథములను మహారాష్ట్రమున వ్రాసెదను. మాయమ్మకు సంస్కృతగ్రంథముల యర్థమువివరించెదను. పురాణము లన్న నామె కధిక సంతోషముగాన నామెకొఱకు పురాణపఠనము చేసి యామెను తృప్తిపఱచెదను. నాకు సంతానము కలుగుట పరమేశ్వరున కసమ్మతమే యయినను నేను నాయక్కబిడ్డలకును, స్నేహితురాండ్రబిడ్డలకును విద్యాబుద్ధులు గఱపెదను. ఇట్లు నేను వారికి నుపయోగపడిన యెడల నాజన్మము కొంత సార్థకమగును. నావలె సౌభాగ్యహీన లయ్యును విద్యా గంధము లేని యనేక బాలికలు విద్యాయుతుండయిన తండ్రితో నేమి తోఁబుట్టువులతో నేనే తగినవిషయములను గుఱించి యేమియు మాటాడుటకుఁ దోఁచక యూరకుండెదరు. నేనట్లు మౌనముద్ర వహింప నక్కఱలేనందున వారితో నాకుఁ దెలిసిన శాస్త్రవిషయములును, ఇతరవిషయములును ముచ్చటింతును. అందువలన వారికి సంతోషముకలుగును. కాన నాకది యే విద్యవలనఁ గలిగెడి యొక మహానందము.

ఇదియుఁగాక ప్రస్తుత విద్యాభ్యాసమువలన నాకుఁ గొంత ద్రవ్యార్జనశక్తి కలుగును. ఆద్రవ్యమువలన బీదసాదలకు సహాయము చేయుదును. ఏతద్విషయమై నాకును స్వతంత్రత కలుగును.

నా స్వదేశ సోదరీమణు లేయేవిద్య నాయొద్ద నేర్చుకొనఁ గోరెదరో యాయా విద్య నేను వారికి మిగుల శ్రద్ధతో నేర్పెదను. నేను చేయఁదలఁచిన మంచికార్యములలో నిదియే ముఖ్యమైనది.

విద్య, డ్రాయింగు మొదలగు నితరవిషయములు నేర్చుకొనుటవలన నాకు మనోల్లాసము గలుగును. ఇట్లు సుఖసంతోషమును, స్వతంత్రముగాను అనఁగా నితరులపై భారము వేయక నాజీవితము గడపఁ గలశక్తి నాకిచట నేర్పఁబడు విద్య వలనఁ గలుగును."

(పైని వ్రాయఁబడిన వ్యాసమును జదివి పరీక్షకుఁ డామెను మిగుల మెచ్చుకొనెను. ఇందు కాయన ౪౦ మార్కులలో ౩౫ మార్కులిచ్చెను. ఈపరీక్షయం దన్నియుఁ గలసి ౫౭౫ మార్కులుండెను. అందు ౪౩౦ మార్కు లీమెకుఁ దొరికెను. ఇట్లు నూటికి ౭౫ మార్కులు సంపాదించు విద్యార్థులు బహు అరుదని యందఱకును దెలిసినవిషయమే.

పైనుదాహరించిన ఆనడాబాయి వ్యాసము మూలభూత మయిన యింగ్లీషు వ్యాసమునుండి వ్రాయఁబడినదికాదు. ఇంగ్లీషుదియొక్క మహారాష్ట్ర అనువాదము ననుసరించి వ్రాయఁబడినది. కాన నిందు మూలములోనుండు భాషాశోభ యంతయుఁ లోపించి యుండవచ్చును. అయినను ఆమెయొక్క యుదార కల్పనము, పరోపకారబుద్ధి యిందువలన వ్యక్త మగుచున్నది. ఆవడాబాయికిఁ దోఁచిన కల్పనలలో నెల్ల నొక్కటి మిగుల నాహ్లాదకరముగా నున్నది. అది యేదియన, విద్యావంతులయినతండ్రితోఁబుట్టువులతో వారికిసంతోషముఁ బుట్టించెడి గొప్ప గొప్ప సంగతులనుగుఱించి ముచ్చటించవలయునని యామెయిచ్ఛ. మనదేశమునందు మహావిద్వాంసులయి రాజకీయసాంఘిక సంస్కరణము మొదలయిన పరోపకారకృత్యములచే దేహము సమర్పించిన యనేక పురుషులకు

నింట కూరగాయ ముచ్చటలుతప్ప మఱియేమియు లేనందున వీధియే యెప్పుడును సుఖకరముగా నుండుటయు, అనేక విద్వాంసులతో ననేకప్రసంగములు చేసి యింటికిఁ బోఁగానే తా మొకక్రొత్తసృష్టిలోఁ బ్రవేశించితిమని తోఁచుటయు, సభలయందు పందొమ్మిదవశతాబ్దమునవలెఁ దోఁచినను నింటఁ బదునాల్గవశతాబ్దమువలెఁ గానుపించుటయు సర్వసాధారణమే గదా! ఇందుకుఁ గారణము స్త్రీవిద్యాభావమే యని చెప్పవలసియున్నది. కాన నిట్టివిద్వాంసులకు ఆవడాబాయికిఁగలిగిన యిచ్ఛఁజూచి యానందాశ్చర్యము గలుగక మానదు. స్త్రీలకు విద్య గఱపినయెడల నెట్టిమంచియూహలు గల్గునో ఈయావడాబాయి వ్యాసమువలననే స్పష్టమగుచున్నది. కాన స్త్రీవిద్య వలన నష్టము కలుగునని భయపడుటకు నెంతమాత్రము కారణము లేదు.

స్త్రీవిద్యశత్రువుల కనఁగా స్త్రీలకు బొత్తుగా విద్య నేర్పఁగూడదను వారికి పూనానగరమునందలి హాయిస్కూలు లోకగర్భశత్రువుగాఁ గానఁబడుచుండును. అచట విద్య నేర్చుకొను బాలికలను దూషించుటయే వారికి సత్కాలక్షేపముగాఁదోఁచుచుండెను. కాన నచట విద్యనభ్యసించువారిలో నెల్ల నాకాలమునం దగ్రగణ్యురాలుగా నుండిన ఆవడాబాయిని వారు బహుబాధలఁ బెట్టసాగిరి. వారామెను వీధుల్లో నెగతాళి చేసియు, తిట్టియు ననేకవిధముల నవమానపఱుపఁ జూచిరి. ఇంతటితోఁ దృప్తిచెందియుండక అనేక బీభత్సవచనములతో నాకాశరామన్న పేరుపెట్టి యనేకమైన యుత్తరములు నామె పేర వ్రాయుచుండిరి. వారామెను కనపడినచోటఁ గొట్టి చం

పుడుమని బెదరించిరి. దుఃఖసముద్రమునందు మునిఁగియు, జంకక విద్యయను నొకయూఁతకోల నాధారము చేసికొని, యాసముద్రమునుండి వెల్వడఁ బ్రయత్నించుచున్న ఆవడాబాయిపై దుష్టుల కుశబ్దములను శిలావర్షము కురియఁగా నామె మనస్స్థితి యెట్లుండెనో చదువరులె యూహించుకొనఁగలరు. ఇట్లామె యెన్నికష్టములు వచ్చినను విద్యామాత్రము వదలక తనను రక్షింప న్యాయస్వరూపుఁడైన పరమేశ్వరుఁడే గలఁడని ధైర్యముతో నుండెను. ఇట్టినిరుపమానధైర్య మెంతయుఁ బ్రశంసనీయముగదా?

౧౮౮౭వ సంవత్సర మావడాబాయిని మిగుల ప్రేమించునట్టి యక్క చింగూబాయి క్షయరోగమువలన మృతిఁజెందెను. ఈమె తనముద్దుచెల్లెలికి ప్రాప్తించిన వైధవ్యదుఃఖమునకై మిగుల చింతించుచు నెల్లపుడు ఆవడాబాయికి దుఃఖోపశమనవచనములఁ జెప్పుచు విద్యయందు పరోపకారమునందును విశేషాసక్తి కలుగఁజేసెను. ఇట్లు మనసుగలిసి ప్రేమించునట్టి సహోదరియొక్క మరణమువలన ఆవడాబాయికి నత్యంతదుఃఖముకలిగెను. ఆదుఃఖమువలన నేకొన్నిరోజులు విద్యాభ్యాసము జరగక తుదకొకవిధముగా మనస్సమాధానముచేసికొని యేదియెట్లయినను తలఁచిన సత్కార్యము విడువఁగూడదనియామె విద్యనధిక ప్రయత్నముతో నభ్యసింపసాగెను. ఇట్లామె దుస్సహదుఃఖములలో మునిఁగియుండియు ననుపమానధైర్యముతో విద్యనభ్యసించుచుండఁగా ౧౮౮౭వ సంవత్సరాంతమున నామెకుఁ గొంచెము దేహమస్వస్థముగా నుండసాగెను. అందువలన నాయెండకాల మామె మహాబలేశ్వరమును ఆరోగ్యప్రదమైన

పర్వతప్రాంతమున కరిగెను. కాని యచటినుండివచ్చిన తదనంతర మేమియు సుగుణముగుపడక రుగ్ణత హెచ్చసాగెను. ఇట్లు రుగ్ణత హెచ్చినందువలన అక్టోబరునెలనుండి యామె విద్యాభ్యాసము బొత్తుగా మానవలసినదాయెను. ఇంగ్లీషు డాక్టర్లు హిందూవైద్యులు పరీక్షించి యెన్ని మందు లిచ్చినను రోగము నిమ్మళించక హెచ్చుచుండెను. కడుపులో శూలవిశేషముగాఁ బుట్టుచున్నందున నామెతాళఁజాలక మరణమునకుఁ బూర్వము కొన్నిరోజు లప్పుడప్పుడు కేకలు వేయుచుండెను. అందుకామె తండ్రి "బిడ్డా! నీకేటికి కేమయినఁ దోఁచుచున్నదా? నీకు మరణభీతి కలుగుచున్నదా?" యని యడిగెను. అందు కామె "నాకు మరణమున్న నెంతమాత్రము భయములేదు. నేను పాపము చేయనప్పుడు పరలోకయాత్రకు భయమేలపడుదును? ప్రాణముతో సమానముగా నన్ను పెంచినట్టి మిమ్ము నెడబాయవలసినందునకును, నేను జన్మించినందుకు జనోపయోగకరమయిన కార్యమేదియుఁ జేయకయే దేహము విసర్జించవలసినచ్చెఁగదాయనియు కొంచెము వ్యసనముగా నున్నది. కాని యీశ్వరాజ్ఞ శిరసావహించి సంతోషముతో నెడలుటయే మనకర్తవ్యము. నాకడుపులో దుఃఖసహమగు వేదనకుఁ దాళఁజాలక నేనిట్లు అఱచెదనెగాని మరణభీతిచేతఁగాదు" అనెను. అందుపై భిడే "ఆవడా! నీమనసునం దెవ్వరికైన నేమేని యియ్యఁదలఁచితివేని ఆసంగతి నాకుఁ జెప్పుము" అని యాతురగాఁ ఆవడాబాయి యిట్లనెను. "నే నీసంవత్సరము నన్ను చిన్నతనమునందుఁ బెంచిన గోవిందరావు చింధడేగారికి నేమియుఁ బంపలేదు. ప్రతిసంవత్సరము పాఠశాలయందు

నాకు బహుమానముగా దొరికినసొమ్ము నే నాయనకుఁ బంపుచుంటిని. ఈసంవత్సర మీారుగ్ణతవలన బహుమతి పొందలేదు. కాన పాప మాబీదవానికేమియుఁ బంపనైతిని. కనుక తా మాతని కేదేనిఁ బంపిన నాకుఁ బరమసంతోషము కలుగును." తత్క్షణమే భిడేగారు ౨౦ రూపాయలను ఆవడాబాయిపేరుఁ బెట్టి గోవిందరావు చింధడే గారికి హుండీ పంపిరి. తదనంతరము భిడేగారు తనముద్దుల కూఁతురిపేరు జనులకు జ్ఞాపక ముండునట్లుగా నామె చదువుకొను పాఠశాలలో నొకబహుమతి యుంచఁగోరి తనయభిప్రాయము ఆవడాబాయికిఁ జెప్పి నీకేవిషయము విశేషప్రీతికరమో చెప్పుమని యడిగెను. అందుకామె "నాయనా! నాయనంతరము జనులు నన్నుఁ దలఁచుకొనునంతటి ఘనకార్య మేదియు నేను జేయలేదు. తమరు చేయు బహుమానమున కెంత మాత్రమును నేనర్హురాలనుకాను" అనెను. అందుకామెతండ్రి మఱింత వేగిరపడుచుఁగా తనకు గణితమునందును డ్రాయింగునందును విశేషప్రీతి కలదనియామె చెప్పెను. అందుపై భిడేగారపుడే వెయ్యిరూపాయలు పాఠశాలాధ్యక్షునికడకుఁ బంపి, అందుపై వచ్చెడి వడ్డీ ప్రతిసంవత్సరము గణితములో, డ్రాయింగులో నందఱికంటె నధికముగా పరీక్షయిచ్చిన కన్యకుఁబహుమాన మిచ్చునట్లు నియమించెను. ఈ సంభాషణ జరిగిన పిదప నిరువది నాలుగుగంటల కినఁగా ౧౮౮౯వ సంవత్సరము జనేవరి ౨౨వ తేది మంగళవారము మధ్యాహ్నము రెండుగంటలవేళ ఆవడాబాయి తనదేహ మీా నశ్వర భూలోకమున విడిచి, తనకీర్తినిచట శాశ్వతముగానుండ నియమించి, దుష్టుల దుర్భాషణల కెంతమాత్రమును నవకాశ

మియ్యనట్టి సదానందమయమైన పరలోకమునకుఁ జనెను. ఆహా! యిట్టిస్త్రీరత్న మింత యల్పకాలమునందే నష్టమగుట మనదేశముయొక్క దౌర్భాగ్యమనియే చెప్పవలయును. ఆమె మరణమువలన జననీజనకులకు నమితదుఃఖము కలుగుటయొక ఆశ్చర్యముగాదు. ఎట్టియనామధేయులు చనిపోయినను వారి మాతాపితలకు దుఃఖము కలుగుటస్వభావమే కాని రక్తసంబంధము లేని పరుల కనేకులకు నెవరిమరణమువలన దుఃఖము విశేషముగాఁగలుగునో వారే మనుష్యానామమున కర్హులు.

పారశాలయందు నామెకొఱకు దుఃఖించని పిల్లగాని, ఉపాధ్యాయినిగాని కానరాదయ్యెను. ఆమె సద్గుణములు దలఁచుకొని దుఃఖించుచు ననేకు లనేక లేఖలను ఆమె తలిదండ్రులకు వ్రాసిరి. వాని నన్నిఁటి నిటవ్రాయుటవలనఁ గ్రంథవిస్తారమగునని వానిలో నొకయుత్తర మిందు నుదాహరించెదను. ఇది యామె యుపాధ్యాయినులలో నొకతయగు నొకయాంగ్లేయ స్త్రీచే వ్రాయఁబడినది.

'మాప్రియ శిష్యురాలగు ఆవడాబాయి దేవలోకమున కరిగెను గాని యామెకు విద్య నేర్పునట్టి యోగ్యాధికారము వడసిన వారి హృదయమున కామె యెప్పటికిని మఱపురాదు.

ఆమె ప్రారంభించినవాని నన్నిఁటిని మిగుల శ్రద్ధతోఁ దుదముట్టించుచుండెను. ఎన్నఁడు మధ్యవిడుచునది కాదు'

'నాయదృష్టవశమున రెండుసంవత్సరము లామెకు గణితము నేర్పుభాగ్యమునాకుఁ గలిగెను. ఈవిషయ మామె మిగుల శ్రద్ధతో నేర్చుకొనుచుండెను. ఈరెండు సంవత్సరము

లలో నామెదీనియందు విశేషప్రజ్ఞగలదియయ్యెను. ఆమెకు
నేర్పవలసిన సమయ మెపుడు వచ్చునాయని నిరీక్షించుచుం
డెడిదానను. ఆవిషయమామెకు నేర్పుటనాకు వినోదకరముగా
నుండుచుండెను.")

ఆమెకు గానము, జలతారుపూలు, తీగెలు, కుట్టుపని
నేర్పుటకు నామె చెలెలిని నియమించిరి. కాని యామెశరీర
మస్వస్థముగా నుండినందున గానవిద్య నేర్చుకొనుట కవకాశము
చిక్కదయ్యెను. జలతారుపూవులు వగయరాలపనియం దా
మెకుఁ గల నిపుణత్వ మామెచేఁ గుట్టఁబడిన జలతారుపని
వలననే తెలియుచున్నది.

తన సుస్వభావమువలన నామె తన సహాధ్యాయినుల
కెల్ల ప్రియురాలాయెనో, యదేప్రకారముగా నుపాధ్యా
యినులకుఁగూడ ప్రియతమురాలయ్యెను. ఆమెయం దద్వి
తీయమగు వినయముగలదు. ఆగుణమె సర్వసద్గుణములలో
శ్రేష్ఠమైదని నాయభిప్రాయము. ఆమెయందు నీ యలౌకికగుణ
మును లుండినందుననే యామెను ఉపాధ్యాయినులెప్పుడును
పొగడుచుండిరి. పాఠశాలఁ గనుఁగొనవచ్చిన సద్గృహస్థు
లనేకు లామెను ప్రశంసించెడివారు. ప్రతిసంవత్సరమును పరీ
క్షలయందు దేరి బహుమతుల నందుచుండెను. ఇట్లు గలిగియు
తుదవఱ కామెయం దహంకార మున్నమాటయే కానిపించ
లేదు. ఎంతవిద్య నేర్చెనో యంతవినయము మధికమగుచుం
డెను. ఆహా! విద్యాదదాతి వినయమ్ అను లక్షణమున కింత
కంటె మఱియేమి లక్ష్యము కావలెను?

# రుద్రమదేవి.

ఈసతీరత్న మాంధ్రదేశమునందలి యోరుగంటిరాజ్యమును మిక్కిలి చక్కఁగా నేలిన శూరవనిత. ఈమె కాకతీయగణపతిరాజుభార్య. దేవగిరిరాజు కూఁతురు. రుద్రమదేవి తనభర్త మరణానంతరము క్రీ. శ. ౧౨౫౭వ సంవత్సరము నుండి ౧౨౯౫గవ సంవత్సరమువఱకును ముప్పదియెనిమిది సంవత్సరములు రాజ్యపాలనము చేసినట్లు దాన శాసనములవలనను, చరిత్రకారులు వ్రాసినదానివలనను స్పష్టముగాఁ దెలియుచున్నది. సోమదేవరాజీయమునందును రుద్రమదేవి ముప్పదియెనిమిదిసంవత్సరములు రాజ్యపాలనము చేసినట్లీక్రిందిపద్యమునఁ జెప్పఁబడినది.

గీ. ఆ యనకు నప్పగించి యయ్యమ్మ యట్లు
బుధజనంబులుఁ బ్రజలును బొగడ నవని
ముప్పదియు నెన్మిదేఁడులు మోద మొదవ
నేలి కైలాసశిఖరి నేఁగుటయును.

కాకతీయగణపతి మరణానంతర మాతనిభార్యయగు రుద్రమదేవి దుఃఖసముద్రమున మునిఁగి యుండెను. అప్పుడు మంత్రియగు శివదేవయ్యగారి హితవచనముల వలన నామె దుఃఖమును మఱచి రాజ్యమునకు వారసు లెవ్వరును లేక యుండినను కూఁతురగు ఉమ్మక్కకుఁ గలుగుసంతానమే సింహా

సనము నెక్క నర్హులని కొంత మనస్సమాధానము చేసికొని రాజుయొక్క ఖడ్గమునుముద్రికను సింహాసనమునం దుంచి శివదేవయ్య సాహాయ్యమున రుద్రమదేవి రాజ్యము చేయసాగెను. ఆమె రాజ్యము బహు యోగ్యముగాఁ జేసెనని చెప్పుదురు. అప్పు డామె యోరుగంటి చుట్టును మూడునాలుగు ప్రాకారములు గలకోటను శత్రువుల కభేద్య మగునటులఁ గట్టి దానికిఁ దగినచోటుల సైన్యముల నుంచెను. అందువలన నారాజ్యమును గెలుచుట బహుదుస్తరమని పెరరాజులు వెఱచుచుండిరి. ఇదిగాక రుద్రమదేవిచేయు న్యాయపరిపాలనము వలన జనులామెరాజ్యమే శాశ్వతముగా నుండఁ గోరుచుండిరి.

ఈమె తనరాజధానిలో ననేకములైన చెఱువులు త్రవ్వించియు, సత్రములు కట్టించియు జనోపయోగ్యము లయిన యనేక కార్యములను చేసెను. బీదవిప్రులకు బంగారపు కొమ్ములు గలగోవుల ననేకములు దానమిచ్చెను. అనేక దేవస్థానములు కట్టించి వానికన్నిఁటికిని వృత్తుల నేర్పఱచెను.

ఒకసారి రుద్రమదేవి యమ్మక్కసహిత యయి మొగలిచెర్లకుఁ బోయి యచట వీరాశక్తినిఁ బూజించుచు నెను దివసంబు లచట వసియించెను. అప్పు డామె పైకి హరిహరదేవుఁడును, మురారియుఁ దిరుగఁబడఁగా వారి నపుడు సామంబునం దనలోనం జేర్చుకొనియె. తదనంతరము రుద్రమదేవి యోరుగంటికోటలోనికి వచ్చి హరిహరుఁడును మురారియును జేయుకపటము నెఱిఁగి యామెసైన్యము నంపి వారిని పట్టించి వారి నందఱిని హతము గావించెను.

తదనంతర మామె కొన్నిదినములు సుఖముగా రాజ్యముచేసినపిదప దేవగిరి రాజు దళములతోడవచ్చి యోరుగంటికి ముట్టడివేసెను. దానిఁ గని రుద్రమదేవి యెంతమాత్రము జంకక పరమేశ్వరునిఁ దలఁచి మహారౌద్రముతో పగవారిని ప్రతిఘటించిపోరాడి వారిబలంబుల హీనంబులు గావించె. అంత వారును ముట్టడినివిడిచి నలుగడలం బలాయితులు కాఁగా రుద్రమదేవి వారిని పోనియ్యక దేవగిరివఱకును దఱిమెను. వారును రుద్రమదేవి శౌర్యంబున కత్యంతాశ్చర్యముఁ బొంది కోటిద్రవ్య మామెకిచ్చి శరణాగతులయి తమదేశమున కరిగిరి. అంత రుద్రమదేవిజయవాద్యములు మ్రోయ తననగరునకుఁ జను దెంచి సైనికులకుఁ దగిన బహుమతుల నొసఁగెను.

పిమ్మట నామెకూఁతురగు ఉమ్మక్కకు గర్భచిహ్నములగుపడెను. వానిం గని రుద్రమదేవి యపరిమితానంద భరితయై పుంసవనము మొదలగు సంస్కారముల నొనరించి వినోదములతోఁ గాలము గడుపుచుండెను. ఇట్లుండఁగా ఉమ్మక్కకు పదినెలలు నిండినపిదప శా. శ. ౧౧౬౬వ సంవత్సరమగు నందనసంవత్సర చైత్రశుద్ధ గురువారము నాఁ డుదయమున నొకపుత్రుఁ డుదయించెను. రుద్రమదేవి యా బాలకునిని స్నానముచేయించి సింహాసనమునందుఁ బరుండఁబెట్టి పౌరులను, సామంతులను రాఁబిలిచి వారందఱికిని మీప్రభు వితఁడని తెలిపెను. వారును మిగుల సంతసించిరి. తదనంతర మామె పుత్రోత్సవమునం దనేక దానధర్మములు చేసెను. బాలకునకు నామకరణ దివసంబున శివదేవయ్య పూజ్యురాలగు రుద్రమదేవిపేరు బాలకున కిడఁదలఁచి ప్రతాపరుద్రుఁడని నామకర

ణము చేసెను. తదనంతర మా బాలకుఁడు దినదిన ప్రవర్ధమానుఁడై శివదేవయ్యవలన సకలవిద్యల నభ్యసింపుచుండెను. ఈయన వెనుక ఉమ్మక్కకు మఱియొక పుత్త్రుఁడు కలిగెను. అతనికి అన్నమదేవుఁడని పేరిడిరి.

రుద్రమదేవునికి గర్భాష్టకంబున నుపనయనంబు చేసి విద్యలన్నియు నేర్పి రాజ్య మాతని కిమ్మని శివదేవయ్య కొప్పగించి క్రీ. శ. ౧౨౯౯వ సంవత్సరంబున రుద్రమదేవి దివి కరిగెను. ఈమె మనయాంధ్రదేశంబునకు శిరోరత్నమని చెప్పుట కెంతమాత్రమును సందియము లేదు. స్త్రీలలో నిట్టివా రుందురని ప్రత్యక్షప్రమాణమువలన నెఱిఁగియు మనవారు స్త్రీలను హీనముగాఁ జూచుట మిగుల శోచనీయము

# డాక్టరు ఆనందీబాయి జోశి

---

## స్త్రీవిద్యా విజయ దుందుభి ! ! !

గీ. తనసిరే వేల్పు లుదధిరత్నములచేత
వెఱచిరే ఘోరకాకోల విషముచేత
విడిచిరే యత్న మమృతంబు వొడము దనుక
నిశ్చితార్థంబు వదలరు నిపుణమతులు.

ఇయ్యుత్తమకాంత క్రీ. శ. ౧౮౬౫వ సంవత్సరము మార్చినెల 3౧వ తేదిని పూనాపట్టణమునందు జన్మించెను. ఈమె తండ్రిపేరు గణపతిరావ్ అమృతేశ్వర్ జోశి. ఈయన పూర్వులార్జించిన యగ్రహారములోని ధనమువలనఁ జీవింపుచుండెను. వీరి నివాసస్థలము కళ్యాణపట్టణము. ఆయనభార్య పూనాకుఁ బుట్టినింటికి నీళ్ళాడఁబోయెను. కాన ఆనందీబాయి యచటనే జన్మించెను. మనదేశమునందలి యాచారమువలన నాఁడుబిడ్డ పుట్టుటవలనఁ దలిదండ్రులకేమి బంధువులకేమి మిగుల వ్యసనము కలుగును. అదేప్రకార మీమె జననీజనకులును విచారపడిరి ! అప్పుడీబిడ్డవలనఁ దాము ప్రసిద్ధుల మగుదుమని వారికేమి తెలియును ? దేశాచారప్రకారము పదునొకండు దినములు గడచినవెనుక పండ్రెండవదినము బారసాలచేసి పిల్లకు యమునయని నామకరణము చేసిరి. శిశువునకు మూఁడునెలలు వెళ్ళఁగానే, తల్లి కళ్యాణమునకు వెళ్లెను. య

మున క్రమక్రమముగా బాలలీలను చేయుచుఁ దల్లిదండ్రుల నానందసాగరమున ముంచుచుండెను. ఈమె నాలు గైదుసం వత్సరముల వయసునందుననే మిగుల తెలివిగలదిగా నుండెను. అటుపిమ్మట నాచిన్నదియింటిలో నుండినఁ జెఱుపుపనులు చేయునని తల్లి సమీపమునందున్న బాలికాపాఠశాల కామెను బంపఁ దొడఁగెను. కాని చిన్నతనమువలన నాచిన్నది విద్యాభ్యాసమునందుఁ జిత్తము లేనిదయి యుండెను. ఆమె తల్లి బిడ్డలను గొడ్డువలె బాదు మూర్ఖస్త్రీలలోనిది యగుట వలన నామె చిన్నతనమున తల్లి చనువులేక యెప్పుడును శిక్షకుఁ బాత్రురాలగుచుండెను. ఆమెతల్లి తల్లియు గణపతిరావుగారి యింటనే యుండెను. కాన యమున నెప్పుడేమనిన నాముసలమ్మవారితోఁ దగవులాడుచుండెను. యమున చిన్నతనమునుండియు నేదో యొకపనిలేక కూర్చుండు స్వభావము గలదిగాక సదా యేదో యొకపనిని చేయుచునే యుండెను. యమున యేడుసంవత్సరములది కాఁగానే తల్లిదండ్రుల కామె వివాహమును గుఱించి చింత కలిగెను. వా రనేకస్థలముల వెదకి యనుకూలుఁడగు వరుని చింతించునెడ నొకగృహస్థుఁడు ఠాణా యనుగ్రామమునుండి కల్యాణమునకు వచ్చెను. ఆయన తో గణపతిరావు కొమార్తె వివాహ చర్చ తేఁగా నాయన "ఠాణాలోని పోస్టుమాస్టరుగారిభార్య నివర్తించెను; మీరా యనకడకు వెళ్లి విచారింపుఁడ"ని చెప్పెను.

ఆయన చెప్పినవాఁడు గోపాలవినాయక జోశి సంగమనేర్ కర్ గారు. ఈయనతనచిన్నతనములోఁ దనయక్కయుఁదానును జదువుకొను కాలములో స్త్రీలబుద్ధి పురుషులబుద్ధితో

సమానముగా నుండునని తెలిసికొనెను. గోపాలరావుగారికిఁ జిన్నతనముననే ప్రథమవివాహమాయెను. ఆయన తనభార్యకు విశేషవిద్యఁ గఱపి స్త్రీవిద్యవలనిలాభములను ప్రపంచమున కగుపఱచవలెనని దృఢముగా నిశ్చయించుకొనినవాఁడు. అందు వలన నాతఁ డనేకప్రయత్నములచేఁ దనసతికి విద్యనేర్పఁ దొడఁగెను. కాని యాచిన్నదియత్త,యాఁడుబిడ్డల కోడంట్రికముచే నలుగుచుండినందున విశేషవిద్యాభ్యాసముచేయ లేకుండెను. ఇట్లుండగా నాచిన్నదానికిఁ బదుమూడవయేట నొక కొమారుఁడు కలిగి తల్లిని స్వర్గమునకంపెను. ఆచిన్నవానిపేరుకృష్ణా; ఆతఁడిప్పటివఱకును సుఖముగానే యున్నాఁడు. ప్రథమభార్యచనిపోయిన పిదప గోపాలరావు నుదాసీనుఁడయి రెండవవివాహము జేసికొనను అని నిశ్చయించుకొనెను. ప్రథమపత్ని యున్నకాలములోనే యతనికిమొదటపునాలోనే పోస్టాఫీసులో నొకచిన్న జీతము గలపని దొరకి పిదప స్వతంత్రముగా ఠాణాలోని పోస్టుమాస్టరు పని దొరకెను. ఆయన తనప్రథమపత్నికిఁ గలిగిన కోడంట్రికముఁగని చిన్నతనముననే వివాహములుచేసి పిల్లల నతిక్రూరముగాఁ జూచెడియత్తలను మిగుల దూషించుచుండెను. ఇవన్నియు విచారించి యాయన ద్వితీయ వివాహము చేసికొనుటకు నిష్టములేనివాఁడయి యుండెను. కాని గణపతిరావు ఆయన వద్దికి వచ్చి తనకొమార్తెను చేసికొనవలసినదని యడుగఁగా నాతఁడు తా నొకస్త్రీని పూర్ణవిద్యావతినిఁ జేసి ప్రపంచమునకు నుదాహరణము చూపఁ దలఁచినవాఁడగుటచే, 'నాభార్యకు నే నెట్టివిద్య గఱపినను మీ రడ్డుపడకుండెడియెడల నే

వివాహమున కొప్పుకొనెద" ననెను. గణపతిరావుగా రం దున కొడంబడఁగా గొన్ని దినములకువివాహముజరిగెను. దేశాచార ప్రకారము వివాహానంతరము యమునాబాయికి 'ఆనందీబాయి' యని యత్తవారు పేరుబెట్టిరి. పెండ్లియైనపిదప గణపతిరావుగారి యనుమతిప్రకారము, గోపాలరావు నిత్యము సాయంతనము కళ్యాణపట్టణమునకు వచ్చుచుండెను. ఆనందీబాయి కొంచెము చదువుకున్నదని తెలిసి గోపాలరావు మరాఠి పుస్తకములను కొన్ని తెచ్చి ముత్తవచేత నామెకిప్పించిచదువునట్లు చేయుచుండెను. రెండవ పెండ్లివాఁడగుటచే పిల్లదాని నిత్వరలో భర్తగారితో మాటలాడఁ బురికొల్పసాగిరి. కాని ఆనందీబాయి కాకాలము భర్తయనిన నొకవ్యాఘ్రమువలెఁ దోఁచుటచే నామెమిగుల భయపడుచుండెను. గోపాలరావామె నెంతమాత్రమును భయపెట్టక బుజ్జగించియే చదువుమొదలయినవి చెప్పుచుండెను.

గోపాలరావు ఆనందబాయికి విద్యనేర్పుట ఆయనమామగారి కెంతమాత్రమును సమాధానము లేదు. ఆయనతానందు కొడంబడినవాఁడగుటవలన నల్లుఁడితో నేమియు ననజాలక యితరులచే స్త్రీవిద్యవలనం గలుగు నష్టములు చెప్పించి మాన్పఁ జూచెను, కాని గోపాలరావు వారికిఁ దగిన ప్రత్యుత్తరము చెప్పి పంపెను. మామగారియూరికి సమీపమునం దుండిన యెడల భార్యవిద్య సాగదని గోపాలరావు అలీబాగనుగ్రామమునకు మార్చుకొనెను. అచటికి ఆనందీబాయితోడనామె ముత్తవ పోయియుండెను. కాన పిల్లకేవిధమయినభయము లేకయుండెను.

అటుపిమ్మట గోపాలరావామెకు విద్యవలని లాభముల నెఱింగింపఁగా నామెమిగుల శ్రద్ధతో ప్రతిదినముతప్పక పాఠములు చదువుచుండెను. ఆమె చురుకుఁదనమును జూచినకొలఁదిని గోపాలరావునకు మఱింత యుత్సాహము కలిగియాతఁడామెతో ననేకసంగతులను ముచ్చటించుచుండెను. అందువలననే ఆనందీబాయికి త్వరగా విద్యాసక్తిగలిగెను. పెండ్లియైనపిదప రెండుసంవత్సరములలో ఆనందీబాయికి మహారాష్ట్రభాష చక్కఁగాఁ జదువుటకును, వ్రాయుటకును వచ్చెను. అంతలో నామెకాభాషయందలి వ్యాకరణము, భూగోళము ప్రకృతిశాస్త్రము, గణితశాస్త్రము మొదలగునవి గోపాలరావుగారు చక్కఁగా నేర్పిరి. అల్లీబాగునందుండుకాలమున ఆనందీబాయి ఋతుమతియైనందున భార్యాభర్తల నొకటి చేసిరి. వెంటనే ఆనందీబాయి గర్భవతియైనందున నామె కళ్యాణమునకుఁ బోయెను. అచట నామెకు కొమారుఁడు కలిగి పదియవదినసంబుననే చనిపోయెను. కాన ఆనందీబాయికిఁ జిన్నతనముననే పుత్రదుఃఖము కలిగెను. అందువలనఁ గొన్ని దినములవఱకును ఆమె విద్యాభ్యాసమునకు భంగము గలిగెను. కాని యటుపిమ్మట మరల నామె చదువు చక్కఁగా సాగుచుండెను. కొన్నిదినములలో నామెకుఁ దన మనోగతము బాగుగా వ్రాసి తెలుపునంతటి ప్రజ్ఞ గలిగెను. అల్లీబాగులోని లోకు లానందీబాయికి వచ్చిన విద్యనుగని యోర్వలేక గోపాలరావు ననేకకష్టముల పెట్టుచుండిరి! కాన నచటనుండుట కిష్టములేక, కోలాపురమునందు స్త్రీవిద్య కనుకూలుఁడగువాఁ డున్నందున బహుప్రయత్నముతో

గోపాలరావుగారచటికి మార్చుకొనిరి. కోలాపురములో బాలికాపాఠశాల వీరింటికి దూరముగుటచే ఆనందీబాయిని నొక్కర్తనంతదూరము కాలినడకనుఁ బంప వీలులేక యుండెను. పాఠశాలలో నుపాధ్యాయినిగా నుండిన మిస్ మాయసీ గారి యిల్లు వీరియింటికి సమీపమునందుండెను. ఆమె బహు మంచిదని విని గోపాలరావుగారామెతోడ మాటాడ నరిగెను. ఆయన ప్రసంగవశమున "నాభార్యను మీబండిలోఁ గూర్చుండఁ బెట్టుకొని వెళ్లెదరా" యని యడుగఁగా నామె కొంత యోచించి మంచిదనియెను, అందుపై ఆనందీబాయి కొన్నిదినములచటి పాఠశాల కరుగుచుండెను. కాని యటు పిమ్మట మాయసీ తనబండిలో స్థల మియ్యనందున నామె పాఠశాల కరుగుట మానుకొనవలసిన దాయెను.

కోలాపురమున నీదంపతులు పాద్రీల (క్రైస్తవధర్మగురువుల) యిండ్ల కరుగుచుండిరి. పాద్రీయాఁడువారు ఆనందీబాయికి నింగ్లీషు రెండు మూఁడుపుస్తకములవఱకును నేర్పిరి. ఆనందీబాయి యల్పవయస్కురాలయినను వారు చేయుమతబోధ నుగ్రహింపక కేవల నీతివాక్యములనే గ్రహింపుచుండెను. వీరి వలననే యీదంపతుల కమెరికాలోని సంగతులనేకములు తెలిసెను. కాన నమెరికాలోని కరిగి విద్యనభ్యసింపవలయునని ఆనందీబాయి కప్పటినుండి యిచ్ఛగలిగెను.

౧౮౭౯వ సంవత్సరప్రారంభమున గోపాలరావుగారిని బొంబాయికి మార్చిరి. అచట నుండుకాలములో ఆనందీబాయి కొంతవఱ కింగ్లీషును సంస్కృతమును నేర్చుకొనెను. కాని యచటను లోకులామె విద్యాభ్యాసమున కనేక విఘ్నములు

తెచ్చుచుండిరి. ఇట్లుండఁగా ౧౮౮౦వ సంవత్సరమునచటినుండి భూజయను గ్రామమునకు మార్చినందున నాదంపతు లచటి కరిగిరి బొంబాయినుండి భూజకుఁ బోవునపుడు ఆనందీబాయి ముత్తవ యామెతోడ రానందున నింటిపని యంతయు నామె యే చేయవలసియుండెను. ఇంటిపనినంతను చేసి యానందీబాయి భర్తకడ నింగ్లీషు సహితము నేర్చుకొనెను. అచటనే యామె యింగ్లీషు మాటలాడుట చక్కఁగా నేర్చుకొనెను.

గోపాలరావుగారికి భార్యను విశేష విద్యావతినిఁ జేయ వలెనని యుండుట నొకవార్తాపత్రికలోనఁ జదివి అమేరికాలోని న్యూయార్కుపట్టణవాసినియగు మిసెస్ బి. ఎఫ్. కార్పెంటర్ అను నామె ఆనందీబాయికి సహాయముచేయఁదలఁచి యామె కొకయుత్తరము వ్రాసెను. ఈమెయే ఆనందీబాయి కనేకవిధము లసహాయముచేసి యామెను కూఁతురివలెఁ జూచుచుండెను. కాన ఆనందీబాయియు నీమెయందధిక ప్రేమ గలదియయి యామెను పిన్ని యని పిలుచుచుండెను. ఈమెకు ఆనందీబాయి వ్రాసినయుత్తరములవలన మనదేశమునందలి స్త్రీలకుఁ గల పరతంత్రతయు, దానిని వదలించుటకై ఆనందీబాయికిఁ గలయభిప్రాయమును దెలియుచున్నవి. స్త్రీలకు విశేష విద్యగఱపినంగాని స్వహితము తెలియదని యామెమతము. ఇదియంతయు నామె స్వానుభవము వలననే తెలిసికొనెను. ఇట్లుత్తర ప్రత్యుత్తరములవలన నాయిరువురకును సఖ్య మధికమయ్యెను.

తదనంతరము గోపాలరావుగారిని కలత్తాకు మార్చిరి. అచ్చటనుండు కాలములో పోస్టుఆఫీసులో 30 రూపాయలవేతనముగల యుద్యోగము ఆనందీబాయికొఱకు సిద్ధమయ్యెను.

కాని యుద్యోగములోఁ బ్రవేశించి స్వతంత్రతను పోఁగొట్టుకొనుట కిష్టములేక యామె దానిని స్వీకరించకుండెను. తదనంతర మామెకు నమెరికాలో వైద్యవిద్య నభ్యసించుకోరిక యధికమయ్యెను.

కలకత్తానుండి శ్రీరామపురమనుస్థలమునకు మార్చి నందున నాదంపతు లచటికరిగిరి. అచటి కరిగినపిదపఁ గొన్నిదినములు సెలవుతీసికొని వారు సమీపమునందుఁగల జయపూర్, అగ్రా, గ్వాలియర్, లఖనౌ, కాన్పూర్, ఢిల్లి, ప్రయాగ, కాశీ మొదలగు ప్రసిద్ధపట్టణములను జూడనరిగిరి. అందువలన ఆనందీబాయికిఁగొంతవరకు ప్రవాసస్థితి తెలిసెను. వారుమరలి శ్రీరామపురమునకు వచ్చినకొద్దిదినములలోనే రెండు సంవత్సరముల సెలవుతీసికొని అమెరికాదేశమున కరుగ నిశ్చయించిరి. కాని యింతలో నీకు సెలవియ్యఁజాలమని పైనుండి యుత్తరువు వచ్చెను. అందువలన ఆనందీబాయి నొకర్తనే యమెరికాకుఁ బంపఁదలఁచి గోపాలరావుగారామెతో నొకదిన మిట్లు ప్రసంగించిరి:—

గోపాలరావు (చింతతో) నీవొంటరిగానే అమెరికాకు వెళ్ళెదవా? నాకిప్పుడు సెలవుదొరకదు. నీకిచటనుండినవిద్యాభ్యాసము కానేరదు. కాన నొంటరిగానైన నరుగుట యావశ్యకము. మనమిరవురము కలసి వెళ్ళవలెననినచో నింకను రెండు సంవత్సరముల వ్యవధిపట్టును. ఇంతలో నీచదు వచటఁ జాలవ ఱకగును.

ఆనందీబాయి ఏమియు ననక భర్తవంక చూచి మీరేమనెదరని యడిగినటుల నగుపడెను, దానింగని

గోపాలరావు, నేఁటివఱకును బ్రాహ్మణస్త్రీ పరదేశమున కరిగి విద్యనభ్యసించిన యుదాహరణ మెందునుగానరాదు. కాన నీవు వెళ్ళి విద్యనభ్యసించి యుదాహరణీయవగుము. స్త్రీలుసామర్థ్యహీన లన్నవాక్యమును నీవబద్ధము చేయుము. మననడవడిని విడువక అమేరికావారికి మన నడనడిని నేర్పుము, ప్రస్తుతము సంస్కరణము కావలయు నను వారు పెక్కండ్రు పురుషులుకలరు, కాని వారిచేతఁ గొంచమైనను సంస్కరణమగుట లేదు. నీవు స్త్రీవైకొంచెము సంస్కరణము చేసి చూపినను మిగుల నుపయోగకరముగా నుండును.

అందు కానందీబాయి సమ్మతించి యంతదూరదేశప్రయాణమునకు సాహసించెను ! ఆమెతన కెట్టికష్టములువచ్చినను వెనుకఁదీయక స్వదేశసోదరీమణుల కొఱకు యుదాహరణము చూపి వారికి మేలుచేయఁ దలఁచెను! !

ఇట్లు వారు కృతనిశ్చయులయి ఆనందీబాయి కొఱక మేరికాలో ననుకూలములగు బట్టలనుకుట్టించి, సిద్ధపఱుచుచుండిరి. ఆనందీబాయి పరదేశపువస్త్రములు ధరియింపనని నిశ్చయించుకొని మనదేశమునందలి ముతక బనాతుగుడ్డలతోనే దుస్తులను కుట్టించుకొనెను. ఇట్టిదిగదా స్వదేశాభిమానము ! ఈమె అమేరికా కరుగునని విని యనేకు లనేకాక్షేపణలు చేసిరి. కాన వారి కందఱకును సమాధానకరముగా ఆనందీబాయి యొకపాఠశాలా మందిరమున సభచేసి గంటసేపు హూణభాషయందు నస్ఖలితముగా నుపన్యసించెను. అందువలననే యామెకు నింగ్లీషునందుఁగల ప్రజ్ఞయు, నామెయొక్క యప్రతిమానక్తృత్వశక్తియు వెల్లడియగుచున్నవి. ఆ యుప

న్యాస మత్యంత శ్రవణీయము. కాన జనానాపత్రికోక్తముగా నిచ్చట నుదాహరించుచున్నాను.

"నాయమేరికాదేశ యాత్రనుగూర్చి వందలకొలది ప్రశ్నలు నన్ను నేరు లడుగుచున్నారు. కావున నే నిప్పుడు అవకాశముఁ గలుగఁజేసికొని వానిలోఁ గొన్నిటికిఁ బ్రత్యుత్తరములం జెప్పఁ దలంచితిని, అవి యెవ్వనఁగా:—

౧. నే నమేరికాదేశ మేల వెళ్ళవలెను?

౨. హిందూదేశమునందుఁ గృషిచేయుటకు నాకు సాధనములు లేవా?

౩. నే నొంటరిగా నేల వెళ్ళవలెను?

౪. నే నిదేశమునకు తిరిగివచ్చినప్పుడు జాతిలోనివారి నుండి నాకు బహిష్కారము గలుగదా?

౫. ఏదేని యాపద సంభవించినయెడల నే నేమిచేయవలెను?

౬. స్త్రీలలో నెవరును జేయని పనిని నే నెందులకుఁ జేయవలెను? అనునవి.

౧ మొదటి ప్రశ్నకుత్తరము:— నేను వైద్యము నేర్చుకొనఁ దలఁచి యమేరికాదేశమునకు వెళ్ళ నిశ్చయించితిని. ఈహిందూదేశమునందు స్త్రీలకుఁ జికిత్సఁ జేయఁదగిన సాధనకలాపము లేని కారణమువలనఁ గలిగెడి బాధలను ఇప్పుడిక్కడకు దయచేసిన నారీమణులు బాగుగాఁ దెలిసికొని యున్నారు. ప్రకృతిశాస్త్రములను, స్త్రీవిద్యను వెలయింపఁ జేయ నీదేశమున వెలయుచున్న సమాజము లెవ్వియు మనదేశపు యువతుల నేరినిఁగాని నాగరికతచేఁ బ్రతిష్ఠ గాంచిన ఖండాంతర

ముల కంపించి వైద్యశాస్త్రప్రవీణలను గావించి, వారిచే నిచ్చటం బ్రమదల కావైద్యశాస్త్రమును గఱపు కళాశాలలను స్థాపింపఁ దలంపమికి నేనత్యద్భుతము నొందుచున్నా నను. తనకుఁ గల లోపముల నెల్ల వెల్లడిసేయక తన్నివారణార్థమై యర్థింపకయుపేక్షించు నిందాస్పదమైనదియు ఈహిందూ దేశమునకంటె మఱియొక్కటి యేదియులేదు. ఈహిందూ దేశమందట స్త్రీవైద్యులు లేని లోపము స్పష్టముగనున్నది. యూరపుదేశపునారులును, హిందూసుందరులును, అవసరము తటస్థించినప్పుడు పరపురుషులకు తమ దేహస్థితిని వివరించి వారిచేఁ జికిత్సఁ జేయించుకొనుటకు సహజముగా నిష్టపడక యున్నారు. యూరపు, అమెరికా దేశములనుండి యిక్కడకు కొందఱు స్త్రీవైద్యులు వచ్చుచున్నారు గాని, వారిభాషయు, నాచారమర్యాదలును మనవారికిఁ గ్రొత్తలగుటచే, వారుమన స్త్రీల కంతగా నుపయోగపడక యున్నారు. తమదేశమందును దమవారియెడలను నైసర్గిక మయిన ప్రేమ గల హిందూసుందరులుపరదేశ యువతులతోఁ గలిసి మెలఁగలేరు. కావున నావలన నేసహాయ లాభమును బడయఁజాలకయున్నారు. ఈ హిందూదేశమున స్వదేశ స్త్రీవైద్యుల యక్కఱ మిక్కిలిగా నున్నట్లు నాకుఁ దోఁచుచున్నది.

౨. ఇఁక నీహిందూదేశమునం దందులకుఁ దగినసాధనములు లేవా యను రెండవ ప్రశ్నమున కుత్తరము:— లేవని నిష్కర్షగా మనవి చేయుచున్నాను. అనఁగా సాధనములు బొత్తిగా లేవని నామతము కాదు. కాని యున్న సాధనములు సులభసాధ్యములు గావని నాయభిప్రాయము. చెన్నపురియం

దు నొక సర్వకళాశాలయు నన్ని రాజధానులలోను మంత్రసాని తనము నేర్పు తరగతులును నుండుట సత్యమే. అయిన నందలి బోధకులు ప్రాచీనాచారప్రవిష్టు లగుటచేతను, కొంత వఱకసహిష్ణు లగుటవలనను అచ్చట నొసఁగఁబడుచున్న విద్య యసంపూర్ణ మయినదిగాను లోపములతోఁ గూడినదిగాను నున్నది. ఇట్లనుట నే నాబోధకుల తప్పుల నెంచుటకుఁ గాదు సుఁడీ. అది పురుషుల స్వభావమని మనవిచేసితిని. వీరికి మాఱుగా నాస్థానములను స్త్రీలలంకరించువఱకిట్టి యిబ్బందులకు మన మోర్చుకొనవలసి యున్నది.

నేను క్రైస్తవురాలను గాను; బ్రాహ్మమతావలంబినిని గాను. కాఁబట్టి హిందూమతాభిమానము గలిగి తద్ధర్మముల ననుష్ఠించుచు విదేశమున నెందయినను పాఠశాలకుఁ బోయి విద్య గఱచుట నాఁబోఁటి బోఁటికి దుష్కరము. ఇంగ్లీషువారి యువతులఁ దోడిగికొని నడయూదుమతాంతరు లయినను ఇచటి ప్రజలు నన్నుఁ జూచిన ట్టూరికయుగఁగాఁ జూడరు. నగరుల లోను, వెలుపలను, నావంటి హిందూయువతులకుఁ గలుగుచున్న పరాక్షేపణలు, దుర్వాదంతులు స్వదేశీయులైన క్రైస్తవస్త్రీలకు లేశమును గలుగుటలేదు. పొగబండిలోఁగాని, వీథుల వెంటగాని నేనొంటరిగాఁ బోవునపుడెల్లప్రజలు కొందఱు నన్నుఁ జేరి నామొగమువంక నట్టే చూచుచు కొంటెప్రశ్నలచే నన్నలయింపుచుందురు. ఈపాడిమాటలకంటె కొన్ని యుదాహరణములవలన నిజము మీమనసులకు నాటఁ జెప్పెదను చిత్తగింపుఁడు.

కొన్ని సంవత్సరములక్రిందట, నేను బొంబాయినగరము న నుండఁగా పాఠశాలకుఁ బోవుచుంటిని. చేతపుస్తకములం బట్టుకొని నేను బడికిఁ బోవుచుండునపుడు కొందరు కిటికీలగుండ నన్ను చూచువారును మఱికొందఱుబండ్లెక్కిపోవుచు, నన్ను పరికించువారును, వీధులలో ద్రిమ్మరుచుండు నిఁక కొందఱు పెద్దపెట్టున నవ్వుచు "ఇదేమివింత! కాళ్ళకు మేజోళ్లను బూట్సులను దొడగికొని పాఠశాల కేగునీగరిత యెవ్వతె! ఇందుమూలముస కలి యప్పుడే ప్రజలమనసుల నావహించిన జాడలు పొడగట్టుచున్నవి గదా!" యనినాకు వినఁబడునట్లుగా కోలాహలముగాఁ బలుకువారుగనుండిరి.

ఓమానినీమణులారా? అట్టిప్రశ్నలను మి మ్మడిగినప్పుడు మీమనసెట్టిసంతాపమును బొందెడినో మీరేసులభము గా నూహించి తెలిసికొనఁ గలరు.

ఒకప్పుడు నేను కొంతకాలము పాఠశాలలో నుండవలసివచ్చి భోజనము నిమిత్తము దినమునకు రెండుసారులు బంధువులయింటికిఁ బోవలసివచ్చెను. నేనపుడట్లుపోవుచు వచ్చుచున్నప్పుడెల్ల వీధివెంట నేగువారు నాచుట్టును చేరికొందఱు ఎగతాళిచేయ నారంభించిరి. కొందఱు కడుపుబ్బనవ్వఁ జొచ్చిరి. తక్కినగృహస్థులుడాంబికముగాతమతమపంచలలో గూర్చుండి నన్నుఁ గని వికృతాలాపము లాడుచునాపైని రాళ్లు రువ్వుట కెంతయు లజ్జింపరయిరి. ఇఁక నంగడివాండ్రు, బేరగాండ్రన్ననో నన్ను వెక్కిరింపుచు అసహ్యాకర మయినసైఁగలం జేయసాగిరి. అట్టిసమయములో నాస్థితి యెట్లుండెనో యిల్లు

చేరుకొనుటకు నామన సెట్లు త్వరపెట్టెనో దానినూహించి మీరే తెలిసికొనుఁడు.

బొంబాయి నగరవాస్తవ్యుల తీరిట్లుండఁగా, బంగాళీవారిరీతి యింకఁజెప్పుటకే శక్యము గాకున్నది. ఇది యెల్ల కడుశోచనీయము. గాలిపట్టుల కెప్పుడయిన నేను వ్యాయామముకొఱకు పోయినప్పుడు ఇంగ్లీషువారయిన నన్నెప్పుడు కన్నెత్తి యంత నిబ్బరముగాఁ జూడరయిరి. కాని బంగాళీవారు తమదంభము నంతను వెల్లడిచేసి హాస్యాస్పదముగావించుకొన నన్నుఁ గని "నీవెవతెవు? నీపేరేమి ? నీస్థలమేది ?నీవెందుల కేగెదవు?" అని యపరిచితు లడుగఁగూడని ప్రశ్నలనడిగి యాగడ మొనర్చిరి. శ్రీరామపురములో విద్యావంతులని యెన్నికగన్న కొందఱు స్వదేశక్రైస్తవులు నేను వివాహితనో. వితంతువునో దుర్వర్తన గలదాననో, కులభ్రష్టనో యని శంకింపుచుండిరి. ప్రియులయిన యోగ్యసభాజనులారా! యిట్టి యవినయప్రచారములు స్వదేశక్రైస్తవులు చేయఁగూడునా? ఎంతమాత్రము చేయఁగూడదు. వీనిని మీకిట్లు విన్నవించుట మీరట్టిలోపములను సవరణచేయఁ దివిరెదరనియు, మీలోని కష్టముల నెన్నఁడెఱుఁగని వారు వీనినెల్ల వినినపిమ్మట నమేరికాదేశమునకు నేను పోవయత్నించుట కేవలము వేడుకకయి గాదని యెంచెదరనియే కాని మఱియొకతలంపునఁ గాదు!

3. నేనొంటిరిగా నేల విదేశమునకుఁ బోవలెనను మూడవప్రశ్నకుత్తరమేమనఁగా:— తొలుత నేను నాపెనిమిటియును గలిసి వెళ్ళుటకే యుద్దేశించితిమి. పిదపస్థితిగతులను బట్టి యాతలంపు మానుకొనవలసివచ్చెను. మాయొద్దధనమా

చాలినంత లేదు. ఈహేతు వొక్కటియే కాక యింతకంటె ముఖ్య ములయినవి యందఱి నొప్పింపదగినవి మఱికొన్ని గలవు. అవి యేమనఁగా నాభర్తగారికి వయోవృద్ధయగు జననియు, పసి వాండ్రుగనున్న తోఁబుట్టువులును తమ్ములునుగలరు. వారం దఱికి సంరక్షకుఁడు నాభర్తగారే యగుటచేత నాయన నాతోఁ గూడవచ్చిరేని, వారు దిక్కుమాలిన వారలయి వారి బ్రతుకు భగ్నమగును, వారు తీరని దారిద్ర్యబాధలకు లోనగుదురు. నాయొ క్కతెకొఱకు పెక్కండ్రను మలమల మాడునట్లు చేయుట యెంత యమానుషకృత్యము! కాఁబట్టి నేనొంటరిగా నేగ నిశ్చయించితిని.

౪. నే నిండియాకు (హిందూదేశమునకు) మరలవచ్చి నప్పుడు నాకు బహిష్కారము గలుగకయుండునా యనుదాని కి సమాధానము:—అట్టిభయమువలన నేనుచలించెదననితలం తురా? నేనందుకు నావంతయినను వెఱవను. ఇక్కడ నేవిధ ముగా నుంటినో యక్కడఁగూడ నాతీరున నేయుండ నిశ్చ యించుకొనియుండఁగా నాకు బహిష్కారమేల కలుగును నాయాచారవ్యవహారములయందుఁ గాని, ఆహారవిహారముల లోఁగాని, వేషభాషలయందు గాని మార్పుగావింప నే నెంత యుఁ దలంపలేను. హిందూయువతిగ నేపోయి, మరల హిం దూమానవతిగ నే వచ్చి యిక్కడ హిందూ సుందరులలో నే గలసియుండ నిశ్చయించితిని. ఇప్పుడును దానికంటె భిన్నము గానుండక నాపూర్వులెట్లు సామాన్యముగా జీవించిరో నేను నట్లే యుండఁగలదానను. ఇప్పగిది నేను బ్రవర్తించునప్పుడు అస్మద్దేశీయులు నన్ను బహిష్కరింపఁ జూతురేని, అప్పు

డేల, ఆపని యిప్పుడే చేయరాదా? అందుకువారికి సర్వస్వాతంత్ర్యము గలిగియే యున్నది. మా మహారాష్ట్ర కుటుంబమొక్కటియైనను లేని యీ బంగాళాదేశమందలి యీస్థలమున నే నిప్పుడు వాసము చేయుచుంటినిగదా! నే నియ్యెడ నా దేశాచారధర్మముల ననుష్ఠించి ప్రవర్తింపుచుంటినో లేదో యెవ్వ రెఱుగుదురు? కాఁబట్టి యెన్నఁడును సంభవింపఁగూడనట్టియు, సంభవించినప్పుడు మానుషప్రయత్నములకు లోఁబడనట్టియు వానినిగుఱించి చింతింపక యుండుటయే యుత్తమము.

౫. నాకేది యయిన నిక్కట్టు తటస్థించిన నే నేమి చేయుదు ననెడి ప్రశ్నకు సముత్తర మేమన్న:-కొందఱు మనుష్యులు ప్రపంచములోఁ గనఁబడుదానికంటె నతిభయంకరముగా గ్రంథములలోఁ గనఁబడు దురవస్థలను, దుర్దశలను నుదాహరణముగాఁ జూపి భయము నతిశయింపఁ జేయఁ బ్రయత్నింతురు; కాని యీ యాపద లెంత భయంకరములో యంత యరుదుగా సంభవించునట్లుగ విధింపఁబడియున్నవి. పురుషులుగాని, స్త్రీలుగాని యెద్దియేని యొకకార్యము చేయఁబూనినప్పుడు తొలుత మేలెంచెదరుగాని కీడెప్పుడు నెంచరు. ఒకానొకప్పుడు తప్పక కీడులు మూఁడి మనవారినిఁగాని యాంగ్లవారినిఁగాని భూమిలోని కడఁగఁ ద్రొక్కినయెడ నింకప్పుడు వ్యథాచర్చలతోఁ బనియేమి? అవి వచ్చినప్పు డనుభవించి తీరవలసినదే. కాని యీయాపదలు రాఁబోవు నప్పుడుండెడిబాధకంటె వాని ననుభవించునపు డుండెడిబాధ యల్పమనుట జగద్విదితమే. ఏవిధముననయినను ఈలోకమున శాశ్వ

తమయినసుఖమును బడయఁగలమా యనుశంకను నివృత్తి చేసికొనుట కీప్రపంచము మన కవకాశ మెన్నఁడును గలుగఁజే యనేరదు. కాని పయికగుపడుచున్న సాధనముల యంతరము లకుఁ దగిన సౌఖ్యమును మనుజు లెల్లప్పుడును బొందుచుండు ట లేదనిమాత్రము మనము చెప్పవచ్చును. అసౌఖ్య మనునది కొందఱు చేరి తమలోతాము విభాగించుకొనఁ దగినపదార్థము గాదు. అది మనమనసునుబట్టి యుండును. దురవస్థలలో కెల్ల మరణమే గొప్పదని యెంచెద మంటిమా కొందఱు దానిగాక కేల సంతోషింపరు? మఱికొంద ఱేల సుఖింతురు? వేయేల? మృత్యువును, దుర్దశయును, మంచివారికిని, పుణ్యాత్ములకును, పాపాత్ములకును, భాగ్యవంతులకును, దరిద్రులకును, దేశ ద్రిమ్మరులకును, గృహస్థులకును సమానముగనే వచ్చుచుండు ను. ఆపత్కాలమునం దందఱు పిఱికివారగుటయు, కార్యావేశ ముచే నెవ్వరు ప్రతిభావంతులు గాకుండుటయును సుప్రసిద్ధమే. గానున్న విపత్తు నెంతటి మనుజుఁడైన నడ్డగింపలేఁడు. ఆపద లును, నెల్లప్పుడు మనల ననుసరించియే యున్నవి. కాఁబట్టి వానిరాకకు ప్రతిమనుష్యుఁడును పరీక్షించియే యున్నాఁడు. ఏదియయిన నొక యుత్కృష్టమైన పనిఁబూనుకొన ఫలిత మనుకూల ముగానుండెనా, దానిని పూనికతో నెరవేర్చినవారి పరిశ్రమ మును ఘనముగా బ్రశంసింతుము. లేక యది ప్రతికూలముగా పరిసమాప్తి నొందెనా తత్కార్యవాహకుల యనజ్ఞతను నిందిం తుము. ఈతీరుననే యదృష్టము మాఱి, ఫలము విఫలమగు సదా లోక మది యవివేకమని చాటుటకు సిద్ధముగ యుం డును.

ఇఁక కొందఱు కూపస్థమండూకములవలె నింటి నంటిపెట్టుకొనువారే సుఖభోగులందురు. కాని, వారికి సుఖభోగమెలాగునఁ గలుగునో తెలియదు. అది కోరినప్పుడనుభవింపఁదగినట్లు సిద్ధముగా సమర్పఁబడి యున్న పదార్థము కాదుగదా? కొందఱికి నూతనప్రియత్వమెంత యధికముగా నుండు ననఁగా సౌఖ్యమయినను నెడతెగనిదిగా నుండిన దానియందు రుచిలేదని వారప్పుడప్పుడు కష్టములను గోరుచుందురు. విదేశమున కేఁగుట చెడుపనిగాదు. కొన్నియంశములనుబట్టి యొక్కచో నివసించియున్న దానికంటె మేలయినపని యని చెప్పవచ్చును. దేశాటనమున నాదేశముల యొక్కయు, ప్రజల యొక్కయు స్థితిగతులు బాగుగ మనసునఁబట్టగలవు. అట్టివానిఁ దెలిసికొనుటయందు విముఖులమయి యుండఁగూడదు. అవజ్ఞతను మనము బుద్ధిపూర్వకముగా నవలంబించుట యనునది గొప్పదోషములలో నొకటి. విదేశయాత్రలు గావించుటచే మనకు బుద్ధివికాసమును జ్ఞానాభివృద్ధియుఁ గలుగును. ఎల్లవారును యుక్తమయిన దానిని జేయవలసినదే. ప్రతిమనుష్యుఁడు తన సహజీవులకుఁ జేతనయినంత యుపకారమునకుఁ బ్రత్యుపకారము చేసి ఋణవిముక్తతను బొందవలసినది. పరసీమలలో మనకు దిక్కెవ్వరని యడిగెదరా? ఏతద్విషయమును గోల్డుస్మిత్తను ఇంగ్లీషుకవి చేసిన మహోపదేశము మనము గమనింతము. అది యెద్ది యనఁగా "అంధులబుద్ధివిశేషము ననుసరింప నేర్చుకొనుము. ఏలయనఁగా వారెన్నఁడు తమచేతి యూఁతకోలతోఁ భూమిని దడవి తెలిసికొనకుండ నడుగు బెట్టరు." ఆతీరుననే నేను సర్వశక్తిసంపన్నుఁడయిన నా పరమపితను నాకూఁతకోలగాఁ జేసికొనియెదను. ఆయన

యే నామార్గమును బరిశీలించి నన్ను ముందుకునడిపించుకొనిపోవును. దానికంటెను మహోత్తర మయినచేతి యూత నాకన్య మేమియుఁ గనఁబడదు.

కొట్టకొనకు నాజాతివారెవ్వరును జేయనిపని నేనేల చేయవలెను? అనుదానికి నే విన్నవించున దేమనఁగా మన మొక్కరొక్కరము సంఘమునకుఁ జెల్లింపవలసినఋణములు పెక్కులు గలవు. వీరిపనిచేసిన ఋణవిముక్తత కలుగునని వేర్వేరుగ నకాంక్షించుట దుస్తరము. ఒక్కకార్యముచే నొక్కరి కెప్పుడు మేలు గలుగఁగలదో యందువలన నందఱికి మేలు కలుగునని యే యెంచవలసినది. సర్వత్రజనులందఱికి శ్రేయస్కర మని చెప్పఁదగినపనిని జేయుటకు మనలో నెల్లవారును ప్రయత్నపడవలసినది. మనుస్మృతియందు "చేయఁదగిన ధర్మమును జేయక యుపేక్షించువారు క్షమియింపబడఁగూడని మహాపాతకులు" అని చెప్పఁబడియున్నది. కావున నాజాతి స్త్రీ లెవ్వరును నిదివఱకుఁ జేయనిపని నేనును జేయఁగూడ దనుట యాశ్చర్యజనకముగా నున్నది. మృతజీవులని ప్రసిద్ధిగాంచిన మనపూర్వులకిట్టియూహ లెన్నఁడును బుట్టియుండలేదు. ఏదీ నాకైస్తవమిత్రులు నేనడుగబోవు నీక్రిందిప్రశ్నమున కేమియుత్తరము నిత్తురో చూచెదము. ఓ నెచ్చెలులారా! మీమతధర్మములను బట్టి యేసుక్రీస్తు మీయందఱికొఱకు తనప్రాణమును బలియొసంగక యుండిన మీకు పాపవిమోచనము గలుగునని తలంతురా? ఆయన యట్లు లోకోపకారమును జేయుచుండఁగా వారికిఁ గలిగిన ఘోరమయినదండనమున కేమయిన నామహానుభావుఁడు జంకెనా? లేదు. ఆయన జంకినట్టు మీరెప్పు

డొప్పుకొనునట్టివారు కారని నిశ్చయముగా నేనుజెప్పఁగలను. మాపూర్వపురాజులలోనుగూడశిబి, మయూరధ్వజుఁడు మొదలగువారు పరోపకారార్థమయి ప్రాణత్యాగము చేయ వెఱవరయిరి. మనకు విఘ్నమే కలుగునో, యాపదలె సంభవించునోయని చేయవలసిన ధర్మమును జేయకపోవుట న్యాయము కాదు. మనము చేయవలసినంత ప్రయత్నము చేసి తీరవలయును. మనకంతట పిమ్మట జయమైనను సరె, యపజయమైనను సరే. మనుజులను మూఁడుతరగతుల వారినిగా విభజించెను. అందు అధములుఁ విఘ్నములు గలుగు ననెడి భయమువలన నేపనినిగాని పూనుకొనరివారు. మధ్యములు తామారంభించిన పనికి నడుమ నంతరాయము సంభవించినతోడనే యాపనిని విసర్జించువారు. ఉత్తములు ప్రారంభించినదాని కెన్ని యడ్డములు వచ్చినను వాని నెల్లఁ బూనికతో నిదానించి విజయము గాంచువారు.

కష్టము లెంత యుత్కృష్టములుగా నుండునో మనకు ధైర్యస్థైర్యము లంత యధికముగా నుండును. కాఁబట్టి మనమారంభించినదాని నెన్నఁడును మానఁజనదు. ఇఁక నావిన్నపము ముగిసినది. ఇంత సేపు ప్రసంగించుటవలన మిమ్ము విసికించితి నేమోయని భయపడుచున్నదానను. అందులకు నన్ను మీరు క్షమింతురు గావుత."

ఈ యుపన్యాస మిచ్చినపిదప ఆనందీబాయి యొక క్రైస్తవగురువుల కుటుంబముతో అమేరికా కరుగ నిశ్చయించెను. ఒకానొక హిందూబ్రాహ్మణస్త్రీ అమేరికా కరుగునని

విని రావ్ సాహేబు దాండేకర్ అను నాతనికి మిగుల విచారము కలిగెను. అంత నాతఁ డనేకప్రయత్నములచే నామె యమేరికాప్రయాణ మాపవలెనని యత్నించిచూచెను. కాని యాతని ప్రయత్నములవలన నేమియు ఫలముకానరాకుండెను. అంత నాపూర్వాచారపరాయణుఁడు ఆనందీబాయి యాప్తులకువ్రాసి వారిచే నమేరికాకుఁ బోవలదని యానందీబాయికి ననేకము లయినయుత్తరములను వ్రాయించెను. కానివానివలనను ఆమె ప్రయాణమాగదయ్యెను. రేపు ప్రయాణమనఁగ ఆనందీబాయి యక్కడినుండి తమ్మునికి ప్రాణాంతముగానున్నదనియు నీవుతక్షణము బయలుదేరి రావలసినదనియు నుత్తరమువచ్చెను. దానింగని ఆనందీబాయి కొంచెమాలోచింపఁగా నాయుత్తరము నీప్రయాణము నాపుటకే వ్రాసిరనియు నీతమ్మునికి నిజముగ ప్రాణాంతముగనుండిన నీవుపోయి చూచునంతకునుండఁడనియు ఇందువలన నీవు చేయఁబోవు మహాకార్యమును మానుట మంచిదికాదనియు నామెమనోదేవత యామెకుఁ జెప్పి యామె నిశ్చయముఁ దొలగకుండఁ జేసెను. ఆహా! దృఢనిశ్చయమన నిట్టిదిగదా? చిన్నచిన్న సంకటములు ప్రాప్తించినను భయపడి మనవారలంగీకృతకార్యమును పరిత్యజింతురు. కాని యట్టివారు ఆనందీబాయి చరిత్రఁ జదివి దృఢనిశ్చయ మనుసద్గుణమును నేర్చుకొనియెదరుగాక.

అంత ౧౮౮౩వ సంవత్సరము ఏప్రియల్ ౭వ తేదిని ఆనందీబాయి కలకత్తానగరమునుండి పాతాళలోకమున కరుఁగ బొగయోడ నెక్కెను. అప్పుడు ఆదంపతుల కిరువురకును గలిగిన వియోగదుఃఖ మిట్టిదని చెప్ప నెవ్వరితరము! అయిన

నువారు తమసుఖములను విడిచి, స్వదేశహితమునకై కష్టముల ననుభవించిరి. వారి స్వదేశభక్తి నెంతపొగడినను తీరదు. త్రోవలో సహవాసముగానుండిన క్రైస్తవస్త్రీ లామెను తమమతమునకుఁ ద్రిప్పవలయునని విశేషముగా బోధించిరి. కాని దృఢనిశ్చయురాలయిన యాయబల వారికిఁ దగినయుత్తరముల నిచ్చి యామతమును ఖండించెను. అందువలన నాయువతు లామెను మిగులతిరస్కారముగాఁ జూచియు,ఆమెకు శరీరమస్వస్థముగానుండినను విచారింపక ఉపోషము చేసినను భోజనముచేయుమనక ఆమె తినదని యెఱింగియు మాంసాహారములు తినెదవాయనియామెను కేరడములాడియు విశేషబాధపెట్టిరి. ఆనందీ బాయి వారింత చేసినను వారిపై కోపపడక స్వదేశవియోగము, స్వజన వియోగము వలనఁ గలిగిన దుఃఖమును తానే యాపుచు దొరకినచో ధాన్యాహారము చేసియు, దొరకనిచో నుపోషముండియుఁ గాలముగడుపుచు స్టీమరుపై వెళ్ళుచుండెను. ఆహా ! ఇట్టిస్వదేశాభిమానమును, స్వధర్మాభిమానమును గలస్త్రీ సర్వజనవంద్యయనుటకు సందేహముగలదా? కొందఱు క్రైస్తవమతబోధకులు మొదట తాము మిగుల ప్రేమకలవారుగా నగుపడి, తమమతము నితరులకు బోధింతురు. వారు తమబోధవలనఁ దమమతము నవలంబింపరని వారికిఁ దెలియఁగా ననేకరీతుల వారి నవమానింతురు. ధర్మగురువు లగువారి కిది యెంతమాత్రమును తగినపని కాదు. తోడివారలు తన నట్లుచూచి సహాయ మేమియుఁ జేయకుండినను ఆనందీబాయి తనకుఁ బరమేశ్వరుఁడే సహాయుఁడని నమ్మియుండెను. పదినెనిమిది సంవత్సరముల వయసునందే

యింతటిదృఢనిశ్చయమును, ధైర్యమును, ఈశ్వరునియందునమ్మి కయుఁ గలిగి వర్తించుటమిగుల స్తుత్యముగదా!

ఇట్లు ఘూమనౌకపైఁ బ్రయాణముచేయుచు ననేకద్వీపములనుగడచి జూన్‌నాలవ తేదిని ఆనందీబాయి అమేరికా చేరెను. అచటికి ఆనందీబాయి వచ్చుచున్నవార్తవిని యదివఱకే కార్పెంటరు దొరసాని యోడనద్దికివచ్చి ఆనందీబాయి నెదుర్కొనెను. అప్పు డాయిరువురికిని గలిగిన యానంద మింతంత యని చెప్పుటకు వీలులేదు. కార్పెంటరు దొరసాని ఆనందీబాయి సద్గుణములను నేటికిని మఱవలేదు. ఇట్టిస్త్రీలుబహుసంఖ్యలో నొకరుందురని యామె యనుచుండెను.

ఆనందీబాయి అమేరికాలోని న్యూజరసీపట్టణమునకేఁగ నచట కార్పెంటరు దొరసానిగారి కుటుంబీకులందఱును ఆమెను బహుమర్యాదచేసిరి. వీరింటనుండియే ఆనందీబాయి తనచదువున కనుకూలమగు తావువెతకుకొనెను. అచటనున్ననాలుగు నెలలు వృథపుచ్చక ఆనందీబాయి కుట్టుపని, అల్లికపని జలతారుపని నేర్చుకొనెను. తదనంతర మామె ఫిలడెల్ఫియా యనుమహాపట్టణమున వైద్యవిద్య నభ్యసించునటుల స్థిరమయ్యెను.

కొందఱు పురుషులుగాని, స్త్రీలుగాని తమదేశమును వదలి పరదేశమునకరిగినపిదపఁ దమదేశాచారముల విడిచి విదేశాచారములనే స్వీకరింతురు. కాని మాచరిత్రనాయిక యట్లుకాక పాతాళలోకమునకరిగియుఁ దనదేశాచారముల మఱవక యాదేశపువారికిని వానిని నేర్పెను. ఆమె తనస్నేహితు

రాండ్రకును కార్పెంటరు నింటి వారికిని మహారాష్ట్ర స్త్రీల వలె జడలువేసి చీరెలు కట్టించుచుండెను. తాను న్యూజరసీపట్టణమున కేఁగుటకు ముందు తనస్నేహితురాండ్ర కందఱకును మహారాష్ట్రపద్ధతి ననుసరించి విందుచేసెను. ఆదిన మామె తానే తమదేశపు పక్వాన్నములు వండి భోజనములకు కూర్చుండుటకు పీటలువేసి, తినుటకు విస్తరులును దొప్పలునుకుట్టి మహారాష్ట్ర దేశాచారప్రకారము సకలపదార్థములును వడ్డించి విందారగింపవచ్చిన యువతులకు మహారాష్ట్రస్త్రీవలెఁ జీరలు, గాజులు, కుంకుము మొదలయిన వలంకరించి చేతితో భోజనము చేయువిధ మంతయు వారికిఁ దెలిపి తానును వారితోఁ గూర్చుండి భోజనము చేసెను.

తదనంతరమునం దామెను దీసికొని కార్పెంటరు దొరసాని శిలడెల్ఫియా పట్టణమున కరిగి యచట నామె కనుకూలమగునటుల నిల్లు మొదలయినవి విచారించి, మరలి తనగ్రామమునకు వచ్చెను. ఆనందీబాయియు నచట విద్య నభ్యసింపుచు స్నేహితురాండ్రఁ గలసియుండెను. అచట నామె నాలుగుసంవత్సరములు విద్యాభ్యాసముచేసెను. ఆవ్యవధిలో నామె కనేక శారీరకమానసికదుఃఖములు కలిగి యామెదేహమునానాటికి క్షీణింపసాగెను. ఆమె చదువుకొనుకాలములో హిందూదేశమునుండి యనేక స్త్రీవిద్యాశత్రువులు మిగుల హేయములగు జాబులను వ్రాసి యామెకు మిగులవిచారము కలుగఁజేసిరి. కొందఱామె పరదేశమున కరిగి స్వధర్మమును విడిచెనని యామెభర్తకుఁ జెప్పి యామెపై మనసు విఱుపఁజూచిరి. కాని వారిప్రయత్నము లెంతమాత్రమును కొనసాగినవికావు. ఇట్లు సత్కా

ర్యములకు నెట్లయిన విఘ్నములు గావింపవలయునని తలఁపుగల ధర్మాచరణపరాయణులు మనదేశమునం దున్నందుకు నెంతయుఁ జింతిల్లవలసియున్నది. అమెరికాలో నుండఁగా ఆనందీబాయి యనేకోపన్యాసముల నిచ్చి యచ్చటి విద్వాంసులను మెప్పించెను.

భార్య వెళ్లిన రెండుసంవత్సరములకు గోపాలరావుగారు బయలుదేఱి కాలినడకతో నమెరికా కరిగెను. ఆయన తనభార్య నడవడిని గనుఁగొనఁదలఁచి యామెకుఁ దెలుపకయే యకస్మాత్తుగా నచటికిఁబోయెను. కాని యామె సత్ప్రవర్తనఁ గనిన పిదప గోపాలరావు తా నామెనుగూర్చి శంకించినందునకు పశ్చాత్తాపపడెను. ఇట్లు గొప్పవిద్య నేర్చుకొని అమెరికాదేశమునకుఁ జని, మహాగౌరవమును గాంచియు విశుద్ధచరితగా నుండి యెల్లప్పుడును సంశయముతోనే యుండెడిపతిని మెప్పించిన యీపతివ్రతాశిరోమణి ప్రాతస్స్మరణీయ యనుటకు సందేహము లేదు.

నాలుగుసంవత్సరములు చదివినపిదప ఆనందీబాయి వైద్యవిద్యయందు ప్రవీణురాలని మెప్పు పొందెను. తదనంతర మాదంపతులు అచటఁ జూడఁదగిన స్థలములనుజూచి కార్పెంటరు దొరసానివద్ద సెలవుపుచ్చుకొని స్వదేశమునకు వచ్చిరి. ఆనందీబాయి అమెరికాలో నుండినకాలముననె కొల్హాపురపు సర్కారువా రామెను తమ స్త్రీవైద్యశాల కధికారిణిగా నుండుమనియు, నెలకు మూడువందలరూపాయిలు వేతనమిత్తు మనియుఁ బిదప నైదువందలవఱకు వృద్ధిపొందింపఁగలమనియు నామెకుఁ దెలిపిరి. కాన నామె యందునకు నొప్పుకొనెను. కాని

దేశముయొక్కయు, స్త్రీలయొక్కయు దురదృష్టమువలనఁ జదు
వుకొనుకాలముననే యామెకు క్షయరోగ మంకురించి క్రమ
ముగా వృద్ధియగుచుండెను. రోగముతోడనే యామె మనదేశము
నకు వచ్చెను. సముద్రప్రయాణమువలన నామె దేహము మఱిం
త యస్వస్థ మయ్యెను. బొంబాయియందును, పూనాయందు
ను, ఆమెకు ఔషధోపచారము లనేకములు చేసి చూచిరి కాని
ఫలము లేకపోయెను. తుదకు ౧౮౮౭వ సంవత్సరము ఫిబ్రవరి
౨౬వ తేది రాత్రి పదిగంటలకుఁ దా జన్మించిన పూనాయందే
యీయద్వితీయ స్త్రీ పరలోకమున కేగెను. మరణకాలమున
"నాచేత నయినంతవఱకు నేను చేసితి" నని పలికి యామె ప్రాణ
ముల విడిచెను.

చూచితిరా? యీధైర్యవతి సాహసము! ఇట్టిరత్నము
లనేకములు మా దేశమునందుఁ గలవు. కాని యారత్నములను
సానఁబెట్టి ప్రకాశింపఁజేయుటకు గోపాలరావు వంటివారు లేరు
గాన నారత్నములును రాళ్ళవలె కానిపించుచున్నవి. ఆనందీ
బాయి సద్గుణములకును, సద్విద్యకును, గోపాలరావే ముఖ్య
కారణుఁడనుట కొంతమాత్రము సందేహము లేదు. సాధారణ
ముగా మొగపిల్లలును ఆఁడుపిల్లలును వారి చిన్నతనపు చేష్టల
వలన మిగుల చెడ్డవారని యూహించుకొందురు. పురుషులు
విద్య నేర్చిన పిదప తమ యజ్ఞానమును కొంతవఱకు విడిచి
మంచివారగుదురు. స్త్రీలో, విద్య నేర్పువారు లేక యింటి
యందుఁ దల్లి ముత్తవ మొదలగువారివలెనే జ్ఞానవంతులును
సుగుణదుర్గుణములు కలవారును నగుదురు. ఆనందీబాయి చిన్న
తనమునందు మిగుల చెడ్డదిగాఁ గానుపించుచుండెను గాని

విద్యాభ్యాస మధికమయినకొలఁదిని ఆమెమనసు మాఱెను. ఆమె పరద్వీపమున కేగి యిట్టివిద్యను నేర్చివచ్చినను, గర్వ మామెను నంటఁజాలకుండెను. ఆమె చరితము గని వినినవారలు స్త్రీవిద్యాద్వేషు లయినను తమయభిప్రాయమును మాని స్త్రీ విద్యాభిమాను లగుదురనుటకు సందేహము లేదు. ఈమె చరి తము అమేరికాలోనివారును వ్రాసి మిగుల పూజ్యభావముతోఁ జదువుచున్నారు.

ఇట్లీయుత్తమసతి దేశదేశాంతరములయందుఁ గీర్తిఁగాం చి విద్యచే స్త్రీలు బాగుపడుదురేగాని చెడిపోరనియు సుగుణ ములకు విద్యకు విరోధమేగాని విద్యలేమి మైత్రిలేదనియు, స్వచ రిత్రమువలన స్థాపించి, విద్యనేర్చిన స్త్రీలందఱు ధర్మము విడుతు రనియు, పతిని మన్నింపరనియు స్వేచ్ఛంద లగుదురనియుఁ గొందఱు చెప్పెడిమాటలు ద్వేషజన్యములయిన యసత్యవా క్యము లనియు, స్థిరపఱచినందునను ఆనందీబాయి చరిత్రము నకు నేను "స్త్రీవిద్యావిజయనందాభి" యని పేరుపెట్టితిని.

# మహారాణీ ఝాశీలక్ష్మీబాయి.

భరతఖండమునందు శౌర్యమహిమవలనఁ బ్రఖ్యాతలయిన యువతీరత్నములలో ఝాశీలక్ష్మీబాయి యగ్రగణ్యరాలు. ఈమె శౌర్యాగ్ని ౧౮౫౭వ సంవత్సరమువఱకును దాఁగియుండి యాకస్మికముగాఁ బ్రజ్వలించెను. ఈమె రాజ్యము ఉత్తరహిందూస్థానము నందలి బుందేలఖండ మను ప్రదేశము నందలి యొకభాగము. ఈరాజ్యము లక్ష్మీబాయిగారి మామగారి యన్నయగు రఘునాథరావుగారి ప్రతాపమునకు మెచ్చి పూర్వము ఈపూనా పేష్వాగా రిచ్చిరి. ఆయనకుఁ బుత్రులు లేనందున ఆయనతమ్ముఁడగు శివరాంభావుగారి నభిషిక్తునిఁ జేసిరి. ఈశివరాంభావుగారి కాలమున పూనాపేష్వాల ప్రతాపము మసుగంట నారంభించినందునను, రెండవ బాజీరావుగారి రాజకార్యనిపుణత్వశూన్యత వలనను ఈయనవారి నతిక్రమించి స్వతంత్రుఁ డాయెను. కాని యింతలో నాంగ్లేయ ప్రభుత్వమెల్లెడలను వ్యాపించినందున శివరాంభావుగా రాంగ్లేయులతో సఖ్యము చేసి యనేక సమయములయం దింగ్లీషువారి కనేక విధముల తోడుపడెను. శివరాంభావుగారికి కృష్ణారావు, గంగాధరరావులను ముగ్గురుపుత్రు లుండిరి. వారిలోఁ బెద్దవాఁ డగు కృష్ణరావు తండ్రి బ్రతికియున్న కాలముననే మృతిజెందినందున శివరాంభావుగారి యనంతర మాయనకొమారుఁ డగురామచంద్రరావుగారికి రాజ్యాధికారము దొరకెను. ఈయన పరిపాలన

కాలములో పేష్వాలరాజ్యాధికార మెల్ల నింగ్లీషువారి యధీనమయినందున ఝాంశీ సంస్థానాధీశులతో నాంగ్లేయప్రభుత్వము వారికి విశేషస్నేహభావము గలిగెను. ఈయన పుత్రహీనుఁడగుటవలన నాయనంతర మాయనపినతండ్రియగు రఘునాథరావు, ఆయన యనంతర మాయనతమ్ముఁడగుగంగాధరరావును రాజ్యమును పాలించిరి. ఈగంగాధరరావు చరిత్రనాయికయొక్క భర్త.

మోరోపంతు తాంబే యనుకరాడే బ్రాహ్మణుఁడు పూనానగరమున వసియించుచుండెను. ఆయనయందు రెండవ బాజీరావు సహోదరుఁడగు చిమాజీయప్పాగారికి మిగుల విశ్వాసమును స్నేహమును గలిగియుండెను. ౧౮౧౮వ సంవత్సరమున ౮ లక్షల పింఛను పుచ్చుకొని సర్వరాజ్యమును ఇంగ్లీషువారి కిచ్చినట్టు పత్రము వ్రాసియిచ్చి రెండవ బాజీరావు బ్రహ్మావర్తమున వాసము చేయఁ జనెను. ఆసమయమునందాయన తమ్ముఁడగు అప్పాగారును తమకుఁ దొరకు పింఛనును సేవకులను తీసికొని కాశీక్షేత్రమున వసియింపఁ దలఁచి దొరతనమువారి యనుజ్ఞవడసి కాశికిఁ బోయిరి. ఆయన పరివారములోనివాఁడు. కాన మోరోపంతుతాంబే సహిత మచటికే చనెను. ఈతనిని శ్రీమంతులగు నప్పాగారికి దివానుగా నుంచి, తత్ప్రీత్యర్థము నెలకు ఏఁబదిరూపాయల వేతన మొసంగుచుండిరి.

మోరోపంతుగారి భార్యయగు భాగిరథీబాయి సద్గుణమునందును సౌశీల్యమునందును మిగుల ప్రఖ్యాతివడసెను. భార్య యిట్టి దగుటవలననే మోరోపంతుగారికి సంసారయాత్ర

బహు సుఖకరముగాఁ గడచెను. ఆభార్యాభర్త లిరువురును పరస్పరానురాగము గలవారై కాశీక్షేత్రమున వసింపఁ గొన్ని దినములకు భాగీరథీబాయి గర్భముధరించి ౧౮౩౫వ సంవత్సరము నవంబరు నెల ౧౯వ తేదిని సుఖప్రసవమై స్త్రీశిశువును గనెను. తాంబేగారి శూరవంశమునఁ గాశీక్షేత్రమున జన్మించిన కన్యారత్నమే లక్ష్మీబాయి. జాతకర్మ నామకరణమహోత్సవములు బహు సంతోషముతో నడపి మోరోపంతుగారు చిన్నదాని పేరు ''మనూబాయి'' యని పెట్టిరి. ఈ బాలిక దినదినప్రవర్ధమాన యగుచుఁ దనముద్దుమాటల వలనను, మనోహర మగుస్వరూపమువలనను జననీజనకులను, వారిపరివారమును మిగుల నానంద పఱుపుచుండెను. ఇట్టి బాలికారత్నంబు సకల జనాహ్లాదకరంబుగాఁ బెరుగుచుండ నామె మూఁడునాలుగు సంవత్సరములది యగువఱకు తన్మాత యగు భాగీరథీబాయి పరలోకగతురా లాయెను. ఈసమయమునందే యప్పాగారును కైలాసవాసు లగుటవలన మోరోపంతుగా రచటనుండి బ్రహ్మావర్తమునకుఁ బోవ తటస్థించెను. అచట బాజీరా వీమెను మిగుల ప్రేమించి కుటుంబసంరక్షణ చేయుచుండెను.

మనూబాయికి బాల్యమునందే జననీవియోగము తటస్థించినందున నామె తండ్రిగారి పోషణలోనే యుండుచు, నెల్లప్పుడు ఆయనను విడువక పురుషులలోనే సదా తిరుగుచుండెను. తల్లిలేని పిల్లయగుటవలనను, సుస్వరూప మధురభాషిణి యగుటవలనను శ్రీమంతులవద్ద నుండువా రందఱును మనూబాయిని మిగుల గారాబము చేయుచుండిరి. పేష్వాగారిదత్త

పుత్రులగు నానాసాహేబు, రావుసాహెబు లాకాలమునందు బాలురేగాన వారితో నీ చిన్నది సదా కలసి మెలసి యుండుచు వచ్చెను. నానాసాహేబేమి నేర్చిన నది మనూబాయి నేర్చుకొనుచు, వారిద్ద అన్న చెల్లెలివరుసలతోఁ బిలుచుకొనుచుండిరి. చదువు, అశ్వారోహణము, ఖడ్గముత్రిప్పుట మొదలయినవన్నియు మనూబాయి నానాసాహేబుగారితోడనే నేర్చుకొనెను. ఈమె స్వభావము బాల్యమునుండియే శౌర్యగుణప్రధానముగా నుండెను. దీని కంతకు క్షత్రియాగ్రగణ్య గుణములుగలశూరుల సంసర్గమే కారణము. ఇందువలన స్త్రీలు స్వభావముచేతనే పిఱికివారనియు, వారికి శౌర్యధైర్యము లెన్నివిధములను పట్టువడనేర వనియు వాదించు విద్వాంసులకు సంశయనివృత్తి కాఁగలదు. స్త్రీలకును పురుషులవలెనే బాల్యమునుండి యెట్టిసంస్కరణ జరుగునో యట్టిగుణములే యబ్బునని సిద్ధమగును.

ఇట్లుండ నొకనాఁ డాకస్మికముగా ఝాఁశీ సంస్థానమునందలి జ్యోతిష్కుఁడగు తాత్యాదీక్షితులు బాజీరావును సందర్శింపవచ్చెను. ఆదీక్షితులతో సందర్భానుసారముగా మోరోపంతుగారు ఝాఁశీవైపున నీచిన్నదానికి వరుఁడు కుదురునాయని విచారించెను. అందు కాయన "ఝాఁశీ సంస్థానాధీశ్వరుఁ డగు గంగాధరరావు బాబాసాహేబుగారికిఁ బ్రథమపత్ని యగురమాబాయి కాలధర్మము నొందెను. కాన నీ కొమార్తె కాసంబంధము విచారింపు" మని చెప్పెను. తదనంతర మీవివాహమునుగుఱించి బాజీరావు గంగాధరరావునకుఁ దెలుపఁగా నాతఁడు సమ్మతించెను. లగ్ననిశ్చయమైన పిదపఁ

గొందదాప్తులతో మోరోపంతుగారు ఝాంశీకి వెళ్ళిరి. అచటనే ౧౮౪౨ వ సంవత్సరమున మనూబాయి వివాహము మిగుల వైభవముతో జరిగెను. వివాహానంతరమునందు దేశాచారప్రకారము అత్తవారిచ్చిన దానికి 'లక్ష్మీబాయి' యను పేరుపెట్టిరి. మామగారగు మోరోపంతు తాంబేగారికి ౩౦౦ రూపాయల వేతన మిచ్చి గంగాధరరావుగారు తమయాస్థానమునందొక సరదారుగా నుంచినందున లక్ష్మీబాయి మరల బ్రహ్మచర్యమున కరుగుట తటస్థించినది కాదు.

గంగాధరరావుగారి యన్నగారగు రఘునాథరావుగారి పరిపాలనలో రాజ్యము విశేష దుస్థితికి వచ్చినందున నారాజ్యాధికారమును పూర్ణముగా దొరతనమువారే స్వాధీనపఱచుకొని రాజ్యమునకుం గల ఋణములను దీర్చుచుండిరి. లక్ష్మీబాయి వివాహానంతరము గంగాధరరావుగారి యోగ్యతను గని బుందేలుఖండముయొక్క పొలిటికల్ యేజంటగు కర్నల్ స్లీమన్ దొరగారు సర్వ రాజ్యపాలనమును గంగాధరరావుగారి స్వాధీనము చేయించిరి.

గంగాధర రావు తనప్రజలను సుఖులనుగాఁ జేయనెంచి రాజ్యమును బహునిపుణముగాఁ బాలింపుచుండెను. ఈయన కాలమునందు ఋణము లన్నియుఁ దీఱి భాండాగారమున ధనము దినదినాభివృద్ధిఁ బొందుచుండెను. ప్రజలును మిగుల సుఖులై యుండి సదా రాజును, రాణిని దీవింపుచుండిరి.

ఇట్లు కొన్నిరోజులు సౌఖ్యములోఁ గడచిన పిదప లక్ష్మీబాయిగారి దుఃఖమునకుఁ బ్రారంభ మయ్యెను. ఆమెకొకపుత్రుఁడు గలిగి మూడుమాసములు జీవించి మృతిఁ జెం

డెను. గంగాధరరావు మహారాజుగారి మనస్సునందు పుత్రశోక మధికమయినందున ఆయన నానాటికి క్షీణించి, వైద్యోపచారములవల్ల నసుమనసుమ కొంచెము స్వస్థపడుచుండెను. ఇట్లు కొన్ని దినములు గడచినపిదప ౧౮౫౩ వ సంవత్సరము ఆక్టోబరు నెల నుండియు నాతనిశరీరము మఱింత క్షీణింపసాగెను. అనేక రాజవైద్యులు సదా సమీపమునందుండి మహౌషధోపచారములు చేయుచుండిరి. కాని యెంతమాత్రమును సుగుణ మగుపడ జూడ గానరాకపోయెను. నవంబరు ౨౧ వ తేది నుండి గంగాధరరావు ప్రకృతియందు వికారచేష్ట లనేకములు కానిపించుచువచ్చెను. అందువలన సంస్థానపుమంత్రి యగు నరసింహరావును మోరోపంతు తాంబేగారును గలిసి ముందు సంస్థానవ్యవస్థనుగూర్చి మహారాజులుంగారితో ముచ్చటించిరి. వారి ప్రసంగమును వినినపిదప దన కిప్పుడే రోగ మసాధ్యముగా లేదనియు, ముందసాధ్యమగునేని తమవంశమునందలి ఆనందరావును తనకుం దత్తపుత్రునిగాం జేసి యనంతరం మా చిన్నవాఁడు స్వరాజ్యభారశకుం డగువఱకును వానిపేరిట లక్ష్మీబాయియే రాజ్యముం బాలించవలయుననియుం జెప్పెను. అందుపై వారందఱాజ్ఞమునసే ముహూర్తనిశ్చయము చేసి త్వరలోనే శాస్త్రోక్తముగా దత్తవిధి నడిపిరి. ఆమహోత్సవమునకు ఝాశీయందలి యనేకప్రముఖులను బిలిచిరి. వారితోడనే బుందేలఖండ్ పొలిటికల్ అసిస్టెంటు యేజంటగు మేజర్ యేలీసు దొరగారిని, సేనాధిపతియగు క్యాప్టెన్ మార్టిన్ దొరగారిని బిలిచిరి. వీరందఱి సముఖముననే దత్తవిధానము జరిగి ఆనందరావుపేరు దామోదరరావని పెట్టిరి.

ఇట్లు దత్తవిధానమయినపిదప గంగాధరరావుగారు దివానుగారిచే నొకవిజ్ఞాపన పత్రము హిందూస్థానపు దొరతనమువారికి వ్రాయించి దానిపై తమవ్రాలు చేసి దానిని తమ హస్తములతో పొలిటికల్ అసిస్టెంటుగారి కిచ్చిరి. అందులోఁ బూర్వ మింగ్లీషు వారు తన తండ్రిగారితోఁ జేసిన కరారు ప్రకారము తమ వంశపారంపర్యముగా రాజ్యము దొరకవలయుననియు, తనకు నౌరససంతతి లేనందున నొక దత్తపుత్రుని స్వీకరించితిననియు, దొరతనమువారు దత్తవిధానమునకు సమ్మతించి వానికి రాజ్యమొసంగి వాఁడు పెద్దవాఁడగువరకు వానిపేర తన పత్నియగు లక్ష్మీబాయి పాలించునట్లు చేయుఁడనియు వ్రాసిరి. విజ్ఞాపనపత్రిక వ్రాసిన దినముననే గంగాధరరావు పరలోకగతుఁడయ్యెను. కులాచార ప్రకారము రాజుగారికి ప్రేతవిధులన్నియు జరుపఁబడెను. తదనంతరమునఁ గొన్ని దినంబులకు లక్ష్మీబాయి సర్వానుమతంబున దత్తపుత్రునకు రాజ్యమిమ్మని దొరతనమువారికొక విజ్ఞానపత్రికను వ్రాసెనుకాని యామె యుద్దేశ్యము సిద్ధించినదికాదు.

ఆవిజ్ఞాపన ప్రకారము దొరతనమువారు దమదత్తతను స్వీకరించి రాజ్యమిత్తురని ఝాన్సీసంస్థానమున నందఱును కొండంతయాసతోడ నుండఁగా ౧౮౫౪వ సంవత్సరము మార్చినెల ౧౬వ తేదిని దత్తవిధానము దొరతనమువా రంగీకరింపక రాజ్యమును తామె స్వాధీనపరచుకొనిరనిన సంగతి తెలిసెను. కాన లక్ష్మీబాయికిఁ బతివియోగ దుఃఖమునకుఁ దోడు రాజ్యవియోగ వ్యసనము సంప్రాప్తమాయెను. దొరతనము

వారు రాజ్యమును తాముస్వాధీన పఱచుకొని పశ్చిమోత్తర పరగణా గవర్నరుగారికచటి రాజ్యము నడుప ననుజ్ఞ ఇచ్చిరి. వారు రాజ్యము స్వాధీనపరచుకొని రాజ్యమునకును రాజ కుటుంబమునకు నిట్లు కట్టుబాట్లు చేసిరి.

గ్రామమునం దున్న రాజభవనము రాణిగారి కుండుటకుఁగా నిచ్చి కిల్లా తాముతీసికొనిరి. మిగిలినసంస్థానమునందలి నగలు మొదలగు ధనమంతయుదత్తపుత్రునకు మైనారిటీ తీరిన వెనుక నిచ్చుటకుగాను తమయొద్దనే దాఁచిరి. రాణిగారు జీవించియుండునంతవఱకు (౫౦౦౦ అయిదువేలరూపాయ) లామెకు నెలవేతనముగా నేర్పరచి యాతవఱకును ఆమెపైఁ గానిఁ యామె యితర భృత్యవర్గము పైఁగాని తమచట్టములు నడువఁగూడ దనియు వ్రాసయిచ్చిరి.

అందుకు ముందున్న రాణిగారి సైనికులకు విశ్రాంతిఁ గలుగఁజేసి వారికి బదులుగా దనసేన నుంచిరి.

రాణిగారికి అయిదువేలరూపాయల వేతన మిత్తుమని దొరతనమువారు వ్రాయుటయేగాని తనరాజ్యముతనకు దొరకవలయు నన్నయుత్కటేచ్ఛగల రాణిగా రాయల్పాంశమును మరణపర్యంతమును స్వీకరించినవారు కారు. అంత నూరకుండక లక్ష్మీబాయి సీమలో నపీలు చేయఁ దలఁచి ఉమేశచంద్ర బానర్జీయనువంగదేశీయునిని నొక ఆంగ్లేయప్లీడరును ఆఱు లక్షలరూపాయ లిచ్చి యింగ్లండునకుఁ బంపెను. కాని, వార చటికరిగి యేమి చేసినదియు నెచట నున్నదియు నేఁటివఱకును దెలియదు. వారచట ననేకోపాయములఁ జేసెదరనియు వారి

ప్రయత్నములవలనఁ దనకు రాజ్యము మరల ప్రాప్తించుననియు రాణిగారికి మిగుల నమ్మిక ముండెను.

౧౮౫౫వ సంవత్సరమున దామోదరరావుగారికి నుపనయనము చేయఁదలఁచి ఆప్లిలని పేర దొరతనమువారు దాఁచియుంచిన ౬ లక్షల రూపాయలలోనుండి యొకలక్ష రూపాయలిండని రాణిగారు దొరతనమువారిని నడిగిరి. అందుకువారు నీవు దీనికొఱకెవరినైన జామీనుంచినంగాని యియ్యమనఁగా నదేప్రకారము వారుకోరినవారి జామీనిచ్చి లక్షరూపాయలు తీసికొని, యాసంవత్సర మాఘమాసమునందు మహావైభవముతోఁ గుమారుని యుపనయనము చేసెను. తన భర్త సొత్తు పుత్రుని యుపనయనమునకుఁ దీసికొనుటకుఁగాను పరుల జామీను కావలసినందుకు రాణిగారి మనస్సెంత ఖేదపడి యుండెనో చదువరులే యోచింపఁగలరు.

ఇట్లు రాణిగారిత్యంతదుఃఖముతోఁ గాలము గడుపుచుండఁగా ౧౮౫౭వ సంవత్సరమున హిందూపటాలము లింగ్లీషువారిపైఁదిరుగఁబడిన భయంకరకాలము ప్రాప్తించెను. ఈ యుద్ధ మితిహాసప్రసిద్ధమేగానతిహాసజ్ఞుల కందఱకు విదితమే.

పటాలములు తిరగఁబడిన యీవర్తమానము ఝాన్సీలోని హిందూపటాలములకుఁ దెలిసి యదివఱకడఁగియున్న ద్వేషాగ్ని ప్రజ్వలింప జూన్ నెల ౧వ తేదిని వారును బందిపోటునకు ప్రారంభించిరి. వారి సేనానాయకుఁడు వారిని సన్మార్గమునకుఁ ద్రిప్ప నెంతయత్నించినను వారుతిరుగకుండిరి. అదిగని యతఁడు గ్రామమునందలి యాంగ్లేయుల నందఱును మిగుల భద్రమగు కిల్లాలోని కరుగుఁడని గుప్తరీతినిఁ దెలుపఁగా వారా

ప్రకార మచటి కరిగి కోటద్వారముల మూసికొనిరి. కాని మరుసటిదినముననే యా తిరుగఁబడిన పటాలములవారు సేనలో మొనగానిఁ జంపి యుప్పొంగి కిల్లాను చుట్టుముట్టి బహుప్రయత్నముల నచటివారి నీవలకుఁదీసి యతిక్రూరులై వారినందఱి నేకక్షణముననే యమసదనమున కంపిరి. వారట్లాయూర నొక యాంగ్లేయ శిశువు సహితము లేకుండఁ జేసి ఝాఁశీరాజ్యము మహారాణీ లక్ష్మీబాయిగారిదని ధ్వజమెత్తిరి. అప్పటినుండి రాణిగారు పటాలములతోఁగలిసి స్వతంత్రించి ఝాఁశీసంస్థానమున తనరాజ్యమును స్థాపించ యత్నించఁ దొడఁగెను. ఆనాలుగు రోజుల నయినరాణిగారు రాజ్యవ్యవస్థ మిగుల నిపుణతఁ జేసిరి. ఆమె తననేర్పువలననే యేపనుల కెవ్వరెవ్వరు యోగ్యులో యాయాపనులకు వారివారిని నియమించెను. కాని పూర్వపు ఉద్యోగస్థులను దొరతనమువారిదివఱకే తీసివేసినందున రాణిగారికిఁ దగినయుద్యోగస్థు లాసమయమున దొరకకుండిరి. అయినను ఆమె తనవలన నగునంతవఱకును సిద్ధపఱచి మార్గసంరక్షణనిమిత్తము క్రొత్తసైన్యమును సిద్ధపఱచెను.

ఝాఁశీరాజ్యము మహారాణీ లక్ష్మీబాయిగారు పాలింపుచున్న సంగతి విని వారి వాశీకుఁడగు సదాశివనారాయణ యనునాతఁడు ఝాఁశీ సమీపముననున్న కరేరాయను దుర్గమును వశపఱచుకొని యచటఁ దాను ఝాఁశీరాజ్యాభిషేకముఁ గావించుకొనెను. అబలయగు రాణిగారు రాణివాసమునందుండునదిగాన నామె తనకు లొంగునని తలఁచెను. కాని రాణిగారు సబలయై సైన్యమునంపి యాతనిఁబట్టి తెప్పించి ఝాఁశీ కిల్లాలో బంధించి యుంచెను.

ఇట్లొకశత్రుని బరిమార్చునంతలో రెండవశత్రుఁ డుత్పన్న మాయెను. ఝూఁశీకి సమీపమునందున్న ఓరచాసంస్థానపు దివాను, నథేఖా యనువాఁడు విశేషసైన్యముతోఁడ దాడివెడలి రాణిగారి కిట్లు వర్తమాన మంపెను "మీకిదివఱ కాంగ్లేయప్రభువు లిచ్చుజీతము మే మిచ్చెదముగాన రాజ్యమును మా స్వాధీనము చేయుఁడు" ఈవార్త విని రాణిగారి ప్రధాన సామంతు లందఱును భయభీతులయి మనసు కంపించెను నిచ్చిన యెడల సంగ్రామముతోఁ బనిలేదనియు వారితోఁ యుద్ధము చేసి గెలుచుట సాధ్యము కాదనియుఁ జెప్పిరి. కాని యసామాన్యశౌర్యముగల రాణిగారు వారిమాటలను వినక యాశత్రువున కిట్లు వర్తమానమంపెను. "ఆంగ్లేయులు సార్వభౌములు. వారు నిగ్రహానుగ్రహములకు సమర్థులు. వారితోఁ సమానులు కానెంచి యాజీత మిచ్చెద ననెదవు. కాన నీవంటి వారింక పదుగురు వచ్చినను స్త్రీనగు నేను వారినందఱిని పౌరుషహీనులఁ జేయఁజాలుదు ననఁగా నిన్ను లెక్కింప నేల" ఇట్టివార్త నథేఖానుకుఁ దెలిసినవెంటనే పట్టరానికోప ముప్పతిల్ల నతివేగముగా వాఁడు ఝూఁశీని సమీపించెను. లక్ష్మీబాయిగారును నట్లు వర్తమానమంపి సంగ్రామమునకు సిద్ధముగానుండెను. అప్పుడామె తాను పురుషవేషముతో సేనాపతిత్వము వహించి ఘోరయుద్ధముచేసి నథేఖాను నోడించి వానియొద్దనుండి లక్షలకొలఁది ధనముఁగొని వానితో సంధి చేసెను.

మహారాణి లక్ష్మీబాయిగారి పరిపాలన మల్పకాలమె యైనను ప్రజలకు మిగుల సుఖకరముగా నుండెనఁట. కాన

వారును రాణిగారి శుభమునే కాంక్షించుచుండిరి. లక్ష్మీబాయి గారికి పురుషవేషముతో దరబారుచేయుట, అశ్వారోహణము చేయుట మిగుల ప్రియము. కాన నామె యనేకసమయముల యందుఁ బురుషవేషముతోడనే యుండుచుండెను. సాధారణముగా నామె స్త్రీవేషముతో నుండినను అలంకారము లేమియు ధరియింపక శ్వేతవస్త్రమునే కట్టుకొనుచుండెను.

రాణిగారికి బీదలపై నధికప్రేమ యుండెను. ఒకనాఁడామె మహాలక్ష్మీదర్శనమునకుఁ బోయి వచ్చునపుడు కొందఱు బీదలు మూఁకలుగా నామె నడ్డగించిరి. దానికారణ మడుగఁగా వారు మిక్కిలి చలివలన బాధపడుచుండినందున వస్త్రదానము నపేక్షించి వచ్చిరని రాణిగారికిఁ దెలిసెను. అందుపై నామె వారందఱికిని టోపీలు, అంగీలు, గొంగళ్లు మొదలగునవి యిప్పించెను.

మధ్యహిందూస్థానమంతయు నించుమించుగా బండిపోటు సైన్యముల స్వాధీనమయినందున నప్పటి హిందూస్థానపు గవర్నర్ జనరల్ లార్డు క్యానింగు దొరగారు ఇంగ్లాండు దొరతనమువారి యనుమతిఁగొని యింగ్లండునందలియు, హిందూస్థానమునందలియు ప్రవీణులగు సేనానాయకులను రప్పించి రాజభక్తిగల యితర సైన్యములను, సహాయార్థ మరుదెంచిన యితర భూపతుల సైన్యములను వారిపరముచేసి యాప్రచండ సేనను నడుపుటకు యుద్ధకళావిశారదుఁడగు సర్ హ్యూరోజ్ దొరగారిని నియమించి ఆయనకు సర్వసేనాధిపత్య మిచ్చెను.

౧౮౫౭వ డిసంబరు ౧౭వ తేదిని సర్ హ్యూరోజ్ దొరగారు సేనానాయకత్వము స్వీకరించిరి. యుద్ధమునకు

బోవుమార్గమును విచారించి వేరువేరుమార్గముల సైన్యములు నడువవలిసిన క్రమమును దెలిపెను క్రమక్రమముగా సర్ హ్యూరోజ్ దొరగారు తమసంగ్రామ కౌశలమందఱునుం గొని యాండ బందిపోటుసైన్యముల పాలయిన భూము లనేకములు గెలిచి, ఝాంశీని గెలుచుతలంపున నచటికి ౧౪ మైళ్ళ సమీపమున తనసైన్యములను విడియించిరి. వారచటనుండి ఝాంశీ వర్తమానముల నరయుచు, ౧౮౫౮వ మార్చి ౨౦వ తేదిని ఝాంశీ పొలిమేరం బ్రవేశించి పురరచన నరసి తదను సారముగా సైన్యములను యుద్ధమున కాయత్తము చేసిరి.

అప్పుడు శౌర్యరాశియగు రాణిగా రాగ్రహించి యిఁక నింగ్లీషువారితో పొసఁగదని తెలిసికొని యుద్ధసన్నాహము చేయసాగెను. నదేఖాంతోడ రణ మొనర్చునపుడుంచిన విశేష సైన్యమున కనేకస్థలములనుండి పరతెంచివచ్చిన బందిపోటు సైన్యములు తోడుపడెను. రాణిగారి సైనికులలో శూరులగు ఠాకురులోకులును, విశ్వాసార్హులగు పఠాణులును విశేషముండిరి. ఆసేనాధిపత్యమునంతను రాణిగారు తామే స్వీకరించి తగినబందోబస్తు చేయసాగిరి. ఝాంశీకోట మిగుల విశాలమైనదియు, నభేద్య మగునదియునై యుండెను. అచట గొప్ప గొప్పబురుజు లుండెను. ఆకిల్లాలో విశేషదినములనుండి నిరుపయోగములై యున్న యనేకఫిరంగులను రాణిగారు బాగు పఱచి బురుజులపై కెక్కించిరి. ఒక్కొక్కఫిరంగి కొక్కొక్క యుద్ధకళానిపుణుని నియమించిరి ఇట్లామె తననేర్పుమెయి సేనలను నడుపుచు యుద్ధసన్నద్ధురాలాయెను.

ఈప్రకార ముభయసైన్యములును యుద్ధసన్నద్ధములై 23వ తేదిని సంగ్రామమున కారంభించిరి. ఆదినము శత్రువులు ఝాంశీకిల్లాను సమీపింప యత్నించిరి. కాని కోటలోని వారి యాగ్నేయ బాణప్రవృష్టి వారి కసహ్యమయినందున సమీపింపఁజాలక పోయిరి. ఆరాత్రి యింగ్లీషు సైనికులు కొందఱు గ్రామము సమీపించి యచట నాలుగుస్థలముల బురుజు లేర్పఱచి వానిపై పిరంగుల నుంచిరి. ఝాంశీలోనివారును ఆరాత్రి యంతయు యుద్ధప్రయత్నమే చేయుచుండిరి. 24వ తేదినాఁడు సహిత యింగ్లీషుసైన్యంబులే దైన్యంబు నొందెను. 25వ తేది ప్రాతఃకాలముననే యింగ్లీషు సైన్యంబులనుండి కిల్లాపైనిని, పురముపైనిని శతముఖ బాణవృష్టి కానాఁగెను. ఆగోళమొకటి వచ్చి శత్రుసైన్యములోఁబడి పగిలి నలుగు రైదుగురినిఁజంపి పదిమందిని గాయపఱచుచుండెను. కాని నాదిన మాపట్టణము నందెచటఁజూచినను హాహాకారములే వినఁబడుచుండెను. ప్రజలన్నాహారములకై తిరుగఁ జాలకుండిరి. వారి దైన్యమును గని రాణిగారు వారికొఱకొకయన్నసత్రము నేర్పఱిచిరి. ఆంగ్లేయ సైన్యంబులనుండి నారాయణాస్త్ర తుల్యములగు గోరమువలన తనసైన్యంబులు దీనముఖంబు లగుటఁగని లక్ష్మీబాయి యింతటికిని ధైర్యమువదలక సైనికుల కుత్సాహమును గలుగఁజేసి యాంగ్లేయసైన్యములను ధిక్కరించెను. ఇట్లీయుభయసైన్యములును బీరువోవక మార్చి 30వ తేదివఱకును సంగ్రామం బొనర్చుచుండెను. ప్రతిపక్షులగు ఆంగ్లేయసైన్యమున కనేక సేనానాయకులుండి నడుపుటవలనను, సైనికు లదివఱకే

యుద్ధమున కనుకూలమగు శిక్షను గఱచియుండుటచేతను వారి సైన్యములు చెదరక యుద్ధముచే గెలుపొందుట యొక వింత కాదు. ఇఁక రాణిగారిసైన్యము లన్ననో యుద్ధశిక్ష నెఱుఁగనట్టి బందిపోటు వారితోఁ గలిసి జనసంఖ్య కెక్కువగాఁ గానుపించినను, వారలంద ఱొకప్రకారము యుద్ధము చేయఁజాలనందున విశేషముగాఁ జెదరుచుండిరి. ఇంతటి విశేషసైన్యమునకంతకును రాణిగారే సేనా నాయకత్వము వహించి నడుపుట బహుదుర్ఘటమని యందఱకును దెలిసినదే. అయినను ఆవీర వనిత తనబుద్ధిచాతుర్యమువలనను, శౌర్యసంపదవలనను ప్రఖ్యాతులగు ఆంగ్లేయ సేనా నాయకులతోఁ బ్రతిఘటించి యుద్ధభూమిని నిలిచి యనేకదినములు సంగ్రామము సల్పి వారిచే 'నీమెను గెలుచుట దుర్ఘట' మనిపించుట మిగుల వింతగదా?

ఆ యుద్ధసమయమునందు రాణిగారు సైన్యమం దంతటను తనదృష్టి నిగిడింపుచు నచటఁ గలకొదవలను దొలఁగింపుచు సైనికుల కనేక బహుమానము లిచ్చుచు, యుద్ధధర్మములను దెలుపుచు వారిని యుద్ధమునకుఁ బురికొల్పి వారి మనంబుల వీరరస ముద్భవిల్లఁ జేయుచుండెను. అప్పు డామె మిగుల జాలిపడి వచ్చినవారికి కామె సమక్షముననే చికిత్స జరిగింపుచుండెను. అప్పు డామె మిగుల జాలిపడి వారిపైనుండి తన హస్తమును త్రిప్పఁగా నాసైనికు లధికావేశపరవశులయియుద్ధము చేయ నుంకింపుచుండిరి. ఇట్టిస్త్రీరత్నములు జన్మించుటవలననే కదా స్త్రీలకును, పురుషులను బోలిన ధైర్యశౌర్యములు గలవని యందఱకును దెల్లంబయ్యె.

ఇట్లు ౩౧వ తేదివఱకును యుద్ధము జరిగినను ఆంగ్లేయ బలంబులు రాణిగారికోటను భేదింపఁ జాలవయ్యె. ఈరణరంగమునందు వారియుద్ధసామగ్రి యంతకంతకుఁ దక్కువగుట వలన వారు జయమునం దంతగా నమ్మకములేక యుండిరి. ఇంతలో నానాసాహేబు* పేష్వాయొక్క సేనానాయకుఁడగు తాంతాటోపేయను వీరుఁడు లెక్కకెక్కువయగు సైన్యముతో రాణిగారికిఁ దోడుపడుటకై కాల్పినుండి వచ్చుచుండెను. ఆసైన్యము బహుదూరమున నుండఁగానే యాంగ్లేయ సేనానాయకులు దూరదర్శకయంత్రమువలనఁ గనిరి. అంత నగ్నిదేవునకు వాయుదేవుఁడు సహాయ మగునటుల నీరాణిగారికి నాసైన్యమువచ్చి తోడుపడిన మనజయ మసత్య మనుకొనిరి. సర్ హ్యూరోజ్ దొర యంతమాత్రమున జంకక యిచట రాణిగారితోఁ బెనఁగఁ గొంతసైన్యమును నియమించి కోటలోనివారెఱుఁగకుండఁ గొంతసైన్యమును కాల్పిమార్గమున కంపెను. వారు చని యాత్రోవ వచ్చుచున్న విపులసైన్యములతోఁ బెనఁగి తమయుద్ధ సామర్థ్యమువలన వానినిఁబాఱఁ దోలిరి. తాంతాటోపేసైన్యముల వారికోర్వఁజాలక తమ యుద్ధసాహిత్యము నచటనే విడిచి పలాయితము లయ్యెను. కాన నాసాహిత్య మనాయాసముగా దొరకినందున సర్ హ్యూరోజ్ గారి బలంబులు మిగుల నుత్సాహము గలవయ్యె.

* నానాసాహేబు (రెండవ) బాజీరావు దత్తపుత్రుఁడు. ౧౮౫౭వ సంవత్సరపు సిపాయిల స్వామిద్రోహమునకు నితఁడే పురస్కర్త. ఇంగ్లీషు వారియొద్దనుండి తన పూనారాజ్యము మరల సంపాదించవలయునని యితని యత్నముండెను.

వారికి నిదివఱకుఁ గలయధైర్య మంతయు నడుగంట శత్రువుల పై నధికోత్సాహముతో తప్తగోలవర్షముఁ గురిపింపసాగిరి.

ఏప్రియల్ ౨వ తేది వఱకును యుద్ధము చేసియుఁ దాము పురప్రవేశము చేయలేకుండుటకు మిగుల చింతిల్లి సర్ హ్యూరోజ్ దొరగారు తనబుద్ధి ప్రవీణతవలన నాదినమున నాకిల్లాను చేకొనఁదలఁచిరి. ఆయన తదనుసారముగా బలంబుల నంప వారును మిగుల నుత్సాహముతో శత్రుపక్షమునుండి వచ్చు బాణములను సైచి గ్రామద్వారములనుండియుఁ, గోటగోడనుండియుఁ బురముఁ జొరసాగిరి. తాతాటోపే గారి పరాభవమును విని రాణిగారి సైనికులు మిగులనిరుత్సాహులైరి. అయినను యుద్ధమునందుఁ దెగఁగా మిగిలినవారికి రాణిగారుతన వాక్యమువలన శౌర్యము పుట్టించి సంగ్రామము నడుపుచుండెను. ౩వ తేదిని తమ్ము నెదిరించువారు లేక హూణబలంబులు పురమంతటను వ్యాపించెను. ౪వ తేదిని పట్టణమంతయు వారి స్వాధీనమాయెను.

తానిన్ని దినంబులు చేసినశ్రమ వృధయైపోవ శత్రువులు తననగరము నాక్రమించుటఁగని రాణిగారు మిగుల విచారపడెను. కాని యామె యంతటిలోనైన ధైర్యము విడువక కర్తవ్యము నాలోచించి జయోత్సాహులగు శత్రువు లింక తన కిల్లా నాక్రమించి తనను బాధింతురని కని యామె యెట్లయిన రణరంగమున ప్రాణములు విడువ నిశ్చయించెను. అంత నామె పురుషవేషముతో బయలుదేర నిశ్చయించి తనదత్తపుత్రుని యం దధికప్రీతి గలదిగాన నాచిన్నవానిని తనమూపునఁ గట్టుకొని అశ్వారోహణముచేసి నాల్గవతేదిరాత్రి స్వల్పసైన్యము

తో నాంగ్లేయసైన్యంబులతోఁ బెనఁగుచు దానిఁ బాయఁగాఁ జీల్చికొని కాల్పీమార్గమున నరిగెను.

రాణీగారు తనసైన్యములలో నుండి కాల్పీమార్గమున వెళ్లిన సంగతి విని సర్ హ్యూరోజ్ దొరగారు సఖేదాశ్చర్యమగ్నులయిరి. ఆయన యంతటితో నూరకుండక యొకసేనానాయకునిఁ గొంత సైన్యసహితముగా నామెను వెంబడింప నంపెను. కాని రాణిగారు వారికి దృగ్గోచరముగాక తనగుఱ్ఱము నతిత్వరగా నడుపుచుండెను. జన్మాదిగా యుద్ధమన్న మాట యెఱుఁగక సదా రాణివాసమునందు వసియించు బ్రాహ్మణవితంతువు వీరుల కభేద్యమగుహూణసైన్యమును భేదించుకొని క్షణములో నదృశ్యయగుట కెవ్వ రాశ్చర్యపడకుందురు ?

మహారాణీ లక్ష్మీబాయిగారు రాత్రి బయలుదేరి తనను బట్టవచ్చువారికిదృగ్గోచరయుఁగాక సూర్యోదయమునకుఁ ఝాంశీ సంస్థానమునకు సరిహద్దయిన భాండేరయను గ్రామమునఁ బ్రవేశించెను అచట నామె గుఱ్ఱమును దిగి కొమారునకు ఫలాహారముఁ బెట్టి మరల నశ్వారోహణము చేసెను. ఇంతలో నాంగ్లేయసైన్యాధిపతి కొంతసైన్యముతోఁ దనను బట్టవచ్చెననియామె వినెను. ఆసమయమునం దామెయొద్దఁ బదునైదుగురుశూరులు దప్ప వేరుసైన్యము లేదు. అట్లయ్యును ఆశూరశిరోమణి జంకక తనఖడ్గము నొరనుండి తీసి యుద్ధసన్నద్ధయైచనుచుండెను. ఇంతలో నాసైనికు లామెనుముట్టడించిరి. కాని యామె తనయుద్ధనైపుణ్యమువలన నాసైనికులను వీకాకు పఱచి కొందఱని యమసదమునకనిచి క్షణములో నదృశ్య యయ్యెను. బహుసైన్యసమేతముగా నున్న యాంగ్లేయ సేనాధ్యక్షుని

స్వల్పసైనికులతో నొకయబలనోడించి పంపుటయెంతయు వింతగదా! అచటినుండి బయలుదేరి యారాత్రియామె కాల్పీనగరమున నానాసాహేబునొద్దఁ బ్రవేశించెను. ఇట్లు నిద్రాహారములు లేక యామె యశ్వారోహణము చేసి ౧౦౮ మైళ్ళు ప్రయాణముచేసెను. దీనినిబట్టిచూడఁగా నామెధైర్యమును అశ్వారోహణశక్తియు నందఱికి నత్యద్భుతమని తోఁచక మానదు.

రాణీలక్ష్మీబాయిగారు కాల్పీకి వచ్చినసంగతి విని బండేవాలానవాబుసహితము తనసైన్యములతో రావుసాహేబు పేష్వాగారికి సహాయుఁ డయ్యెను. వీరందఱునుతమసైన్యముల యుద్ధసన్నద్ధములుగాఁ జేయుచుండిరి. రాణిగారిశౌర్యము నెఱిగియు రావుసాహేబు పేష్వా గారు తనకుఁ గలస్వాభిమానము వలనఁ దనసర్వసేనాధిపత్యమును నొకస్త్రీ కిచ్చుటకు సమ్మతిపడఁడయ్యె. కాన రాణిగారు కొంతవఱకు యుద్ధమునందు నిరుత్సాహు రాలయియుండిరి.

సర్ హ్యూరోజ్ దొరగారు ఝూఁశీనుండి బయలుదేరి కాల్పీని గెలుచుటకై యుసైన్యసమేతముగా రాత్రిం దినప్రయాణములు చేయుచు కాల్పీ సమీపమునందలి కూచయనుగ్రామమున పేష్వాగారి సైన్యముల నెదిరించిక్షణములో నోడించిరి. కాన పేష్వా, బండేసంస్థానపు నవాబు మొదలగువారితో రాణిగారు కాల్పీకి వెళ్ళవలసివచ్చెను. ఆసమయమునందామె సొంత సైన్యము లేనందున పేష్వాగా రామెను మన్నింప నందునను ఈయుద్ధమునందామె ప్రతాప మేమియుఁ దెలిసినదికాదు. కాని కాల్పీకి వెళ్లినపిదప నామెసైన్యము బందోబస్తునుగురించి తనయభిప్రాయము పేష్వాగారికిఁ దెలిపెను. అప్పుడాతఁడు

లక్ష్మీబాయిగారి తెలివిని గని తాతాటోపిని లక్ష్మీబాయిని సర్వసైన్యాధిపత్యమునకు నియమించెను. అందుపై వారిరువురు మిగుల దక్షతతో సైనికులకు యుద్ధము గఱపుచుండిరి. ఇంతలో నాంగ్లేయసైన్యంబులు కాల్పీనగరము నలుప్రక్కల ముట్టడించెను. అప్పుడు రెండువందలగుఱ్ఱపుబలము నిచ్చి యమునానది వైపున యుద్ధముచేయ రాణిగారి నంపిరి. ఆమెయుఁ గడమసైన్యము మిగులజాగ్రతగా నుండుటఁ గని తనస్థలమునకుఁ బోయెను. కాని యుద్ధమునం దసమానప్రజ్ఞగల హూణసైన్యంబు లల్పకాలములోనే పేష్వాగారి సైన్యంబుల దైన్యంబు నొందించెను. అది గని రావుసాహెబు పేష్వా మొదలగువా రధికవిచారమున మునుంగ రాణిగారు వారికి ధైర్యపుమాటలు చెప్పి తనస్వల్పసైన్యముతో శత్రువులను చీకాకుపఱచెను. కాని వెనుకనుండి వచ్చుశత్రు సైన్యములవలనను, తమసైన్యమునందలి యితరసేనాధిపతులు పలాయితు లగుటవలనను రాణిగారు యుద్ధమునుండి తొలఁగవలసినవా రైరి.

ఇట్లు కాల్పియందు దపజయమును బొందిన యీప్రముఖులందఱును గ్వాలేరువైపునఁ గలగోపాలపురమునందుఁ జేరి ముందు చేయవలసినదానినిగూర్చి విచారించుచుండిరి. వారెంత విచారించినను సైన్య మత్యల్ప మగుటచే యుద్ధము చేయుటకుఁ దోఁచకుండెను. రాణిగారును వారితోడనే యుండెఁగాన నామె యాయల్పసైన్యముతో గ్వాలేరున కరిగి సిందేగారిని తమకుఁ దోడుపడ వేఁడుకొనవలయు ననియును, అందు కాయన సమ్మతించినయెడల యుద్ధము చేయవలయుననియు నాలోచన చెప్పెను.

ఆమె గఱపిన యాలోచన పేష్వాగా రంగీకరించి దిన ప్రయాణములు చేసి ౧౮౫౮వ సంవత్సరము మే నెల ౩౦వ తేదిని గ్వాలేరునకు సమీపమునం దున్న మురారిపుర సమీపమునఁ బ్రవేశించిరి. అంత వారందఱును విచారించి సిందేగారిని తమకు సహాయు లగుటకుగాను వర్తమాన మంపిరి.

ఆవార్త సిందేగారి దరబారున కరగఁగా నదివఱకుఁ దాత్యాటోపే బోధవలన నాతనికి వశులైన సరదార్లందఱును పేష్వాగారికి సహాయము చేయుదమని చెప్పిరి; కాని ప్రభుభక్తిగల జయాజీరావు సిందేగారును, దివాను దినకరరావుగారును వారివాక్యములను లెక్కింపక మిగుల యుక్తిగా మఱుసటిదినము పేష్వాసైన్యములను బాఱఁదోల నిశ్చయించిరి. కాని ఆ రాత్రి దివానుగారు లేని సమయమున నెవరో మహారాజుగారిని యుద్ధమునకుఁ బురికొల్పిరి. అంత నాయన తన కధిక విశ్వాసపాత్రములగు సైన్యములం గొని సూర్యోదయమునఱకు మురారి కేవల రెండుమైళ్ళదూరమునఁ గల బహాదురపురము నందుఁ దన దండను నిలిపి యుద్ధ మారంభించెను. ప్రథమమునందు పేష్వాసైన్యములపైఁ బడుగుండ్లను గని సిందే పూర్వము పేష్వాల బంటగుటవలనఁ దమ కనుకూలుఁడై తమ నెదుర్కొన వచ్చుచున్నాఁడని తలఁచిరి కాని యాబాణవృష్టి యంతకంత కెక్కువగుటవలన పేష్వా మొదలగు పురుషశ్రేష్ఠులందఱు రిచ్చవడి యేమియుఁ దోఁచకుండిరి కాని వారు తాను చెప్పినటుల సైన్యపు బందోబస్తు చేయకున్నను, కోపముంచక రాణీ లక్ష్మీబాయిగారుతగినయుక్తిఁ గఱపి యుద్ధమారంభము చేసెను. అందువలన నారెండుసైన్యములును కొంతవఱకు సమానము

గాఁ బోరి పిదప సిందే సైన్యములకే గెలుపు దొరకు నట్లయ్యె ను. అదిగని రాణిగారు తాను ధైర్యముతోఁ గొందఱాశ్వికు లనుగొని సిందేగారి ఫిరంగీలపై నాకస్మికముగా నడరి మహా ఘోరముగాఁబోర సిందే సైనికులు పాఱఁజొచ్చిరి. అదిగని తా త్యాటోపే సైనికులు మఱింత యుత్సాహముగలవారయి శత్రుసైన్యములను నదలింపసాగిరి. కాన సిందేగారి పరాక్రమ మంతయువృథపోవ నాతఁడును, దివాను దినకర్ రావును మ ఱికొందఱు సరదార్లతోఁ దనకుసహాయులగుఁడని యడుగుట కుగాను ఆగ్రా కిల్లాలోనున్న ఆంగ్లేయుల యొద్ది కరిగెను. విపు ల సైన్యసమేతుఁడగు నొకతరుణ నృపుని సల్పసైన్యముఁగల యొకయబల తనశౌర్యముచేఁ బాఱఁదోలెను. ఇందువలననే యొకకవి యిట్లు నుడివెను:—

* 'క్రియాసిద్ధిః సత్వేభవతి మహతాం నోపకరణే'

సిందేగారు పురము విడిచి చనినవెనుక నాతని రాణివా సపుస్త్రీ లందఱు ఆత్మసంరక్షణముకొఱకు నరవర యనుపుర మున కరిగిరి. వీరందఱు బయలుదేరి కొంచెముదూర మరిగిన పిదప సిందేశత్రువులచేఁ బడెనని విని గజరాయను నొకస్త్రీచేత ఖడ్గముధరించి రాజభవనమునకు వచ్చి రాజు సురక్షితముగా వెళ్లినవార్త విని వెనుక మరలెను. ఆహా యీస్త్రీయొక్క ధైర్యము అసామాన్యముగదా ?

రాజు పలాయితుఁడయిన వెనుక సకల సైన్యములు తమ కనుకూలములయినందున పేష్వాగారికి నగరు ప్రవేశిం

---

* 'గొప్పవారి కార్యసిద్ధి వారిపరాక్రమమువలననే యగును; కేవల సామగ్రి బలమువలనఁ గాదు.'

చుట కెంతమాత్రము ప్రయాసము కాలేదు. పేష్వాగా రంతటి తోఁ దాము సార్వభౌముల మయితిమని తలఁచి పట్టాభిషేక మహోత్సవము గావించుకొని బ్రాహ్మణసంతర్పణలు చేయ సాగిరి. లక్ష్మీబాయి యివన్నియు రాజ్యనాశన హేతువులని యు, ఈయాడంబరమును వదలి సైన్యపు బందోబస్తు చక్కఁ గాఁ జేసి యుద్ధసన్నద్ధులమయి యుండవలసిన దనియుఁ జెప్పె ను. కాని యవి స్త్రీవాక్యములని పేష్వాగారును, ఆయన సేనా నాయకుఁ డగు తాత్యాటోపేగారును మన్నింపక మహోత్స వములలోను, బ్రాహ్మణ సంతర్పణములలోను మునిఁగి యుండిరి.

జూన్ నెల ౧౬వ తేదిని సర్ హ్యూరోజ్ గారు సైన్య సహితులయి బహద్దరు పురము చేరిరి. కాని భోగపరాయణు లగు పేష్వాగారి కాసంగతియే తెలియకుండెను. ఆంగ్లేయసే నానాయకు లచటినుండి మురారికోట చేకొనిరని వినియును పేష్వాగారు చింతదక్కి పుణ్యకృత్యములు చేయుచునేయుం డిరి. ఆయన యనుజ్ఞవడసి తాత్యాటోపే సైన్యవ్యవస్థ చేయురీతి గానక లక్ష్మీబాయి గారిని వేఁడుకొనెను. జయము కలుగు నాస లేదని తెలిసికొనియు రాణిగారు సమరమునఁ దెగి స్వర్గ ముఁ గాంచ నపేక్షించి యాయన మనవి చిత్తగించెను. తదనం తర మామె కొంతసైన్యమును చక్కఁబఱచి మిగత నితర సేనానాయకులను జూడని యమించెను. ఆమె తన సేన ననేక భా గములు విభజించి మిగుల భద్రముగా యుద్ధసన్నద్ధురాలై నిలి చెను. ఇతర సైన్యాధిపతులును తమతమ శక్త్యనుసారముగా

వ్యూహములు పన్ని నిలిచిరి. రాణిగారు గ్వాలేరు పూర్వదిక్కు సంరక్షింతునని తనసైన్యమునచటనే మోహరించి నిలిచిరి.

౧౭వ తేదిని బ్రిగేడియర్ స్మిథ్ అనుసైన్యాధిపతి గ్వాలేరు పూర్వదిక్కుననున్న సైన్యములపై బాణవృష్టి చేయసాగెను. అది రాణిగారి బలమగుటవలన నాసైనికు లింగ్లీషు వారిబలములనాదినమున ధైర్యముతో మార్కొని నిలిచిరి. రెండవదినమును లక్ష్మీబాయిగారి వీరోత్సాహవచనముల వలన నాసైన్యములు పరబలంబులంబొడిచి తామును మృతులగుచుండిరి. లక్ష్మీబాయిగారి శౌర్యముం గని యాంగ్లేయ సేనానాయకులు మిగుల నద్భుతపడి యామె నోడింప నిశ్చయించిరి. ఇట్లు వారు నిశ్చయించి నలుదిక్కులనుండి యామె సైన్యముపై బాణపరంపరలు పఱపుటచే నా సైన్యంబులు నిలువక పాఱఁజొచ్చెను. ఇట్లు తన ముఖ్యసేవకులు కొందఱుదప్ప నందఱును తనను విడిచినందునను. అంతకుముందే యితరసేనాధిపతులు లజ్జయును నుబొంది పలాయితులగుటవలనను, లక్ష్మీబాయి తనఖడ్గబలముచే శత్రుసైన్యములలోనుండి యనేకశూరులం బొడుచుచు నావలకుఁ బోవుచుండెను. ఇట్లామె బహుదూరము వెళ్ళిన పిదప నామెతో పురుషవేషము ధరించియున్న 'ముందర' యను దాసియొక్క యంతిమశబ్దమామె చెవినిఁబడెను. అందువలన నామె వెనుక తిరిగి తన ప్రియదాసినిఁ జంపినవానిని యమపురమున కనిపి ముందుకుసాగెను. ఇట్లు ముందటిత్వరగా నడుగుచుండ నొక జలప్రవాహ మడ్డపడినందున ననేక గాయములచే క్షీణించియున్న యామె గుఱ్ఱ మాప్రవాహమును దాటఁజాలక నిలిచెను ! లక్ష్మీబాయిగా రాగుఱ్ఱము నావలకుఁ దీసికొని

పోవ ప్రయత్నించెనుగాని యాపని సిద్ధించినదికాదు. ఇంతలో శత్రుసైనికులు కొందఱామెను చేరరాఁగా నాయువతి మిగుల శౌర్యముతో వారిలో ననేకుల నంతకపురంబున కనిచెను! ! వారు బహు జనులును ఈమె యొంటరిది, కాన వారిలో నొకఁ డామె వాలునకు జంకక పక్కగా నిలిచి యామె తలకుడివైపుగా నఱికెను. బాధింపఁబడిన సింహముపై మత్తగజమొండు నట్లాభటుఁడు చేసిన ఖడ్గప్రహారమువలన నామె తల కుడివైపంతయు తెరగఁబడి రక్తము ప్రవహింపసాగెను. ఇంతలో నాయాశ్వికుఁడు తన ఖడ్గము రాణిగారి యురమునందు గ్రుచ్చెను. పురుష వేషముతో నుండుటవలన నీమె రాణిగారని పగవారికి గుర్తింప రాకున్నను, శత్రుపక్షమునందలి యొకానొక సైన్యాధిపతియగునని వారికిఁ దోఁచెను. ఈదెబ్బతో రాణిగా రాసన్నస్థితిని బొందెను. కాని యావీరయువతి యట్టి సమయమునందును ధైర్యము విడువక తన నట్టిస్థితికిఁ దెచ్చిన యాశ్వికునిఁ బరలోకమున కనిచెను!

ఇట్లామె వానినిఁజంపి బొత్తిగా శక్తిహీన మయ్యెను. అంతవఱ కామెను విడువకున్న రామచంద్రరావు దేశముఖు సగము ముఖము కోయఁబడిన రాణిగారిని శత్రువులచేతఁ బడకుండ సమీపమునందున్న పర్ణకుటిలోనికిఁ గొని చనెను. ఆయన మిగుల దుఃఖించి రాణిగారికి నుపచారములు చేయుచుండెను. కాని ౧౮౫౮వ సంవత్సరము జూను నెల ౧౮వ తేదిని అద్వితీయశౌర్యగుణ మండితురాలగు ఝాన్సీ మహారాణి లక్ష్మీబాయిగా రీలోకమును విడిచి శాశ్వతసుఖప్రదమగు లోకమున కరిగెను! రామచంద్రరావు దేశముఖుగారును

రాణిగారి యాజ్ఞ ప్రకార మామెశరీరము శత్రువులచేఁ బడ కుండ గుప్తముగా నగ్ని సంస్కారము చేసెను.

అటు పిమ్మట నాయుద్ధమునందు జయమొంది ఆంగ్లే య సేనాధిపతులు సిందేగారికి మరల రాజ్యము నిచ్చిరి. తద నంతర మా సేనానాయకులు క్రమముగా బందిపోటు వారి నడఁచి క్రమముగా తాత్యాటోపేను నితర సైన్యాధీశ్వరులను నురితీయించిరి. బందేవాలా నవాబు శరణుచొచ్చి క్షమకుఁ బాత్రుఁడయ్యెను!

ఇంగ్లీషు ప్రభువు లిట్లు విజయులయినందున మనకు స్త్రీవిద్యాదికములచే నత్యంత లాభప్రదమైన విక్టోరియా మహారాజ్ఞిగారి రాజ్యము ప్రాప్తించెను.

రాణిగారి దత్తపుత్రుఁడు తల్లి యనంతర మనేకకష్టము అనుభవించి ప్రస్తుతము నెల కేఁబదిరూపాయల జీవనము గలిగి సామాన్యమానవునిరీతి ఇందోరుపట్టణములోఁ గాలము గడపుచున్నాఁడు. ! ! !

లక్ష్మీబాయి యింగ్లీషువారితోఁ బోరాడినప్పటికి ననే కాంగ్లేయు లామె శౌర్యాతిశయముల ననేకరీతులఁ గొని యాడినారు. వానిలోఁ గొన్నిఁటి నిచ్చట నుదాహరించు చున్నాను:—

(౧). రాణిగారికిఁ బ్రతిపక్షియై ఆమె నోడించిన సర్ హ్యూరోజ్, సైన్యాధిపతియే 'గుణీగుణం వేత్తి' యన్న న్యాయ మున రాణిగారినిగుఱించి యిట్లు వ్రాసెను.

"రాణీలక్ష్మీ బాయియొక్క అత్యున్నతమైన కులీనత వలనను, ఆమె యాశ్రితజనులవిషయమయి మఱియు సైనికుల,

విషయమై చూపిన యపారమయిన యౌదార్యమువలనను, గొప్పగొప్ప సంకటసమయములయందును చలింపని ధైర్యము గలదియై యుండినందునను, సైనికులలో నామెనుగురించి పూజ్యభావము హెచ్చి యామెపక్షము మాకు భయంకర మయ్యెను."

"గ్వాలేరులో జరగిన యుద్ధముయొక్క గొప్పపరిణామము ఝాంశీరాణియొక్క మృత్యువు. ఆమె యబలయయినను మాతోఁ దిరుగఁబడిన వారిలో నతిశూరయు నత్యుత్తమసేనాగ్రణియునై యుండెను"

(౨) "ఆయుద్ధమునందు నత్యంత దృఢనిశ్చయమును, తేజమును, జనానురాగమును గలిగినట్టి సైన్యాధ్యక్షురాలయిన ఝాంఁశీరాణి చంపఁబడెను." డాక్టరు లో.

(౩). "లక్ష్మీబాయి నడితారుణ్యములో నుండినందున నత్యంత సుందరముగా నుండెను. ఆమెమనసు ఉత్సాహపూర్ణముగాను, శరీరము మిక్కిలి సశక్తముగాను నుండెను, ఆమె యందు, ప్రాణముపోయినను చింతలేదుగాని మానహాని సహింపనన్న యభిమానముండెను." మార్టిన్ దొర.

(౪). "ఏస్త్రీని రాజ్యతంత్రము నడుపుటకు నసమర్థురాలనియెంచి, మేము రాజ్యభ్రష్టముగాఁ జేసితిమో యాస్త్రీయే ప్రచండసైన్యముయొక్క యాధిపత్యమును స్వీకరించుటకు సంపూర్ణముగా సమర్థురాలని మాకు నిప్పుడు తెలిసెను." ఎడ్వెను ఆర్నోల్డుదొర.

(౫). "శత్రువులలో నత్యుత్తమమనిషి ఝాంఁశీయొక్క మహారాణియే" జస్టిన్ మ్యాకర్తిదొర.

# విమలదేవి

(అచ్చ తెనుఁగు.)

ఈమె మార్వాడలోని రూపనగరమునకు ఱేఁడుగా నుండిన అమరసింగుని కూఁతురు. అప్పుడు డిల్లీలో నుండిన రారాజుపేరు ఔరంగజేబు. రజపూతదొరలు కొందఱు ఔరంగజేబునకు జడిసి తమబిడ్డల నతనికిచ్చి యాతని కనికరమునకుఁ దగినవారయిరి. విమలదేవి తండ్రియుఁ దన బెద్దకూఁతు నౌరంగజేబునకిచ్చి పెండ్లిచేసెను. రాచకన్నియల నిట్లు తురకల కిచ్చుటకు విమలదేవి యిచ్చ మెచ్చక, తనయుసురులువోయినను తురకను పెండ్లాడననియుఁ దల్లిదండ్రులు తనకు మంచి రాచకొమరుని వెదకి కూర్చనియెడలఁ దనపాయమంతయుఁ గన్నియగనే గడపెద ననియుఁ దలఁచెను. ఇట్లుండ నౌరంగజేబున కిల్లాలగు కేసరిబాయను విమలయొక్క యక్క పుట్టినింటికి వచ్చెను. అప్పుడు విమలదేవి తల్లియగు కౌమారదేవి మొదలయినవా రంద ఱామె రారాజునకుసతి యగుటవలన నామెను మిగుల గారవించిరి. కాని విమలదేవిమాత్ర మామె మొగమునుజూడక యేకతమున నుండి ముక్కంటిని గొలుచుచుండెను. అప్పుడచటికి కేసరిబాయి చెలియలినిఁ జూడవచ్చి యామె గొలుచు బూచుల దొరను దూఱసాగెను. అప్పుడు విమలదేవి మిగుల కోపగించి తోఁబుట్టువునుజూచి "యచ్చపు రాచకులంబునఁ బుట్టి మిగుల పనికిమాలిన కులమువానిఁ జేప

ట్టిన నిన్నుఁ జూచినదోసమువచ్చును. నేను నాయుసురులుబోం దిని విడిచిపోయినను తురకల చెట్టఁబట్టక మేటిమగండగు రజపూత పుడమిఱేనిఁ బెండ్లియాడెద" ననియుఁ బ్రతినవట్టెను. అందుకామెయక్క "నిన్నుఁ దురకల కిప్పించకుండిన నేను జౌరంగ జేబున కింతినేకాను" అని డిల్లీకరిగి తనమగని కాకతయంతయుఁ జెప్పి యతనిచేవిమల నిమ్మని తన తల్లిదండ్రులకు జాబు వ్రాయించెను.

విమలదేవియుఁ దాఁ జేసిన ప్రతినఁ దల్లిదండ్రులకుఁ జెప్పఁగా వారు మెచ్చియామెను గొనియాడిరి. కాని యౌరంగజేబువద్దనుండి వచ్చినజాబునుచూచుకొనిన పిదప వారు మిగుల వెఱచి విమల నతని కియ్యఁదలఁచిరి. దీనిఁగని విమల మిక్కిలి నొగిలి సిసోదియా రాచకొలంబునఁ బుట్టిన రాజసింహుఁడు నాఁబరఁగు రాచకొమరుని బీరమ్ము నిదివఱకువినియున్నదిగాన నతని కొకజాబువ్రాసి తమయొజ్జలచేత నతనికిఁ బంపెను. ఆజాబులో నామె 'ఆఁడయంచ కాకికి నాతియగుట దగునా ? దోసమెఱుఁగని దొరకొలంబునఁ బుట్టిన కన్నియకోఁతిమూతివాఁడును బోడితలవాఁడును నైన తురకఁ గూడుట యింపగునా? వెన్నుఁడు రుక్మిణిం దీసికొనిపోయినటుల నన్నుఁ గొనిపొండు. మీ రొకవేళ నన్నుఁ గాపాడరాకుండిననేను నామేనుం జాలించెదను. ఇది నిజము' అని వ్రాసెను. ఈజాబుంగొనిచనిన పుడమివేల్పు విమలయొక్క మంచి గొనముల నారాచసింగంబునకుం జెప్పఁగా నతఁడు తురకలపై కరం బలిగి గొప్ప దండుతో రూపనగరమునకు బయలుదేరెను. ఈలోపలఁ బెండ్లిముహూర్తము దగ్గర వచ్చి నందున నౌరంగజేబు పెండ్లికొ

మారుఁ డగుటకై యారాజుకుం దగినసంబముతోఁ గూడి రూప నగరమునకుఁ బయలుదేరెను. ఔరంగజేబు రాకడ విని విమలదేవి డెందమునన్నిగులఁ గుంది చచ్చుటకు నుంకించునంతలో రాజసింహుఁడు వచ్చి యామెను చేపట్టిమరలఁ దనసీమకుఁ దీసికొని పోవఁ దొడఁగె. ఇట్లు పోవుచు నొకప్పుడు గొన్నికొండల నడుమకు వచ్చిరి. అప్పు డచట వారు కొంతసేపు డప్పి దీర్చుకొనుటకై కూర్చుండిరి. అప్పటికిఁ గొంచెముదవ్వున నేయౌరంగ జేబు తనమూఁకలతో విడిసియుండెను. అప్పు డౌరంగజేబు నాతియు విమలదేవియక్కయు నగు కేసరిబాను ఒక చెంచువాఁ డెట్టులనో పట్టుకొని తెచ్చి వీరు దిగిన కొండత్రావునందొక పొదచాటున నుంచెను. అప్పు డామె "నన్నెవరయినఁ గాపాడుఁడ"నియాకారడవిలో మొఱ్ఱపెట్టఁగా విని విమల తనమగని నంపఁగా నారాచపట్టి యాచెంచువానిచేతినుండి కేసరిబాను విడిపించి తనయింటియొద్దికిఁ దీసికొనివచ్చెను. కేసరిబా చెల్లెలి మొగముచూడ సిగ్గుపడి యామె తనకుఁ జేసినసాయమునకుఁ గరంబు సంతసించి తాను విమలకుఁ జేసిన యెగ్గునకుఁ దన్నుఁ మన్నింపుమని చెలియలిని వేఁడుకొనియెను. అప్పుడు విమలదేవి తనయక్కను వెఱవవలదని చెప్పి కొందఱుబంటుల వెంట నిచ్చి యామెను నౌరంగ జేబువద్దికంపెను. కేసరిబా చెప్పఁగా నౌరంగజేబు జరిగినకత యంతయు విని రాజసింహునిపైఁ గల పగమాని ఢిల్లీకిఁబోయెను. రాజసింహుఁడును నెలఁతతో ఉదేపురమున కరిగి సుఖంబుండె.

# లీలావతి

ఉ. వింతగ వాదమేల యవివేకుల పోలిక? స్త్రీలవిద్య సిద్ధాంతమె చేసినారు మనతజ్ఞులు పూర్వులు.—వీరేశలింగకవి.

గణితశాస్త్రపండితుఁడని ప్రసిద్ధిఁగాంచిన భాస్కరాచార్యుల కొక కూఁతురుండెను. ఆమెపేరు లీలావతి. సిద్ధాంతశిరోమణియందు భాస్కరాచార్యులవారు తా నాగ్రంథము ౧౦౭౨ వ శాలివాహన శకసంవత్సరమునందు రచియించితి నని వ్రాసినందున లీలావతి ౧౨ వ శతాబ్దమునందుండినట్లు తెలుచున్నది. లీలావతి బాలవితంతువైనందున నామె భర్తృనామ మేదియో తెలియదు. మనదేశమునందుఁ జరిత్రములు వ్రాసియుంచుపద్ధతి పూర్వమునుండి లేనందున గణితశాస్త్రమునం దసమానపండితయైన లీలావతినిగుఱించి కొన్ని సంభవాసంభవములగు కథలుదప్ప మఱియేమియుఁ దెలియదు. ఐనను దంతకథలుదప్ప చరిత్రమున కితరసాధనంబు లేవియు లేనందున నా దంతకథలే యిచ్చట వ్రాసెదను. భాస్కరాచార్యులవారు జ్యోతిషమునందు మిగుల ప్రవీణులు. కాన లీలావతికి వైధవ్యము ప్రాప్తించునని జాతకమువలనఁ దెలిసికొనెనఁట. అందువలన భాస్కరాచార్యులు పూర్ణాయువు గలవరుని వెదకి తెచ్చి యొకమంచిముహూర్తమునందు లీలావతికి వివాహము చేయ నిశ్చయించిరి. వివాహమునకుఁ బూర్వము చేయవలసిన విధుల జరిపి కన్యావరులను మండపమునందుఁ గూర్చుండఁ బెట్టెను.

ముహూర్తము తెలియుటకయి నీటిలో ఘటికాయంత్రము (సన్నచిల్లి గలగిన్నె) నొకదాని నునిచి, పురోహితసమేతుఁడయి ముహూర్తము నెదురు చూచుచుండెను. అంతఁ గొంత సేపటికి లీలావతి యాగిన్నెలోనికి నీరు వచ్చువిధము చూడ గోరి కొంచెము జరిగి చూచుచుండెను. అట్లు చూచునపు డామె శిరోభూషణమునం దుండిన యొకసన్నని ముత్యమాగిన్నెలోఁబడి నీరు వచ్చుమార్గము నరికట్టెను. ముత్యము పడిన సంగతి యెవరును చూచినవారు కారు. ఎంతసేపు చూచినను గిన్నె మునుఁగకుండుటఁ గని దానికారణము నెఱిగి ఆచార్యులవారు హతాశులయి యేదో యొకముహూర్తమునందు లీలావతి వివాహము గావించిరి.

వివాహానంతరము స్వల్పకాలములోనే లీలావతికి వైధవ్యము ప్రాప్తించెను కూఁతున కిట్టిదురవస్థ సంభవించినందునఁ దండ్రి మిగుల పరితపించెను. కాని యాయన యంతటితోఁ దన కొమార్తె జన్మమునిరర్థకమని తలఁపడయ్యెను. లీలావతికి సంసారసౌఖ్యము లేకపోయినను ఆచార్యులవా రామెకు విద్యానంద మొసంగఁ దలఁచిరి. లీలావతి యిదివఱకే విద్యావతి యగుట వలన నామెకుఁ దండ్రి గణితశాస్త్రమును నేర్పసాగెను. లీలావతియు విద్యాభిరుచి గలదై తనదుఃఖమును మఱచి సదా గణితాభ్యాసమే చేయుచుండెను. కొన్నిరోజులకామెకు గణితశాస్త్రమునం దపారపాండిత్యము గలిగెను. ఈమె తనగణిత ప్రావీణ్యముచేత గణించి యరగంటలో వృక్షమునకుఁ గల యాకులసంఖ్య చెప్పుచుండెనని యొకలోకవార్త గలదు. ఈలోకవార్త యెంతమాత్రమును సమ్మదగినది గాకపోయినను,

లీలావతికి గణితశాస్త్రమునందుఁ గలయసామాన్య ప్రజ్ఞను చూచి లోకులీవార్త పుట్టించి రనుటకు సందేహము లేదు. ఆమెకు గణితము చెప్పునెడ వేసిన ప్రశ్నలును, వానియుత్తరములును నొకటిగాఁ జేసి భాస్కరాచార్యులు లీలావతి గణితమనుపేరఁ బ్రసిద్ధిఁ జేసెనని యందురు. ఈసంగతి లీలావతి గణితములోన "బాలే బాలకురంగలోలనయనే లీలావతీ ప్రోచ్యతాం" "అయేబాలే లీలావతిమతిమతి బ్రూహి" (లీలావతి యనుబాల యీలెక్క చెప్పుము అనియర్థము) అనిన వాక్యములవలన నీసంగతినిజమేయయియుండవచ్చునని తోఁచుచున్నది. లీలావతి గణితమువలననే బాలవితంతువయిన లీలావతియొక్క కీర్తి సకలదేశములయందును నిండియున్నది. లీలావతి గణితము, ఫారసీ, యింగ్లీషు మొదలయిన పరభాషలయందుఁగూడ భాషాంతరీకరింపఁబడినది లీలావతి గణితములోని లెక్కలన్నియుఁ జేయుటకుఁ బురుషులకే మహాప్రయాసముగా నుండును. కాన నిట్టికఠినపు లెక్కలను నేర్చిన స్త్రీయొక్క బుద్ధికుశలత యెంత యుండవలయునో చదువరులే యూహింపఁగలరు.

ఈలీలావతి చరిత్రమువలనఁ బూర్వకాలమున ఈదేశమునందు స్త్రీవిద్య సర్వసాధారణమయి యుండెనని తెలియుచున్నది.

# సత్యవతి

బంగాళాయిలాకాలోని మాల్ హదనీ యను ప్రాంతములోనిదగు గౌడమగ్రాసు నివాసియగు రామానందగోస్వామికి నీమె కోడలు. గోస్వామిభార్యపేరు సునీతి. ఈమె మిగుల దయగలది యయి యింటిపని నంతను జేసి యూర నెవ్వరును క్షుత్తుచే బాధపడుచుండలేదుగదా యని తెలిసికొనినపిదప పతి సుతులకుఁ గుడువఁబెట్టి పిదపఁదాను భుజించును. రామానందుఁడు భగవద్భక్తుఁడు, పాపభీతుఁడునై తనకుఁ గలమాన్యములో వచ్చినవానితో జీవనము చేయుచు సంతుష్టుఁడయి యుండెను. రామానందుఁడు తనపుత్రుఁడగు ప్రేమానందునికి విద్యాబుద్ధులు గఱపి సద్గుణవంతునిగాఁ జేసెను. వారికోడలగు సత్యవతి మిగుల రూపవతి యగుటయేగాక విద్యావతియయి వినయ వివేకాదిసద్గుణనిధిగా నుండెను. ఈమె రాణీభవాని కాలమునందుండినట్లు తెలియుచున్నది. సత్యవతియత్తమామలను సేవచేయుచుఁ బతియాజ్ఞను శిరసావహించి మిగుల నమ్రతతో నుండుటవలన వారును ఆమెయం దధికాదరము కలవారలయిరి. ఇట్టికుటుంబమధిక సుఖములో నుండఁగా వారి కకస్మాత్తుగా నొకగొప్పయాపద సంభవించెను. ఆయాపదవలననే సత్యవతి యొక్క ధైర్యస్థైర్యములు బాగుగా బయలుపడి యామె కీర్తి శాశ్వతపఱచెను.

ఆకాలమునం దాదేశమున కంపనీవారి ప్రభుత్వము క్రొత్తగాఁ బ్రారంభ మయ్యెను. ఆసమయమున ననావృష్టి దోషమువలన నాదేశమున నొకగొప్పక్షామము సంభవించె. ఆక్షామమున పంటలులేక కాపులు మిగుల హీనస్థితికి వచ్చిరి. కాని దొరతనమువారి యుద్యోగస్థులు, దొరతనమువారి కియ్యవలసిన పన్నుకొఱకయి కాపుల యిండ్లనమ్మియు, పొలములను విక్రయించియు పన్ను దీసికొని వారి ననేక బాధలఁ బెట్టుచుండిరి. వాండ్రను రక్షకభటుల కొప్పగింపఁగా వారు వారిని, వారి స్త్రీలను సకలబాధలపఱిచి సభలలో నవమానింపుచుండిరి. ఇట్టిసమయములో నదివఱకు మాన్యముగా నిచ్చిన రామానందుని భూమికి నచటి యుద్యోగస్థుఁడగు దేవీసింహుఁ డన్యాయముగా పన్ను నడిగెను. అప్పుడు రామానందునివద్ద ద్రవ్యమేమియు లేనందున నాయధికారి వారి యింటనున్న వస్తువులన్నియు వేలము వాటెను. అట్టియాపత్సమయములో రామానందుఁడు తనపరివారముతోఁడ రంగపురమున తనశిష్యు లుండినందున, నచటికిఁ బోవుచుండెను. కాని రాజభటులు వారి నందఱిని త్రోవలోఁ బట్టుకొని రాజస్థానమునకుఁ దీసికొనిపోయిరి. అచటఁ గులాంగనలొందు నవమానమును జూచి సహింపలేక ప్రేమానందుఁడు దీని కంతకును కారణుఁ డగుదేవీసింహుని తనచేతికత్తితో నఱకఁబోయెను. కాని యింతలో రాజభటుఁ డొకఁడు వచ్చి యతని చేయి పట్టుకొనియెను. అంత నా రాజభటుఁ డొకగదిలోని కతనిఁ దీసికొనిపోయి వీపుపైని లెక్కలేని దెబ్బలను గొట్టెను. అదివఱకట్టి దెబ్బలచేత నలుగురుమనుష్యులచట మృతులయిరి.

ఆవార్త విని రామానందుఁడును, సత్యవతియు, ప్రేమానం
దుఁడు చచ్చెనని వగచిరి. తదనంతరము రామానందుఁడు కారా
గృహములోని కరిగి యచట దెబ్బలచేత విరూపియయి
మూర్ఛఁజెందిన పుత్రుని గుర్తింపక చచ్చెనని తలఁచెను. అంత
నతఁడీవలకు వచ్చి కోడలి కాదుఃఖవార్త నెఱిఁగించి యామెను
దీసికొని యరణ్యమార్గమునఁ బోవుచుండెను. సత్యవతి
పతి మరణమున కధిక దుఃఖితయయి యనుగమనము చేయ
నిశ్చయించెను. కాని రామానందు లామె నట్లు చేయనియ్య
కుండెను. వీరిట్లరుగుచుండ దేవీసింహుఁడు సుహాసవతు లగు
సతులను బట్టి తెప్పించి వారిని దొరల కర్పించి యాదొరల
యనుగ్రహము సంపాదించుచుండె ననివార్త వీరికిఁ దెలిసెను.
నాఁటినుండియు వారు గ్రామమునం దెప్పుడును సంచరింపక
అరణ్యమునందే తిరుగుచుండిరి. కాన వారు రాజభటులకు
జిక్కలేదు. ఇట్లు వీరు నడుచుచు నొకగ్రామ సమీపారణ్యము
నకు రాఁగా నాగ్రామమున నొకసౌందర్యవతిని వెదకుచు
రక్షకభటులు వచ్చి రనినవార్త వారికిఁ దెలిసెను. అప్పుడు
రామానందుఁడు కోడలినిఁ జూచి 'అమ్మా! నీవు నాతో
నుండిన నీకు విశేషసంకటములు కలుగును. కాన నీ వీవృద్ధ
దాసిని నొకసేవకునినిఁ దీసికొని కాశీక్షేత్రమున కరుగుము'
అనిపలికెను. అందుకు సత్యవతి 'మీరు నాకు మామగారై
నను నన్ను మీకన్యకకంటె నెక్కుడుగాఁ జూచెదరు. మిమ్ము
ను విడిచిపోవుటకు నే నెప్పుడును సమ్మతింపను. మన మిరు
వురము కలిసియుండుటయే నాకు దుఃఖములో సహితము
సుఖముగానుండును. పతివ్రతల నెవ్వరును జెఱుపలేరు. మనో

నిశ్చయముగల నాతుల నెవ్వరును నవమానింప శక్తులుకారు' అని పలికి దుఃఖాతిరేకమువలన సత్యవతి మూర్ఛిల్లెను. కొంత సేపటికి కామె సేదతేరి 'హా పరమేశ్వరా! నన్ను నాప్రాణ నాథునితోడఁ గొనిపోవక యేల బ్రతికించితివి? బ్రతికించినను నాకీసౌందర్య మేల యిచ్చితివి. దీనివలన సుఖము ననుభవించు వారు లేరైరి. ఇఁక దీనితోడి ప్రయోజన మేమి? సంకట మూలమగు నీసౌందర్యముతో నీప్రపంచమున నుండుటకష్టము కాన ముక్కు, చెవులుగోసికొని విరూపి నయ్యెద' నని యామె యట్లు చేయఁబోఁగా రామానందు లామె నట్లు చేయనియ్యక ననేకహితులను చెప్పి వృద్ధదాసిని విశ్వాసార్హుఁ డగు భృత్యుని నిచ్చి యామె నరణ్యమార్గమునఁ బంపెను. అప్పుడామెకుఁ గట్టువస్త్రము దప్ప నన్యవస్త్రముగాని దగ్గర ధనముగాని లేదయ్యెను.

కోడలినంపి రామానందులు భగవన్నామ సంకీర్తన చేయుచుండఁగా రాజభటు లచటికి వచ్చి యతనిని బట్టుకొని పోయి కారాగృహమునం దుంచిరి. సత్యవతి కొంతదూర మరిగి ముందుపోవ మనసొప్పక మరలి మామగా రున్న స్థలము నకువచ్చి యతనిని రాజభటులుగొనిపోయి కారాగృహమునం దుంచిరని వినెను. అప్పుడామె మిగులదుఃఖించి యూరకుం డక మరల ధైర్యమువలంబించి మామగారిని విడిపించు నుపా యము వెదకి, తాను పురుషవేషమును ధరియించి బంధఖా నాను సమీపించి తనసేవకుల నచటనే యునిచి తాను ముం దుకువచ్చెను. అచట నధికారియగు రామసింహ జమాదారా బాలునిఁజూచి నీ వెవ్వఁడవనియు, నేలవచ్చితివనియు నడుగఁ

గానతఁడు తనపేరు 'నాన'కనియుఁ, దన నివాసస్థలము గయా జిల్లాలోని పూర్ణియా యనుగ్రామమనియుఁ దా నుద్యోగము నిమిత్తము వచ్చితిననియుఁ జెప్పెను. అందుపైనతఁడా బాలునిఁ దనయొద్ద నల్పజీతమున కుంచుకొనియెను. ఈ వేషధారిబాలకుఁడు నిత్యముయజమానునిసేవ బాగుగాఁజేసి యతని కృపకుఁ బాత్రుడయ్యెను. అంతనొకనాఁడతఁడు కైదుఖానాలోనికి యజమానునియనుజ్ఞవలన నరిగి మిగుల యుక్తిగా రామానందుల నచటినుండివిడిపించి విపినమార్గముననరణ్యమధ్యమున నున్న యొక యోగిని*గృహమునకుఁదీసికొనిపోయెను. వారచటికరిగియామెతోఁ గొంత ప్రసంగించునంతలోఁ చచ్చిపోయెననుకొనిన ప్రేమానందుఁడు బ్రతికి కలకత్తాలో కారాగృహమునందుండినట్లు తెలిసెను. అప్పుడు సత్యవతి యొకభృత్యుని వెంటఁదీసికొని భర్తను విడిపింతునని పురుషవేషముతో రామకృష్ణుఁడనునామమునఁ గలకత్తాకుఁ బయలు దేరెను. ఆపదలు మనుష్యులకు శత్రువులని తలఁచెదరుగాని నిజముగా విచారింపఁగా గొప్పవారి కవి మిత్రులనియే చెప్పవచ్చును. ఆపత్కాలము వలననె గొప్పవారిపవిత్రచరిత్రము, చాతుర్యము ధైర్యము మొదలైనగుణములు వెల్లడియగుటకవకాశము కలిగి వారికీర్తి జగద్విఖ్యాతమగును.

* ఈయోగిని యవతెవో తెలియదు; కాని యాకాలమునందే యుండి యాదేవీసింహుని భయముచేతనే యరణ్యమునందు యోగినిగా వాసము చేయుచుండిన 'కమలాదేవి'యే యైయుండవచ్చునని యూహింపఁబడుచున్నది. కమలాదేవిచరిత్రచూచునది.

సత్యవతి రాత్రిందివములు నడచి మూఁడుదినములకు కలకత్తానగరము ప్రవేశించెను. అచట బందిఖానా రామానందులను బట్టిన యధికారి చేతిదిగాక యతనికంటె గొప్ప యధికారిచేతిలో నుండెను. అందువలన నచటవ్యాజ్యమునకుఁ బోయినచో ప్రేమానందుఁడు విముక్తుఁడగునని తెలిసెను. కాని యాకోర్టు వ్యాజ్యమునకువిశేషద్రవ్యముకావలసియుండెను. ద్రవ్యముకొఱకు సత్యవతి విచారింపుచుండఁగా, నాగ్రామమునందు గంగా గోవిందసింహుఁ డనుగృహస్థునింటికి యాచనార్థము కొందఱు బ్రాహ్మణు లరుగుచున్నట్టామెకుఁ దెలిసెను. అప్పు డామెయు బురుషవేషముతో నచటికరిగెను. కానియచట నేమియుఁ దొరకదయ్యె. అంత నాసాధ్వి మిగులచింతించి రాజవీధిలోనొకవృక్షచ్ఛాయనుకూర్చుండినిద్రాహారములు లేక కొన్నిదినములు గడపెను. అంత నొకదినమాత్రోవ నొకగొప్ప యుద్యోగస్థుఁ డరుగుచుండెను. ఆయన చేతిలోనుండి యతనికిఁ దెలియకయే కొన్ని యగ్యతములైన కాగితములు క్రిందఁ బడెను. అవి పడుటనుగని త్వరగాసత్యవతి వానినెత్తి తెచ్చి యాగృహస్థున కిచ్చెను. వానిని దీసికొనియాతఁడాబాలకునికిమిగుల కృతజ్ఞుఁడయి "నీవు నాకువచ్చు గొప్ప యాపదలను దొలఁగించితివి. నీకేమికావలయునో యడుగు"మనెను. అందుకు నామె తనబంధుఁడొకఁ డాయూర బాదివాసములో నుండినందున నతని విడిపింపవచ్చి ద్రవ్యహీనతవలన నాపని సాధ్యముకాక యుండెననియు, తమ రాకార్యమునకుఁ దోడుపడ వలెననియు వేఁడుకొనెను. అందు కాగృహస్థుఁడు సమ్మతించి రామకృష్ణుని (సత్యవతినామము) యిచ్ఛప్రకార

ము ప్రేమానందును విడిపించెను. కారాగృహమునుండి బైటికి వచ్చినపిదప పురుషవేషధారిణియగు తనసతినిఁజూచి ప్రేమానందుఁడు గుర్తింపక తనబంధువుఁ డెవఁడో తనను విడిపించెనని తలఁచెను. తదనంతరము వారు గృహమునకు వచ్చినపిమ్మటసత్యవతి భర్తకుఁ దన నెఱిఁగించి యతని పాదములపైఁబడెను. అంత ప్రేమానందుఁడును తనసతి చేసిన యద్భుతకృత్యమున కచ్చెరువంది యామె నాలింగనము చేసికొనియెను. మృతుఁడయ్యె నను కొనిన ప్రియభర్తనుపండ్రెండుసంవత్సరములకుఁ గాంచెనుగాన సత్యవతి సంతోషమునకుఁ బారము లేదయ్యె. తదనంతరమువారిరువురును భృత్యుని వెంటఁ దీసికొని కొన్ని దినములకు రామానందుఁడును యోగినియు నున్నస్థలమునకువచ్చిరి. అప్పుడు రామానందుఁడు పరమానందమగ్నుఁడయి కోడలిని బహువిధముల నుతియించెను. అంత వారందఱును రంగపురమున కరిగి సుఖముగానుండిరి.

# మహారాణీ త్రిపురసుందరి

ఈమె నేపాలాధీశ్వరుడగు రాణాబహదురుని పెద్దభార్య. ఈరాజు ౧౭౭౭గవ సంవత్సరమున సింహాసనారూఢుం డయ్యెను. ఈయునకు నిద్దఱుభార్య లుండిరి. వారిలోఁ బెద్దదియు, మహారాణి బిరుదుఁ బొందినదియునైన త్రిపురసుందరి గుల్మీరాజుబిడ్డ. ఈమె యత్యంత సద్గుణవతియు, నమితయౌదార్యవతియునై యుండెనని చరిత్రకారులు వ్రాసియున్నారు. కాని యీమెకు సంతానము లేనందువలన రాజీమెను నొల్లకయుండెను. అయినను నాసాధ్వి పతిభక్తిపరాయణయై యుండెను.

౧౮౦౦వ సంవత్సరమునందు రాజుకు మతిభ్రమ కలిగి రాజ్యమంతయు రెండవ భార్యకుమారున కిచ్చి, రెండవభార్యను నాచిన్నవానికిఁ బాలనకర్త్రిగా నేర్పఱచి కాశీవాసముఁ జేయఁబోయెను. పతివ్రతాతిలకమగు త్రిపురసుందరియుఁ బతివెంట నతనిసేవకై కాశికిఁబోయెను. కాని యారాజీమెను మిగుల బాధపెట్టి, యిల్లు వెడలఁగొట్టి మరల నేపాళమునకుఁ దిరిగి పోవలసినదానినిగాఁ జేసెను.

ఇట్లు నేపాళమునకు వచ్చినప్పుడు ఆమెకుఁ దనకు హక్కుగల బాలరాజుయొక్క పాలనకర్తృత్వము వహించవలయుననిన యిచ్ఛ కలిగెను. బాలరాజుకుఁ బాలనకర్త్రిగా నుండవలసిన హక్కు పట్టపురాణి(రాజుయొక్క పెద్దభార్య)ది కాని యితరులదికాదు. కాన తనకా యధికారము రావలయునని త్రిపురసుందరియిచ్ఛ న్యాయమయినదియేకాని యన్యాయమయినది

కాదు. కాన నిందనుగుఱించి యీమెను నిందించుటకు వీలు లేదు. రాణిగారు తనయధికారమును సంపాదించుకొనుటకయి సైన్యములను పోగుచేసి నేపాళదేశము సరిహద్దు సమీపమునకు వచ్చెను. ప్రజలందఱీమెకే యనుకూలు రయినందున నప్పుడు రాజ్యము చేయుచుండిన రెండవరాణికి మిగుల చింతకలిగెను.

౧౮౦౨వ సంవత్సరము నవంబరు నెలలో మహారాణి త్రిపురసుందరి, పొలిమేర దాటి నేపాళదేశములోనికిఁ జొరఁబడెను. కాని త్రోవలోనే యీమె సైన్యమును రెండవరాణి యొక్క సైన్యము కొల్లఁగొట్టెను. కాని యీపరాభవమువలన ధైర్యమువిడువక మహారాణి మరల సైన్యమును జతపఱుచుకొని ౧౮౦౩వ సంవత్సరము ఫిబ్రవరి నెలలో నేపాళమునకు వచ్చెను. చిన్నరాణిగారి సైన్యములు వచ్చి యీమెను నెదిరించెను; కాని యీమె సైన్యములచే నవి యోడింపఁబడి మహారాణి మహావైభవముతో ఖటమండూ యను నిజరాజధానిఁ బ్రవేశించెను. అచ్చటనున్న చిన్నరాణి బాలరాజును వెంటఁ దీసికొని పాఱిపోయెను. కాని మహారాణిగా రారాజపుత్రుని మరలఁ దెప్పించి రాజ్యముపైఁ గూర్చుండఁ బెట్టి తాను పాలనకర్త్రిగానుండెను. మహారాణిగారు న్యాయప్రవర్తన గలదియైనందున నోడిపోయిన చిన్నరాణి నేమి, యీమె పక్షమువారి నేమి, యెంతమాత్రమును బాధపెట్టక వారి యపరాధముల నన్నిఁటిని క్షమించెను. ఆహా! ఈమె క్షమాగుణం బందఱికిని ననుకరణీయముగదా ? రక్తపాతము లేక ప్రభుత్వములలో నిట్టిమార్పులు గలిగిన యుదాహరణ మిది యొక్కటియేయని చెప్పెదరు. ఈమెయచ్చటనున్న యింగ్లీషువారి రాయబారితో

విశేష స్నేహముగా లేనందున నాతఁడాదేశమునందలి యింగ్లీషువారి యిలాకకుఁ బోవలసినవాఁడాయెను.*

ఈమహారాణి బహుఖ్యాతిగాను, ఘనతగాను రాజకార్యముల నన్నిఁటిని నిర్వహించుచుండెను. జనులందఱును పరరాజులును మిగులఁ గొనియాడ నీమె బహుదీర్ఘ కాలమువఱకు రాజ్యముఁ జేసెను. బుద్ధిసామర్థ్యము విషయముననే గాకుండ సద్గుణములనుగుఱించియు నీమె విఖ్యాతిఁ జెందెనని చరిత్రకారులు వ్రాసియున్నారు. మతిభ్రమ బాగయిన పిదప నీమె పెనిమిటివచ్చి మరలఁ గొన్నిరోజులు రాజ్యము చేసెను. అప్పుడును నీమె భర్తసేవయందుఁ దత్పరురాలయి యుండెను. ఈమె పెనిమిటి ౧౮౦౬ గిన సంవత్సరములోఁ గాలముచేసెను. తదనంతర మీమె భీమసేనుఁడనువానిని మంత్రిగా నేర్పఱచుకొని మిక్కిలి చాతుర్యముతోఁ జక్కఁగా రాజ్యపరిపాలనము చేసెను. ఈమె ౧౮౩౨ వ సంవత్సరములో మృతిఁ జెందెను. పతిచేఁ దిరస్కరింపఁబడియు, సవతులచే నవమానింపఁబడియు, పాతివ్రత్యము, క్షాత్రగుణము మొదలయిన సద్గుణములను వదలక ధైర్యముతోనుండి యోగ్యమైన తనహక్కులను శౌర్యముచే సంపాదించుకొని, శత్రులనుగూడ దయార్ద్రదృష్టితోఁ జూచుచు జనులు గొనియాడ రాజ్యపరిపాలనము చేసిన యీసతీమణిని నెవరు గొనియాడక యుందురు?

---

* హిందూదేశములోని ప్రాంతములలో నొక్కనేపాళదేశము స్వాతంత్ర్యతగలదియై యున్నదనిన మాట చదువరులకుఁ దెలిసియేయుండును. ప్రస్తుత మింగ్లీషువారును, నేపాళమువారును నన్యోన్యస్నేహభావముతో నుండుట యెంతయు శ్లాఘనీయము గదా!

# సావిత్రీబాయి రాణేకరీణ్.

ఈశూరనారి కర్నాటకములోని బేళగాముజిల్లాయందుండు బేలవాడీయందలి భుయికోటకు నధిపతిగానుండిన యేసాజీభార్య. ఈమె శివాజీ మహారాజు సైన్యములతో యుద్ధము చేసెను.

శివాజీ యొకప్పుడు కర్ణాటకముపైకి దండువెడలెను. అప్పుడాయన తనసైన్యాధిపతియగు దాదోజీ నచటిదుర్గములు గెలువ నియమించి తాను తనదేశమున నెరంగక్రీబల సైన్యములను గెలుచునిమిత్త మరిగెను. దాదోజీ తాను భుయికోటను గెలిచినచో దాని చుట్టుపట్టులనుండు దుర్గము లల్పశ్రమతోఁ దనకుఁ జిక్కఁగలవని యనుకొని ప్రథమమునందు దానిని ముట్టడించెను. కాని దానిసంరక్షకుఁడగు యేసాజీ వారికి లోఁబడక వారితో ఘోరముగాఁ బోరెను. ఇట్లు కొంతసేపు సంగ్రామము జరిగినపిదప నేసాజీయుద్ధరంగమునం బడియె. అంత నతని సైన్యములు విచ్చలవిడిగా నలువంకలకుఁ బాఱసాగెను. భర్త యుద్ధమునఁ జచ్చుట విని యతనిపత్ని కొందఱు దాసీలతోడ యుద్ధభూమికి వచ్చెను. ఆమె యచటికివచ్చి గతప్రాణుఁడైనను చేతిపలుకయు, వాలునువిడువని తనపతిని గాంచెను. అప్పుడామె మనంబున శౌర్యాగ్ని ప్రజ్వలింపఁగా నామె పతివియోగదుఃఖము మ్రింగి భర్త చేతివాలును, బలుకయుఁ దనకేల నమర్చి పతిసన్నిధిని నిలిచి తనసైనికులతో నిట్లనియె.

'ఓసిరవరులారా! స్త్రీలవలె నేల పాఱిపోయెదరు? మీరు మిగుల పరాక్రమవంతులనియు, శత్రువులకు వెన్నియ్యనివారనియు మిగుల కీర్తిగాంచితిరి. ఆకీర్తికి యిదియేనా లక్షణము? మీకధిపతియగు వాఁడిచటఁ బడియుండఁగా నతని శత్రువులస్వాధీనమున విడిచి చనుటయేనా శూరధర్మము? మీతండ్రులు, తాతలు రాజభక్తులై తమప్రాణములను రాజకొఱకు విడిచి స్వర్గమునకరిగి యుండఁగా మీరు రాజద్రోహులై నరకమునకుఁబోవ యత్నించుట యుచితమా? మీశత్రువులు మీయజమానునియొక్కయు, మీసహచరులయొక్కయు, మీబాంధవులయొక్కయు మృతశరీరములకు నిర్దయులై గోడ్లనిచ్చు విధమున నిచ్చకోటక్రిందఁ బాఱవేయుదురో లేక అంత్యజులచేత వారిశరీరముల నొకపల్లములోఁ బాఱవేయింతురో, అట్లుగాక కుక్కలనక్కల కాహారముగానిచ్చి మిగిలిన యస్థిమాంసముల నరణ్యమునఁ బాఱవేయుదురో! ఇందుకైనను మీకు సిగ్గుకాదా? తిరుగుఁడు; మరలిరండు. మీచేత పరాక్రమమేమియుఁ గాకున్నను నాయొక్కయు, నాదాసీజనముయొక్కయుఁ బరాక్రమము చూచుచుండుఁడు! ఇట్టివాక్యముల నుచ్చరించి కేవలము మహిషాసురమర్దనుని యవతారమును బోలియున్న యా వీరయువతి తా నశ్వారోహణముచేసెను. వెంటనే యామె దాసీలును ఆయుధహస్తులై తమతమ గుఱ్ఱముల నెక్కిరి. దీనిం గని పాఱిపోవు సైన్యములు సిగ్గుపడి మరలి సావిత్రీబాయి యాజ్ఞను మన్నించి యుద్ధముచేయుటకు సిద్ధమయ్యెను.

సావిత్రీబాయి తనసైనికుల నందఱిఁ జేర్చి కోటను మరలఁగొన నిశ్చయించెను. ఈసంగతి దాదోజీకిఁ దెలియఁగా

నతఁడధికాశ్చర్యముం బొంది స్త్రీ లిట్టి సాహసకార్యములలో నికిఁ జొరఁగూడదనియు మీజీవనమునకై శివాజీగారు చాల భూమిని మీకిచ్చిరనియు, గాన మీరు సాహసించి మీయొక్కయు మీసైనికుల యొక్కయు ప్రాణములకుఁ దెగించకుఁడని యతఁడు సావిత్రీబాయికి వర్తమాన మంపెను. కాని యీవచనములా శూరయువతికి రుచియింపక మరల నిట్లు చెప్పిపంపెను. 'నా ప్రాణముల కాధారమగు ప్రాణనాథుఁ డిదివఱకే స్వర్గమున కరిగెను. కాన నిఁక నేను నాప్రాణముల కెంతమాత్రమును భయపడను. నాపుట్టినింటివారును, జొచ్చినయింటివారును ప్రాణములకన్న స్వకర్తవ్యమునే యధికముగా నెంచెడివారుగా నుండిరి. నాభర్త నెఱవేర్పఁదలఁచినకార్యము నతఁడు నెఱవేర్పకయే పరలోకమున కేగెను. కాననది నే నెఱవేర్చుట నాకర్తవ్యము. ఇందువలన మీరు వెంటనే కోటను నాస్వాధీనము చేసిపొండు. లేదా యుద్ధమునకు సిద్ధమగుఁడు. ఈరెండు వాక్యములు దప్ప మూడవవాక్యము నే నెన్నఁటికి నొప్పను.'

ఈమె చెప్పినమాటలు దాదోజీకి సమ్మతములైనను విధిలేక యతఁడు సంగ్రామరంగమునకు రావలసినవాఁడాయెను. అప్పుడు సావిత్రీబాయి నాలుగైదువందల సైనికులతో వేలకొలఁది సైనికులు గలదాదోజీసైన్యములను దైన్యంబు నొందించి వారివ్యూహములను చిందరవందఱగఁ జేసి యనేకులను దనకత్తివాతంబడవేసి కొందఱిని మూర్ఛనొందించి, కొందఱిని గాయపఱచి యీనిన యాఁడుసింగమువలె నా రణరంగమున నెటు చూచినను దానయై యందఱకును భయము పుట్టించుచుండెను.

ఇట్లామె మూడువేలసైనికులను లక్ష్యముచేయక రెండుజాముల సంగ్రామములో వారిలో ననేకులను జంపియుఁ, గొందఱిని పాఱఁగొట్టియుఁ గోటాద్వారములను దెఱచెను. దీనింగని దాదోజీ మిగులదిగులొంది యింకను గొన్ని వేలసైన్యమును దెచ్చి యామెను చుట్టుముట్టెను. అప్పుడును నామె ధైర్యమును విడువక శత్రుసైన్యములతోడఁ బోరి తన శౌర్యము నందఱకును విదితపఱుపుచుండెను. ఆసమయమునందామె సైనికులుకొంచె మధైర్యపడిన ట్లగుపడఁగా వెంటనే యామె ముందుకువచ్చి తన మెడలోని హారములను దెంపి సైనికులకు బహుమానములిచ్చి వారి కుత్సాహము కలిగించెను. అందువలన వారు మిగుల శౌర్యముతోడఁ బోరి యుద్ధమునఁబడిరి. తదనంతరము దాదోజీ యెనిమిదివేలసైనికులతోడ నామెను ముట్టడించి యామెవెనుకకుఁ బోయి యామె గుఱ్ఱపుకాలిని నఱికెను. అందువలన నామె క్రిందికి రావలసినదాయెను. ఆమె క్రిందదిగినవెంటనే యామె కుడిచేతిని దాదోజీ నఱికెను. అంతతో నాచెయ్యి ఖడ్గముతోఁ గూడ ధరణిపైఁ బడియెను. అప్పుడు చేయి పోయినందునకంటెను చేతిలోని ఖడ్గముపోయినందునకే సావిత్రీబాయి కధిక దుఃఖము కలిగెను. తదనంతర మాయన యాకిల్లాపైని శివాజీ పతాకమును నాటి విజయమును చాటి యచటినుండి సావిత్రీబాయిని దనతోఁ దీసికొని శివాజీ కోలాపురమునం దుండఁగా నచటికివచ్చెను. అచట దాదోజీ సావిత్రీబాయి ధైర్యస్థైర్యములను, యుద్ధవిశారదత్వమును శౌర్యమును, దృఢనిశ్చయమును మొదలగు గుణములను చాలవర్ణించెను. దానిని విని శివాజీమిగుల

నాశ్చర్యమునుబొంది యామెను తనసన్నిధికిఁ దెప్పించెను. ఆమె ముఖావలోకనము చేసినతోడనే శివాజీకి మిగుల పశ్చాత్తాపము కలిగెను. అందువలన నతఁడామె కనేక సమాధాన వచనములనుఁ జెప్పి తాను గొనిన కోటను మరల నిచ్చెదనని యె. కానిసావిత్రీబాయి యామాటలను చెవిని బెట్టక 'నాకివన్నియు నక్కఱలేదు. వంశమునం దెవ్వరును లేని యపకీర్తిని నేను శౌర్యహీనతవలనఁ దెచ్చితిని. కాన నాఖడ్గమును, నాశత్రువును నాకొప్పగింపుఁడు ఇదియే నాకోరిక. ఇట్లుచేయని యెడలఁ దమ రిప్పుడేనాశిరస్సును ఛేదించి పుణ్యము కట్టు కొనుఁడు' ఇది యేగదా నిజమయిన శౌర్యలక్షణము. శివాజీయామె యడిగినవాని నియ్యఁజాలక యామె నామెయింటి కంపెను కాని యావీరవనిత తనకుఁ గలిగిన యపజయమునకుసహింపక దిగులొంది రెండు మూడుమాసములకే పరలోకమున కరిగెను.

*

# వాక్పుష్టా

ఈ పుణ్యశీల కాశ్మీరాధిపతిగా నుండిన తుంజీనునికిఁ బత్ని. ఈరాజు మిగుల ప్రజావాత్సల్యము గలవాఁడనియు, ధర్మాత్ముఁడనియుఁ గీర్తిఁ గాంచెను. ఆయన భార్యమిగులధర్మాత్మురాలును, ధైర్యవతియునయి యుండెను. తుంజీనుఁడు తనసతి సహాయమువలన రాజ్యము నేలుచుఁ బ్రజలను సుఖులనుజేయుచుండెను. కాని యొకానొకసమయమునం దాదేశమునందలి ప్రజలకు క్షామమువలన గొప్పయాపద సంభవించెను. అట్టిసంకటసమయమునందా సుశీలచూపినధైర్యమును స్వప్రజారక్షణమునకయి పడిన పాట్లును మిగులస్తుత్యములు.

కాశ్మీరదేశము తుంజీనుని పరిపాలనదినములలో సర్వైశ్వర్యయుతమయి యుండియచటి ప్రజలకు మిగుల సుఖప్రదంబై యుండె. తుంజీనుఁడును న్యాయపరిపాలనము చేయుచుఁ దనప్రజల నానందింపఁ జేయుచుండెను. ఇట్లుండఁగా నొకసంవత్సరము ఫాల్గుణమాసమునందాదేశమునం దంతటను మంచు కురిసి కోఁతకు సిద్ధము లయిన పొలములపై నంతటను మంచు గట్టిగాఁ బేరెను. అందువలన ధాన్య మంతయు నాశమొంది యాదేశమున గొప్ప కాటకము సంభవించెను. అందువలన జనులన్నార్తులై తిరుగుచుండిరి. రాజు తనపత్ని సహాయవలన క్షుద్బాధాపీడితు లగుజనుల నాదరింపుచు, వారి కందఱకు నన్నము పెట్టింపుచుండెను. అప్పుడు వాక్పుష్టయనఁ గలదయా

రసమును జూచి యచటి ప్రజలు మిగుల నారందపరవశులయి తమ దుఃఖములను మఱచిరి.

ఇట్లు కొన్ని దినములు గడచినపిదప రాజు బొక్కసమంతయు నోడిసెను. అప్పుడు రాజు, మంత్రి మొదలగువారి సహాయమువలనఁ గొన్ని దినములు ప్రజల యాఁకలివాపి తుదకు ద్రవ్యహీనుఁడును, ధాన్య రహితుఁడునునై ప్రజలబాధలు చూచుచు నుండవలసినవాఁడాయెను. అప్పుడు రాణి తమ ప్రజలబాధలు తొలఁగుటకయి యనేకోపాయములను చేసెను. తుద కామె తననగల నన్నిఁటిని నమ్మి యాద్రవ్యముతో నితర దేశములనుండి ధాన్యము తెప్పించి యన్నార్తుల కన్నము పెట్టుచుండెను. ఆహా! యీమె యౌదార్యము నేమని కొనియాడవలయును? కాని యా స్వల్పద్రవ్యముతోఁ గొనిన ధాన్యము ప్రజల కెన్ని దినములు చాలును? ఇంతటితో నా దేశపుక్షామము వదలనందున జనులలో ననేకోపద్రవములు గలుగసాగెను. జననీజనకులు తమ పిల్లలపయి నిర్దయులైరి. భార్యాభర్తలొండొరులపైఁగల పవిత్రమగుదాంపత్యప్రేమను విడనాడిరి. సహోదరప్రేమలు రూపుమాసె నందఱును దమతమ పొట్టకూటికయి నలువంకల విచ్చలవిడిగా దిరుగసాగిరి. అన్నాభావమువలన ననేకజనులు మృతులయిరి. వృద్ధులు, బాలురు, తరుణులు ననుభేద మిసుమంతయును లేక యందఱును యమపురమునకు విందులయి చనిరి పోఁగా మిగిలిన యల్పజనులును చూచుట కతి వికారరూపులయి మనమున నొక విధమగు భయము పుట్టించువారయి యుండిరి. అప్పు డాకాశ్మీరదేశము కేవలము దండధరుపురమును బోలి

యుండె. ఇట్టివిపద్దశయందొకరాత్రి పురజను లన్నమునకయి రాజగృహమును ముట్టడించి యాక్రందనము చేయసాగిరి. క్షామమువలనను గత్తరవలనను పీడింపఁబడిన యాదీనజనుల దురవస్థనుగని వాక్స్పష్ట మిగుల చింతాక్రాంతయును, నివారించు నుపాయము గానక సదయాంతఃకరణయై తనపతి బుజముపైఁ దలవాల్చి యిష్టదేవతను బ్రార్థించుచుండెను. ఆసమయమున దుఃఖమువలన చిత్తవ్యాకులుఁడయిన తుంజీనుఁడు తన పత్నితో ‘ కాంతామణి! మనము చేసిన పాపమువలన మన ప్రజల కిట్టికష్టములు సంభవించె. నాదురదృష్టమువలన ధనమంతయు వ్యయమయ్యె. ప్రజల యాఁకలి నివారించుట కెన్ని యుపాయములు చేసిన నవన్ని యువృథలయ్యె; నిట్టి నరాధముఁడనగు నాజన్మము కాల్పనా? నేను బ్రతికి యుండఁగానే నా ప్రజలు చచ్చుచున్నవారు. మనము చేసిన ప్రయత్నములన్ని యు నిష్ఫలములయ్యె. మనగర్భమునఁ గన్నవారివలెఁ గాపాడిన యసంఖ్యప్రజనాశ మొందెను. ఇంకను నాశ మొందనున్నది. రాజ్యమునం దెటు చూచినను పతులకయి విలపించు సతులును పుత్రులకయి శోకించు జననీజనకులును, అన్నమునకయి యారాటపడు జనులును నమితముగా నగుపడుచుండెదరు. ప్రపంచమునందింతకంటెను దుఃఖకరమగు సమయము వేఱుగ నుండునా? రత్నములతోడను, సువర్ణరజతాది ద్రవ్యములతోడను ధాన్యసమృద్ధితోడను, నొప్పి సుందరముగాఁ గానుపించు నీకాశ్మీరదేశము నేఁడు శ్మశానతుల్యముగాఁ గానుపించెడిని. నలుదిక్కులనుండి విపత్సముద్రములో మునుఁగుచున్న యీ ప్రజకుఁ దరుణోపాయ మెయ్యది? ఈదుస్సహ మగు ప్రజా

దుఃఖమును జూడనోప. కాన నగ్నికుండములో మునిఁగి ప్రాణములను విడిచి నాఖేదమును బాపుకొనియెదను. తన ప్రజలు సుఖులై రాత్రి నిద్రింపఁగాఁ జూచి సంతోషించు రాజెంత ధన్యుఁడో! ప్రాణేశ్వరీ! మన కిట్టిదురవస్థ కలుగుట కెట్టి ఘోరపాతకము చేసితిమో చెప్పుము.

ఇట్లు హరిశ్చంద్రనరేంద్రుఁడు మూర్ఛితుఁడయి నేలం బడియెను. అంతకుముందంతయు భర్తవాక్యములను చెవియొగ్గి వినుచున్న వాక్పుష్ట తన నాధుండు తుదివాక్యము నుచ్చరించి మూర్ఛిలుటఁ గని తాను ధైర్య మవలంబించి శైత్యోపచారముల నతనిని సేదఁదేర్చి యతనితో నిట్లనియె. "రాజా! యింత శోకమునకుఁ జోటీయ నొసఁగఁదగదు! ఇట్టి సమయమున ధైర్యము విడుచుట యుచితమా? ఇట్టిసమయమున నధైర్యపడిన నింక తమ యాధిక్య మెట్లు నిలుచును? తము నజ్ఞానులవలె దిగులొందిన నేమిలాభము? ఇంద్రుఁడు గాని, బ్రహ్మగాని, యముఁడుగాని, మరియేదైవముగాని సత్యశీలుఁడగు రాజును జెఱుపఁ జాలఁడు. రాజు ప్రజలకు పితృతుల్యుఁడు, చావసిద్ధముగా నున్న సుతులను విడిచిపోవుట తండ్రికిఁ దగదు. పతిభక్తికలిగియుండుట సతులకర్తవ్యము. అట్లే విపన్నులగు ప్రజలను విడువకుండుట భూపాలుని కర్తవ్యంబు. ఆత్మహత్యచేసికొనుట గొప్పపాతకములలో నొకటిగా నెన్నఁబడును. అట్టిపాతకమున కొడిఁగట్టుట మిగుల నధర్మము. ఆశాంకురము నెప్పుడును చంపఁగూడదు. ఒక్కప్రాణియైనను జీవించి యుండినంతవఱకు ప్రాణత్యాగము చేయ నిశ్చయించుట యుచితముగాదు. మనము బ్రతికించుటకును మనల నాశ్రయించుట

కును నింక నెవ్వరును లేనిసమయమున నగ్నియందు ప్రాణముల నాహుతిచేసినఁ జేయవచ్చును."

ఈవాక్యముల నుడువునప్పుడు వాక్పుష్ట శరీరమునం దొకకాంతి కలిగి మిగుల ప్రకాశించెను. అప్పు డామెకు మిగుల నుత్సాహము కలిగెను. ఆమె యేకాగ్రచిత్తముతోఁ బరమేశ్వరునిఁ బ్రార్థించి పతితోఁ మరల "లెండి తమ రికఁ జింతింపఁ బనిలేదు. మనప్రజ లికఁ గాటకమునుండి రక్షింపఁబడి యెద రని నాకుఁ దోఁచె." అని చెప్పెను.

పరమపతివ్రత వాక్య మెప్పుడు నసత్యము కాఁజాల దనియెదరు. అట్టి పవిత్రురాలగు వాక్పుష్ట నుడువులును నసత్యములు కానయ్యె. మఱునాఁడు వేలకొలఁది పావురములు చచ్చి యాపురమునఁ బడియెను. అందువలన లోకులు వానినే తిని బ్రతికిరి. ఇతిహాసజ్ఞులగువారు స్కాట్‌లండ్ చరిత్రమునం దిట్టి యద్భుతము జరుగుట నెఱిఁగియుందురు. కాన నిది వారికసంభవమని తోఁచకుండెడిని. రాజు తనభార్యయం దిట్టి యసామాన్యసద్గుణములు వసియించుటఁ గని యాత్మహత్య చేసికొనుట మానెను. కాశ్మీరవాసులు సుస్థిరులైరి. వాక్పుష్ట యొక్క పుణ్యచరితమువలన కాశ్మీరదేశము త్వరలోనే ధనధాన్యసమృద్ధమై యచటఁ బ్రజలు సుఖసంపద నొప్పియుండిరి.

తుంజీనుఁడు బహుదినములు రాజ్యభోగముల ననుభవింపక ముప్పదియాఱవ యేటనే కాలధర్మము నొందెను. వాక్పుష్ట సహగమనము చేసెను.

# రాణి ఔస్కువరు

ఈమె పంజాబుదేశములోని పటియాల సంస్థానమును ౧౮వ శతాబ్దాంతమునను ౧౯వ శతాబ్దారంభమునను నేలుచుండిన రాజా సాహెబు సింహుని భార్య. ఈమె తనపతి రాజ్యపాలన కర్తుఁడు కానందునవలనఁ గొన్ని దినములును, అతని పిదపఁ గొమారుఁ డల్పవయస్కుఁ డయినందునవలనఁ గొన్ని దినములును పటియాల సంస్థానమును జక్కఁగాఁ బాలించి కీర్తిఁ గాంచెను! రాజీమె సొంతవ్యయమునకై యీమెకుఁ గొంత భూమినిచ్చెను. గొప్పరాజ్యభారమును వహింప సమర్థయగు నామె యీ యల్పభూభాగముతోఁ దృప్తినొందియుండక మనమున రాజ్యమునంతను దానేల నిచ్ఛ గలిగియుండెను. రాజు విచారశూన్యుఁడును, రాజ్యపాలనయందసమర్థుఁడును, దుస్సాంగత్యము గలవాఁడుగాను నుండినందున సంస్థానము మిగుల హీనస్థితికివచ్చెను. రైతులు రాజును లెక్కింపక పన్నుల నెగఁగొట్టుచుండిరి. ఉద్యోగస్థులందఱు తమతమ యర్థకార్యములఁ జేయక, తమపైవారిని ధిక్కరింపఁదొడఁగిరి! రాజ్యమిట్లు ధికదుర్దశకు వచ్చుట నెఱిఁగి రాజు తాను దానిఁ జక్కఁబఱుపలేనని తెలిసికొని తనసవతి తల్లియగు ఖేమ్కువరు తనకై రాజ్యముచేయునట్లు నియమింపఁ దలఁచెను. కాని యీమె సవతితల్లి యగుటవలన, నామె హితమును రాజుహితమును నొక్కటి కాదనియును, ఆమెచేతికి రాజ్యతంత్రము నిచ్చినచో రాజునకు

ను, నతనిపుత్రునకును సహితము జరుగుట యసంభవ నీయ మనియును, నూహించి సామంతరాజులును, బ్రిటీషు (ఇంగ్లీషు) వారును రాజ్యము నాతని పత్నియగు జొస్కువరు కియ్య నిశ్చయించిరి. బ్రిటీషువారి యేజంటు సమయము తటస్థించినచోఁ దాను రాణికి రాజ్యమిచ్చునట్టుల దొరతనము వారి యనుజ్ఞ వడసియుండెను. ఇది యంతయు విని రాజు సహచరులగు దుష్టు లందఱు రాణిరాజ్యము నేలినచోఁ దమదుశ్చేష్ట లేమియు సాగవుగదా యని చింతించి రాణిపై ననేక నేరములు నిర్మించి రాజునకుఁ జెప్పి యతని కామెపై ద్వేషముఁ గలుగఁ జేసిరి. కాని యేజంటొకప్పుడు పటియాలకువచ్చి సంస్థానమునకుఁ గలుగు నష్టము లనేకములఁగని రాజునకుఁ బోధించి రాజ్యము రాణి స్వాధీనము చేసెను. ఈమె రాజ్యమునకు వచ్చినవెంట నే రాజ్యమునందంతటను మిగుల స్వస్థతగానిపించె. ఆమె సత్యవంతుఁడగు నొకబుద్ధిమంతుని మంత్రిగా నేర్పఱచి, యతని సహాయమువలనను, తనబుద్ధిబలమువలనను రాజ్యము నేలు చుండెను. అదివఱకనేకవత్సరములనుండి పన్నులు రాని గ్రామములనుండి వెనుకటి యనింతను రాఁబట్టెను. సామంతు లియ్యవలసిన ధనమును సైన్యమును మంచితనముననే చేకొని యెను. ఇందువలన నదివఱకప్పులలో నుండిన సంస్థానమప్పుడు అప్పుల నన్నిటిని దీర్చి బొక్కసములో లక్షధనము కలిగియుండెను. రాజు పాలనదినములలో నూఱుగురుసైనికులను పోగుచేయుట దుస్తరముగా నుండెను. కాని రాణిరాజ్యమునకువచ్చిన సంవత్సరమునకే రెండువేలగుఱ్ఱపురౌతులను రెండువేల పదాతి సంఘమును నొడఁగూర్చెను. ఈమె పాలనమునకుఁ గాపులు

ను, ప్రజలును మిగుల సంతసించిరి. ఉద్యోగస్థు లందఱు తమ తమ నియమితకార్యములఁ దప్పక చేయుచు రాజభక్తి కలిగి యుండిరి. ఇట్లీమె మిగుల దక్షతతో రాజ్యము నేలుటఁ గని రాజు సంతసించెను. కాని దుష్టులగు నతని చెలికాండ్రకీమెరాజ్యము మిగుల దుఃఖకరముగాఁ దోఁచి, వారిలో ముఖ్యులగుఆల్బల్ సింగు గుర్జరసింగులనువారురాజుతో రాణినిన్ను విషమిడిచంపయత్నించుచున్నదియని మనసునకు నాఁట దెలిపిరి. వారికి రాణితో నంతవైరమేల కలిగెననఁగానింగు ప్రథముఁడగు ఆల్బల్ సింగు కొంతభూమి కౌలుకుఁగొని దానిసంవత్సరమున కేడువేల రూపాయలను కొంత సైన్యమునురాజున కిచ్చునట్లేర్పాటు చేసకొనియెను. ఆభూమికి ౧౨ వేలరూపాయ లిమ్మని రాణి యతని నడుగఁగా నతఁ డియ్యక యాభూమిని విడుదలచేసెను. ఆమె యాభూమిపై సాలుంటికి ౧౨ వేల రూపాయలను రాఁబట్టెను. రెండవవాఁడగు గుర్జరసింగుఁడును నిట్లేకొంతభూమిని కౌలుకుఁ దీసికొని ౭ వందలరూప్యములను రాజునకు నిచ్చుచుండెను. వానినిసహితము ౧౨ వేలరూపాయ లిమ్మని రాణి యడుగఁగా వాఁ డియ్యకుండెను. అందుపై నామె యాపుడమి నింకొకని కిచ్చి ౧౨ వేల రూపాయలను గొనియెను.

రాజు కొంచెము మతిభ్రమ కలవాఁ డయినందున వారిమాటలు విని మిగుల నాగ్రహించి రాణిని, యువరాజగు నామె కొమరుని, సత్యరతుఁడగు నామె మంత్రిని కారాగృహమునం దుంచెను. కాని యతఁడు ధైర్యహీనుఁడైనందున తాఁ జేసినకార్యమువలన నేమి యుపద్రవము సంభవించునో యని భయపడఁ దొడఁగెను. రాణిని కారాగృహమునం దుంచినతో

డనే రాజ్యము మరల సుస్థితికి రాసాగెను. సైనికులందఱుఁ జెదరిపోయిరి. అందుకు రాజు మిగుల చింతించి రాణిని యూమెపుత్రుని, మంత్రిని చెఱవిడిపించి రాజ్యమును మరలఁ జక్కఁ జేయుమని భార్యను వేడఁదొడఁగెను. అప్పు డామె తనను మరల చెఱసాలలోఁ బెట్టకుండఁ గట్టుదిట్టములు చేయుఁడనియుఁ దేప తేప తను నిట్లే కారాగృహమునం దుంచినచో జనులు తన్ను మన్నింపరనియుఁ జెప్పి యందుకు జామీ నెవ్వరినైనను చూపుమనెను. ఆమె యంతటితో నూరకుండక యేజంటును బిలిపించెను ఏజంటు రాకడఁ గనినతోడనే రాజు మరల కోపించెను. ఎట్టకేల కా యేజంటు రాణికిఁ బట్టముకట్టి చనియెను. ఈతడవ రాణి రాజ్యమని పేరేకాని దానియం దామె యధికార మెంతమాత్రము జరగకుండెను. రాణిప్రాణములకే గొప్పయాపద వచ్చునట్టుండెను. రాజ్యమునందలి దుష్టులందఱు రాణికి వైరులయిరి, రాజు కొంతసైన్యము పోగుచేసి రాణినిఁ జంప యత్నించెను. ఆమె పేరోలగమున కెవ్వరును రాకయుండిరి. దీని నంతను రాణి యేజంటునకుఁ దెలుపఁగా నతఁడు కొంత సేనతో వచ్చి మహాప్రయత్నముమీఁద సర్వాధికారము రాణిగారికి నిచ్చి రాజుచేతినుండు గురుముఖి రాజముద్రయును నామెకిప్పించెను. రాజునకుఁ గొంచెము భూమియు నెల వేతనమును నేర్పఱచెను. రాణి సర్వాధికారిణి యయినను ఆమె తన భర్త యనుమతి వడయనిది యేకార్యము చేసెడిదికాదు. ఆమె రాజ్యమువలన రాజునకు స్వతంత్రత స్థిరముగానే యుండెను. కాని యాభ్రమిష్టున కీస్వతంత్రత కలుగుటవలన నష్టమే కలిగెను. అతఁడు నాతదనంతరము నాపుత్రునకేమియు లేకుండఁ జేసెద

నని ధనమును విచ్చలవిడిగా వెచ్చింపఁ దొడఁగెను. అందువలన నాతని సొంతధనము సహితము సంస్థానపు బొక్కసములో భద్రపఱచవలసి వచ్చెను. ౧౮౧౬వ సంవత్సరము రాజు కాలముచేసెను. తదనంతర మతనిపుత్రుఁడగు కర్మసింహుఁడు రాజ్యాధీశుఁ డయ్యెను. కర్మసింహుఁడు బాలుఁడని యాతని పేర రాణి కొన్నిదినములు రాజ్యము నేలెను. కాని కొమారుఁడు పెద్దవాఁడయినపిదప నతఁడు రాజ్యమును తన్నేలనిమ్మనఁగా రాణియందుకు సమ్మతింపక పుత్రునితోఁ గలహించెను అంత నామెపుత్రుఁడామెకుఁ గొంతధన మిచ్చి సమాధానపఱచి యామెను వేఱొకచోటికనిచి తాను రాజ్యము నేలుచుండెను. ఇంతటితో నీమె రాజ్యపాలనచరిత్రము ముగిసెను. ఈరాణికొంచెము మహత్త్వాకాంక్ష గలదియైనను నది సమర్థులకు సహజగుణము గాన నొకదోషము కాదు. ఇదిగాక నీమెయందు వసియించు ధర్మనీతి సత్యములును, స్వాభిమానమును, పరహితేచ్ఛయు, రాజ్యపాలనసామర్థ్యము మొదలగు సద్గుణములు మిగుల శ్లాఘనీయములు.

ఈచరిత్రమువలనను, నిదివఱకు వ్రాయఁబడిన రాజ్యపరిపాలనమునం దధికనిపుణురాండ్రయిన రాణుల చరిత్రమువలనను, నిఁక ముందువచ్చునట్టి చరితములవలనను స్త్రీలురాజ్యపాలనమునం దధికసమర్థురాండ్రనియు, వా రనేకపర్యాయములుపురుషులు తమబుద్ధిహీనతవలనఁ జెడఁగొట్టిన కొన్నిసంస్థానములను బాగుపఱచిరనియును దెల్లముగాఁ దెలియుచున్నది. ఇందును గుఱించి యీశతాబ్దమునం దుండి పోయిన యింగ్లండులోని యొకతత్త్వవేత్త యిట్లు నుడివెను:—

“ఇందునగుఱించి యేషియాఖండమునందును, యూ
రోపుఖండమునందును, విచారించినచో రాజ్యపాలన మధిక
దక్షతతోఁ జేసిన స్త్రీలసంఖ్యయే లెక్క కెక్కువై యున్నది.
హిందూస్థానమునం దొకానొక సంస్థానమునందు రాజ్యమతి
వ్యవస్థగాను, మితవ్యయముగాను, నియమితముగాను, కలుగు
చుండి రైతుకు నన్యాయముజరుగక, సంస్థానమునకు నానాఁ
టికి నాదాయము హెచ్చుచుఁ బ్రజలు సుఖులై యుండిరనినచో
నిట్టి సంస్థానములలో నాలుగింటిలో మూడుసంస్థానములు
స్త్రీలపాలనలో నున్నవని నిశ్చయముగాఁ దెలిసికొనవచ్చును.
ఈసంగతి పూర్వము నా కనుభవసిద్ధము కాకున్నను, హిం
దూస్థానమునందలి ప్రధాన రాజ్యవ్యవస్థ సమాజముతో నా
కుఁ గలిగిన సంబంధమువలన హిందూస్థానమునందలి. యనేక
రాజ్యములలోని కాగితపత్రములు నాకుదొరకెను; వానివల
న నేనిమాటను స్థాపించఁ గలిగితిని. ఇట్టి యుదాహరణము
లనేకములు దొరకును. హిందువుల యాచార ప్రకారము
ను. వారి మతప్రకారమును స్త్రీలకు రాజ్యార్హత లేదు.
అట్లయినను రాజ్యమునకు వారసుఁడగువాఁ డజ్ఞానదశయం
దుండుటయు, వారి తల్లులు వారిపేర ననేక పర్యాయములు
రాజ్యము నేలుటయుఁ దటస్థించుచుండును. అదేలయన, రాజు
లనేకులు సోమరులుగాను, విషయాసక్తులుగాను నుండుటవల
నవారల్పవయసుననే మృతులగుదురు. ఈరాణులు లేక రాజపు
త్రికలు ప్రజలయెదుటి కెన్నఁడును రారు, వారు తమకుటుంబము
నందలి పురుషులతోఁదప్ప నన్యపురుషులతో సంభాషింపనైన
నుసంభాషింపరు. భాషించినను దెరలోనుండి భాషించెదరు. వా

రికివిద్యయే రాదు. వచ్చినను రాజ్యపాలనవిషయములుగలపుస్తకమువారిభాషలో నొకటి యైనను లేదు. ఈయిబ్బందులన్నియు విచారించినయెడలనీయుదాహరణములవలనస్త్రీలయందు రాజ్యపాలనమునకుఁ దగినగుణములు స్వాభావికముగానై యుండునని చక్కఁగా మనసునకు నాటును." *

---

* జాన్ స్టూఅర్టుమిల్ కృతమైన సబ్జెక్షన్ ఆఫ్ విమెన్ నాఁబరఁగు గ్రంథరాజముయొక్క భాషాంతరంబైన 'స్త్రియాంచీపరవశతా' 'స్త్రీలపరవశత' యను మహారాష్ట్రగ్రంథమునుండి యిది తెనుఁగు చేయఁబడినది.

# రాణీ సాహేబ్ కువరు

ఈమె పంజాబుదేశములోని పటియాలసంస్థా నాధీశ్వరుఁడగు రాజా సాహేబ్ సింహుని సహోదరి. బారీదు వాబులో నధికభాగము కధీశ్వరుఁ డగుసరదార్ జయమల్ సింహునిపత్ని. ఈమె తనసహోదరుని రాజ్యమును చక్కఁగా నేలి రెండుమూఁడుసార్లు యుద్ధములలో జయముఁ గాంచి మిగుల శూర యనియును రాజకార్యనిపుణ యనియును బేర్కొనం బడియె.

౧౭౯౩వ సంవత్సరము మంత్రులును, ఉద్యోగస్థులును దనకు వైరు లైనందున రాజ్యముఁ దాను జక్కఁబఱుపఁజాల నని రాజాసాహెబు సింహుఁడు దెలిసికొనియెను. అంత నతఁడు తనయనుజను దనవద్దకిఁ బిలిపించుకొని యామెకు ముఖ్యప్రధానిత్వమునిచ్చెను. తదనంతరమామె కొందఱువిశ్వాసార్హులగు నుద్యోగస్థుల సహాయమువలన రాజ్యమునం దంతటను గలుగుచున్న యన్యాయముల నుడిపి న్యాయముగాఁ బాలించుచుఁ బ్రజలకు మిగుల హితురా లాయెను. అంతలో నామెభర్త పై నతని పాలివాఁడగు ఫతేసింహుఁడు వైరముఁ బూని యతనిని జాల తొందర పెట్టుచున్నట్టు లామెకుఁ దెలిసెను. అప్పు డామె తనసహోదరున కామాట నెఱిఁగించి యచటినుండి కొంత సైన్యమును దీసికొని దాని యాధిపత్యమును దానే స్వీకరించి ఫత్తేపురమున కరిగెను. అచట నీమెకును ఫతేసింహునకు

గొప్పయుద్ధము జరిగిన పిదప రాణీజయముం గాంచి యచటం జెఱలో నుండిన భర్తను విడిపించి మరల జయఘోషములతో పటియాలం బ్రవేశించెను.

౧౭౯౪వ సంవత్సరమున ఆనందరావు, లక్ష్మణరావులను మరాఠా సైన్యాధిపతులు విపులసైన్యసహితులుగ యమునానదినుత్తరించి పటియాలసంస్థానమును గెలుచుటకై వచ్చుచుండిరి. వారువచ్చునపుడు వారిశౌర్యమునకు వెఱచి కొందఱు సామంతరాజులు వారికి ధనము నిచ్చిరి. మఱికొందఱు వారి కనుకూల వచనములఁ బలుకుచు ననేకవస్తువాహనములను వారి కర్పించిరి. కాని యసమర్థుఁ డగు రాజునకు మంత్రిగానుండినయింతిమాత్రము వారికి వెఱచి లోఁబడునట్టిది కాక పోయెను. ఆమె మరాఠీవారి రాకనువిని మిగుల నాగ్రహించివారిని గెలుచుటకయి యత్నింపసాగెను. ఆమె శౌర్యధైర్యములం గని చుట్టుపట్ట నుండు రాజులును జమీందారులు గొంత సేనలతో నామెకుఁ దోడుపడిరి. ఇదియంతయు గలిసి ౭ వేలసైన్య మయ్యెను. దాని కంతకును దానే యాధిపత్యము వహించి రాణీసాహెబు కువరు అంబాల యనుపట్టణ సమీపమునం దున్న మర్దనపుర సమీపమున శత్రువుల నెదిరించి నిలిచి వారిత్రోవ నరికట్టెను. అచ్చట నారెండు సైన్యములవారికిని ఘోరసంగ్రామము జరిగెను. రాణీసైన్యమల్పమగుటవలనను యుద్ధవిద్యాభ్యాసము వారి కంతగా లేనందునను గొంతసేపు యుద్ధము జరిగిన పిదప వారు శత్రువుల దెబ్బలకు నాఁగియుండ నేరక నలువైపులకుఁ జెదరునట్లుగుపడిరి. అప్పుడు ధైర్యవతియగు నారాణి రథమునుండి దిగి ఖడ్గము నొఱలోనుండి తీసి ఝళిపించుచు శౌర్యోత్పాదకము లగువచ

నముల నాసైనికులతో నిట్లనియె. "సైనికులారా! నేను నా ప్రాణములు పోవునంతవఱకు నిచటనే యుండి పోరాడెదను. నేను మీరాజునకు సహోదరిని; స్త్రీని; నన్ను విడిచిపోవుట శూరులగు మీకు ధర్మము కాదు. యుద్ధమును విడిచిపోయినను మీకొకనాఁటికి మృత్యువు సిద్ధముగయే యున్నది. మీరిదివఱకు సంపాదించిన కీర్తి నేల మాపెదరు? ధైర్య మవలంబింపుఁడు. శత్రువులతోఁ బోరుఁడు." ఇట్లాడిన యామెవాక్యములవలన సైనికులకు శౌర్యస్ఫురణము కలిగి యాదినమంతయు యుద్ధము చేసిరి. నాఁ డుభయపక్షములయందును జాల ప్రజానాశము కలిగెను. ఆదిన మెవరికిని గెలుపు దొరకెనని నిశ్చయించుటకు శక్యము కాక యుండెను. నాఁటి రాత్రి రాణీసాహెబుకువరు సైనికు లామెతో 'మన కిఁక జయము కలుగదనియు నీరాత్రి మన మెచటికైనను బాఱిపోయి ప్రాణములను రక్షించుకొందమనియుఁ జెప్పిరి. కాని యాశూరనారి యావచనములు రుచింపక యారాత్రి శత్రువులపై నకస్మాత్తుగాఁ బడి వారిని వెళ్ళఁగొట్టుదమని తనసైనికులను బురికొల్పెను. అంత వారందఱును వేకువజామున సన్నద్ధులై నిర్భయముగా నుండిన మరాఠావారి శిబిరముపైకిఁ బోయిరి. ఈసైనికు లచటి కరిగి వారికేమి యపాయము చేయకున్నను వారిసైన్యముల జాగ్రతగా నుండినందున వీరిఁ జూచినంత మాత్రముననే మిగుల వెఱచి మరాఠావారిసైన్యము పాఱఁ దొడఁగెను. అప్పుడు రాణి తనకుఁ దోడుగా గొప్ప సైన్యము

వెనుకనుండి వచ్చుచున్నదనిన వదంతి నొకదానిని మరాఠా వారి సైనికులకుఁ దెలియునట్లుచేసెను. అందువలన వారు తమకు గెలుపు దొరకుట దుస్తరమని యనుకొని తెల్లవారిన తోడనే తమసైన్యమును వచ్చినత్రోవనే మరలఁ గొనిపోయిరి. రాణీసాహెబుకువరు జయము గాంచి విశేషవైభవముతో మరలి పటియాలకు వచ్చి మహావైభవముతో రాజ్యపరిపాలనము చేయుచుండెను. కొన్నిదినములు నడిచినపిదప నారాజ్యమునందు కొందఱు రాజద్రోహులై రాజ్యమునందంతట ననేక యుపద్రవములను జేయుచుండిరి. అప్పుడు రాణీసాహెబుకువరు తానుగొంతసైన్యసహితయయి నహానను పట్టణమున కరిగి యచట మూడునెలలు వసియించి యారాజద్రోహుల నందఱిని రూపడంగించి రాజ్యమును సుఖప్రదముగాఁ జేసి మరలి పటియాలకు వచ్చి యెప్పటివలె రాజ్యపాలనము చేయుచుండెను.

ఈమె రాజ్యము నేలుటవలన రాజునకు, సహచరులగు దుష్టులకుతంత్రము లేమియు సాగవయ్యె అందువలన వా రామెకు శత్రువులయిరి. చట్టాసంస్థానాధీశ్వరుఁడగు సరదార్ గురుదాసు సింహునిబిడ్డయు, రాజునకుఁ బత్నియునైన ఔస్కు-వరు రాజ్యము నేల సమర్థురాలును యువరాజునకుఁ దల్లియు నైనందువలన నామెయు నాఁడుబిడ్డ రాజ్యమేలుటకు సమ్మతింపదయ్యె. రాజ్యమునందంతటను రాణీసాహెబు కువరకు విరోధులు బహుజను లగుటవలన వా రామెపై ననేకదోషములను మోపసాగిరి. వారామెయందు ముఖ్యముగాఁ గనిపెట్టిన గొప్పనేర మేదనఁగా నహానుపట్టణములో జరిగిన మహాయుద్ధమునందు జయము గాంచినందుకై యచటిసామంత రాజావె

కిచ్చిన మత్తగజము నామెరాజున కియ్యక తానే యుంచుకొనుట ఆమె శౌర్యమహిమవలన దొరకిన బహుమతి నామె యుంచుకొనఁదగదఁట. ఆమె సహోదరుని యాజ్ఞను బొందకయే తనజహాగిరిలో నొకకోటను గట్టెను. ఈ రాజునకుఁ గోపము వచ్చుటకుఁ గారణమయ్యెను. రాజల్పబుద్ధి గలవాఁడుగాన తనకామె చేసినమేలును మఱచి యామె నాభర్తకడ కరుగుమని చెప్పెను. అందువలన నామె రాజధానిని విడిచి తనజహాగిరిలోనున్న కోటలోనికిఁ బోయి యచటనే వసియించెను. యామె యచటనుండి తనకేమి యపాయము చేయునో యని భయపడి రాజు కొంతసైన్యము తీసికొని యామెతో యుద్ధమున కరిగెను. కాని బుద్ధిమంతులు కొందఱతనితో స్త్రీతోడి కలహమున కరుగుట యుచితము గాదని చెప్పి యతని ప్రయత్నమును మాన్పి వారిరువురకును సంధిచేయ నెంచి రాణిని పటియాలకుఁ బిలువనంపిరి. కాని యామె పటియాలకు వచ్చుచుండఁగా రాజు తనను పిలిపించి చంపునని యామెకుఁ దెలిసినందున నామె మరలి తనకోటలోనికిఁ బోయెను. కాని రాజు మరల నామెను నమ్మించి తననగరమునకుఁ బిలిపించి కారాగృహమున నుంచెను. ఆమె యచటఁ గొన్ని దినములుండి యొకదినము తనబట్టలను దనదాసికి నిచ్చి దాసిబట్టలను దాను గట్టుకొని యుపాయముగా నందుండి బయలుదేరి తనకోటలోనికి వచ్చిచేరెను. తదనంతర మామె ౧౭౯౯వ సంవత్సరమునందు పరలోకమున కేఁగెను.

# కమలాదేవి

ఈమె సత్యవతి కాలము (సత్యవతి చరిత్ర చూచునది) నందే యుండెనని యూహింపఁబడుచున్నది. ఈమె భర్త ముర్షిదాబాదు సమీపమునం దొకగ్రామవాసియగు బ్రాహ్మణుఁడు; ఆయనపేరు జగన్నాధభట్టాచార్యుఁడు. ఈదంపతులకు ముగ్గురుపుత్రు లుండిరి. మానసింహుఁడనెడివాఁడువీరికిఁ గొంత భూమి ధర్మార్థముగా నిచ్చినందున వారు దానివలననే సుఖజీవనము చేయుచుండిరి. కమలాదేవి శాంతసుశీలాదిగుణములు గలదైనందున నాయూరివారందఱామెను మిగుల మన్నింపుచుండిరి అప్పుడాదేశపు ప్రభుత్వము కుంపనీవారిచేతికిఁ గ్రొత్తఁగా వచ్చెను. ఆసమయమున నొకగొప్పక్షామము సంభవించినందువలన పంటలు పండక జనులు మిగుల హీనస్థితికి వచ్చిరి. ఇదే సమయమని తలఁచి దొరతనమువారి యుద్యోగస్థులు కొందఱు క్షామమువలనఁ బీడింపఁబడిన జనులను దాను విశేషముగాఁ బీడించి, మిగుల బాధ పెట్టుచుండిరి. అప్పటి దొరతనమువారికి నింకను మనదేశభాష తెలియనందున వారు ప్రజలకుఁ గలుగుబాధలను తెలిసికొనఁజాల కుండిరి. ఇట్టి సమయమున ముర్షిదాబాదున గంగాగోవిందసింహుఁ డనుదుష్టుని యధికారము చెల్లుచుండెను. నాఁడుసుఖముగాఁగాలము గడపుచున్న జగన్నాధుని కుటుంబము నొక్కసారిగా దుఃఖసముద్రములోనికిఁద్రోచెను. అదెట్లనిన, వారి కాసంవత్సరము పంట

బొత్తుగాఁ బండనందున దొరతనమువారి కియ్యవలసిన పన్నిచ్చుటకు వారికి శక్తి లేక యుండెను. అట్టిసమయమున గంగాగోవింద సింహుఁడు పొలముపన్ను నెపమిడి వారింటఁగల సమస్తవస్తువులను వేలముపాడించెను. అందువలన వారికిఁ గట్టువస్త్రములుదప్ప రెండవవస్త్రమయినను లేకపోయెను. సద్గుణవతియగు నాకమలాదేవికి నొడలంతయు మూయుటకుఁ జాలినంతవస్త్రమైనను లేకయున్నందున నామెయింటినుండి బైటికి వెడలఁజాలకుండెను. ముగ్గురు పిల్లలును దెచ్చిన భిక్షాటనపుగింజలు వారికే కడుపునిండకుండెను. ఈదుఃఖమునంతను గని జగన్నాథభట్టాచార్యుఁడు ప్రాణత్యాగము చేయ నిశ్చయించెను. కాని కమలాదేవియతనికిఁగొంతధైర్యము సెప్పినందున నతఁడు కొన్నిదినములాఁగియుండెను. తుదకు దారపుత్రాదులదుఃఖముఁ జూడఁజాలక జగన్నాథభట్టాచార్యుఁ డెవ్వరికిని తెలియకుండనొకదినమునురి వేసికొని ప్రాణములను విడిచెను. అప్పుడు కమలాదేవి యపారమగు దుఃఖసముద్రమున మునిఁగియుండియుఁ దనపుత్రులు బెంగ పెట్టుకొనకుండ వారి నోదార్చుచుండెను. ఇట్లుండఁగా వారిలోఁ బెదవాఁడగు క్షేత్రనాథుఁడను వాఁడు తనపొలముల విడుదలకై ఢిల్లీకిఁ బోవలయునని తండ్రి చెప్పఁగా వినినందున ఢిల్లీకిఁ బ్రయాణముకాఁగా, కమలాదేవి పోవలదని చెప్పి యాపెను. కాని యాపండ్రెండు సంవత్సరముల బాలుఁ డామాటలను వినక యొకనాటిరాత్రి లేచి ఢిల్లీకిఁ బ్రయాణమయిపోయెను. కమలాదేవికి దుఃఖములపై దుఃఖములే వచ్చుచుండెను. కాని యామె మిక్కిలి ధైర్యవతిగాన నా యిరువురు పుత్రులను రక్షించుచుఁ బ్రాణములతో నుండెను. ఇట్లుండఁ గొన్ని దినములకు నా బాలకులు

అన్నము లేనందున మృతులైరి. అంత నామె కడుపులోనుండి వచ్చుదుఃఖమును బట్టజాలక మృతులైన బాలకుల నిద్దఱిని రెండు భుజములపై వేసికొని చేత నొకచిన్న కత్తినిఁ బట్టుకొని గంగా గోవిందసింహునిసమీపమునకుఁబోయి మిగుల కోపమురాఁగా నాకత్తితో నతనినిఁజంప నుంకించెను. అప్పు డామె జగన్నాథుని భార్య యని తెలిసికొని గంగా గోవిందసింహుఁడు మిగుల భయముచే దిగులొందెను. కాని యతనిసమీపమున నుండు బంట్రోతు లామెచేతికత్తినిఁదీసికొనియా బాలకులనొకరి కొప్పగించి యామె నచటనుండి వెడలఁగొట్టిరి. అప్పు డామె దుఃఖాతిరేకమువలన మతిభ్రమ కలదియై యన్నపానాదులను మఱచి వీధులలోఁ దిరుగు చుండెను.

గంగా గోవిందసింహుని క్రింది యధికారియగు దేవీసింహుఁడు సుందరులగు స్త్రీలనందఱినిఁబట్టి తెప్పించి యొకగృహమునం దునిచి, వారిని దొరలకడకంపి వారిశీలమును గొని దొరలయనుగ్రహము సంపాదించుచుండెను. ఇందువలన కమలాదేవిని సహితము దేవీసింహుని చారులు పట్టుకొనిపోయి యాగృహమునం దునిచిరి. అచట నామె దేవీసింహుని కపటము నెఱిఁగి యొక చిన్నకత్తిని దనయొద్ద దాఁచియుంచెను. ఒకదిన మామెను దేవీసింహుఁ డొకదొరయింటికి నంపెను. ఆదొర కమలాదేవి నంటరాఁగానామె కత్తితోనతని యురమునఁ బొడిచెను. కాని యతనియొడల దుస్తులు దళముగానుండినందున నతనికి విశేషాపాయముగాక కొంచెము గాయమయ్యెను. అంత నాదొర కమలాదేవి నంపి యట్టి స్త్రీనిఁ బంపినందుకు దేవీసింహునిపై మిగుల కోపపడెను. దేవీసింహుఁడు కమలాదేవిని

మరల నాగృహమునందే యుంచి యామె కనేక దుర్బోధలను జేయింపుచుండెను.

ఇట్లుండ దేవిసింహుని జమాదారగు లక్ష్మణసింహున కు కమలాదేవిపై మిగుల దయగలిగి యామెవృత్తాంతమునం తను నడిగి తెలిసికొని యామెయందు మాతృభావముగలవాం డయి గుప్తముగా నామె నచటినుండి తీసికొనిపోయి దీనాజ్ పురమునందున్న తనతమ్ముండగు రామసింహునివద్ద నుంచెను. తదనంతరము లక్ష్మణసింహుండును నుద్యోగము చాలించుకొని దీనాజ్ పురమునకు వచ్చి కమలాదేవికి సేవచేయుచు క్షేత్ర నాథుని వెదకుటకు మనుష్యుల నంపెను. ఇంతలో దేవిసిం హునిచారులు కమలాదేవిని వెదకెదరని వీరికిం దెలియంగా, సమీపారణ్యమున నొక కుటీరమును నిర్మించి యందుకమలా దేవిని యోగినివేషముతో నుంచిరి. అచట నామె కొన్నిరోజు లున్నపిదప క్షేత్రనాథుండు పొలములను విడుదల చేయించు కొని తల్లికడకు వచ్చెను. అప్పు డాతల్లికొడుకులు కొంతసేపు దుఃఖించి లక్ష్మణసింహునియందు మిగుల కృతజ్ఞత గలవారలై తమ గ్రామమున కరిగిరి.

# తారాబాయి

మహారాష్ట్రరాజ్య సంస్థాపకుఁడయిన శివాజీకిఁ బుత్రుఁడగు రాజారామున కీమె జ్యేష్ఠభార్య. తారాబాయి రాజ్యపాలనమునందు బహు నిపుణురాలని ప్రసిద్ధిఁగాంచెను. శివాజీ మరణానంతరము కొన్ని దినము లాతని ప్రథమ పుత్రుఁడగు సంభాజీ రాజ్యముచేసెను. కాని కొన్నిరోజులకు సంభాజీని ఢిల్లీశ్వరుఁడగు ఔరంగజేబుపట్టుకొనిపోయి బహుక్రూరముగా వధియించి యాతనిపుత్రునిని భార్యను తనయొద్దనే కైదులో నుంచెను. కాన సంభాజీ తమ్ముఁడగు రాజారాము రాజ్యము పాలింపుచునుండెను. రాజారాము పరిపాలనదినములు ప్రజల కతిసంతోషకరములై యుండెను. కాని క్రీ. శ. ౧౭౦౦వ సంవత్సరమునం దతఁడు దీర్ఘవ్యాధిచే మృతుఁ డగుట తటస్థించెను. మరణకాలమునందు రాజారామునకు జ్యేష్ఠభార్యయగు తారాబాయియందుఁ గలిగిన శివాజీయను ౧౦ సంవత్సరముల పుత్రుఁడును, ద్వితీయభార్యయగు రాజసాబాయి యందుద్భవించిన సంభాజీయను 3 సంవత్సరముల సుతుఁడునునుండిరి.

రాజారాముగారి యనంతరమునందు తారాబాయి తనపుత్రునిని సింహాసనమునం దునిచి, తాను రామచంద్రపంతు, శంకరాజీ, నారాయణ, దనాజీ, జాధవ్ మొదలగు ప్రధానుల సహాయమున రాజ్యము చేయుచుండెను. ఆమె యొక్కస్థలముననే కూర్చుండియుండక ప్రతికోటకును దానే

స్వయముగాఁబోయి యచట నావశ్యకములయిన వాని నరసి తగిన బందోబస్తు చేయుచుండెను. ఇదిగాక యామె సైన్యముల నంపి మహమ్మదీయ సైన్యములను గెలుచుట కారంభించెను. ఔరంగజేబొకవైపున నీమెకోట నొకదానిని గెలువఁ బ్రయత్నించునంతలో రెండవవైపాతని స్వాధీనములో నుండిన కోటల నైదాఱింటిని తారాబాయి గెలుచుచునుండెను. రామచంద్ర పంతోకపర్యాయము మహమ్మదీయులకు సహాయము చేయుచున్నాఁడని తోఁచి తారాబాయి కాతనియందు కొంచె మనుమానము కలిగియుండెను. కాని పిదప నాతఁడు పన్నాళ పావనగడ లనుదుర్గములను బహుశౌర్యముతో గెలుచుటఁ గని యామెకు నాతనిపైఁ గలిగిన యనుమానమును వదలి అత్యంత విశ్వాసాస్పదునిగా నతనినే స్వీకరించి విశేష బహుమానము చేసెను. పిమ్మట నామె పన్నాళ కిల్లాలోని కరిగి యచటనే యుండెను.

ఇట్లు కొన్ని సంవత్సరములు గడచిన పిదప ఔరంగజేబు మరణానంతరము సంభాజీ కొమారుఁడగు శాహు విముక్తుఁడయ్యెను. అతఁడు తన రాజ్యమునకువచ్చి పినతల్లిని తన రాజ్యము తన కిమ్మని యడిగెను. అప్పుడు రాజ్యపాలనదక్షురాలగు తారాబాయి రాజ్యమిచ్చుటకు సమ్మతింపక నీవు నిజమయిన శాహువు కావనియు వేషధారివనియు కొన్ని యాటంకములు చెప్పెను. కాని శాహునకుఁ గొందఱు సరదార్లు స్వాధీనులయినందున తారాబాయికిని, శాహుకును యుద్ధము జరిగెను. అప్పుడు తారాబాయి సాతారాపట్టణమును దన బావకొడుకగు శాహునకు వదలి కోలాపురమున తన కొమా

రుఁడగు శివాజీకొఱకు రెండవరాజ్యము స్థాపింపవలసిన దయ్యెను. ఆరాజ్యము నేఁటివఱకును నడుచుచున్నది.

కోలాపురమున తారాబాయి శివాజీకి రాజ్యముకట్టి రామచంద్రపంతు సంక్రాజీ నారాయణులను మంత్రులు తన పక్షము నవలంబించి తనకు సహాయులయియుండ రాజ్యము నేలసాగెను. కోలాపురమునకు సమీపమునందుండిన రాయగడ కిల్లా మహారాష్ట్రరాజ్యమునకు మూలస్థానమైనందున దానిని గెలువవలయునని శాహు ప్రయత్నించుచుండెను. ఈ సమయమునందనఁగా క్రీ. శ ౧౭౧౨ వ సంవత్సరమునందు మశూచికా జాడ్యమువలన తారాబాయి కొమారుఁడగు శివాజీ మృతుఁడయ్యెను. ఈ దుఃఖములో నామె యుండఁగా తారాబాయిని రాజ్యమునుండి తీసి యామె సవతి కొమారుఁడగు సంభాజీకి రాజ్యము నిచ్చి రామచంద్రపంతు తానే రాజ్యము నడుపుచుండెను. ఆసమయమున తారాబాయి గర్భిణిగా నుండిన తనకోడలిని శత్రుభయముచేత నజ్ఞాతవాసములో నుంచెను. అక్కడనే యామె ప్రసవమై మగశిశువును గనెను. ఆశిశువుగూడ నజ్ఞాతవాసములోనే పెరుగుచుండెను.

క్రీ. శ. ౧౭౪౯వ సంవత్సరప్రాంతమున శాహు విధికరిగెను. అతనికిఁ బుత్రసంతానము లేనందున నజ్ఞాతవాసములో నుండిన తారాబాయి మనుమఁడగు రామరాజును సాతారాకు రాజునుజేసి తారాబాయి యతని పేరిట తాను రాజ్యము నేలసాగెను. కాని యారాజ్యమునకు వంశపరంపరాగత మంత్రియగు బాలాజీ బాజీరావ్ పేష్వా ప్రబలుఁ

డయి రాజుపేరిట తానే రాజ్యము నేల యత్నించెను. ఇందు వలనఁ దారాబాయికిని పేష్వాకును ప్రబలవైరము సంభవించెను. అందుపై తారాబాయి సింహగడయందుండిన తన పతియొక్క సమాధిని దర్శించు మిషతో నచటికి కరిగి యచటి యామాత్యుని సహాయమువలన రాజ్యమును తానేల యత్నించెను. అప్పు డాసంగతి నెఱిఁగి బాలాజీ పేష్వా వైరముచే నీమె చిక్కదని తలఁచి మంచిమాటలచే నామెను పూనాకుఁ దీసికొనిపోయి రాజ్యమునందలి యనేకసంగతులు నీ యాజ్ఞప్రకారమే చేసెదనని చెప్పి యామెను సమాధానపఱచుకొని రాజు నా యాజ్ఞప్రకారము నడువ వలయునని చెప్పెను.

ఈ సమయమునందు రామరాజు (తారాబాయి మనుమనిపేరు) సాంగోళేయను గ్రామమునందుండెను. రామరాజునకు రాజ్యవ్యవస్థ తెలియనందువలన తనకుఁ గొంత జహగిరి వదలి రాజ్యమునంతను పేష్వాను చేయుమని యతఁడు వ్రాసి పంపెను. ఆప్రకారమే పేష్వా రాజయ్యెనుగాని యతనికి జహగిరి యియ్యకుండెను. తదనంతరము రామరాజును కొంత సైన్యముతోడ సాతారకంపెను. అచట నతనికిఁ బట్టణమందయుఁ దిరుగుట కనుజ్ఞమాత్ర మిచ్చెను. అటుపిమ్మట పేష్వా ఔరంగబాదునకుఁ బోవుట తటస్థమయ్యెను. ఆసమయమునఁ దారాబాయి రామరాజు నడిగి యతనికి స్వతంత్రేచ్ఛ లేదని తెలిసికొనియెను. వెంటనే యావృద్ధనారి దామాజీగాయిక్వాడునకు "ఇచట నీకుఁ బ్రతిపక్షులు లేరుగాన మరాఠేల రాజ్యము బ్రాహ్మణుల (పేష్వాల) పాలుగాకుండఁ గాపాడవల

యును” అని యుత్తరము వ్రాసియంపి రాజును పట్టణములో నుండి కిల్లాలోనికిఁ బిలిపించి యిట్లు తిరస్కారోక్తులం బల్కెను. “ఓరీ! నీవు శివాజీవంశీకుఁడవు కావు. నేను నామనుమనిని హీనులయింట దాఁచితిని. కాని వారు నాపిల్లని నుంచుకొని తమపిల్లని నే నాకిచ్చిరి కాఁబోలును. నేనది విచారింపక నిన్నింతటి పదవికి నెక్కించి మిగుల వ్యసన పడవలసినదాన నయితిని. హీనకులుని శివాజీవంశస్థునిగాఁ జేసిన పాపమున కిఁక నేను కృష్ణాతీరమునకునరిగి ప్రాయశ్చిత్తముచేసికొనవలయును” ఇట్లని యామె రాజును వెంటనే కారాగృహవాసినిఁ జేసెను. పిమ్మట నాయువతికిల్లా యధికారినిఁబిలిచి రాజుసహచరులపైని, గ్రామములోఁగ, కోకణస్థబ్రాహ్మణ (పేష్వా) పక్షపాతులకు వారిగృహములపైని పిరంగిగుండ్లనువేసి నిర్మూలము చేయుమని యాజ్ఞాపించెను. ఈవార్త నాపురమునంగల కొందఱు పేష్వా పక్షము వారు విని ఈముసలమ్మకు మతిచెదిరి యేదియో యనుచున్నదని తలఁచిరి. కాని సైన్య సహితుఁడయి గాయికివాడ్ వచ్చుటను విని వారందఱును కొంతసైన్యము సిద్ధపఱచి కృష్ణాతీరమునందుండిన పాహోళేయను గ్రామమునందు యుద్ధసన్నద్ధులై యుండిరి. దమాజీగాయకవాడ్ పదునైదువేలసైన్యముతోఁ బారోళేయను గ్రామమును సమీపించెను. అప్పుడా యుభయసైన్యములకుఁ గొంతకలహము జరిగినపిమ్మట దమాజీ ప్రతిపక్షబలంబుల నోడించి సాతారాలోనికిఁ బ్రవేశించెను. ఈయనపోయి తారాబాయినిం గలిసినవెంటనే యీమె సాతారాసమీపమునందలి రెండుమూఁడు దుర్గములను వశపఱచుకొనియెను. ప్రతినిధి తారాబాయి కనుకూలుఁడగుటవిని పేష్వా

బహుత్వరగా సాతారాకు రావలసినవాఁ డయ్యెను. పేష్వా సాతారాను సమీపించి దామాజీ గాయికవాఁడను ఓడించి యతనిని బాధించి పూనాకుఁబంపెను. తదనంతరము తారా బాయితనకు వశపడుటకై పేష్వా పెక్కుపాయములనుబన్నెను. కాని యీ స్వాభిమానముగల వనిత యెంతకును స్వాధీనపడ కుండెను. సరదార్లందఱా మె కనుకూలురై యుండినందున బలాత్కారముగా నామె నీవలకుఁదీయుట యుచితముగాదని పేష్వాకుఁ దెలిసియుండెను. అందువలన నతఁడు మరాఠీ వాని (సాతారాకోలాపురపు) రాజ్యములలోని కనేక పర్యాయములు బందిపోట్ల నంపి గ్రామములు కొల్లగొట్టించి తారాబాయిని, కోలాపురాధిపతియగు సంభాజీని వశపఱచుకొనెను.

పేష్వా గాజీయుద్దీనుపనికొఱకు ఔరంగబాదున కరుగఁగా నా సమయమున తారాబాయి అయిదువేలసైన్యమును పోగుచేసి వాయి, సాతారాలను రెండుపరగణాలను తన స్వాధీనము చేసికొనెను. పిమ్మట బాలాజీ పేష్వాపూనాకువచ్చి కర్ణాటకముపైకి దండు వెడలుటకంటెను తారాబాయిచేఁ జిక్కిన కోటలను గెలుచుట యావశ్యకమని తలఁచెను. అంత నతఁడు సాతారాకు విశేషసైన్యములనంపి కిల్లాలోనికి నన్నసామగ్రి పోవకుండ నాపెను. అప్పుడచటి దుర్గాధిపతి యుద్ధము చేసినందున ఫలము లేదనుకొని రాజును తారాబాయియొక్క కిల్లా బైటికిఁ దీసికొనిపోవయత్నించెను. ఈసంగతి యేలాగుననో తారాబాయికిఁ దెలిసి వెంటనే యతనిని మరణదండనకు గురి చేసెను. అంత పేష్వా తారాబాయిని గెలుచుట దుస్తరమని తలఁచి అప్పటి కాసంగతిని విడిచి కర్నాటకముపై కరిగెను.

ఇట్టిశూరవనిత మొదట తనకొమారుని పేరిటను, పిదప మనుమని పేరిటను రాజ్యంబుజేసి ఔరంగజేబువంటి సార్వభౌమునితోడను, పేష్వాలవంటి మహాబలవంతులతోడను సమానముగాఁ బోరాడి స్వాభిమానమునకయి ప్రసిద్ధిపడసి యెనుబదిమూఁడు సంవత్సరములవఱకుఁ బ్రతికి క్రీ. శ. ౧౭౬౧వసంవత్సరమునందు మృతిఁజెందెను.

# గనోరు సంస్థానపు రాణి

ఈ శౌర్యశాలినియగు సతీరత్నము చేసిన శౌర్యసాహసములు దక్క విశేషచరిత మేమియుం దెలియదు. ఈమె పేరేమియో, జననిజనకుల పేళ్ళేమియో తెలిసికొనుటకుం బ్రస్తుతమేమియు సాధనములు కానరానందున నామె స్వల్పచరితము నిందుం దెల్పెదను.

మధ్యహిందూస్థానము నందలి బోపాలసమీపమున పూర్వము గనోరుసంస్థానమను నొకహిందూరాజ్యము నుండెను. మహమ్మదీయులు హిందూస్థానమునకు వచ్చి స్వదేశపురాజుల పాలనలో నుండిన రాజ్యములను తాము స్వాధీనపఱచుకొను కాలములోని చిన్నసంస్థానము కొంతవఱకు ధైర్య మవలంబించి స్వతంత్రముగా నుండెను. మొగలులు ఢిల్లీ ప్రవేశించి యచటి తురుష్కులను వెడలంగొట్టంగా వారు హిందూస్థానము నలుగడలం జేరి వారివారిశక్త్యనుసారముగా రాజ్యములం గెలిచి జనుల ననేకబాధలకు లోను జేసిరి. ఇట్టివారిలోం జేరిన యొకమహమ్మదీయుండు మధ్యహిందూస్థానమునకు వచ్చి గనోరు రాజ్యమును గెలిచి యచట తనరాజ్యమును నిలుపవలయునని యత్నించెను. కాని యాసంస్థానమును గెలుచుట యాతం డనుకొనినట్లు సులభముగాక మిగుల దుస్తరమాయెను. తురకలు తనరాజ్యముపై యుద్ధమునకు వచ్చుట విని గనోరురాజు మిగుల రోషముతో వారితోడ యుద్ధమునకుం జనెను. అందు

వలన రక్తప్రవాహము కానిదీ గనోరురాజ్య మొక యడుగయి నను వారికిఁ జిక్కదయ్యెను. గనోరురాజాసంగ్రామమున తన శౌర్యసాహసములనంతను వినియోగించి చూచెను. కాని యా దినములు మహమ్మదీయులకు సుదినము లగుటవలన నాశౌర్య నిధియగు భూపాలుఁడు వీరస్వర్గమునకుఁ జని తురకలకే జయము ప్రాప్తించెను.

రాజు శూరసైన్యసహితముగా హతుఁ డగుట విని యాతని రాణి మిగుల దుఃఖించెను. కాని యాధైర్యవతి తన దుఃఖమునంతను మ్రింగి మరల క్రొత్తసైన్యమును సిద్ధపఱిచి తా నాసైన్యాధిపత్యమును స్వీకరించి హతశేషులగు తమసైనికులుమహమ్మదీయులతోఁ బోరాడుచున్న స్థలమునకుఁ జనెను. రాణిగారు సైన్యసహితముగాఁ దమకు సహాయమునకు వచ్చుటఁగని యావీరులు మఱింత శౌర్యముతోఁ బోరఁ దొడఁగిరి. రాణిగారును తనభర్తవలెనే యుద్ధమునందు మిగుల నేర్పుగలది యగుటవలన నామెధైర్యమువలన గనోరుసైన్యము మిగుల పెంపుతోఁ బగర నడవఁ దొడఁగెను. కాని మ్లేచ్ఛసైన్యమధికమగుట వలన వారిప్రయత్నమంతయు వృథయై రాణిగారు కోటలలో నైదుకోటలు తురకల పరంబులయ్యెను. తుదకల్పసైన్యముతో రాణిగారుమాత్రము జీవించియుండెను. అప్పటికిని నామెధైర్యమువిడనాడక యుద్ధము చేయుచుండెను. మఱికొంత సేపటికి మహమ్మదీయులు మనసు పట్టుకొందురని రాణిగారికిఁ దోఁచి తన స్వాధీనములో మిగిలియున్న నర్మదాతీరపుకోటలోనికిఁబోయెను. ఆమె నర్మదాదాఁటి కిల్లాలోనికిఁ బోయినవెంటనే మహమ్మదీయు లాకోటను చుట్టుముట్టిరి. పగవారు సమీపించినందున

రాణి తీవ్రముగాఁ గోటలోని కరిగి ద్వారముల నన్నిఁటిని మూసి కొనెను. ఈతొందరలో సైనికు లనేకులు కోటబయిట నుండుటచేఁ బగవారిచే నతిక్రూరముగాఁ జంపఁబడిరి.

కోటలో నత్యల్పసైన్యము రాణిగారికడ నుండెను. ఆస్వల్పసైన్యముతోడ రాణి కొంతవఱకు సంగ్రామము నడపెను. కాని దానిని లక్ష్యపెట్టక విజయులగు నామ్లేచ్ఛులు కోటకు నిచ్చెనలు వేసి వేలకొలఁది కోటలోనికిఁ జొచ్చిరి. ఆసమయమునందు రాణిగారికి శరణు చొచ్చుటకంటె నొండుమార్గము లేనందున "కోటను మీస్వాధీనము చేసెదను; యుద్ధము నాపు" డని యాసైన్యాధిపతియగు తురుష్కునకు నొకదూత పరమున నంపెను.

రాణిగారివద్దనుండి వచ్చిన కబురువిని యాఖానుసాహేబు మిగుల సంతసించెను. వాఁడదివఱకు రాణిగారి యసమానరూపము విని యామెపై నధికమోహము కలిగియుండెను. కాన వాఁడు సంకోచపడక ఆవచ్చినదూతతోడ నిట్లని చెప్పిపంపెను. "తమ యధిక సౌందర్యమునకు నేను మెచ్చితిని. మీ రిదివఱకు మహారాజ్ఞీపదవియం దుంటిరి. కాన నేను జీవించియుండు నంతవఱకు నా పదవియే కలిగి యుండవలయును. నేను సేవకునివలె నీ గనోరురాజ్యము నేలెదను." ఈవాక్యములు వినఁగానే రాణిగారా దుష్టుని యభిప్రాయ మెఱిఁగెను. కాని యామె తానేమి చేయుటకును దోఁచక కొంతసే పేమియో యోచించి తురుష్కులపై నామెకుఁ గలకోపవహ్ని నార్పునుపాయము నొండు గానక నామ్లేచ్ఛుని నొకకపటోపాయముతోఁ జంప నిశ్చయించెను. ఇట్లు కృతనిశ్చయయయి యాదూతతోడనే ఖానున

కిట్లు చెప్పి పంపెను. "నేనును మీయతుల పరాక్రమము విన్నది మొదలు మీభార్య నగుటకుఁ దొందర పడుచున్న దానను. క్షత్రియస్త్రీలు పరాక్రమవంతులనె మెచ్చెదరు. నావంటి స్త్రీని వివాహ మగుటకుఁగా మీ రొప్పినదే నా కొక సన్మానమని తలఁచెదను. కాని మనవివాహప్రయత్నము చక్కఁగా జేయుట కయి నాకు కొంత యవకాశ మియ్యవలయును."

ఖానుసాహెబు మిగుల సంతోషముతో రాణిగారు చెప్పినట్లంతయు నొప్పుకొనెను. వానికి నాటిని బోలినసంతోష దినము జన్మించినది మొదలు ప్రాప్తించకుండెను. కాని వాఁడు రాఁబోవు సౌఖ్యసముద్రములో మునిఁగియుండెను. ఇట్లాతఁ డానందమగ్నుఁడయియున్న కాలములో లగ్ననిశ్చయమునకని రాణిగారివద్దినుండి రత్నఖచితమగుమస్సు ఖానునకు వచ్చెను. దానిం గనినపిదప నాతని సంతోషమునకుఁ బారము లేదయ్యెను. అప్పుడు రణవాద్యములును, ఘోరనాదములును నెచ్చటలేని మంగళవాద్యములును, శుభవాక్యములును నలుగడల వినఁబడుచుండెను.తమసైన్యాధిపతి వివాహదినము గాన నామ్లేచ్ఛసైనికులు మదిరాపానముచే శరీరభ్రాంతి లేకయుండిరి. ఖానుసాహెబు మిగుల నానందముతో రాణిగారంపిన దుస్సు ధరించి వివాహమున కెప్పుడు పిలుపు వచ్చునాయని నిరీక్షించుచుండెను.

ఇంతలో రాణిగారివద్దినుండి పిలుపు రాఁగాఁ బరమానందముతోఁ బురుషుఁడు వివాహమంటపముకడకు వచ్చెను. అచటికి వచ్చి యాతఁడు రాణిగారినిఁ గని తానదివఱకు వినిన దానికంటె నామె విశేషసౌందర్యవతిగా నుండుటవలన నాతనికి

విశేషానందము కలిగెను. నర్మదయొద్ద నంటియున్న యొక విశాలభవనమునం దీవివాహప్రయత్నము చేయఁబడెను. రాణి సర్వాలంకారయుత యయి యొకమంచముపయి కూర్చుండి యుండెను. ఇతర రాజస్త్రీలును, దాసీలును పైని మంచి తివాచిపఱచిన యొక యుచ్చస్థలమునఁ గూర్చుండిచేత నొక్కొక గివిటీలను పట్టుకొనిరి. ఖాను రాఁగానే రాణిగా రాతని నొక మంచముపై కూర్చుండ నియమించెను. ఖానుసాహేబు రాణి గారి వాక్యములను శిరసావహించి మంచ మెక్కెను. ఆమంచ ముపై కూర్చుండి రాణిగారితో నేమో కొంతసేపు మాటాడిన పిదప నాదుష్టుని శరీరమునం దంతటను తాపముపుట్టి శరీరము నల్లఁబడి నాలుక లోనికి గుంజసాగెను. వాఁడు మరణవేదనకుఁ దాళఁజాలక నేలఁబడి పొరలఁదొడఁగెను. అప్పుడు రాణి వాని సమీపమున కరిగి మిగుల కఠినముగా వాని కిట్లనియె. "పాపీ! నీపాపఫల మనుభవింపుము. ఓ చెడుగా! నీకు మృత్యువు సమీపించెను. నీవు తొడుగుకొనిన వస్త్రంతయు విషముపూసినది. కాన నావిషమంతయు నీశరీరమున నిండెను. కనుక నింక నీవు జీవితాశను వదలుము. నాపాతివ్రత్య రక్షణమునకు వేరుపాయము గానక యీనింద్యకార్యమునకుఁ దెంపుచేయవలసె" ఖానుసాహేబుగారి యవస్థఁగని యాతనిసేవకులు కొంతవడి దిచ్చవడి యూరకుండిరి. వారు తెలివితెచ్చుకొని యాగడము చేయ నెంచునంతలో రాణిగారు గవాక్షములోనుండి నర్మద లోనికిఁ దుమికిరి. అంత నామ్లేచ్ఛభటు లేమిచేయుటకుఁ దోఁచక నచటనున్న యితరస్త్రీలను బాధింప నెంచిరి. కాని యాస్త్రీలు తుపాకిమందు గోనెలపైఁ గూర్చుండి యుం

డినందున వారు తమచేతి దివిటీలతో నామందు గాల్చిరి. అంత నగ్ని ప్రజ్వరిల్లి యాస్త్రీలును అచట నుండిన మ్లేచ్ఛభటులును నొక్కసారిగా నాశ మొందిరి ! !

ఇట్లు తేజోమయురాలగు రాణి పరాజయ మొందియు, పగవానిచేఁ జిక్కియుఁబిగుల యుక్తిగా నాపగతునిఁ జంపి పాతివ్రత్యమును గాపాడుకొనెను!! ఇట్టిపతివ్రతలే ధన్యలుగదా?

# జనరేశ్వరి

ఈయువతీరత్నము ప్రసిద్ధుఁడగు అక్బరుకాలమునం దుండెను. ఈమె వాస్తవమగు నామ మెవ్వరికినిఁ దెలియదు; గాని యామెను లోకులు గ్రామదేవతయగు జనరేశ్వరి పేరనే పిలుచుచుండిరి. ఆకాలమునందు బంగాలీదేశమున మాండలికులుగానుండి యక్బరునకు కప్పము నిచ్చుచుండిన రాజులలో జనరేశ్వరికి భర్తయు, జేసోర్ సంస్థానికుఁడును నగు విక్రమాదిత్యుని పుత్రుండయిన ప్రతాపాదిత్యుఁ డొకఁ డయియుండెను.

ప్రతాపాదిత్యుఁడు మిగులబలవంతుఁడే గాని యాతని బలశౌర్యములకుఁ దోడుసద్గుణము లలవడక జన్మముతో దుష్కారములే వృద్ధియగుచుండెను. ఈయన పూర్వులకెవ్వరికో గ్రామదేవతయగు జనరేశ్వరి ప్రత్యక్షమయి మీవంశమున నెన్నఁడేని పాపాచరణ జరిగిన నేను గ్రామము విడుతుననియు, నా విగ్రహపుముఖము మఱియొక వైపునకుఁ దిరిగిన నేను గ్రామమును విడిచితినని తెలిసికొనవలెననియుఁ జెప్పెనని యొకవాడుక కలదు. ప్రతాపాదిత్యుని దుష్ప్రవర్తనఁ గనినవా రందఱును త్వరలోనే గ్రామదేవత గ్రామమును విడిచి పోవునని భయపడుచుండిరి. రాణి జనరేశ్వరి తనభర్త యిట్టి దుష్టుఁడయినను నాతనియెడ నిసుమంతయుఁ దిరస్కారభావము లేనిదయి సదా యాతనిని సన్మార్గమునకుఁ ద్రిప్ప యత్నించుచుండెను.

సుగుణమణియగుపత్ని యనేకవిధముల హితములు బోధింపుచున్నను ప్రతాపాదిత్యుఁడు వాని నన్నిఁటిని పెడచెవులఁ బెట్టి దుష్ప్రవర్తనమును మానకుండెను. ఆతఁడు ద్రవ్యాశచే మిగుల సైన్యమును గూడుకొని పల్లెలు, పట్టణములు కొల్లగొట్టసాగెను. ఆతని వర్తనము నెఱిఁగి కొందఱుబందిపోటుదొంగలాతనికి సహాయులు కాఁగా నాతఁడు దక్షిణబంగాళాదేశమునంగలసామంతరాజులను, జమీన్దార్లను, కొల్లగొట్టి తాను వారికి ప్రభువనని వారిచేఁగప్పములఁ గొనుచుండెను. ఆయనకుబుఱుతకీచులు (పొరుచుగీజులు)ను తోడుపడుటచే నాతఁడు బంగాళాప్రాంతమునకు సుబేదారుగానుండినమహమ్మదీయునికిసహితము మిగుల భయప్రదుఁడుగా నుండెను. తుదకాతఁడు బాదుషాకు పన్నుగట్టక స్వతంత్రతను వహించెను.

ఆదుష్టుఁ డంతటితో నయిన నూరకుండక పినతండ్రియగు బసంతరాయులయెడ ద్రోహము తలఁచెను. బసంతరాయులు మిగుల సజ్జనుఁడును రాజవంశమునందలి వృద్ధుఁడును నగుటచే ప్రజ లాతనియం దధిక భక్తి గలవారై యాతనిని విశేషముగా గౌరవింపుచుండిరి. ఆభీష్మునకుఁ దనయన్నకుమారుని చేష్టలెంతమాత్రమును నిష్టము లేక యనేక పర్యాయము లాతనికి బుద్ధిచెప్పి చూచెనుకాని, యందువలన ఫల మెంతమాత్రమును గలిగినదికాదు. ప్రతాపాదిత్యుని కాతనిమాటలవలన ద్వేషము గలిగి తనప్రజలు పినతండ్రియొక్క సత్స్వభావము నెఱిఁగి తనను పదచ్యుతులను జేసి రాజ్యమాతని కిచ్చెదరేమోయని తలఁచి యాతనిఁజంప నిశ్చయించెను.

జనరేశ్వరికి భర్తచేయు దురాలోచన తెలిసి తన్నివారణార్థమై యనేకమార్లతని కనేక హితబోధ లొనర్చియు, వేడుకొనియుఁ జూచెను. కాని యందువలన ఫలమెంత మాత్రమును గలుగుజాడ కానరాదయ్యెను. జనరేశ్వరియందును కొంతయు జింతింపక పతిచేత నట్టిదుష్కార్యము కాకుండ నొక యుపాయముఁ యోచించెను.

బంగాళాదేశమునందు బహుదినములనుండి నడచుచుండిన యొకయాచారము కలదు. అది యిప్పటికిని ఆదేశమునందచ్చటచ్చట నడచుచున్నదఁట. అది యేదనగా నొకస్త్రీ తన కార్యము నొకశూరపురుషునిచేఁ జేయించఁగోరినప్పు డామె తనచేతి కంకణము నొకదాసినిచ్చి శూరులసభకు బంపును. దాసిం గొని చని యొకదాసి యాశూరులమధ్యం బడవేయును. తదనంతర మచటి శూరులలో నొకఁడా కంకణమును తీసికొని కంకణమంపిన స్త్రీ యెట్టిదుర్ఘటమైన కార్యము నిర్వహింప నంపినను నిర్వహించెదనని ప్రతిన చేయును. జనరేశ్వరి దీనినంతను విచారించి తన నాయుపాయముచేయ నెంచెను. తదనంతర మొకదినము రాణిగారి యాజ్ఞవలన నామె కంకణమును దాసికొనివచ్చి ప్రతాపాదిత్యుని కొలువుకూటమునం బడవేసెను. దానిగని సభికులందఱు మిగుల వింతపడి రాజువంకఁ జూచుచుండిరి. ప్రతాపాదిత్యుఁడు తిరస్కారముగా దానికయి చూడకుండెను. తుదకాసభయందలి శూరుఁడొకఁడు లేచి మెల్లఁగా ముందడుగిడెను. ఆలేచినవాఁడు రాణిగారి సహోదరుఁడును, ప్రతాపాదిత్యుని సేనానియునై యుండెను. అతఁడప్పుడు లేచి కంకణము నెత్తి రాజువంకఁ దిరిగి యిట్లని వక్కా-

ణించెను. "ఈ కంకణము తమపత్ని కడనుండి వచ్చెను. రాణిగారి కిట్టిసంకటమేమి వచ్చినదో తెలియదు. ఆమె సంకటమును నివర్తింప తమరే దీని నెత్తెదరని యెదురు చూచుచుంటిని. కాని తాము దాని నెత్తుజాడ కానరానందున నేనెత్తవలసినవాఁడనయితిని. అదేలననఁగా యెవ్వరును నెత్తకుండిన నింతసభయందు శూరుఁడులేనట్లర్థమగును. కాన నేనెత్తి యిట్లు ప్రతిజ్ఞఁ జేయుచున్నాను. నాబొందిలో ప్రాణమున్నంతవఱకు రాణిగారి యిచ్ఛితకార్యమును నెరవేర్పక మానను."

సేనాపతి ప్రతిజ్ఞనువిని రాజు మనమునందు మిగుల కోపించెను. కాని యాతఁడు తనమఱఁది కేమియు ననుటకు సాహసింపఁడయ్యె. దీనినంతను గని కంకణము తెచ్చినదాని మిగుల సంభ్రమముతో రాణిగారియిచ్ఛితకార్యమును సభవారి కిట్లు నివేదించెను. "రాణిగారి యిచ్ఛితకార్యమును వినుఁడు ఈకంకణము నెత్తిన వీరపురుషుఁడు రాజావసంతరాయులను, ఆతని కుటుంబమును రక్షించుటకయి తమప్రాణమున్నంత వఱకును ప్రయత్నింపవలయును" "ఆమె యిచ్ఛ ప్రకారమే జరుగున"ని యా సేనాధిపతి తనసంస్థానమునఁ గూర్చుండెను.

ఆదినము సభచాలించి రాజు రాణినగరునకు వచ్చెను. ప్రతాపాదిత్యుఁ డితరుల కెంతభయంకరుఁడయినను తనపత్ని ముందర నాభయంకరత యేమియు లేక మిగుల సాత్వికుఁడుగా నుండుచుండెను. ఇదియంతయు జనకేశ్వరి యొక్క నేర్పుచాతుర్యమువలననేకాని మఱివేరుకారణముచేఁగాదు. ఎట్టికష్టులును ఆమెను గనిన సమయమునందు శిష్టులుగా నుండుచుండిరి.

ప్రతాపాదిత్యుఁడు రాణిమనస్సు మరల్ప ననేకయుక్తులను బన్నెను కాని వానివలనఁ బ్రయోజన మెంతమాత్రమును గానరాకుండెను. అందుపై నాతఁడామెనుభయ పెట్టియు, బతిమాలియు, వసంతరాయులను జంపిన యెడలఁ దమకుఁ గలుగులాభములను దెలిపి వసంతరాయులు బ్రతికియుండఁగా నాకుసుఖము కలుగదని చెప్పెను. కాని రాణి తననిశ్చయమును విడువక "మీకు సుఖము కలిగినను దుఃఖము కలిగినను మీచే నట్టి పాపకార్యము జరుగనియ్యన" నిస్పష్టముగాఁ దెలియఁజెప్పెను.

బహిరంగముగాఁ బినతండ్రినిఁ జంపుట దుర్ఘటమని తలఁచి ప్రతాపాదిత్యుఁడు కపటమును బన్నెను. అతఁడు తానదివఱకు చేసిన దుష్కార్యమునకుఁ బశ్చాత్తాపపడినట్టుల నటించుచు వసంతరాయుల సన్నిధికరిగి మిగుల వినయముతో నాతనికి నమస్కరించి క్షమియింపుఁడని వేఁడుకొనెను. కొమారునిపశ్చాత్తాపమున కెంతయు సంతసించి వసంతరాయు లాతనిని మిగుల గారవించెను. అందుపై రాజు పినతండ్రిని నేఁడు తమరు నాయొద్దభోజనమునకు వేంచేయుఁడని వేఁడుకొనఁగాఁ గపట మెఱుఁగనియావృద్ధ రాజందుకు సమ్మతించెను.

ప్రతాపాదిత్యుఁడు పై కెంతసాధుస్వభావముఁ దాల్చినను ఆతని దుస్స్వభావము నెఱిఁగిన రాణి వసంతరాయుల పుత్రునిఁ దెచ్చి తనవద్ద దాచియుంచినపిదప భర్తను పినమామగారి వద్దికి పోవ నిచ్చెను. తదనంతరము వసంతరాయులువిందారగింప బయలుదేరెను. అప్పు డాయనకుఁ బ్రతాపాదిత్యుపై యించుక సంశయముకలిగి యొకపావురమును తనతోడఁ గొనిపోవుచు తనభార్య కిట్లని చెప్పెను. "ఈపావురము

నను వదలియిటకు వచ్చునేని నాకు కారాగృహవాసమో, స్వర్గ వాసమో కలిగెనని తెలిసికొనుము."

ఇట్లాయన తనపత్నిని వీడ్కొని అశ్వారోహణముచేసి మితపరివారముతో జేసోరునకుఁ బయలుదేరెను. ఇంతలో నాతని నెదుర్కొనుటకయి ప్రతాపాదిత్యుఁడు పంపినసేన లాతనిని దారి తప్పించి యొకయరణ్యమధ్యమునకుఁ గొని చని యచట నతనిని జంపిరి. ఆయనప్రాణము విడిచినతోడనే పావుర మాతని భార్యసన్నిధి కరిగెను. ఆపక్షినిం గనినతోడనే యాసతి మానహానికి వెఱచి తనపరివారముతో సమీపమునందున్న చెఱువునంబడి ప్రాణములు విడిచెను. ఆమె పుత్రుఁడుమాత్రము జనరేశ్వరియొక్క సంరక్షణలో సురక్షితుఁడై యుండెను.

పినతండ్రినిఁ జంపి తాను సుఖింతునని ప్రతాపాదిత్యుఁడు తలఁచెను. కాని యాతని పాపఫల మధికమైనందున నాతని కట్టిసుఖము దొరకదయ్యెను. వసంతరాయుల మరణానంతర మల్పకాలములోనే రాజామానసింహుఁడను, అగ్బరు సేనాధిపతి విపులసైన్యముతో ప్రతాపాదిత్యునిపై యుద్ధయాత్ర వెడలెను. ప్రతాపాదిత్యుఁడును ఆతనితోడఁ బోరుటకు సిద్ధుఁడుగా నుండుటవలనయుద్ధసన్నద్ధుఁడయ్యెను. ఆసమయమున నాతనియొద్ద నెనుబదివేలకాల్బలములును, పదివేల అశ్వములును, ఇన్నూరు గజములును నూరుతోపులుయుద్ధమునకయిసిద్ధముగానుండెను ఇదిగాక బుడతకీచులును ఆతనికి సహాయులై యుండిరి. కానియింత కలిగియుఁ గూడ కాతనికే యపజయము కలిగెను. దీనికొక కారణము కలదు. అచటి గ్రామదేవతయగు జనరేశ్వరియొక్క ముఖము మఱియొకవైపునకుఁ దిరిగెనఁట. యుద్ధసమయమున

నీవార్త సైనికులకుఁ దెలియఁగా తమరాజు దుష్ప్రవర్తనము వలన దేవి గ్రామమును విడిచిపోయెను గాన జయము కలుగదని తలఁచి వారు నిరుత్సాహులైరి. తదనంతరము వారి పిచ్చి నమ్మకమును పోఁగొట్టవలయునని రాజనేకరీతుల యత్నించెను. కాని వారందఱు తమరాజు దుష్టత్వము నెఱిఁగినవారలే కాన నాతనిమాటలను నమ్మక సంగ్రామరంగమును విడిచి పాఱి పోవఁదొడఁగిరి. కానఁ బ్రతాపాదిత్యుఁ డల్పకాలములోనే పగఱచేఁ జిక్కి కారాగృహవాసి యయ్యెను.

ప్రతాపాదిత్యుఁడు చేతఁ జిక్కిన తదనంతరము మానసింహుఁడు రాజధానియగు జేసోరుపట్టణముం గొనువేడ్క నాపట్టణమును సమీపించెను. కాని పట్టణము నలుదిక్కుల సంరక్షకులచేఁ రక్షింపఁబడుచుండుటఁ గని యాతఁడు మిగుల వింత పడెను. దాని నెవరు రక్షించెదరని విచారింపఁగా ప్రతాపాదిత్యుని భార్యయగు జనకేశ్వరి తాను సైన్యాధిపత్యమును స్వీకరించి గ్రామసంరక్షణ మొనర్చుచున్నదని తెలిసెను. అందుపై నాతఁడు గ్రామము తనస్వాధీనపఱుపుమని జనకేశ్వరికి వర్తమాన మంపెను. అందుపయి నామె స్వపరబల తారమ్యముల నెఱిఁగి మిగుల చాతుర్యముగా నిట్లు ప్రత్యుత్తర మంపెను. "నేను కోరిన కొన్ని సంగతులను మీరొప్పుకొనిన నగరము మీకొప్పగించెదను. నగరరక్షణమునకై రక్తధార లొలుకుట నిష్ప్రయోజన మని నే నెఱుఁగుదును. మీరు మాగ్రామమును కొల్లగొట్టుట మొదలగు బాధలఁ జరుపకుండిన పక్షమునను, నాభర్త యెచ్చటనుండునో యచ్చటనే నన్ను నుంచుటకు సమ్మతించిన పక్షమునను నిరాటంకముగా నీయూరు

మీస్వాధీనపఱచెదను. ఇది మీకు సమ్మతమేని నాబొందిలోఁ బ్రాణము లున్నంతవఱకును యుద్ధము చేయఁ గలదానను".

రాజామానసింహుఁడాను కోరినసంగతుల కనుమతించి పట్టణము వశపఱచుకొని ప్రతాపాదిత్యునిఁ గొని ఢిల్లీకుఁ బ్రయాణ మయ్యెను. గాని ప్రసకేశ్వరి భర్తయం దధికభక్తి గలదిగాన నట్టిసంకట సమయమునందు అతని విడువక వెంబడించెను. కాని ప్రతాపాదిత్యుఁడు కారాగృహవాసదుఃఖము నోర్వఁజాలక ఢిల్లీమార్గముననే గతప్రాణుఁ డయ్యెను. కాన నాకాలమునం గలయాచారప్రకారము జనకేశ్వరి సహగమనము చేసెను.

ఇట్టి స్త్రీలేకదా సాధ్వీమణులనం దగియుందురు. జనకేశ్వరివంటి రూపగుణములు గలశూరస్త్రీ దొరికినను నిర్భాగ్యుఁడగు ప్రతాపాదిత్యుఁ డామె సహవాసము వలని ఫలము నెంతమాత్రమును బొందకుండగా తనదుష్కర్మమువలన నామెకు దుఃఖము కలుగఁ జేసెను. జనకేశ్వరి కట్టిదుష్టుఁడు భర్తయయినను అతనియం దెంతమాత్రమును తిరస్కారబుద్ధిలేక సన్మార్గప్రవర్తకునిఁ జేయ యత్నించుచుండెను. ఇదియే భార్యాధర్మము; గాని యది భర్తధర్మము గాదు.

# జోధపురరాణి

ఈరాణి ఔరంగజేబుబాదుషా రాజ్యారంభమునందు ననఁగాఁ బదు నేడవశతాబ్దమధ్యమున నుండెను. శహాజహాన్ బాదుషా రాజ్యదినములలో మార్వాడ దేశమునందలి జోధపుర రాజ్యమును జసవంతసింగుఁడను రాఠోడవంశీయుఁ డగురాజు పాలింపుచుండెను. ఈయన పత్నియొక్క ధైర్యస్థైర్యములును స్వాభిమానమును మిగుల శ్లాఘనీయములు ఆమెపే రెచటను కానరాదు. కానియామె చేసినకార్యము లనేకదిక్కుల వర్ణింపఁ బడినవి.

ఈజసవంతసింగు ఢిల్లీపతియగు శహాజహానునకు సామంతుఁడయి యుండెను. జసవంతసింగు మిగుల పరాక్రమ వంతుఁడయి ఔరంగజేబును ఉత్తరమునకు రానియ్యక మాళ్వా ప్రాంతముననే బహుదినములవఱకు సంగ్రామము చేయుచు నాపెను. అప్పుడాయవరంగజేబు తండ్రియగు శహాజహానుని పదచ్యుతునిఁ జేయు తలంపుతో సహోదరసహితుఁ డయి ఢిల్లీకిఁ జనుచుండెను. త్రోవలో నుజ్జయినీయందాతనిసి జస వంతసింగు డాపఁదలఁపఁగా నాయిరువురకును ఘోరయుద్ధము జరిగెను. ఆయుద్ధమునందు సైనికులందఱు సమయుట వలన జయము కలుగుననను ఆశలేక జసవంతసింగు మరలి తన నగరమునకు వచ్చుచుండెను. గ్రామమును సమీపించినకొలఁదిని ఆతని కొకవిధమయిన భీతి జనించెను. ఏలయనఁగా తాను పరా

జయము నొంది పలాయితుఁడయి వచ్చినవార్తవిని రాణి తన నేమమునో ముఖమునైనను జూచునో లేదో యని స్వభార్య యొక్క క్షాత్రతేజము నెఱిఁగినవాఁడుగాన నాతనికి శంక కలిగెను. అదేప్రకారమాయన గ్రామమును సమీపించినతోడనే రాణి పట్టణపు సింహద్వారములు మూయించి యాతనిని పట్టణములోనికి రానియ్యకపోయెను.

నగరద్వారములను మూయించి యామె భర్త కిట్లు వర్తమానము పంపెను:— "జోధపుర నరేశ్వరుఁడు పరాజయమునుబొంది తనదీనముఖము నగరవాసులకుఁ గనుపఱుపకుండిన నేమంచిది. ఇట్టిపిఱికికి నేనికి భార్యనైతినని నాకే మిగుల సిగ్గుగా నున్నది. జోధపురాధిపతియై మేవాడరాణాకు అల్లుఁడును నగువాఁడొకని పరాజయమును బొంది పాఱివచ్చుటకంటె హీనత యేమున్నది?" ఇట్లని యామె యంతటితో నూరకుండక సేవకులతో "చితిఁ బేర్చుఁడు. జోధపురాధిపతి పరాజయమునుబొంది తిరిగి వచ్చుట సంభవింపదు. ఆయన యుద్ధమునందే శత్రువులచేఁ జంపఁబడియుండును. నేనుత్వరగా నాభర్తను గలియఁ బరలోకమున కేఁగెదను" అని చెప్పెను.

ఈప్రకారము వారముదినములు గడచినపిదప నీసంగతి నంతను విని యామె తల్లి జోధపురమునకు వచ్చెను. ఆమె వచ్చి కొమార్తె కనేకవిధముల బోధించి యిప్పు డపజయము పొంది వచ్చినను జసవంతసింగు మరల సైన్యసహితుఁడయి పోయి శత్రువులతో సంగ్రామ మొనరించునని చెప్పెను. ఇట్లు తల్లిచేఁ బ్రబోధిత యయి యారాణి నగరద్వారములు తీయుట కాజ్ఞ యిచ్చెను. జసవంతసింగుఁ డింటికి వచ్చినపిదప నాతని

పత్ని భర్తకుఁ దగిలిన దెబ్బలను, గాయములను గని మిగుల విచారపడి వానికిఁ దగు నౌషధము రాచి మాన్పు బ్రయత్నములు చేసెను.

ఔరంగజేబు ఢిల్లీకరిగి తండ్రిని కారాగృహమునం దుంచి సహోదరుల నంతమునొందించి, రాజ్యము నపహరించిన పిదప జసవంతసింగుని వైపు దృష్టి సారించెను. జసవంతసింగు నొకని నంతము నొందించిన తనరాజ్యము నిష్కంటక మగునని యాతఁ డనుకొనుచుండెను. కాన నాతని నుపాయాంతరము చేఁ జంప నెంచి యాసమయమున కాబూలుదేశమున జరుగుచుండిన ప్రజాయుద్ధము నాపుటకయి జసవంతసింగునికి సైన్యాధిపత్య మొసఁగి యాతని నచ్చటికిఁ బంపెను. కాని కపట మెఱుఁగని జసవంతసింగు తన కంతటి సైన్యాధిపత్యము దొరకినందున కెంతయు నుప్పొంగుచు రాజాజ్ఞ శిరసావహించి యాతఁడు దండయాత్రకు బయలువెడలెను. అప్పు డాతని శూరపత్నియు నాతనితోడఁ గాబూలుదేశమునకు యుద్ధార్థమయి వెడలెను. ఆదంపతు లిరువురును దమ కిదివఱకుఁ బరాజయమువలనఁ గలిగిన యపకీర్తి నణఁచి శాశ్వతకీర్తిని సంపాదింపఁ గృతనిశ్చయు లయి పృథివిసింగుఁ డను పుత్రునకు రాజ్యము నిచ్చి సైన్యసహితు లయి వెడలిరి.

ఆసమయమునందు రాణిగారు పురుషవేషమును ధరియించి యొకానొకశూరుని పగిది భర్తతోడన యుండి యాతనికి సహాయురాలయి యనేకపర్వత ప్రదేశములను మిగుల కష్టముతో గడచి కొన్నిదినములకు కాబూలుపట్టణమును సమీపించిరి. వారచటికి వెళ్లునప్పటి కాదేశమంతయు రాజద్రో

హులచే వ్యాపింపఁబడి యుండెను. కాన నాదంపతుల కచటి కరిగినపిదప విశ్రాంతి యన్నమాటయె తెలియదు. ఇట్లు జస వంతసింగు తనసైనికుల సహాయముచే నారాజద్రోహులను శాసింపఁ బ్రయత్నించుచుండెను. ఆకష్టములలో నారి కేను చూచినను శత్రుసైన్యముల భయము దప్ప మఱియేమియుం గాన రాకుండెను. అచటి పర్వతజలమును, వాయువును వారిశరీరము లకు సరిపడక పోవుటవలన వారికి మిగుల ప్రయాసమయ్యెను. ఇట్టిభయంకర సంగ్రామదినసంబులలో నాపతిభక్తిపరాయణ యగు రాణి గర్భవతిగా నుండియు భర్తను ఛాయవలె ననుస రించియుండి శూరపురుషునివలె నాతనికి సర్వవిధములఁ దోడ్ప పడుచుండెను. ఆమెశౌర్యధైర్యములం గని రజపూతవీరులు మిగుల నాశ్చర్యపడుచుండిరి.

ఇన్నికష్టములు పడినను రాణిగారికి సుఖప్రాప్తి లేద య్యెను. కుటిలుఁడగు అవరంగజేబు జసవంతసింగు కాబూలు లోనున్న కాలముననే విషప్రయోగము చేయించి యాతనిని చంపించెను. అదేప్రకారము పృథివీసింగును జోదపురమునుండి ఢిల్లీకి రప్పించి విషమిడి చంపించెను. జసవంతసింగుని వంశము మూలముతో నాశమొందెనని ఔరంగజేబు సంతసింపు చుండెను. కాని యొకచిన్న యంకురము గలదని యెఱుంగఁ డయ్యె.

జసవంతసింగుని మరణానంతరము పరదేశము నందుం డిన రాణి కష్టము లిట్టివని చెప్ప నెవ్వరివశము ? పతి మృతుఁ డయినప్పుడనే సహగమనము చేయుట యాకాలమునం దుత్త మముగా నెన్నఁబడుచుండెను. ఈరాణియు నట్లే చేసియుండు

ను. కాని గర్భవతియగుటచే యనుగమనమును మానవలసిన దాయెను. అట్టియసహ్యదుఃఖకాలమునం దామె బొత్తుగా ధైర్యమువదలక నిండుగర్భవతియైనను తానే రజపూత సేనాధ్యక్షతను వహించి హిందూస్థానమునకు మరలెను. కాని యుంతలో కాబూలుదేశములోనే యామె ప్రసవమయి యొకపుత్రరత్నముంగనెను. ఈశిశుసింహుండే తనతండ్రిని సహోదరునిఁ జంపిన ఔరంగజేబు పగతీర్చుకొనన సమర్థుఁడయ్యెను! ప్రసూత్యనంతరము కొంచెముశక్తి రాఁగానే రాణిగారు మరల ప్రయాణముచేసిరి. వారు పేశావరీనగరమునకు వచ్చువఱకు శత్రువులచే మిగుల నిగ్రహింపఁబడుచుండిరి. కాని యాగ్రామమునకు రాగానే జోధపురమునుండి వారికి సహాయార్థము బయలుదేఱిన రజపూత సైన్యము వారినిఁ గలసెను. కాన నచటినుండి వారికిఁ బగరచే నంతగా బాధగలుగకుండెను. వారందఱు ఢిల్లీని సమీపించఁగానే మరల పెక్కుచిక్కులు ప్రాప్తించెను. జసవంతసింహునిభార్య అజితసింగ కుమారునితో సుఖముగ ఢిల్లీవఱకు వచ్చుటవిని బాదుషామిగుల క్రోధించి నీకొమారుని నాకడ కంపుమని రాణికి వర్తమానమంపెను. ఈ సంగతివిని రాణిగారు తనకొమారుని నంపుటకు సమ్మతింపక తనసైన్యబలముచేఁ బోరాడినను, తనబాలుని సంరక్షిం కొన నిశ్చయించెను. అంత నామె తనశిశువు నొక పెట్టెలోనుంచి యాపెట్టె నొకవిశ్వాసపాత్రుఁడగు తుఱుకిచ్చి దానినొకసురక్షితమగు చోటికిఁ గొనిపొమ్మని చెప్పెను. వాఁడును అదేప్రకార మాబుట్టనుగొని పండ్లు కొమిష చెప్పి నియమితస్థలమునకుఁ గొనిచనెను.

రాణిగారు ఢిల్లీపట్టణమునుండి బయలుదేరుట మిగుల దుర్ఘటముగా నుండెను. అయినను శూరవనితయగు రాణియు నామె సైనికులును మిగుల శౌర్యముతోc బాదుషాసైన్యముల నోడించి మేవాడదేశపు మార్గమునంబడిరి. ఆసమయమునం దారాణియనేక వీరభటులశిరములు తనచేతి ఖడ్గముతోc ద్రో నేసిన నవి ఢిల్లీయంతట వెదచల్లబడియెనcట. ఇట్లు వారందఱు మేవాడ మార్గమున నడుచుచు రాజపుత్రుcడగు అజిత సింహుc డున్నస్థలమునకు వచ్చిరి. తనపుత్రుని కెంతమాత్రము ప్రాణభయములేక సురక్షితుcడయి యుండుటcగని రాణిపర మానందభరిత యయ్యెను. అంత నామెపుత్రసహితయయి మేవాడయందున్న తనసహోదరునికడ కేcగెను. తనకొమారుc డు పెద్దవాcడగునంతవఱకు విద్యాబుద్ధులు చెప్పి సంరక్షించు నటులc దనతోcబుట్టువుచే నొప్పించుకొని యాశిశువు నాతని స్వాధీనము చేసెను.

అజితసింగు పెద్దవాcడయినపిదప తనశౌర్యముచే మహమ్మదీయుల ననేకపర్యాయము లోడించిపంపెను. రాణియుc దనపుత్రుని సంగ్రామకేళి కెంతయు సంతోషించి కన్నఋణము తీఱెనని చెప్పుచుండెను. ఈరాణి వృద్ధయై కాలధర్మము నొందెను.

# విమల

ఈ పతివ్రత ఘూర్జరాధిపతియగు జయశిఖరునికి సహోదరి. ఈజయశిఖరుఁడు క్రీ.శ. ౬౯౦గవ సంవత్సరప్రాంతమున పంచాసర మనుపట్టణము రాజధానిగా ఘూర్జరదేశము పాలించినట్లు తెలియుచున్నది. ఆసమయమున ఘూర్జరదేశము మిగుల నున్నతదశయం దుండెను. విమల మిగుల రూపవతి యగుటయే గాక, సద్గుణవతియై యుండెను. సకలదేశముల రాజపుత్రులును తమ్మాయామె వరియింపవలెనని కోరుచుండిరి. కాని విమల యైశ్వర్యభోగములయం దిచ్ఛలేనిదియై గుణవంతుఁడగు శౌర్యనిధిని వరియింప నిచ్ఛగలిగియుండెను.

ఇట్లుండఁగాఁ గొన్ని దినములకు ముల్తానను పట్టణము నందలి రాజు భార్యాపుత్ర సహితుఁడయి ప్రభాసక్షేత్రము దర్శించుటకుఁ బోవుచుఁ ద్రోవలో నుండినందున పంచాసరము నకు వచ్చెను. అప్పుడు జయశిఖరుఁడు వారిని తనకోటలోనికిఁ గొనిపోయి తగిన మర్యాదలుచేసి కొన్నిదినములు వారి నచట నుంచుకొనియెను. వారచటనుండిన దినములలో నా రాజునకుఁ బుత్రుఁడగు సురపాలునితో జయశిఖరుఁడు క్రీడాయుద్ధము చేయుచుండెను. నంతఃపురకాంత లందఱును చూచుచుండిరి. అప్పుడు సురపాలుని శౌర్యసద్గుణములు విమలకుఁ దెలిసెను. అంత నొకదిన మా రాజపుత్రులు సింహము వేటకరుగుచు దానిఁ జూచుటకై విమలతోఁగూడ నంతఃపురకాంతల నందఱ నరణ్యా

మునకుఁ దీసికొనిపోయి యచట నొకమంచముపైఁ గూర్చుండఁ బెట్టిరి. అప్పు డొకసింహము జయశిఖరునిపైకి రాఁగా దానిని సురపాలుఁడు మిగుల శౌర్యముతోఁ జంపెను. దానింగని నప్పటి నుండియు విమల సురపాలుని శౌర్యధైర్యములకు మెచ్చి యతనిని భర్తనుగా వరియింప నిశ్చయించెను.

అటుపిమ్మట జయశిఖరుని వీడ్కొని సురపాలుని తండ్రి పత్నీ పుత్రసహితుఁడయి పోయెను. పిదపఁ గొన్ని దినములకు సురపాలుని చెలియలగు రూపసుందరిని తనకొడుకు భార్యగా నిశ్చయించు నిమిత్తము జయశిఖరుఁ డొక బ్రాహ్మణుని ముల్తానాకుఁ బంపెను. అపు డాబ్రాహ్మణుని చేతికి విమల యొక యుత్తరమిచ్చి దానిని సురపాలున కిమ్మని చెప్పెను. వాఁడు దానిని సురపాలున కిచ్చెను. తరువాత రూపసుందరిని వివాహమాడుటకు జయశిఖరుఁడు ముల్తానాకుఁ బోయెను. వివాహానంతరము రూపసుందరికినిఁ దోడు సురపాలునిం దీసికొని జయశిఖరుఁడు తన దేశమునకు వచ్చుచుండెను. అప్పు డాత్రోవలో లాటదేశాధీశుఁడు తనకుఁ జెల్లింపవలసిన పైకము బహుసంవత్సరములనుండియుఁ జెల్లించనందున జయశిఖరుఁడు వానిపైకి సైన్యముం బంపెను. ఆ సైన్యాధిపతివెంట నతనికి సహాయునిగా సురపాలునిఁ దోడిచ్చెను. లాటదేశమున వీరికిని, వారికిని గొప్పయుద్ధము జరిగి జయశిఖరుని సైన్యాధిపతి చావఁగా సురపాలుఁడు వారిని గెలిచి యారాజును దెచ్చి జయశిఖరునకు నొప్పగించెను. అప్పుడుసురపాలుని శౌర్యమునకుమెచ్చి జయశిఖరుఁ డాతనికిఁ దన సేనానాయకత్వమునిచ్చి నగరమునకువచ్చినపిదపఁ దన చెల్లెలగు విమల నాతనికిచ్చి వివాహము చేసెను. విమల వివాహానంతరము పతి

యం దధిక ప్రేమ గలదియయి పతివ్రతాధర్మములను దప్పక నడుపుచుండెను.

అంతఁ గొన్ని దినములకు ఘూర్జరదేశపు ఖ్యాతినివిని * కళ్యాణాధిపతి దానిపైకి దాడివెడలివచ్చెను. కాని సురపాలునివంటి శౌర్యనిధి సేనాధిపతియగుటవలన నతనిబలంబుల ధైర్యంబు లుడిగి నరల తనదేశమున కరుగవలసినవాఁ డాయెను. తన యపజయమునకు సురపాలుఁడే కారణుఁడుగాన నతనిని జయశేఖరుని సమీపమునుండి చీలఁదీయవలయునని తలఁచి కళ్యాణరాజు "నీవు జయశేఖరుని విడిచిపోయినచో విశేష ధనమిచ్చెద" ననియు, "రాజ్యమిచ్చెద" ననియు నాసచూపి సురపాలున కొక జాబువ్రాసెను. ఆజాబొక భృత్యుఁడు తెచ్చి విమలతోనున్న సురపాలుని కిచ్చెను. అతఁడు దానిం జదివికొని మిగుల క్రోధము గలవాఁ డయ్యెను. కాని తనపత్నినిఁ బరీక్షింప సమయ మిదియే యని తలఁచి యామె కాసంగతిఁ దెలిపి "నీవు మిగుల వైభవముగ రాణివయిభోగముల ననుభవించెదవా! నే నీయుత్తర ప్రకారము చేసెద" నని చెప్పెను. అదివిని మిగుల తిరస్కారముగా నిట్లనియె 'నీవు సత్యవ్రతుఁడవనియు, కృతజ్ఞుఁడవనియు, ననుకొని నిన్ను వివాహమాడితినేగాని, యిట్టి కృతఘ్నుఁడవని తెలియకుంటిని. నేనిదివఱకెన్నఁడును దుస్సాంగత్యము చేయ లేదు ఇకముందును చేయను. మీరు మీతలఁచినట్లు చేయుదురేని మీకును నాకును ఋణ మింతటితో నే సరి. సతిపతినే దైవముగాఁ జూడవలెను. పతి దుష్కార్యము చేయునని నప్పుడు

* ఇతఁడు కళ్యాణపురమున స్థాపింపఁబడిన పశ్చిమ చాళుక్యవంశము లోనివాఁడయి యుండవచ్చును.

పతికంటె నధికుఁడు పరమేశ్వరుఁడు గలఁడని తలఁచి యాపరమేశ్వరునకు భయపడ వలయును. కాన నేను మీతోడ దుష్కార్యమున కొడిగట్టి జగదీశ్వరుని శిక్షకు లోనుగాను." భార్య చెప్పిన నీతికిని, నామెకుఁగల ధర్మబుద్ధికిని మిక్కిలి సంతసించి సురపాలుఁ డామె నాలింగనము చేసికొని తననిజమయిన యభిప్రాయ మామెకుఁ జెప్పెను. అప్పు డాదంపతు లిరువురు నాలోచించి తిరస్కారోక్తులతో నొకజాబును కళ్యాణరాజునకు వ్రాసిరి. జాబు తెచ్చిన దూతను శిక్షించెదనని సురపాలుఁ డనగా దూతనుశిక్షించుట ధర్మము గాదని చెప్పి విమల వాని నంపించెను.

సురపాలుఁ డంపిన జాబును జూచుకొని భూవరుఁడు (కళ్యాణరాజు) మిగుల క్రోధించి విశేషసైన్యములతో మరల ఘూర్జరపతితోడి రణమునకు వచ్చెను. ఈపర్యాయము కొంత యుద్ధము జరిగిన వెనుక జయశిఖరునకు జయము దొరకునను నాసతగ్గెను. కాన నాతఁడు గర్భవతిగానున్న తన భార్యను, చెలియలిని నరణ్యమునం దెచటనైనను గుప్తముగానుంచి రమ్మని సురపాలుని నంపెను. అట్లు సురపాలుఁడు వారలను కిరాతులకు స్వాధీనముచేసి వారికిఁ గొందఱు సేరిభటులను సహాయమున కుంచి మరల పట్టణము వైపునకుఁ బోవుచుండెను. ఇంతలో సురపాలుఁడు లేనందున భూవరుసైన్యములు మిగుల ధైర్యముతోఁ బోరాడి జయశిఖరుని జంపి పట్టణము నాక్రమించెను. అచట సురపాలుఁడు దొరకనందున సతనిని వెదకుటకయి కొంతసైన్యముతో భూవరుని కొమారుఁడు కర్ణుఁ డనువాఁడు బయలుదేఱెను. కాని సురపాలుఁడు వేరు

మార్గమునఁ బోయినందున కర్ణునకుఁ జిక్కఁడయ్యె. కర్ణుఁడు అరణ్యమున నతనిని వెదకుచుఁబోయి విమలా రూపసుందరు లున్న స్థలమునకుఁ బోయెను. అల్పులగు వీరభటులను విపుల సైన్యసహితుఁ డగు కర్ణుఁడు వధియించి విమలయొక్క రూపమునకు మోహితుఁడయి యామెను బలాత్కారముగా తన శిబిరములోనికిఁ గొనితెచ్చెను. అప్పు డామె రోదనమును విని కర్ణుఁడు దప్పక యతని సైనికుల కందఱకును నామెపై మిగుల దయగలిగెను. కర్ణుఁడు బలాత్కారముచేయ ననుకొని యుండ నామె ప్రాణములను విడువ నిశ్చయించెను. కాని నీసమ్మతి లేనిది నిన్ను నేను బలాత్కారము చేయునని యతఁడు పల్కఁగా నామె ప్రాణత్యాగము చేసికొనుట మానెను. కర్ణుఁ డామెను తనపై మనసు ద్రిప్పుటకు నలుగురైదుగురు దాసీలను నియమించెను కాని వారామె దృఢనిశ్చయమును, పాతివ్రత్యమును గదలి యభీష్టమును నెఱవేర్పలేక యుండిరి. అంతఁ గర్ణుఁ డిచటనుండిన నామె తనకు వశవర్తి గాదని తన రాజ్యములోని దిగుపోరట్ నగరమున కామెను తీసికొనిపోయెను. అచట నామె ననేకప్రకారముల బోధించినను ఆమె కర్ణునకు వశపడకుండెను. కాన కర్ణుఁడు సురపాలుఁడు చనిపోయెనని యామె భృత్యుని కొకనికి లంచమిచ్చి వానిచే నామెకుఁ జెప్పించెను. అట్లు చెప్పుటవలన నామె భర్తయాసను విడిచి తనకు వశపడునని కర్ణుఁడు తలఁచెను. కాని యట్లుగాక వెంటనే యామె సహగమనమునకుఁ బ్రయత్నము చేసెను. అప్పుడు కర్ణుఁ డామె నట్లుచేయవలదనియును, ధర్మశాస్త్ర ప్రకారము తనను వివాహము చేసికొనుమనియు ననేకవిధములఁ జెప్పి సహగమ

నము చేయ నియ్యకుండెను. కాని యామెసద్గుణముల వలన సైనికులందఱా మెపక్షము నే స్వీకరించి కర్ణుని చీవాట్లు పెట్టి యామెను సహగమనమునకు సిద్ధము చేసిరి. ఆమె చితి యొక గట్టుపైన నుండెను. విమల యచటి కరిగి తనను చూడ వచ్చి తనకు నమస్కరించిన స్త్రీలకు పాతివ్రత్యధర్మముల నుపదేశించి సైనికులకు బుద్ధులు గఱపెను. అంతవఱకుఁ బశ్చాత్తాప మను మాటలేని కర్ణుఁడు మిగులఁ బశ్చాత్తాపమును బొంది యామెను క్షమ వేఁడెను. అప్పుడు విమల 'నీవు పరమేశ్వరుని క్షమ వేఁడుకొని మరల నిట్టి పాపకార్యములు చేయకుమ'ని యతనికిఁ బోధించి చితి నెక్కెను.

అచట సురపాలుఁడు గ్రామమును సమీపించి గ్రామము శత్రువులస్వాధీనమగుటయు రాజు యుద్ధమునఁ జచ్చుటయు విని మరల నరణ్యమునకు వచ్చెను. కాని యతని కచటఁ దన వారెవ్వరును గానిపించలేదు. కాని జరిగినవృత్తాంత మంతయు నొకకిరాతుని వలన విని యతఁడు కర్ణునివద్ద చెఱలో నున్న తనసతిని విడిపింపనరిగెను. సురపాలుఁ డల్పవీరులతో సోరట్ నగర సమీపముననుండి కర్ణుని గెలుచు నుపాయము చింతించుచుండఁగా తనపత్ని సహగమనవార్త వినెను. అప్పుడాయన తానొక్కఁడును మాఱువేషముతో నామూకలోఁ బ్రవేశించి చితిపై నెక్కి యగ్నిరవులు కొల్పుచున్న విమల నదాటున నెత్తుకొని యతివేగమున నరిగెను. సురపాలుఁడు విమల నెత్తుకొనిపోయి యొకగుఱ్ఱముపై నెక్కించుకొని యరణ్యమార్గమునఁ బోవుచుండెను. విమల కర్ణుఁడే తన నిట్లు తెప్పించెనని తలఁచెను. కాని కొంతసేపటికి సురపాలుని

వచనములవలన తనభర్త చచ్చుట యబద్ధమనియు నతఁడే తనను తీసికొనివచ్చె ననియుఁ దెలిసికొనియెను. తదనంతర మాదంపతులు మాఱువేషములతో రూపసుందరి యున్న యరణ్యమునకుఁ బోయిరి. రూపసుందరి, యచట నిదివఱకే ప్రసవమయి మొగశిశువును గనెను. ఆబాలుని పేరా చెంచులు వనరాజని పెట్టిరి. విమల వదినెను పుత్రసహితముగాఁ జూచి యపరిమితానందభరిత యయ్యెను. వా రాయరణ్యముననే గుప్తముగా కాలము గడపుచుండిరి. కాని విమల కచటి యరణ్యజలము పడక క్షీణించి కొన్నిదినములకు నామె దివి కరిగెను.

# పద్మావతి

సా భార్యాయా శుచి ర్దక్షా సా భార్యా యా పతివ్రతా
సా భార్యాయా పతిప్రీతా సా భార్యా సత్యవాదినీ.*

పద్మావతి జగన్నాథ నివాసస్థుఁడగు అగ్నిహోత్రుఁడనువిప్రుని కూఁతురు. జయదేవుఁడను మహాకవిభార్య. ఈమె పాతివ్రత్యమునందు మిగుల ప్రసిద్ధిఁ గాంచెను. పద్మావతి మిగులసౌందర్యవతియు గుణవతియు నైనందున నామెజనకుఁడామెకుఁ దగినవరుని విచారించి వివాహము చేయనిశ్చయించెను. అంతఁ గొన్నిదినములకు జగన్నాథమునకు బిల్వా యను గ్రామములో నుండిన నారాయణభట్టను బ్రాహ్మణుని కుమారుఁడగు జయదేవుఁడు సకల సద్గుణపరిపూర్ణుఁ డనియుఁ దగిన వరుఁ డనియుఁ దెలిసినందున బీదవాఁడని శంకింపక యాయగ్నిహోత్రి పద్మావతి నాతని కిచ్చి వివాహము చేసెను. వివాహానంతర మాదంపతులు మిగుల నైక్యము గలిగి కాపురము చేయుచుండిరి. పద్మావతి తమకుఁ గలదానిలోనే కాపురము మిగుల చక్కఁగాఁ గడపుచుండెను. ఆమె పూర్వకాలపు పతివ్రతలకథలు చదివియు వినియుఁ దాను వారివలెనే ప్రవర్తించుటకు నెల్లప్పుడు యత్నించుచుండెను. కాన పరమభక్తుఁడగు

---

* పవిత్రురాలును చాతుర్యవతియునై పతిప్రియయు భర్తృనిగ్రహము విడచి సత్యము పలుకునట్టిదియే సద్భార్య యనఁదగు.

జయదేవునకు సంసార మసారమని తోఁచక మిగుల సారముగాఁ గానుపించుచుండెను. జయదేవుఁడు పీయూషవర్షుఁడగు కవియని ప్రసిద్ధిఁ గాంచెను. ఆయన సాహిత్యసంగీత విద్యలయం దసమానపాండిత్యము గలవాఁడై ప్రసన్న రాఘవ మనునాటకమును గీతగోవిందమను సంగీతగ్రంథము రచియించెను.

ఇట్లాదంపతులు సుఖముగా నుండఁ గొన్నిదినంబుల కొకయూరి సాహుకారు జయదేవుని మిగుల వేఁడుకొని సమీపమునం దున్న తనగ్రామమునకుఁ గొనిపోయెను. జయదేవుఁ డచటఁ గొన్ని దినంబు లుండి యాగ్రామమునం దంతటను ననేకులను భక్తులనుగాఁ జేసెను. తదనంతర మాయన స్వగ్రామమునకుఁ బ్రయాణ మగుటఁ గని యాసాహుకా రాయనకుఁ దెలుపక గుప్తముగా నాబండియడుగున గొంతద్రవ్యము నునిచి యింటి కేఁగినవెనుక పద్మావతిగారి కిమ్మని తనబంటుగు బండితోలువానికిఁ జెప్పెను.

ఇట్లు బయలుదేరి జయదేవులు కొంతదూర మరిగినపిదప నతనిబండిలో ధనమున్న సంగతి యరణ్యవాసులగు దొంగలకుఁ దెలిసి వా రాబండిని నాపి సకలధనమును దోఁచుకొని జయదేవుని వదలినఁ దమకు నతఁడు రాజభటులచే నపాయముఁ జేయించునని తలఁచి, కాలు సేతులు కొట్టి జయదేవులను నొకపాడు నూతిలోఁ బాఱవేసిరి. అందుపైఁ గొంతసేపటికి క్రౌంచ దేశాధీశ్వరుఁ డచటికి వేఁటాడ వచ్చి జయదేవునిఁ గని తన నగరమునకుఁ గొనిపోయెను అచట రాజవైద్యులచే ననేకౌషధోపాయములు చేయించఁగా జయదేవుల కాలు సేతుల గాయములు మానెను. జయదేవుల యపారపాండిత్య

మును. నిర్మల దైవభక్తియు, నప్రతిమసాధువృత్తియుఁగని క్రౌంచరాజాతనిని గురువుగా భావించి సేవింపుచుండెను.

ఇచటఁ బద్మావతి భర్తకొఱకు ననేకస్థలముల వెదకించియు వెదకియు జాడఁగానక మిగుల దుఃఖముతోఁ బుట్టినింటనేయుండి భర్తజాడ లరయుచుండెను. ఇట్లు కొన్నిదినములు గడచినవెనుక క్రౌంచాధీశ్వరుఁడు జయదేవుల వార్తఁ దెలిపి పద్మావతినిఁ దోడుకొని వచ్చుటకై తనపరివారమును బంపెను. వారు చెప్పినవార్త విని పద్మావతి మిగుల సంతోషముతో భర్తకడ కేఁగెను.

పద్మావతి గురుభార్య యగుటవలనను మిగుల పతివ్రత యని ప్రసిద్ధి గాంచుటవలనను రాజపత్ని మిగుల శ్రద్ధతో నామెవలన ననేకనీతులు వినుచుండెను. ఇట్లొకనాఁడు పద్మావతి పాతివ్రత్యమునుగూర్చి యుపన్యసింపుచుండఁగా నచటికి నొక సేవకుఁడు వచ్చి రాజపత్ని సమీపబంధువుఁ డెవఁడో యొకఁడు లోకాంతరగతుఁ డాయెననియు, ఆయన వియోగము సహింపలేక యాతని భార్య సహగమనము చేయఁబోవుచున్నదనియుఁ దెలిపెను. ఆసంగతి విని యచటి స్త్రీలందఱు మిగుల నాశ్చర్యపడఁజొచ్చిరి. కాని పద్మావతికి నాసంగతి యొక విశేషముగాఁ దోఁచకపోవుటవలన నామె సుఖముసం దాశ్చర్యభావ మించుకయుఁ గానుపించదయ్యె. అందుకు రాజపత్ని పద్మావతిని "అమ్మా! ఆమహాపతివ్రత సకల సుఖములను విడిచి భర్తతో సహగమనము చేయు నన్నవార్త విని మీకాశ్చర్యము కలుగ లేదా? దయచేసి మీమనోగతము నెఱిఁగింపుఁ డ"ని వేఁడుకొనెను. అందుకుఁ బద్మావతి రాజపత్నితో నిట్లు

నియె, "భర్త ప్రాణములు పోయినవెంటనే ప్రేమగల పత్ని యొక్క ప్రాణములు బొందినుండి వెడలును. ఇదియె నిజమైన ప్రేమయొక్క లక్షణము. అట్లు వెంటనే బొందిని విడువక తరువాత ప్రాణత్యాగము చేయుట యాత్మఘాతయెగాని పత్నీ ధర్మముగాదు."

పద్మావతియొక్క శుద్ధాంతఃకరణమునుండి వెడలిన యీవాక్యములు ప్రభుపత్ని చెవులకు ములుకులవలెఁ దోఁచగాఁ నామె పద్మావతి తాను నిజమైన పతివ్రతను అని వెల్లడించుటకై యీడంబములు పలికెనని యెంచి పద్మావతి నామె పరీక్షించి భంగపఱచవలయునని నిశ్చయించెను.

అందుపైఁ గొన్ని రోజు లయినపిదప రాజుతో జయదేవు లరణ్యమున కరుగుట సంభవించెను. అప్పుడు రాజపత్ని తన మంత్రిని బిలిచి తనకుట్ర యభిప్రాయ మాతనికిఁ దెలిపి తదనుసారముగా కార్యము నిర్వహింప నాతనిని నియమించెను. అట్లు కుతంత్రము పన్ని యారాజకాంతి యారోజునఁ గూడఁ దన నియమప్రకారము పద్మావతి గృహమున కరిగి యామెతోఁ బ్రసంగించుచుండెను! అంతలో దూతిక యొకత యతి దీనవదనయై వచ్చి కారడవిలో నాకస్మికముగా జయదేవుఁడు పులినోటఁ బడి ప్రాణములను విడిచెనని గద్గదస్వరముతోఁ జెప్పెను! ఆ పిడుగువంటివార్త చెవిసోఁకినతోడనే పద్మావతి నిశ్చేష్టితయై కొంతవడి దేహము తెలియకుండి మరల దేహస్మారకము గలిగి దుఃఖాతిరేకము పట్టఁజాలక పతినామము నుచ్చరించి మరణతుల్యమగు మూర్ఛనొందెను. కాని యచ్చటి వారందఱును నామె మృతిఁజెందెనని యనుకొనిరి.

ఆమె పాతివ్రత్యమును బరీక్షింపవలెనని యీతంత్రమును బన్నిన రాణిగారు పద్మావతి మరణమును గని యేమి చేయుటకుఁ దోఁచక దుఃఖింపసాగెను. అదివఱకామెకీకార్యమునందుఁ దోడుపడినవారిపుడామెనే నిందింపసాగిరి. ఇట్లు రాణిగారు సపరివారముగా శోకింపుచుండు సంతలో రాజుగారును జయదేవుఁడును పురమునకు వచ్చిరి వారిట్లు జొచ్చి పద్మావతి గతించుట విని యామెను సమీపించిరి. అంత జయదేవులు భార్యను గని తనదుఃఖము నాపఁజాలక కొంతవఱకు దుఃఖించిన పిదప ధైర్యము నవలంబించి తనసంగీతము పద్మావతికి మిగుల ప్రియమగుట నెఱిఁగినవాఁడు గావున నామె ముందఱ రసవంతమయిన సంగీతము పాడ నిశ్చయించి తనవీణెఁ దెప్పించి తాను రచియించిన గీతగోవిందమును మిగుల మనోహరముగాఁ బాడఁ జొచ్చెను. ఇట్లు సంగీతమున కుపక్రమించిన కొంతసేపటికిఁ బద్మావతి మొగముపైఁ గొంచెము తెలివి గానుపించెను. ఇరువదియైదవ యష్టపది ముగియఁగానే పద్మావతి తెలివొంది కనులు విప్పి తనముందుఁ గూర్చున్న జయదేవునిఁ గాంచెను. అంతనామె మిగుల నానందముతో భర్తకు నమస్కరించి యానంద బాష్పములతో నతని పదములను గడిగెను.

ఈయనర్థమున కంతకుఁ దనపత్నియే కారకురాలని క్రౌంచరాజు మిగుల కోపించి యామెను విసర్జింపఁదలఁచెను. కాని దయామయురాలగు పద్మావతి రాజును సమాధానపఱచి భార్యాభర్తలెడఁబాయకుండఁ జేసెను. తదనంతరము పద్మావతీ జయదేవులు కాశీక్షేత్రమున కరిగి యచటి పురుషులకు భక్తియు స్త్రీలకు పాతివ్రత్యమును ఉపదేశింపుచు

తమ ప్రవర్తనవలన నారికి దారిఁజూపుచుండిరి. కొంతకాల మచటనుండి స్వగ్రామమునకుఁ బోయి యచ్చటనే కొన్ని రోజులకు వారు కాలధర్మము నొందిరి.

పద్మావతీదేవి రాజుభార్య కుపదేశించిన యుపన్యాసమొకటి యాంధ్రమహాభక్త విజయమునందుఁ గానుపించుచున్నది; గాని మహారాష్ట్రభక్తవిజయమునందు లేదు. ఆంధ్రభక్తవిజయకారుఁ డీయుపన్యాసము నెచ్చటినుండి సంగ్రహించెనో తెలియదు. అయినను నాయుపన్యాసము స్త్రీలకుఁ బాతివ్రత్యంబు గఱపుటకు సత్యంతోపయుక్తముగా నుండుట వలన దాని నిందుఁ బొందుపఱచుచున్నాను.

"అమ్మా! లోకములో సతులకు ముఖ్యముగాఁ గావలసిన ధర్మ మొక్కటిగలదు. పతికంటె వేఱుదైవముగాని, పతికంటె వేఱు గతిగాని పతికంటె వేఱు చుట్టముగాని, పతికంటె వేఱుసంపదగాని, పతిసేవకంటె నుత్కృష్టమగు పూజగాని పతి యనుమతి నతిక్రమించుటకంటె పరమ సాధనముగాని లేదనియు, పాతివ్రత్యమున కెప్పుడును భంగము రాకుండ కాపాడుకొనుచుండుటే బ్రహ్మజ్ఞానమనియు, పతి నామమునననవరతము సంస్మరించుటే బ్రహ్మధ్యానమనియు, పతి నెడఁబాయకుండుటే బ్రహ్మానందమనియు, పతిమృతి నొందినతోడనే ప్రాణముల్ విడుచుటె మోక్షమనియు, నిశ్చయించుకొని వర్తించుచున్న సతికి సర్వశుభములును సులభముగా సిద్ధించును. పాతివ్రత్యమున కన్న నుత్తమమయిన వ్రతము మఱేదియును లేదు. లోకమునంగల జపతపో నియమాదు లేవియుఁ బాతివ్రత్యమునకు సమానములు కావు.

పాతివ్రత్యమును బాడు చేసికొనక మిగుల జాగ్రత్తతోఁ గాపాడు కొన్న గుణవతి భాగీరథి యనఁబడును. పాతివ్రత్యము గల వనితకు పరమపద మఱచేతిలోనిదని పెద్దలు పలుకుదురు. పాతివ్రత్యమును రక్షించుకొన్న వనితలకు నేలోపములును రావు. పాతివ్రత్యమునకు భంగము కలిగించుకొన్నచో బహు విధములయిన బాధ లనుభవింపవలసి వచ్చును. ప్రాణమున కంటె పదిమడుగు లెక్కుడుగాఁ బాతివ్రత్యమునందు ప్రీతి గలిగి కాపాడుకోవలసినది. భూషణముల కెల్ల భూషణము పాతివ్రత్యమే సుమీ! పాతివ్రత్యమునకంటెఁ బడఁతులకుఁ బాలింప వలసిన పదార్థ మొక్కటి లేదు. పాతివ్రత్యమును బాడు చేసికొనిన పాపాత్మురా లొకవేళ సత్కర్మములను జేసినను అవి నిష్కర్మముల క్రింద మారి తుదకు దుఃఖమును గలిగించునుగాని లేశమయినను సుఖమును గలిగింపవు. పతివ్రతలయొక్క ప్రభావముచేతనే భూతల మంతయు నంతరమున నిలిచియున్నదనియు, పతివ్రతలవిషయమున బ్రహ్మాదిదేవతలు సహితము భయపడుచుందురనియు పెద్దలు పలుకుదురు. పూర్వము మృతినొందిన తనపతిని సావిత్రీదేవి మరల బ్రతికించుకొన్నది కాదా? తనచిత్తశుద్ధినిఁ దెలుపుటకై సీతాదేవి యగ్నిలో మునికినది గాదా? తనకు హాని చేయవచ్చిన కిరాతుని దమయంతీదేవి భస్మము చేసినది గాదా? తనమాంగల్యము నితరులకుఁ దెలియనీయక చంద్రమతీదేవి రక్షించుకొన్నది గాదా? రేణుకాదేవి యిసుకతోఁ గుండను జేసి జలమును దెచ్చినదిగాదా? బృంద తన భర్తవలె ననువర్తింపవచ్చిన విష్ణుమూర్తియొక్క మాయను దెలిసికొన్నది

గాదా? అనసూయాదేవి నారదు లిచ్చిన యినుపసెనగలను బొరుగులగునట్లు వేఁచినది కాదా? ఆమెయే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను తనకు బిడ్డలనుగాఁ జేసికొన్నది కాదా? అరుంధతీదేవి యిసుకను నిమిషములోపల వండినదికాదా? లక్ష్మీదేవి పరమశివునిఁ బట్టుకొన్న బ్రహ్మహత్యను వదలఁ గొట్టినది కాదా? పార్వతీదేవి పరమేశ్వరుని యర్ధాంగమును సంపాదించుకొన్నదిగాదా ? ఇటువంటి మహాత్వమంతయు వారికి పాతివ్రత్యమువలననే గదా గలిగినది. మరియు; అరుంధతీదేవి తక్కువజాతిలోఁ బుట్టినదయ్యును తనపాతివ్రత్యముచేత సప్తర్షి మండలమున వసిష్ఠులవారిదండను నిండుకాంతితో వెలయుచు లోకమునకు కన్నులపండువు చేయుచున్నది. ఒక్కపర్యాయము పత్నులమీఁది మోహముచేత మిక్కిలియార్తి చెందిన తనభర్తయగు అగ్నిహోత్రునియొక్క యిష్టాపూర్తి చేయు నిమిత్తము స్వాహాదేవి తనమాహాత్మ్యమువలన ఆరుగురు ఋషిపత్నులరూపములఁ దాల్చియు, పరమపవిత్రురా లన్న హేతువుచేత నరుంధతీ దేవిరూపమును మాత్రము ధరించుటకు శంకించినదిగాదా ? సత్కులప్రసూతయు సకల సంపన్నయు నయిన అహల్యాదేవి మనోవైకల్యముచేత పాతివ్రత్యమును పాడుచేసికొన్నందుననే గదా పాషాణమయి పడియుండి చిరకాలము దుఃఖమనుభవించినది ? ఇప్పుడును వివాహ సమయములయందు సన్నికల్లు మీఁదమున నహల్యను కన్యచేతఁ ద్రొక్కించుటయు, నరుంధతీదేవి నగుపఱచి భక్తిపూర్వకముగా మ్రొక్కించుటయు, నాఁడుకగానున్నది కాదా? చక్కఁగాఁ బాతివ్రత్యము నొక్కటినిఁ గాపాడుకున్న చో బహువిధము

లయిన యుపవాసాదివ్రతములచేఁ బ్రయోజనము లేదు. పాతివ్రత్యరక్షణ మొక్కటే పడఁతులకు పరమోత్కృష్టవ్రతమని ధర్మశాస్త్రములు విధించుచున్నవి. దేవతాచార్యుని భార్య యైన తారాదేవి బుద్ధిమాంద్యముచేత చంద్రునితో వ్యభిచరించినందునఁగదా శాశ్వతమగు నపనిందననుభవింపుచున్నది? చేడియలతోఁగూడి జలక్రీడసలుపుచున్న చిత్రరథునిఁ జూచి భ్రమసినందునఁగదా రేణుకాదేవి తనపాతివ్రత్యమును భంగము చేసికొని యిసుకతోఁ గుండను జేయలేక తుదకు నెట్లు నడి పరశురామునిచేత ఖండింపఁబడెను? ద్రౌపదీదేవి కర్ణుని యందుఁ గల్గినందునఁగదా తపోధనున కుపయోగపడు ఫలమును వృక్షమున కెక్కింపలేక సిగ్గుపడినది? కాఁబట్టి యత్నపూర్వకముగాఁ పాతివ్రత్యమును రక్షించుకొనవలసినది స్త్రీలకు ముఖ్యకర్తవ్యము. మృతులయినవారిని మరల బ్రతికింపవలె నన్నను హరిహరబ్రహ్మలను రక్షించవలెనన్నను భూతముల నెల్లఁ దలక్రిందులుగాఁ జేయవలెనన్నను పతివ్రతల కొక లక్ష్యముకాదు. పాతివ్రత్యము బ్రహ్మనిష్ఠతో సమానమని పెద్దలు పలుకుదురు. సర్వోత్కృష్ట మగు బ్రహ్మనిష్ఠపురుషులకుఁ జిత్తశుద్ధిని గలిగించి పూజ్య మగు మోక్షసామ్రాజ్యము నను గ్రహించునట్టే పాతివ్రత్యము సతులకు పరమపదమొసఁగ నోపును. ఏకపత్నీవ్రతు లగువారికి నన్యస్త్రీసహవాస మెట్లు విసర్జనీయమో యాప్రకారమే పతివ్రతలకు సహితము పరపురుషసాంగత్యము సర్వదావర్జనీయము. ఏకాంతమున నేకాసనమున నిందు కొమారునితో నైనను గూర్చుండుట కులభామినికి యుక్తముగాదు. ధనికుఁడయినను, నిర్ధనుఁడయినను, రూప

వంతుఁడయినను, రూపహీనుఁడయినను, వివేకియయినను, అవి వేకియయినను, రోగియయినను, నిరోగుఁడయినను, మఱి యెట్టి వాఁడయినను, చేపట్టిన పెనిమిటివిషయమున లేశమయిన పారషోచ్చెములు లేక మిక్కిలి మచ్చికగలిగి యనువర్తింప వలసినది భార్యకు ముఖ్యధర్మము. భర్త తన కేమిచ్చినను మిక్కిలి సంతోషపడవలెను గాని చాలదని యెప్పుడును దుఃఖపడఁగూడదు. పతి తెచ్చియిచ్చిన వస్తువులను పదిలముగా దాచి యుంచి మరల నాతఁడడిగినప్పుడు నిష్కపటముగా నిచ్చివేయవలెను. బలిభిక్ష మెప్పుడును దప్పక పెట్టుచుండవలెను. దేవ పితృపూజాకాలములయందుఁ దనపతికి ననవరతము శుభములు గలుగునట్లుగాఁ బ్రార్థింపవలెను. పతియనుమతి లేక దేవతలనుగాని పితరులను గాని యతిథులనుగాని పూజింపరాదు. పూజించినచో నది సద్గతి నొందనేరదు. ఈవిషయమున పార్వతీదేవి చెప్పిన యితిహాసము చెప్పెదను. పూర్వ మొక బ్రాహ్మణున కిద్దఱుముద్దియలు గలరు. వారిలో నొక్కతె తనపెనిమిటి యనుమతిప్రకారము మడఁకువగలిగి నడచుకొనుచుండెను. మఱియొక్కతె స్వతంత్రతను వహించి తనయిష్టప్రకారము పితృదేవతాతిథి పూజలను జేయుచుండెను. కొంతకాలమునకు పిమ్మట విధివశమున వారు మువ్వురును నొక్కపర్యాయమే మృతినొందిరి. అప్పుడు పతికి హితముగా నడచుకొన్న సతి పతిపోయిన సుగతికిఁ బోయెను. పతిసమ్మతికి విరోధముగా నడచుకొన్న రెండవ పడఁతిని యముఁడు పోఁగూడ దని యాటంకపఱచినందున వెనుకనే నిలిచి కన్నుల నీరు పెట్టుకొని యేడువ మొదలు పెట్టెను. అది చూచి యతఁడు దయార్ద్రహృదయుఁడయి యా

షును గనుఁగొని "పతికిసమ్మతిలేని ధర్మము నెప్పుడును సతి చేయఁగూడదు. చేసినయెడల దుర్గతికిఁ బాత్రమగును ఇఁక మీఁద నయినను నీవు బుద్ధి తెచ్చుకొని పతికి హితములగు వాని నేఁ జేసినచో నాతనిగతి నొందఁగల" వని చెప్పఁగా నామె మరలిపోయెను. కాఁబట్టి పతికిసమ్మతముగా ననువర్తింపవలసి నదే సతికి పరమధర్మము అధర్మవర్తనఁగల వనితలు అసురులని పైశాచులని రాక్షసులని చెప్పఁబడు మూఁడు తెగల వారికిని సాధారణముగా వ్యభిచారమునం దనవరతము నిష్టము గలిగియుండును. వారిలో నాసురీవర్గమువారు సదా హృదయమునందు కౌర్యము నుంచుకొనియుండుట, ధనధాన్యములను నాశ చేయుట, భోగములయందు కేవల మనురాగము కలిగి యుండుట అసూయపడుట, మొదలగు దుర్గుణములు కలిగిఁ వర్తింతురు. పైశాచికావర్గమువారు మనసునందు క్రోధమును సాధించుట, పతిసుతులయందు ద్వేషము కలిగియుండుట, గృహకృత్య వర్తనముల నేర్పుచాలకుండుట, కలహములయందిచ్ఛ గలిగియుండుట, మొదలగు దుర్గుణములు గలిగియుండుచు కొనుచుందురు. రాక్షసీవర్గమువారు లేశమైనను సహనము లేకుండుట, యెల్లప్పుడు కల్లలాడుట, విశేషముగా నిద్రపోవుట సిగ్గులేక యుండుట మొదలగు దుర్గుణములు గలిగి నడుచుకొనుచుందురు. వీరందఱు నిస్సంశయముగాఁ బతివంశమువారిని నరకమునకుఁ బాపి తాము నరకమునకుఁ బోవుదురు. అట్టి దుష్ప్రవర్తనగల వనితలయినను తుదను తెలివి తెచ్చుకొని పతిభక్తిఁ గలిగి మిక్కిలి యనురక్తితో సత్కృత్యములుచేసి శాంతినివహించి వర్తించుచున్నచో మునుపుచేసిన

పాపములనుండి తొలఁగిపోయి పురుషునితోఁగూడ స్వర్గలోకమునకుఁ బోవఁగలుగుదురు. అట్లు వర్తింపక పోయినను పతుల యవసానకాలమునం దయినను ఇతర చింత లేకయను మరణము చేసిన పక్షమున వారికి పతి సహితముగా సద్గతి సిద్ధించును"

# కృష్ణాకుమారి

ఈవీరబాల మేవాడ దేశాధిపతి యగు మహారాణా భీమసింహుని కూఁతురు. ఈమె ౧౭౯౨వ సంవత్సరమున మేవాడదేశపు రాజధాని యగు ఉదేపూరున జన్మించెను. జాతకర్మాది సంస్కారములు జరిగినపిదప నాబాలకుఁ గృష్ణ యని నామకరణము చేసిరి. కృష్ణయం దామెజనని కధికప్రీతి యగుటచే నామె మిక్కిలి గారాబముతోఁ బెరుగుచుండెను. కృష్ణాకుమారి అత్యంత రూపవతిగా నుండెను. ఆమె పెరిగిన కొలఁదిని నామె యందలి యనేక సద్గుణములచే నామె విశేషకీర్తిం గనెను. ఇట్లుండఁగాఁ గొన్ని సంవత్సరములకాబాల వివాహయోగ్య యయ్యెను. కాన రాణిగారికి గూఁతు వివాహచింత విశేషమయ్యెను. ఆమెయొక్క యసమానరూపమును మృదుమధుర భాషణములును నదివఱకే దేశమంతటను వ్యాపించెను. కాన జనులామెను రాజస్థానమను కొలనిలో నామె యపూర్వపద్మమని పొగడుచుండిరి.

ఇట్టి కన్యారత్నము నెవరునకు నియ్యవలయునని భీమరాణా మిగుల విచారసాగరమున మునిఁగెను. ఆయన కిట్టి చింత గలుగుట కొకకారణము కలదు. ఆ కాలమునందు రజపుత్రస్థానమునఁ గల రాజులందఱిలో ఉదేపురపు రాణాలు శ్రేష్ఠకులీనులుగా నెన్నఁబడుచుండిరి. తమకంటె నుచ్చవంశీకులకుఁ గన్య నిచ్చిన సరి. లేనియెడల రజపూతులలో మిగుల

నవమానకరముగా నుండును. కాన రాణాగారు సమానవంశీకుని వెదకుచుండిరి. కాని యట్టి వరునకు విద్యాగుణములు సరిపడవయ్యెను. విద్యాగుణైశ్వర్యములు కలవరుని వెతకినచో వాఁడు కులీనుఁడు గాక పోవుచుండెను. ఇందువలనఁ గన్య నెవ్వరి కిచ్చుటకును కొంతవడి నిశ్చయింపనైరి. తుదకు మార్వాడదేశపు రాణాయగు భీమసింహునకుఁ గన్య నియ్య నిశ్చయించెను. కాని ప్రారబ్ధవశమున నల్పకాలములోనే మార్వాడ భీమసింహుఁడు స్వర్గస్థుఁ డయ్యెను.

తదనంతరము జయపురాధీశ్వరుఁ డగు రాణాజయసింహుఁడు కృష్ణాకుమారిని తనకిమ్మని యడుగుట కొకదూత నంపెను. ఉదేపురాధీశ్వరుఁడును అందుకు సమ్మతించి కన్యను జయసింహునకిత్తునని చెప్పెను. ఇంతలో మార్వాడ దేశపు సింహాసనము నెక్కిన రాజామానసింహుఁడు భీమసింగున కిటు చెప్పి పంపెను. 'ఇదివఱకీసింహాసనముపై నున్నవానికి కన్య నిచ్చుటకు నిశ్చయించితిరి. విధివశమున నాతఁడు కాలధర్మము నొందెను. అయినను నీకన్య యీసింహాసనమునకు వాగ్దత్త యయి యున్నది. కాన నాకియ్యవలయును.' రాణాభీమసింగుఁడు మార్వాడ రాజదూతతో 'మీరాజునకు నాకూఁతు నియ్య'నని స్పష్టముగాఁ దెలియఁజెప్పి పంపెను. ఇందువలన మార్వాడ దేశమునకును మేవాడదేశమునకును వైరము సంప్రాప్తమాయెను. ఆరెండుదేశములయందును సంగ్రామ సన్నాహములు జరుగుచుండెను. ఆసమయమునందు గ్వాలేరు రాజగు సిందే జయపురాధీశ్వరునిపై మిగుల వైరము కలవాఁడగు భీమసింగున కిట్లు వర్తమానమంపెను "కృష్ణాకుమారిని జయపురపు

రాణా కిచ్చినయెడల నేను మానసింహునకుఁ దోడుపోయి నీతో యుద్ధముచేయుదును” ఈవార్త విన్నంతమాత్రమున భీమసింహుఁడు తననిశ్చయమును మరల్పుకొనెను తనమాటను ఉదేపూరు రాణా లక్ష్యపెట్టకుండుటఁ గని సింహుఁడు మిగులకోపించి యుద్ధసన్నాహముతో బయలుదేరి యుదయపురమును సమీపించెను. సిందే ఉదయపుర ప్రాంతమున విడిసినపిదప కొన్నిదినములకు భీమసింగుఁడును సిందేయును నొక దేవాలయములోఁ గలిసి యేమాలోచించి జయసింహునకుఁ గన్య నియ్యవలెనని భీమసింగు వర్తమానము పంపెను. జయపురాధిపతి తనయాసలన్నియు నిరాశ లగుటవలన మిగుల కోపగించుకొని మానసింహునితో యుద్ధము చేయుటకై సైన్యము సిద్ధపఱుప నాజ్ఞాపించెను. మానసింహుఁడును యుద్ధమునకు కాలుద్రవ్వుచునే యుండెను. అతని శత్రువులు కొందఱు లక్షయిరువదివేల సైన్యము పోగుచేసి జయసింహునకు సహాయులైరి. అప్పుడారాజుల కిరువురకును పర్వతశిఖరి సమస్థలమున ఘోరసంగ్రామము జరిగెను. ఆ యుద్ధమునందు మానసింహుని సైనికులనేకులు జయసింహుని పక్షమునఁ గలియుటవలన మానసింహుఁడు యుద్ధమునుండి పలాయితుఁ డయ్యెను. ఇట్లు పాఱిపోయి యాతఁడు యోధగడయను దుర్గమునందు దాఁగియుండెను. జయసింహుని సేన యోధగడను ముట్టడించి భేదింపఁ దొడఁగెను. కాని యాదుర్గ మభేద్య మగుటచే వారు దానిని భేదింపనేరక మరలిపోయిరి. ఈయుద్ధమునందు జయసింహుని సైన్యము మిగుల నాశమొందెను. కాని జయపురాధీశ్వరుఁడు తనపురమునకుఁ బాఱిపోయెను. మానసింహుని శత్రుఁడయిన రాజొకఁడు

తన సైన్యములోని నవాబు అమీర్ ఖానను మ్లేచ్ఛునిచే చంపఁబడెను. ఈవిశ్వాసఘాతకుఁడగు తురుష్కుఁడే పిదప ననేక యుక్తులచే నుదేపూర్ రాణాకు ముఖ్యస్నేహితుఁడయి అజిత సింహుఁడను నాతనిచేఁ గృష్ణాకుమారి తండ్రికడ సేవకునిగా నుంచెను

ఇంతి సంగ్రామమయినను జయసింహ మానసింహులకంకెను యుద్ధమునందలి యిచ్ఛ తగ్గదయ్యెను. అందువలన వారిరువురును దళములతోడ ఉదేపురమునకు వచ్చుచుండిరి. కాన నాసంగతివిని భీమసింహ రాణా మిగుల చింతతో నాయుభయులను సమాధానపఱుచు నుపాయము విచారింపు చుండెను. ఆయన కేమియుఁ దోచక అమీర్ ఖాను నేకాంతముగాఁ బిలిచి యాలోచన యడిగెను. అప్పుడా దుష్టుఁడు కృష్ణాకుమారిని మానసింహున కిచ్చుటయో, చంపుటయో యుక్తమని చెప్పెను. ఈరెంటిలో కృష్ణాకుమారిని చంపుటయే యుక్తమమని రాజునకుఁ దోచెను. కాని స్త్రీహత్య జేయుట కాతని సేవకులలో నొకఁడును నొడఁబడఁడయ్యెను. భీమసింగుఁడు దౌలత సింగుఁడను సేవకునిం బిలిచి కొమార్తెను జంప నాజ్ఞాపించెను. వాఁడు కాభృత్యుఁడు ప్రభువును తిరస్కరించి తానట్టిపనిని చేయనని నిశ్చయముగాఁ జెప్పెను. తదనంతరము రాణాగారు మహావనసింహుఁ డనువానిం బిలిచి యీ ఘోరకర్మ చేయుమని చెప్పెను. ఈమహావనసింహుఁ డట్టికార్యము చేయుటకుఁ దనకిష్టము లేకున్నను రాజాజ్ఞకు వెఱచి దానికియ్యకొనెను. అంతనాతఁడు చేత ఖడ్గము ధరియించి యా కన్య నిద్రించు గృహమునకుఁ జనెను. కాని యానిద్రించు సౌం

దర్వ్యరాశినిం గనినతోడనే యాతని చేతులాడక ఖడ్గము చేతి నుండి జారి క్రిందఁబడ నాతఁ డాకార్యమును మాని మిగుల దుఃఖముతో మరలిపోయెను. తదుపరి అమీర్ ఖాను దుర్మంత్రము వెల్లడికాఁగా రాజసతి దుఃఖమునకు మితము లేదయ్యెను.

రాజభవనమునందంతటను దుఃఖమయముగా నున్నను కృష్ణాకుమారి ముఖమునం దెంతమాత్రమును మృత్యుభీతి కానరాదయ్యెను. ఆమె యెప్పటివలె సంతోషముగా నాడుచు, పాడుచుఁ జెలులకు నీతులను బోధింపుచుఁ గాలము గడుపుచుండెను. ఈకూఁతును విషప్రయోగమువలనఁ జంపుమని రాణా గారికి అమీర్ ఖా నాలోచన చెప్పెను. అట్టినీచకృత్యము రాణా గారికి సమ్మతమగుటవలన నొకబంగారుగిన్నెలో విషము పోసి దాని నాయనబిడ్డకడ కంపెను. దానిని కృష్ణాకుమారి సన్నిధికిఁ దెచ్చిన సేవకుఁ డీవిషము మీతండ్రి మీకొఱకుఁ బంపెనుగాన దీనిని మీరు స్వీకరింపవలయునని చెప్పఁగా నాబాల తండ్రియాజ్ఞ శిరసావహించి యావిషపాత్ర నాభృత్యుని చేతినుండి తీసికొని పరమేశ్వరునిఁ బ్రార్థించి తండ్రికి ధనాయుష్య సమృద్ధియగుఁగాత యని యావిషము నామె త్రాగెను. విషప్రాశనానంతరమునందు సహితమామె మరణభయము నొందక తనయిష్టదైవమునుఁ బ్రార్థింపుచుండెను. ఇంతలో నామెతల్లి శోకించుట విని యాబాల తల్లి కిట్లు సమాధానము చెప్పెను. "అమ్మా! నీవేల శోకించెదవు ? దుఃఖమెంత త్వరగాఁ దగ్గినయంత మంచిది. నేను క్షత్రియవీరుని బిడ్డనుగాన మరణమునకు వెఱవను. ఈశరీరము పుట్టినప్పుడే చావు సిద్ధము. ఇఁక నాచావునకై వగచిన నేమిఫలము" ఇట్టివాక్యములచేఁ దల్లికి

సమాధానము చెప్పుచు నవ్వుచు నుండునే కాని యాబాల యావిషముచే మృతి చెందదాయె. అంత రెండవభృత్యుఁడు మఱియొకపాత్రలో విషము పోసికొని వచ్చి యామెచే త్రాగించెను. కాని యందువలనను ఆమె మరణ చిహ్నము కానరా దయ్యెను.

తుదకు వారు చావనందునను సమరసమును నొకభయంకరమగు విష మామె కిచ్చిరి. దానిని త్రాగిన వెంటనే యాకన్యారత్నముయొక్క పవిత్రచరితము ముగిసెను. కాని కృష్ణాకుమారి ధైర్యము, నిర్భయత్వము, సత్యశీలయు, దేశముకొఱకుఁ దండ్రికొఱకుఁ జూపిన యాత్మత్యాగమును మొదలగునవి యీప్రపంచమునం దుండి యామె కీర్తిని నజరామరము చేయుచున్నవి.

# మైనలదేవి

ఈయుదాత్తచరిత ౧౦౭౨-వ సంవత్సర ప్రాంతమునం దుండెను. విదర్భదేశమున చంద్రపురంబు గలదు. ఆచటి రాజగు జయకేశునకు మైనలదేవియను కూఁతురు కలదు. ఈమె యుక్తవయస్కురాలు కాఁగా తండ్రి యామెకొఱకు సకల రాజపుత్రుల పటములను దెప్పించెను. వానిలో ఘూర్జరా (గుజరాతి) ధిపతియును, చాలుక్యవంశజుఁడునగు కర్ణరాజు రూపమామె కధిక ప్రియమగుటవలన నామె తన పటము నొక విప్రునకిచ్చి యారాజున కంపెను. కర్ణుఁడును మైనలదేవి సౌందర్యమును మెచ్చుకొని యావిప్రుని మిగుల సన్మానించి యామెను వివాహమాడ సమ్మతించెను. ఆవార్త దెలిసినవెంటనే మైనలదేవి ఘూర్జరదేశమున కరుగఁగా నచటనే కర్ణరాజునకు నామెకు వివాహమయ్యెను. వివాహానంతరము రోజు క్రొత్త పుష్పము నాఘ్రాణించు పురుషస్వభావము ననుసరించి కర్ణరాజునకు మైనలదేవియందలి ప్రేమ తగ్గెను. అట్టిసమయమునందు మైనలదేవికిఁ గలిగిన దుఃఖమువలన నామె యనేక పర్యాయములు జీవితముపై రోసెనుగాని యత్తగారి నీతిబోధవలనను, ఆత్మహత్యా దోషమని యెఱిఁగిన దగుటవలనను ఆమె యెన్నఁడును తనమరణమునకుఁ బ్రయత్నము చేసినది కాదు. ఇట్లు కొన్ని దినములు జరిగినపిదప ముంజలాయను భోగకాంతపై రాజునకు మక్కువగలదని ముంజలుఁడను మంత్రికిఁ దెలియఁగా నాతఁ

డుమైనలదేవియొక్క సద్గుణములం గని మిగుల కనికరించి ముంజలా యను నెపమున రాణినే యాతనికడకంపెను. రాజును వేషాంతరములో నున్న భార్యను భోగభామినిగా నెంచి నాఁడామెం మిక్కిలి సంతోషముగాఁ గాలముఁ గడపెను. మైనలదేవియు నాతని యుంగరమును గుఱుతుగాఁ గొనెను. పరమేశ్వరుని యనుగ్రహమువలన నాటిరాత్రి మైనలదేవి గర్భమును ధరియించెను. తదనంతరము కొన్ని కారణములచే వేశ్యాసంభోగము చేసినందునకయి రాజు మిగుల పశ్చాత్తాపము నొందెను. తద్దోషపరిహారార్థ మారాజు బ్రాహ్మణానుమతంబున నెనుత ప్రతిమల నాలింగనము చేసికొనుటకు సహితము సిద్ధమయ్యెను. కాని మంత్రి నిజముగా జరిగినసంగతిఁ దెలుపఁగా రాజు మనసు శాంతిఁబొందెను. అటుపిమ్మట రాణి ప్రసవమై కొమారునిఁ గనెను. ఈచిన్నవానిపేరు సిద్ధరాజ జయసింగని పెట్టిరి.

ఈచిన్నవాఁడు బాలుఁడయి యున్నసమయముననే కర్ణరాజు ౧౦౯౪వ సంవత్సరమున మృతినొందెను. పతిమరణము వలన మైనలదేవికిఁ గలిగిన దుఃఖమునకుఁ బారము లేదు. కాని యట్టిసమయముననే యామె తనదుఃఖమును దిగమ్రింగి రాజ్యభారమును వహించి ప్రజలను సుఖపెట్టవలసిన దయ్యెను. ఆపెలయన కర్ణరాజు ననంతరము బాలుఁడగు సిద్ధరాజ జయసింగునికిఁ బట్టము గట్టి యాతనిపేర కర్ణరాజునకు మాతులుఁడగు మదనపాలుఁ డనువాఁడు రాజ్యము నడుపుచుండెను. కాని యాతఁడు విచారశూన్యుఁ డయినందున ప్రజలకు న్యాయము దొరకకుండెను కాన సామంతుఁడను ప్రధానుఁ డొకఁడు బాలరాజును తనస్వాధీనము చేసికొని మిగులచాతుర్య

ముత్తి మదనపాలుని నొక సేవకునిచేఁ జంపించెను. ఇందువలన రాజ్యపాలనము మైనలదేవిపైఁ బడెను. మైనలదేవియు మిగుల దక్షతతో రాజ్యము నడుపుచు ప్రజలను బిడ్డలవలె నేలుచుండెను. మైనలదేవి, సాముంతి, ముంజ, ఉదా యను ముగ్గురు జైనమంత్రుల సహాయముచే న్యాయముగా రాజ్యశాసనముల నేర్పఱచి ప్రజలను తదనుసారముగాఁ బ్రవర్తింపఁజేసెను. ఆమె మోనరసమను తటాకమొకటియు, మలావను చెఱువొకటియుఁ ద్రవ్వించెను. ఈమె మలావను తటాకము కట్టునెడ నొకవేశ్యగృహము పడఁగొట్టినఁగాని యది యందముగాఁ గట్టుటకు వీలులేకుండెను. కాన రాణిగారా వేశ్యకు మిగుల ధనమిచ్చి దానియిల్లు గొనుటకు మిక్కిలి యత్నించెను. ఆవేశ్య తా నాధనముతీసికొని గృహము నియ్యననియు, మీరు తటాకము కట్టుటవలన మీ కెట్టికీర్తి కలుగునో దానిని నడ్డగించుటచే నాకును నట్టికీర్తియే కలుగుననియు చెప్పెను. రాణిగారు న్యాయప్రవర్తనయందే చిత్తము కలదిగాన నెవరియాస్తియందు వారికిఁ బూర్ణాధికారము గలదని యెంచి వేశ్య నింతమాత్రమును నిర్బంధపెట్టక దానియిల్లు వదలి చెఱువును వంకరగాఁ గట్టించెను. ఈ న్యాయమువలన నేఁటికిని ఆప్రాంతమునందలి ప్రజలు "న్యాయముఁగన నిచ్ఛగలవారు మలావతటాకమును గనవలెనని" చెప్పుదురు.

ఆమె ప్రధానులును రాణిగారి యనుజ్ఞప్రకారము అనేక ధర్మకార్యములఁ జేసిరి. ఒకానొకసమయమునం దామె సోమనాథమునకుఁ బుత్రసహితయై యరిగి భాలోడను గ్రామమున యాత్రికులకుఁ బన్నువలనఁ గలుగు బాధలఁగని కొమా

రునిచే పన్ను విడుచుటకుల ధారపోయించెను. ఇట్లీసతి రాజ్యము నేలి యనేక సత్కార్యములఁ జేసి కొమారుని చేతికి రాజ్యసూత్రముల నిచ్చి మిగుల వృద్ధయయి కాలధర్మము నొంచెను.

## ర ఖ మా బా యి కి బే

రాజకార్యధురంధరత్వమునకయి ప్రఖ్యాతి గాంచి యీ సాధ్వి క్రీ. శ. ౧౭౬౯గిన సంవత్సరప్రాంతమున ఖాందేశము నందలి పారోళే యను గ్రామమున జన్మించెను. ఈమె తండ్రి పేరు బాళంభట్టు; తల్లి పేరు సావిత్రిబాయి. బాళంభట్టు వైద్యక వృత్తిచే జీవనము చేయుచుండెను. రఖమాబాయియొక్క బాల్యేతిహాస మేమియుఁ దెలియదు. ఈమెకుఁ దల్లిదండ్రులు భివరాబాయియని నామకరణముచేసిరి. భివరాబాయిని విఠల్ మహాదేవను నతని కిచ్చి వివాహముచేసిరి. వివాహానంతర మీమెకు రఖమాబాయి యనునామాంతరము గలిగెను. భర్త జీవిత కాలమునందు నీమెబుద్ధివైభవ మంతగాఁ బ్రకాశింపకున్నను, ఈమె భర్త కనేక పర్యాయములు రాజ కార్యములయందుఁ దోడుపడెనని మాత్రము తెలియుచున్నది.

క్రీ. శ. ౧౮౨౯వ సంవత్సరమున విఠ్ఠల్ మహాదేవ గతించెను. ఆయనమరణమునకుఁబూర్వమే జ్యేష్ఠపుత్రికకొమారుఁడగు గణేశవిఠ్ఠల్ జోగ అను పిల్లవానిని దత్తపుత్రునిగా స్వీకరించెను. తదనంతర మల్పకాలములోనే మహారాజ్ మల్హారరావ్ హోళకర్ గారు గణేశవిఠ్ఠలునకు తమదివానగిరినిచ్చిరి. అప్పుడాయన బాలుఁడగుటవలన రాజ్యవ్యవస్థనంతను రఖమాబాయిగారే చూచుచుండిరి. అటుతరువాతఁ గొన్నిదినములకు రావ్‌జీతియంబకను నాతనిప్రోత్సాహమువలన గణేశవిఠ్ఠ

లుని దివాన్ గిరినుండి తీసి ఆపని రావ్ జీత్రియంబకున కిచ్చిరి. పిదప రఖమాబాయి తన ద్రవ్యముతో వర్తకము చేసి దాని నధికముగా వృద్ధిపఱుపఁ జొచ్చెను. ఆమెవర్తకశాలలు హిందూస్థానమునం దంతటను నుండుటయేగాక చినా దేశము నందు సహితముండెను. ఈవర్తకమువలన ప్రతిదినము లక్షయిరువదియైదు వేల లాభము కలుగుచుండెననియెదరు. ప్రతి వర్తకశాలకును లక్షరూపాయిలు మూలధనము (అసలు) గా నుంచి ఆధనముతో నతఁడు సంపాదించు లాభములోఁ గొంతభాగ మాతనికి నిచ్చునట్టుగా నేర్పాటు చేసినందున నాశాలాధికారులు కపటము చేయక వర్తకము చక్కఁగా నడుపుచుండిరి. ఇట్లు ౧౮౨౭వ సంవత్సరమునుండి ౧౮౩౩వ సంవత్సరము అక్టోబరు నెలవఱకును ఆమె తనవ్యాపారమును చక్కఁగాఁ జేసికొనుచుండెను.

౧౮౩౩వ సంవత్సరము అక్టోబరునెలలోనే మహారాజ్ మల్హార్ రావు హోల్కరుగారు దివి కరిగిరి. ఆయన పుత్రులు లేక గతించినందున నాతనిభార్య గౌతమబాయియు తల్లి కేసరిబాయియు నాలోచించి మార్తాండరావను చిన్నవానిని దత్తునిగాఁ గొనిరి. అప్పుడు రఖమాబాయి రాజమాతకు మిక్కిలి సహాయము చేసెను.

ఈసంధికాలములో నదివఱకు మహేశ్వరయను పట్టణమునందు రాజనిర్బంధములో నుండిన హరిరావ్ హోల్కరను నాతఁడు బంధముక్తుఁడయి వచ్చి రాజ్యము చేయసాగెను. అప్పుడు కొన్ని కారణములవలన రఖమాబాయి యిందూరు

నుండి వెడలి ఉజ్జయినిలో నాంగ్లేయుల యాశ్రయమునం దుండ వలసినదాయెను.

ఈమె యుజ్జయినిలో నుండినకాలమునందు నచట ననేక గృహములను గట్టించెను. క్షిప్రానదీతీరమున నొకఘట్టము కట్టించి యచట గంగయొక్క మూర్తిని స్థాపించెను. రఖమాబాయిగా రచట నొకయన్నసత్రమును సహితము స్థాపించిరి. ఇది యంతియుఁగాక యామె గ్రామమునందలి బీదసాదల నరయుచు వారికి సహాయము చేయుచుండెను.

౧౮౪౩వ సంవత్సరమున హరిరావు మహారాజుగారు స్వర్గస్థు లయిరి. తరువాత ఖండేరావుగారు సింహాసనారూఢు లయిరి. అప్పుడు హరిరావుగారి కాలమునందు జప్తుచేయఁబడిన రఖమాబాయిగారి యగ్రహారము వారికి మరల నియ్యఁబడెను. కాన నామె మరల నిందూరమునకు వచ్చెను.

రఖమాబాయి తనద్రవ్యమును హోళ్కరులకు బదులిచ్చెను. అది నేఁటివఱకుఁ దీర్పఁబడుచున్నది. ఇదిగాక యామె రాజపుతానాయందలి మధ్యహిందూస్థానమునందలి సంస్థానికుల కనేకుల కనేకలక్షలధనము వడ్డికి నిచ్చి వారి నాదుకొని తనకు ఋణులను జేసి వారిచే మిగుల గౌరవింపఁబడుచుండెను. ఇప్పటికిని నామె వంశీకులను సంస్థానికు లందఱు తమతో సమానముగా మన్నింతురు.

౧౮౪౪వ సంవత్సరమున క్రొత్తగా సింహాసనారూఢుఁడయిన ఖండేరావు మృతినొందెను. అప్పుడు రాజ్యమునకు వారసులు లేక యున్నందున నచటివారి కందఱకును మిగుల విచారముగా నుండెను. ఆసమయమునందు రఖమాబాయియు,

ఆమెకు సహోదరతుల్యుఁడయిన రెసిడెంటు దొరగారును రాజ్యమునకు వారసుని నేర్పఱచుటకై చేసిన కష్టము వారికే తెలియవలెను. కాని తక్కినవారలకు తెలియఁజాలదు. ఏప్రెల్ నెల ౮-వ తేదిని వేడ్ (ఇది రెసిడెంటు పేరు) దొరగారింటనుండి మార్చి యాస్థలమునకు హ్యామిల్టన్ దొరను బంపిరి. అప్పుడు వేడ్ దొరగారు హామిల్టనును తనతోఁ దీసికొని రఖమాబాయివద్దకి వచ్చి యామెకు సహాయము చేయవలసినదని హ్యామిల్టన్ గారితోఁ జెప్పి నీ యిచ్ఛ యేమియని రఖమాబాయిని నాతఁడడిగెను. అప్పుడామె సంస్థానము విషయమై తనకుఁ గలవిచారమును వెల్లడి చేసెను. అందుపై నాదొర సంస్థానము కొఱకు వారసు నేర్పఱచుటయందు రఖమాబాయికి సహాయము చేయుమని హ్యామిల్టను గారితోఁ జెప్పెను. అందుపై భావుహోళకరు గారి యిద్దఱు పుత్రులలో నెవరిని ఏరుచుకొనవలయునని యోచన కొలఁదిరోజులు జరుగుచుండెను. వారిలోఁ బెద్దవానిని తెచ్చి రఖమాబాయి చూపఁగా వానినే దత్తపుత్రునిగాఁ గొనెను. ఈయనయే తరువాత తుకోజి మహారాజని ప్రసిద్ధుఁడయ్యెను. తుకోజీరావు యౌవనవంతుఁడయి రఖమాబాయిగారి యుపకారమును మఱవక యామెను నాయనమ్మగను మిక్కిలి గౌరవించుచుండెను.

కొమారుఁడు పెద్దవాఁడయి వ్యవహారము చేయ మొదలు పెట్టినపిదప రఖమాబాయి దానధర్మములయందే తనదృష్టి నిలిపి కాలము గడుపుచుండెను. ఆమె తన ద్రవ్యమునుండి రామేశ్వరమునకు తిరుగుత్రోవలోనికి ననేకుల నంపి యక్కడక్కడ అన్నసత్రములను కట్టించెను. మఱియు నొక దేవాల

యమును కట్టించి దానిలో విఠ్ఠలమూర్తిని స్థాపించెను. కాశీయందలియు నితర స్థలముల యందలియు వర్తకశాలలలోఁ గొంతధనము ధర్మముక్రింద వ్యయపఱుపఁబడుచుండెను.

ఇట్లు కొంతకాలము గడపిన పిదప నామెకు ద్వారకాయాత్రకుఁ బోవలయునని బుద్ధి పుట్టెను. అంత నామె మిగుల వైభవముతో నాయాత్రకుఁ బయలుదేఱెను. ఆమె పోవుచుండఁగా గాయకవాడ మహారాజామెను మిగుల నాదరముతోఁ బిలుచుకొని పోయి తగినమర్యాదలు చేసిపంపెను. అచటినుండి పోవునపుడు త్రోవలో నీళ్ళు దొరకనిచోట్ల నెల్ల నామె బావులు త్రవ్వించి యూరివారికిని బాటసార్లకును గలుగు నిబ్బందులను తొలఁగించుచుఁ జనెను. అచటియాత్ర సాంగముగాఁ జేసికొని పోయినదారినే తిరిగి స్వగ్రామము చేరెను.

శా. శ. ౧౭౧౮వ సంవత్సర మాషాఢశుద్ధ యేకాదశి రోజున నీపవిత్రురాలగు సాధ్వి పుణ్యలోకమున కరిగెను! మరణసమయమున నామెకు రమారమి ౭౦ సంవత్సరముల వయస్సుండెను. ఆమె మృతినొందినందున కాపట్టణమునందలి ప్రజలందఱును మిగుల దుఃఖించిరి.

రఘమాబాయిగారికి నిద్దఱుపుత్రిక లుండిరి. వారిలో పెద్దదియగు [illegible]బా యనిబాపూసాహెబ్ పణశీకర్ గారికి నిచ్చి వివాహము చేసిరి. రెండవదగు చిమూతాయిని నానాసాహెబు కాకిర్డేగారికి నిచ్చి వివాహము చేసిరి. వారిలో పెద్దామె కొమారుని రఘమాబాయిగారు పెంచుకొని యతనికి గణపతిరావు లేక దాజీసాహెబ్ కిబేయని పేరుపెట్టిరి. చిన్నకూఁతురి వంశము నవిరతము వృద్ధిపొందుచునే యున్నది.

# నాచి

ఈవిద్వాంసురాలు వలేశ్వరోపాధ్యాయుల కూఁతురు. వలేశ్వరోపాధ్యాయులు ఆంధ్రబ్రాహ్మణుఁడు; మిక్కిలి విద్వాంసుఁడు; ఈయన నివాసస్థలము వలేశ్వరపురము. ఈవలేశ్వరపురము శ్రీశైలమునకుఁ బశ్చిమమున నుండును. ఈయన విద్యార్థులకుఁ జెప్పు సంస్కృతము నిత్యమును విని యీతని యింటిదాసీజనులును సంస్కృత మతి స్వచ్ఛముగా మాటలాడుచుండిరఁట. ఈయనయే మన యాంధ్రదేశమునం దంతటను నాడుల భేద మేర్పఱచి యాయా నాడులలోనే వివాహాదికములు జరుగు నిబంధనఁ జేసెనని చెప్పెదరు. ఆవిభాగంబులు నేఁటివఱకును మన దేశమునఁ బ్రచారములో నున్నవి. ఈయనకుఁ బుత్రసంతతి లేదు. ముగ్గురుబిడ్డలుమాత్ర ముండిరి.

వలేశ్వరోపాధ్యాయులు శా. శ. ము యొక్క 12వ శతాబ్దమునం దుండెనని తెలియుచున్నది. కాని నాచి సహితము శతాబ్దములో నుండినట్లు యూహింపఁబడియున్నది. ఈమె యాంధ్రబ్రాహ్మణ స్త్రీ యైనను నీమె చరిత్రము నాంధ్రదేశమునం [illegible] గౌరవకపోషక [illegible] న్యాయసమయము మహారాష్ట్రమున [illegible] యూరోపియనులు [illegible] ల్ల చరిత్రము గ్రంథములందు దాన వ్రైతిరి. ఈమె బాలవితంతువు కాన తండ్రి యింటి [illegible] చదువుకొనుచుండె యీమెను విద్వాంసురాలినిగాఁ జేయఁదలఁచెను. [illegible] దలఁచి

యేలేశ్వరోపాధ్యాయులవా రామెకు విద్యనేర్ప మొదలు పెట్టిరి. కాని విద్య త్వరగా రాకుండినందుల కామె మిగుల చింతించి విద్యార్థులకు బుద్ధివైభవము కలుగుటకై తండ్రి చేసియుంచిన జ్యోతిష్మతియను తైలమును నెవ్వరికిని జెప్పక త్రాగెను. అందుపై నామెకు దేహతాప మతిశయిల్ల నింటిలోనుండిన బావిలోఁ దుమికెను. తదనంతరము నింటిలోనివా రామెను వెదకి యెందునుగానక తుదకు బావిలో చూచిరి. అప్పటి కామె తాపము కొంత చల్లారినందున నామెకుఁ దెలివి వచ్చి వారికిఁ దనవృత్తాంతమునంతయు జెప్పెను. అది విని తండ్రి యామెను నాబావిలో మరి కొన్నిగడియలుంచి పైకిఁ దీసెను. నాఁటి మొదలామెకు విశేషముగ తెలివియు జ్ఞాపకశక్తియుఁ గలిగినందున నాచి తండ్రియొద్దఁగల సాస్త్రవిద్యనంతయు నేర్చెను.

విద్యావతియైనపిదప నామెకుఁ దీర్థయాత్రలు చేయవలయునని బుద్ధి పొడముటగాఁ దండ్రియామెననుసరించి యామెను యాత్రకుఁ బంపెను. నాచియుఁ దీర్థాటనము సుఖముగాఁ జేసికొని వచ్చుచుండెను. అప్పుడు దారిలో నెందెందు గలుగు పండితులనందరును దీనిమాకు పండితులతో వాదముచేయుచు సంభాషించెను. అప్పు డా విద్యావతి వారి నోడించి మిగుల ప్రఖ్యాతిగాంచెను. ఇదిగాక యామె పండితస్త్రీయాత్రాముఖమున సకలదేశముల రాజసభల యందుగల విద్వాంసులతో వాదముచేసి గెలిచి విశేష బహుమానములందెను. ఆమె యాత్రానుకూలములన్నియుఁ దీసికొనివచ్చి తండ్రికిఁ జూపి యామెకుఁ దన యాత్రావృత్తాంతమంతయు వినిపించెను. బ్రాహ్మణులలో కొమార్తెకుంగల వైధవ్యదుఃఖమునా

తను మఱచి తనకూఁతును పుత్రునిగా నెంచి యామె యిట్టి విద్యాసంపన్న యగుటకు మిగుల సంతోషించెను. ఈమె తన చరిత్రము ననుసరించి నాచినాటక మను నొక నాటకమును సంస్కృతమున రచియించెను. ఈమె విద్యాసంపదలచే మిక్కిలి వైభవముగాంచినందున నేలేశ్వరోపాధ్యాయులకుఁ బుత్రులు లేని కొఱంత తెలియకుండెను.

# సరసవాణి

ఈపండిత తనభర్తయగు మండన మిశ్రునకు శంకరాచార్యులవారితో వాదముచేసి యోడిపోఁగా నా నాచార్యులతో వాదించెను. ఈమెకుఁగల యసమానపాండిత్యమును సౌందర్యమును గని లోకు లీమెను సరస్వతీ యవతారమని తలఁచిరి. అందువలన వా రామెను ఉభయభారతి యని పిలుచుచుండిరి. (ఈమె యాదిశంకరుల వారితో సమకాలీనురాలగుటవలన శంకరులవారి కాలనిర్ణయమే యీమె కాలనిర్ణయమని వేరుగఁ జెప్పనక్కఱలేదు. ఆదిశంకరులవారు క్రీ. శ. ౭వ శతాబ్దమునం దుండిరని కొందఱును, ౮వ శతాబ్దమునం దుండిరని కొందఱును, ౯వ శతాబ్దమునం దుండిరని కొందఱును జెప్పుచున్నారు. కాని కొన్ని యాధారములవలన నాదిశంకరుల వారు క్రీ. శ. ౮వ శతాబ్దాంతమునను ౯వ శతాబ్దాదిని నుండి నట్లు పండితు లనేకులు నిర్ణయించియున్నారు.)

శోణనదీతీరమునందుండు విష్ణుశర్మయను బ్రాహ్మణునకు సరసవాణి యొక్కతెయే కూఁతురు. అందువలన నతఁడామెను కడుగారాబముతోఁ బెంచుచుండెను. తల్లిదండ్రు లామెకు సకలవిద్యలను నేర్పిరి, సాంఖ్య, పాతంజల, వైశేషిక, న్యాయమీమాంసా, వేదాంతములనెడి యాఱుశాస్త్రములును, వ్యాకరణాది షడంగములును, కావ్యనాటకములును,

ఇతర విద్యలన్నియు నామె నేర్చెను. ఇందువలన లోకులామె ను గని యద్భుతపడుచుండిరి.

ఇట్లు విద్యారూపగుణ సంపన్నయగు నాచిన్నది వివాహ యోగ్యయయ్యెను. అప్పుడామె గుణవంతుఁడును, సురూపవంతుఁడునునగు విశ్వరూపాపరనామము గలమండనమిశ్రుని ఖ్యాతిని బ్రాహ్మణులవలన వినెను. మండన మిశ్రుఁడును సరసవాణియొక్క సద్గుణములు వినెను. అందువలన వారికి నుభయులకును నొకరి నొకరుచూడ వలయునని యభిలాష జనించెను. కాని వారు తమతల్లిదండ్రుల కాసంగతిఁ దెలుపుటకు సిగ్గుపడి తమలోఁ దామే కృశించుచుండిరి.

ఇట్లు కొన్నిదినములు గడచినపిదప తమపిల్ల లిట్లు కృశించుట కేమికారణమోయని వారి జననీజనకులు చింతించి యొక దినమువారు దాని కారణమును చెప్పక తప్పదని వారిని వారి తండ్రులు బలవంతపఱుపఁగా వారు నిజమయినకారణమును దెల్పినవారైరి.

అంతపై హిమమిత్రుఁడు సరసవాణి తండ్రియొద్దికి కన్యకను విచారింప నిద్దఱుబ్రాహ్మణుల నంపెను. వారికి విష్ణుశర్మ తగినమర్యాదలుచేసి యాగమనకారణ మడుగఁగా వారును తాము వచ్చినసంగతి నతని కెఱిఁగించి పిల్లను మండనున కిమ్మని యడిగిరి. అందున కతఁడు తనభార్య నడిగి నిశ్చయించి చెప్పెదనని వారికిఁ జెప్పి యామెనడుగఁగా నాయువతి యిట్లనియె.

"ధనము, కులము, శీలముగల వానికిఁ బిల్ల నియ్యవలెనని శాస్త్రములయందును, వ్యవహారమునందును ప్రసిద్ధియే

కదా? ఈపిల్లఁడు దూరముననుండువాఁడు. ఇతని కులశీలములు మనకుఁ దెలియవు. కనుక నిందానగుటంచి యేమి చెప్పఁగలను" అందుకతఁడు మండనమిశ్రుని విద్యాప్రభావమును బొగడి ధనమునకన్నను విద్యయే శ్రేష్ఠమని చెప్పెను. అంత నాదంపతు లిరువురును కొమార్తెకా సంగతిఁ దెలిపి యామె మనోభావము నెఱుఁగఁ దలఁచి యామె సన్నిధి కరిగి యాసంగతి నామె కెఱుకపఱచి నీ యభిప్రాయమేమని యడిగిరి. వారా వార్త చెప్పినంతోడనే యా బాల కపరిమితసంతోషము కలిగి యాసంతోషమున నామె మనసునందిముడుటకుఁ జోటుచాలక రోమాంచరూపమున బయటఁ బడెను. దానివలననే నామె యభిప్రాయమును వారెఱిఁగి యావచ్చిన బ్రాహ్మణులకుఁ దోడు తా మొక బ్రాహ్మణుని వరునిఁ జూచుటకును, లగ్ననిశ్చయము చేయుటకును బంపిరి. నాఁటికిఁ బహునాల్గవ దివసంబున దశమినాఁడు శుభచంద్రయుక్తమైన ముహూర్తమును వ్రాసి గణితమునందుఁ బ్రవీణుఁడైన సనాతనుఁడను తమబ్రాహ్మణుని చేతి కిచ్చెను.

అంత నాబ్రాహ్మణులు మువ్వురు కొన్నిదినములకు మండనమిశ్రగ్రామమునకుఁ జేరి యుపాసితాద్రికి శుభలేఖ నందిచ్చిరి. ఆయన దాని జదివికొని సంతసించి శుభదినమునందు బంధువర్గముతోఁ దరిఁబోయి కొమారుకు వివాహము చేసెను.

కూఁతు నత్తవారింటికి కనుపునపుడు సరసవాణి తల్లిదండ్రు లామె కిట్లు బోధించిరి. "ప్రియకుమారీ! నేఁటినుండియు నీకు నపూర్వమైనదశ ప్రాప్తమయినది. ఈసుస్థితికి యోగ్యమైనటుల నీవు ప్రవర్తింపుము. బాల్యమునందలి క్రీడలు

వినువుము. ఏలయనఁగా అట్టి నీమాటలు మాకు సంతోషజనకములైనటుల నితరులకుఁ గానేరవు. స్త్రీలు వివాహమున కన్నెప్రాయము తల్లిదండ్రుల యాజ్ఞలో నుండవలయును. తదనంతరము వారికిఁ బతియే గతి. కనుక నీవు పతి యాజ్ఞలో నుండుము. ఇందువలన నీకు నుభయలోకములలోఁ గీర్తి కలుగును. పతికంటెను మొదట లేచి స్నానము చేయుము. అతఁడు భోజనము చేయనిది భోజనము చేయకుము పతి గ్రామాంతరము వెళ్ళినయెడల భూషణాదులను ధరియింపకుము. ఇటుల నరుంధత్యాది పతివ్రతలు నడిచినటుల నడుచుటయే నీకు భూషణము. పతి కోపగించినయెడల మాఱు మాటాడకుము. ఆయన కోపమునంతను నోర్చుకొనుము. ఇటులఁ జేసిన నతఁడు నీపైఁ గోపమును వదలి ప్రేమింపఁగలఁడు. శాంతితో సాటి యేదియును లేదుసుమా. పతి యింట లేకుండినప్పుడు నతిథులెవరైన వచ్చినయెడల వారిని దిన్నఁగా సన్మానించి యాదరించి పంపవలయును. అటులఁ జేయనిపక్షమున వారిలో నెవరైన మహాత్ములుండిన యెడలఁ గులదాహమగును. అత్తమామలను తల్లిదండ్రులవలెఁ జూడుము. బావమఱఁదులను నన్నదమ్ములవలెఁ జూడుము. వీరికిఁ గోపము వచ్చినయెడల నీకును,నీభర్తకును నెంత యన్యోన్య ప్రేమముండినను మీలో భేదము పుట్టింతురు.”

ఇట్లు వారు గూఁతునకు బుద్ధులుగఱపి యామె నత్తవారియింటికి నంపిరి. ఆభార్యాభర్తలు తమనగరమునకు నరిగి గృహస్థాశ్రమమును జక్కఁగా నడుపుచుండిరి. ఇట్లు కొన్ని సంవత్సరములు గడచినపిదప నీదంపతుల విద్యాప్రావీణ్యము

లోకమంతటను వెల్లడియైనందున శంకరులవారు వీరితో వాదించి గెలుపొంద నెంచి యాగ్రామమునకు వచ్చి నీళ్లు గొనిపోవుచున్న యువతులను మండనమిశ్రునిగృహ మెచట నని యడుగఁగా వా రిట్లు చెప్పిరి:—

"ఎవని ద్వారమునందుఁ బంజరమున నుంచఁబడిన ఆఁడు చిలుక వేదము స్వతఃప్రమాణమా పరతఃప్రమాణమా యని చర్చించుచుండునో యాగృహమే మండనమిశ్రునిదని తెలిసి కొనుము."

"పూర్వకృత కర్మవలన, మనుష్యుఁడు చేయుకార్యమునకు, ఫలము కలుగునా లేక పురుషప్రయత్నము వలన ఫలము కలుగునా యని యేద్వారములోఁ బంజరస్థలయిన శుకయువతులు వాదించుచుండునో యాదేగృహము మండన పండితునిది యనుకొనుము."

"జగత్తు నిత్యమా యనిత్యమా యని యేయాఁడు చిలుక లే గృహముయొక్క సింహద్వారమునఁ బంజరమునను ముచ్చటించుచుండునో యాగృహమే మండనునిది యనుకొనుము."

వారట్లు చెప్పఁగా శంకరులవారచటి కరిగి మండనునిచే వాదభిక్షఁగొనిరి. తరువాత సమస్తవిద్యాశారద యయిన సరసవాణిని సభకు నధిపతినిగా నేర్పఱచివారు వాదవివాదమునకు నుద్యుక్తులయిరి.

ఇట్లు కొన్ని దినములు వాదము జరిగినపిదప మండనుఁడు వాదమునందోడుట తటస్థ మయ్యెను. అప్పు డాతని సను

గ్రహించి శంకరు లతనికి సన్యాస మియ్యఁదలఁపఁగా సరసవాణి శంకరులతో నిట్లనియె.

"ఓయతిశ్రేష్ఠ! నీయుద్దేశము నాకుఁ దెలిసినది. నీవు నాపతిని గెలిచితివిగాన నతనిని నీశిష్యునిగాఁ బరిగ్రహించుట యుక్తమే. కాని నీ వింకను నాతనిని సంపూర్ణముగా నోడించలేదు. ఆతని యర్ధశరీరిణినగు నన్ను గెలిచినఁగదా మీగెలుపు పూర్ణమగును. మీరు గొప్పపురుషులు లయినప్పటికిని మీతో వాదము చేయవలయునని నాకుచాల నుత్కంఠ యున్నది."

శంకరులు—"వాదవివాదమునం దుత్కంఠ గలదని నీవు చెప్పితివి కాని నీతో వాదము కూడేరదు. గొప్పవారు స్త్రీలతో వాదము చేయరు."

సరసవాణి—"స్వమతమును స్థాపింపఁ దలఁచువారు తమమతమును ఖండించువారు పురుషులయినను, స్త్రీలయినను వారితో వాదము చేసి వారిని పరాజితులను జేయుట యత్యంతావశ్యకము. ఇందువలననే పూర్వము యాజ్ఞవల్క్యులవారు గార్గితోను, జనకుఁడు అబలయైన సులభతోను వాదము సల్పిరి. వారు యశోనిధులు కాకపోయిరా!"

ఇట్లు సరసవాణి చెప్పినయుక్తివాదమువలనను, పూర్వోదాహరణములవలనను కుంఠితులయి శంకరులవారు సభయందు నామెతో వాదము చేయుట కొప్పుకొనిరి.

పరస్పర జయోత్సుకులయినట్టియు తమబుద్ధిచాతుర్యమువలన రచియించిన శబ్దమనెడి యమృతముచే వినువారిని విస్మయ మొందించునట్టియు నాసరసవాణి శంకరులకు నత్యద్భుతముగా వాదము జరిగెను.

ఇట్లహోరాత్రములు పదియేనుదినముల వఱకును అసమాన విద్యావంతులగు సరసవాణీ శంకరులకు ఘోరమ యినవాదము జరిగి తుదకు సరసవాణి యడిగినప్రశ్న కుత్తరము చెప్పఁజాలక శంకరు లారునెలల వ్యవధి యడిగిపోయి మఱికొంతవిద్య నభ్యసించి మరల వచ్చి యామెకు సమాధానము చెప్పెను. అందుపై మండనమిశ్రుఁడు సన్యసింపఁగా సరసవాణి దివి కరిగెను.

ఈసరసవాణి చరితమువలన నామె కాలమునందలి హిందూసుందరులు గొప్పవిద్య నభ్యసించుచుండి రనియును, వారు గొప్పపండితులతో సహితము వాదవివాదములు చేయుచుండిరనియును దెలియఁబడుచున్నది. ఆకాలమునందు నోరెఱుఁగని పసిపాపలకుఁ దల్లిదండ్రులు తమసమ్మతితో వివాహములు చేయు నాచారములేక కన్యావరులు యుక్తవయస్కులయినపిదప వారి యనుమతి ననుసరించియే వివాహములు జరుగుచుండె ననియును స్పష్టముగాఁ దెలియుచున్నది. అప్పటి సంఘస్థితిఁబట్టి చూడఁగా నప్పటిస్త్రీ లత్యంతోచ్ఛదశయందుండినట్లు తేలుచున్నది. కాని ఆకాలమునం దట్టియుచ్ఛపదవియందుండిన హిందూసుందరులు ప్రస్తుత మత్యంత హీనస్థితికి వచ్చి తమదుర్దశనే తెలిసికోఁజాలనంతటి యజ్ఞానులగుట మిగుల దుఃఖకరము. పూర్వకాలమునందలి స్త్రీలకును, ఈకాలపు స్త్రీలకును గలతారతమ్యము సతీహితబోధినీ పత్రికోక్తముగా నిందుదాహరించి యీచరితము ముగించెదను.

"ఈభరతఖండమునం దిప్పుడున్న స్త్రీలస్థితికిని పూర్వకాలమునం దుండిన స్త్రీలస్థితికిని మిక్కిలి వ్యత్యాసము గలదు.

పూర్వకాలమునందలి సుందరులు విద్యలయందును, కళలయందును, పాండిత్యము కలవారయి పురుషుల కుపదేశము చేయఁదగినంత మంచిదశయందుఁ గూడ నుండుచు వచ్చిరి.— వేదమందు వర్ణింపఁబడిన గార్గి, మైత్రేయి మొదలయినవారినే యిందుకు నిదర్శనములుగాఁ జెప్పవచ్చును; ఆకాలమునందలి స్త్రీలు వేదవేదార్థము లెఱిఁగినవారని చూపుటకు శకుంతల మొదలయినవారిని దృష్టాంతములుగాఁ గొనవచ్చును; యజ్ఞాదులయందును, వివాహములయందును స్త్రీలు పఠింపవలసిన మంత్రము లుండుటయే మనపూర్వులు భాషాపాండిత్యము కలవారయి మంత్రార్థముల నెఱిఁగియుండవలెనని యుద్దేశించినట్లు స్పష్టమగుచున్నది. ఆకాలమునందు స్త్రీలుపురుషులవలెనే గౌరవింపఁబడుచుండిరిగాని యిప్పటివలె గదులలో మూసిపెట్టఁబడుచుండలేదు. వారి కట్టిస్వాతంత్ర్యములు పూర్వకాలమునందుఁ గలిగి యున్నవని చూపుటకు సీత మొదలగు క్షత్రియ స్త్రీలు సహితము భర్తలతో వచ్చి సభలలో సింహాసనముల మీఁదఁ గూరుచుండుచు వచ్చిన వార్తను సూచించుటకంటె విశేషమేమియుఁ జెప్పనక్కఱలేదు. ఇవియవి యని వేఱుగఁ జెప్పనేల? ఆకాలమునందలి స్త్రీలకుండవలసిన స్వాతంత్ర్యముల నన్నిటిని వారు గలిగియుండిరనుటకు సందేహములేదు. వారి కప్పుడున్న విద్యాప్రభావమునుబట్టినా రట్టిగౌరవములకును స్వాతంత్ర్యములకును నర్హురాండ్రయి యుండిరి. మనపూర్వులు గృహిణీధర్మములను వివరించుచు భర్తకుభార్య మంత్రివలె నాలోచనచెప్పవలెననియు, తల్లివలె నుపచారము చేయవలె

నసియు, గురువువలె హితోపదేశము చేయవలెననియు, వైద్యుని
వలె శరీరారోగ్యమును కాపాడవలయు ననియు చెప్పియున్నారు.

ఇటువంటి పనులను యుక్తముగా నిర్వహింపఁ గలుగు
టకు స్త్రీలెంతటి విద్యావతులుగా నుండవలయునో చెప్పుట
కంటె నెవరికి వారూహించుకొనుటయే సులభముగా నుండు
ను. జ్ఞానమూలమయిన విద్యానిక్షేప మే హేతువుచేతనో క్రమ
క్రమముగా మన దేశపు స్త్రీలనువిడిచిపోయినది. ఆవిద్యాధనము
తోనే వారికిఁగల సమస్తలాభములును, సమస్త స్వాతంత్ర్యము
లును క్రమక్రమముగా నశించుచు వచ్చినవి. కడపట స్త్రీలకు
విద్య కావలయునా యని సంశయపడునంత దురవస్థ మనదేశ
మున కిప్పుడు పట్టినది. స్త్రీలు విద్యాహీనురాండ్రగుటచే
మూఢత్వములో మునిఁగియుండి సంసారభారమును చక్కఁగా
నిర్వహించుటలో మునుపటివలె పురుషులకు సహాయురాం
డ్రు కాఁ జాలకున్నారు. అందుచేత పురుషులకు స్త్రీలయందు
పూర్వకాలమునందుండెడు గౌరవమంతయు తగ్గిపోయినది.
ఏవిషయమునందయినను స్త్రీల నాలోచన యడుగుటయే యన
ర్థదాయకమని సామాన్యముగా పురుషు లిప్పుడు భావించు
చున్నారు. అందుచేత పురుషు లనేకులు స్త్రీలయొక్క - యభి
ప్రాయమునుగాని అంగీకారమునుగాని పొందకయే వారిని వివా
హమును మిషమీఁద నంగహీనులకును, వృద్ధులకునుగూడఁ
గట్టిపెట్టుచున్నారు; మానవదేహమున కలంకారమయిన విద్యా
భూషణము వారికి లేకుండఁ జేసి లోహపు నగలనుమాత్రము
పెట్టి తమ వేడుక నిమిత్తము వారిని తోలుబొమ్మలవలెఁ జేయు
చున్నారు; వారిని గృహ యజమానురాండ్రనుగాఁ జూడక

తమయుపచారము నిమిత్తమయి దాసులనుగా చేయుచున్నారు. పురుషులు స్త్రీలవిషయమునఁ జేసిన యిట్టియన్యాయము వలన స్త్రీలను మూఢురాండ్రనుగాఁ జేసి చెడఁగొట్టుటయేకాక తామును వారితోడిపాటుగా మూఢశిరోమణులయి చెడిపోవుచున్నారు. అందుచేత పురుషులలోఁగూడ నిజమయిన యీశ్వరభక్తియు సద్వర్తనమును బోయి మూఢభక్తియు, నీతిరాహిత్యమును వర్ధిల్లుచున్నవి. దానిఁబట్టి నిజమయిన సౌఖ్యమును సంతోషమును లేక యనేకులు భూతల స్వర్గముగా నుండవలసిన గృహము మహారణ్యమువలె నగుచున్నది. ఏయింటఁ జూచినను నైకమత్యమునకు మారుగా కలహములును, మనస్తాపములును పెరుగుచున్నవి. ఈస్థితియంతయు పురుషుల లోభమువలనను స్వప్రయోజనపరత్వమువలనను గలుగుచున్నది కాని స్త్రీలదోషమువలన నణుమాత్రమును గాదు. ఏకాలమందైనను ఏదేశమునందును తమ స్త్రీలను మంచిదశకు తీసికొనిరాక తాము బాగుపడిన పురుషులు లేరు, తాము బాగుపడఁ దలఁచిన పక్షమున ముందుగా తమ స్త్రీలను బాగుచేయవలెను; స్త్రీల బాగే పురుషుల బాగు కాఁబట్టి పురుషులు తమ యోగక్షేమాభివృద్ధి నిమిత్తమే మూఢురాండ్రయిన యిప్పటి స్త్రీలను తొంటి యుత్తమదశకు మరలఁ దీసికొనివచ్చుటకై ప్రయత్నింపవలెను. స్త్రీల యభివృద్ధి నిమిత్తమయి యక్కడక్కడ నుత్తమపురుషులు చేయు ప్రయత్నములకు మూఢతాపిశాచావేశముచేత స్త్రీలే ప్రతిబంధకారిణు లగుచున్నారు. ఇంటివద్ద స్త్రీల సహాయమున్నంగాని కులాచార మతాచార విషయములయందు పూర్వాచారములకు విరుద్ధములైననూతన

సదాచారము నెలకొలుపుట పురుషులకు సాధ్యముకాదు. కాఁబట్టి పురుషులు తమస్త్రీలనుమూఢదశయందుంచియే దేశమున కేమో మహోపకారమును చేయుదుమన్న దురహంకారము విడిచి వారియేర్పాటును బొందియే సత్కార్యములను జేయఁ జూడవలెను. స్త్రీల సహాయ మున్నపుడే పురుషులకు విజయము గలిగి లోకమునకు సత్యమైన యుపకారము కలుగును. సద్విషయములలో స్త్రీల యేర్పాటును పొందఁ దలఁచిన పక్షమున ముందుగా వారి నాశ్రయించి యున్న మూఢతాపిశాచము తొలఁగునట్లుగా వారిని విద్యావతులను గాను, వివేకురాండ్రనుగాను జేసిమనకు సరియైన యేర్పాటు చేయుటకు వారిని శక్తురాండ్రను జేయవలెను"

# చాందబీబీ

ఈశూరవనితకు నిజామ్‌శాహీలలో మూఁడవపురుషుఁడగు హుసేన్ నిజామ్‌శాహ తండ్రి. ఆదిల్‌శాహీలలో నాల్గవ పురుషుఁడగు అలీ ఆదిల్ శహా భర్త. వీరిరువురికిని పరస్పర కలహములు కలిగి యుండెను. కాని అహమ్మదనగరు విజాపూరు గోలకొండలకుఁ ప్రభువులగు తురకషహాలు కూడి విజయనగరముపై దండు వెడలుటకు నిశ్చయించుకొనిన కాలములో, అహమ్మదనగరమునకు నధిపతియగు హుసేనషహా, విజాపురమున కధిపుఁడగు అలీషహాతో సఖ్యము చేయఁదలఁచి తన కూఁతురగు చాందబీబీని నతనికిచ్చి వివాహము చేసెను. తదనంతరము తలికోటలో క్రీ. శ. ౧౫౬౫వ సంవత్సరమునందీమహమ్మదీయులకును విజయనగరాధీశ్వరుఁడగు రామరాజునకును యుద్ధము జరిగి విజయనగర సంస్థానము నశించెననుసంగతి హిందూదేశచరిత్రము చదివినవారికందఱకును విదితమేగాని స్త్రీచదువరులకునీశాహీలసంగతి చిన్నగాఁ దెలిసి నంగాని ప్రస్తుత చరితము బోధపడదుగాన వాని వివరము నిందు గొంత సంగ్రహముగాఁ దెల్పెద.

క్రీ. శ. ౧౫౨౬వ సంవత్సరమున* బ్రాహ్మణీరాజ్యమను తురకరాజ్య మంత్యదశకు వచ్చెను. అప్పుడు దక్షిణమున నైదుగురు తురుష్కులు స్వతంత్రులయిరి. వారిలో విజాపురమునందు రాజ్యము చేయువారిని 'ఆదిల్ షహాల'నియు, గోలకొండయందలి రాజుల వంశమును 'కుతుబ్ షహాల'నియు వర్హాడ (బీరారు) రాజులను 'ఇమాద్ షహాల'నియు, అహమ్మదనగర ప్రభుత్వమువారిని 'నిజామ్ షహాల'నియు, 'అహమదాబాదునందలివారిని 'బరీద్ షహాలని'యు వాడుచుండిరి. కాని కొన్నిరోజులయిన పిదప 'ఇమాద్ శాహి' 'బరీద్ శాహీలు' రెండును నాశమునొంది 'ఆదిల్ శాహి' 'నిజామ్ శాహి' 'కుతుబ్ శాహీలు' మూఁడునుమాత్రము నిలిచెను. శాహియనఁగా రాజ్యమనియు షహా యనఁగా రాజనియు నర్థము.

భర్తజీవితకాలమునందు చాందబీబీయొక్క చాతుర్య మంతగాఁ దెలియకుండెను. ఈమె భర్తయగు అలీ మిగుల భోగముల ననుభవించుచు రాజ్యమునం దెంతమాత్రము దృష్టి లేక యుండెను; ఇట్లుండఁగా క్రీ. శ. ౧౫౮౦వ సంవత్సరమునం దొక దినమునం దాయన యజాగ్రతగా నున్నసమయమునం

---

* ఢిల్లీలో గంగూయను బ్రాహ్మణుఁడు జఫీర్ ఖానను తురకపిల్లవానిని బాల్యమునఁ గొని పెంచి యింటిపని చేయుటకయి యుంచుకొనెను. పిదప నాచిన్నవాని బుద్ధివైభవముఁ గని యాతని యజమానుఁడు ద్రవ్యమక్కఱలేకయే యాతనిని దాస్యమునుండి విడిచెను. తదనంతర మాపిల్లవాఁడు దక్షిణమున రాజ్యము స్థాపించెను. అప్పుడతఁడు తనయజమానునియెడఁ గృతజ్ఞుఁడయి జఫీర్ ఖాన్ గంగూ బ్రాహ్మణీయని తనపేరు పెట్టుకొనెను. అతని రాజ్యమే బ్రాహ్మణీరాజ్య మనం బరఁగెను.

దొరకఁ డకస్మాత్తుగా నతనిఁ జంపెను. తదనంతరమునం దాతని తమ్మునికొడుకగు రెండవయిబ్రాహీమ్ ఆదిల్‌షహా సింహాసనారూఢుఁ డయ్యెను. ఆయన ౯ సంవత్సరముల బాలుఁ డగుట వలన నాతని పెత్తండ్రి భార్యయగు చాందబీబీయే కమీల్ ఖానను మంత్రి సహాయమువలన రాజ్యము నేలుచుండెను. కొన్నిదినములైన వెనుక కమీల్‌ఖానునకు రాజ్యకాంక్ష మిక్కుటమయ్యెను. దానిఁగని చాందబీబీ కిశ్వరఖానను సరదారుని సహాయముచే వానిఁ జంపి కిశ్వరఖానునకు దివాన్‌గిరి నిచ్చెను. కాని కొంతకాలమునకు వాఁడును కృతఘ్నుఁడయి రాణిమీఁదఁ గొన్ని దోషముల నారోపించి యామెను సాతార కిల్లాలో ఖైదుచేయించెను. చాందబీబిని ఖైదుచేసిన పిదప కిశ్వర్‌ఖాను రాజ్యమునం దంతటను విశేషసంక్షోభము చేయ సాగెను. దాని నెవరును మాన్పలేక యుండఁగా యెకసాల్‌ఖానను సర్దారుఁడొకఁడు వాని నచటినుండి వెడలఁగొట్టి చాందబీబీని విడిపించి తెచ్చెను. తదనంతరము వాఁడు యెకసాల్ ఖానును వజీరుగా నేర్పఱచి రాజ్యము నేలుచుండెను. అప్పు డామెయు పాతనౌకరుల నందఱిని తీసి క్రొత్తవారిని నియమించెను. అక్కాలమునందు విజాపురమునందలి జనులు మంత్రిత్వము ఉన్‌ఉల్‌ముల్కు సిద్దీ కియ్యవలెనని కొందఱును, అబ్దుల్ హాసనను దక్షిణీతురక కియ్యవలెనని మఱి కొందఱును ఇట్లు రెండు పక్షములుగా నుండిరి.

ఇట్లు రాజ్యాంగమునందంతఃకలహంబులు జరుగుచుండఁగా మూర్తిజా, నిజామ్‌షహా కులీకుతుబ్‌షహా వీరిద్దఱును అహమ్మదనగరముపైకి దండు వెడలి దానిని సమీపించిరి. అప్పుడ

వటఁ బ్రజలలో బొత్తుగా నైకమత్యము లేక యుండినందున వైరులకు మిగుల ననుకూలముగా నుండెను. ఇట్టి సమయము నందు చాందబీబీ మిగుల యుక్తిగా నౌకరులను సమాధానపఱచి అబ్దుల్ హాసనునకుఁ బ్రధానిత్వమిచ్చి రెండుపక్షములవారిని నొకటిగాఁ జేసి శత్రువులను మరలిపోవునట్లు చేసెను! షహాలు కమతమునగరముల కరిగినపిదప దిలావర్ ఖాను సిద్దీ మిక్కిలి గర్వించి అబ్దుల్ హాసనును జంపించి తానే ప్రధాని యయ్యెను.

ఇట్టి రాజ్యమున నొకసంవత్సరముపై నాలుమాసములలో మువ్వురు మంత్రులైనను నొకరును నెగ్గకుండిరి. దిలావర్ ఖాన్ సిద్దీ మిగుల చాతుర్యవంతుఁడైనందున నతఁడు తనకు రాజ్యకాంక్ష కలిగియు దానిని వెలిపుచ్చక మిగుల జాగరూకుఁడయి యుండెను. ఇతఁడు రాజ్యవ్యవస్థను బహు చక్కఁగాఁ జూచెనుగాని చాందబీబీ యచటనుండిన తనయాట లేమియు సాగవని తెలిసికొని ఇబ్రాహీమ్ ఆదిల్ షహా చెల్లెలగు ఖుదీజా సుల్తానాయును రాజపుత్రిని మూర్తిజా నిజామ్‌షహాకొడుకగు మిరాన్ హుసేనున కిప్పించి క్రీ. శ. ౧౫౮౪ వ సంవత్సరమున ఖుదీజా సుల్తానాకుఁ దోడు చాందబీబీని జామ్‌షహాకిఁ బంపి బాలరాజును స్వాశ్రయునిగాఁ జేసెను.

చాందబీబీ నిజామ్ శాహీకివచ్చినపిదప నచట నైదాఱు సంవత్సరములలో మూర్తిజాను జంపి యాతని కొడుకగు మిరాన్‌హుసేను అతనిఁజంపి యాతని పినతండ్రి యగు బురాణ సహాయును, అతని వెనుక నాతని పుత్రుఁడగు ఇస్మాయెల్ షహాయును తదనంతరమాతని తమ్ముఁడగు ఇబ్రాహీమ్ నిజామ్ షహాయును రాజ్యముచేసిరి. ఇబ్రాహిమ్మరణానం

తరమునం దతని పుత్రుఁడగు బహదుర్‌ను కారాగృహమునం దుంచిఆన్ అను దక్షిణీతురకమంత్రి, నిజామ్‌షాహిలోనివాఁడని చెప్పఁబడు అహమ్మదను వానిని సింహాసనముపై నుంచి తానే రాజ్యము చేయ మొదలుపెట్టెను. ఈ అహమ్మదునకు రాజ్యము నిచ్చుట సిద్దీ సరదారుల కిష్టము లేక బహదురునకు ననువయస్కుఁడగు నొక బాలునిఁ దెచ్చి వానినే రాజ్యార్హుఁడని చెప్పఁ దొడఁగిరి. ఇట్లు వారు రెండుపక్షములవారయి సైన్యసహితులగుటఁ గని మి ఆన్ మంజూ మిగుల చింతించి అక్బర్ బాదుషా కొడుకగు మురాదను నాతనికి మీరు నాకు సహాయము చేసినచో అహమ్మదనగరము మీ స్వాధీనము చేయుదునని వర్తమానము నంపెను. కాని మురాద్ సైన్యసహితుఁడయి వచ్చులోపల అహమ్మదనగరమునం గల రెండుపక్షములవారికిని యుద్ధము జరిగి సిద్దీలను మి ఆన్ మంజూ ఓడించెను. కాని దానిప్రకారము అహమ్మదనగరము మురాదున కిచ్చుటకు సమ్మతింపఁడయ్యె. అంత నారాజపుత్రుఁడు యుద్ధసన్నద్ధుఁడయ్యెను. ఆ సమయమున నీప్రధాని సైన్యమునంతను ఆదిల్‌షహా, కుతుబ్‌షహాలను సహాయమునకుఁ బిలువఁబోయెను. అతఁడరిగినపిదప బహదుర్ రాజ్యమని సాటించి చాంద బీబీ రాజ్యమును తానే నడుపుచుండెను.

ఆసమయమునం దిద్దఱు ముగ్గురు రాజ్యము తమకే కావలయునని యనుటవలన నచటి లోకులు రెండు మూడు పక్షములుగా నుండిరి ఇట్టి సమయమున చాందబీబీ తనదృఢనిశ్చయమును విడువక, నేహాంగఖానునకు శాహ అల్లీ సిద్దీకిని వర్తమానముల నంపి వారిని రాజధానికిఁ బిలువనంపెను.

చాందబీబీ యాజ్ఞప్రకారము వారిరువురును వచ్చుచుండఁగా త్రోవలో శత్రువులు వారిని రానియ్యక నిలిపిరి. నేహాంగ ఖాన్ మాత్రము శత్రుసైన్యము నుపాయముగాఁ జీల్చి రాజధానిం బ్రవేశించెను.

ఆదిల్‌షహా, కుతుబ్‌షహాలు మురాదునిరాక విని ప్రథమమునందు నిజామ్‌శాహీని గెలిచి పిదప మనపైకివచ్చునని భయపడి విపులసైన్యములతో నిజామ్‌శాహీకిఁ దోడుగా వచ్చుచుండిరి. ఈ సంగతి విని మురాద్ వారు వచ్చినచో గెలుపొందుట కష్టమని తలఁచి గ్రామమును చుట్టుముట్టి బురుజులను పడఁగొట్ట యత్నించుచుండెను. మురాద్ సైనికులు బురుజులను బైటినుండి త్రవ్విగూనచేసి యాగూఁటిలో తుపాకిమందునుంచి దానికి నగ్నిని రవులుకొల్ప యత్నించుచుండిరి. కాని చాతుర్యవతియగు చాందబీబీ లోపలినుండి బైటివఱకు రంధ్రములు పొడిపించి వారాగూటిలోనుంచు మందు నివలికిఁ దీయించుచుండెను. ఇంతలో వారొక బురుజునకు నిప్పంటించినందున నా బురుజుతోఁ గూడ ననేక సైనికులు నాశము నొందిరి. అంత నాత్రోవను మొగలులు పట్టణములోనికిఁ జొర నుంకించఁగా నదివఱకెంతక శౌర్యముతో యుద్ధము చేయుచున్న నిజాము సైన్యములు ధైర్యమును విడిచి పాఱఁదొడఁగెను. అప్పుడు చాందబీబి ధైర్య మవలంబించి, కవచమును ధరియించి మోముపై ముసుకువేసికొని చేత ఖడ్గమును ధరియించి "నాబొందిలో ప్రాణము లుండఁగా పట్టణము పగవారిచేఁ జిక్కనియ్యన"ని కూలిన బురుజు వైపునకుఁ బరుగెత్తెను. దానింగని సైనికు లధికశౌర్యసాహసములుగల

వారలై మరల శత్రువులంతోఁ బోరసాగిరి. ఆదినమంతయు
యుద్ధము జరిగెనుగాని చాందబీబీ శత్రువులను పట్టణము
లోనికిఁ జొరనియ్యకుండెను. అప్పు డామె యెక్కడఁజూచినను
దానయై బహుశౌర్యముతోఁ బోరాడెను. ఆసమయము
నందలి యామె శౌర్యమునుగని శత్రుసైనికులు సహిత
మాశ్చర్యపడిరని ప్రత్యక్షముగాఁ జూచిన యతఁడే వర్ణించెను.
అప్పుడు మురాద్ తనకు గెలుపు దొరకుట దుస్తరమని తెలిసి
కొని "మాకు వర్హాడప్రాంతము నిచ్చినయెడల మేము మాదేశ
మునకుఁ బోయెదము" అని చాందబీబీకి వర్తమాన మంపెను.
త్వరగా రాజ్యమునందలి యితరసైనికులువచ్చి తనకుఁ దోడు
పడు లక్షణము లేమియు నగుపడనందున వర్హాడప్రాంతము
చాందబీబీ వారికి నిచ్చి సంధి చేసికొనెను.

తదనంతరమున నామె బహదూర్‌ను కారాగృహము
నుండి విడిపించి తెచ్చియతనికిఁ బట్టాభిషేకము గావించెను.
అంతనామె అహమ్మదఖానను నాతని ప్రధానిగా నేర్పఱచి
యాపిల్లవాని పేర తాను రాజ్యము నేలుచుండెను. కాని
అహమ్మద్ ఖానునకు రాజ్యకాంక్ష మిక్కుటమైనందున అతఁడు
చాందబీబీమాటను సాగనియ్యకుండెను. ఈసంగతి సైనికులకు
దెలియఁగా వారాతనిఁబట్టి బంధించి చాందబీబీ స్వాధీనము
చేసిరి. తదనంతర మాతనిపని నేహాంగఖానను నాతని కిచ్చినం
దునచాందబీబీరాజ్యము సురక్షితముగా నేలఁదొడఁగెను కాని
త్వరలోనే నేహాంగఖాను రాణికి వైరియయ్యెను. ఈ సమయ
ననే మురాద్ శహాపురమునందు కాలము చేసెను. అంత
నక్బరుపాదుషా తనచిన్నకొమారుఁడగు డానియల్ అను నా

తనిని మురాద్ పనిమీఁదికిఁ బంపి యతనికి వజీరుసిగాఖాన్ ఖానను వానిని బంపెను. అప్పు డగ్బరు బర్హాణ పురమునకు వచ్చి డానియల్‌ను క్రీ. శ. ౧౫౯౯వ సంవత్సరమున అహమ్మదు నగరముపైకి యుద్ధమున కంపెను.

ఈసమయమునందు నిజామ్‌శాహీలో మిగుల నవ్యవస్థగా నుండెను. చాందబీబీవారి చాతుర్యవతి రాజ్యము చేయుచున్నను ఆసమయమునం దామెకు నచట విశ్వాసార్హులగువా రెవ్వరును లేకయుండిరి. కాన నామె యేమియుఁ జేయలేక యుండెను. నేహంగఖాను చాందబీబీతో నేమో యాలోచించి వైరులను త్రోవలో నాటంకపఱుపఁబోయెను. కాని శత్రువులాతఁడుండుత్రోవను రాక మఱియొకత్రోవనుండి వచ్చి పట్టణమును ముట్టడించిరి. అప్పుడు చాందబీబీ తన యాజ్ఞను వినువా రెవ్వరును లేక అప్పటికి రాజధానిని విడచి బాలరాజునుగొని జున్నరను గ్రామమునకుఁ బోవ నిశ్చయించెను. కాని యామె సమీపమునను౦డు హమీద్‌ఖానను వాఁడు కాయాలోచన సరిపడక చాందబీబీ పగవారికి రాజ్య మిచ్చుచున్నదని యూరంతటను చాటమొదలు పెట్టెను. అది విని దక్షిణితురకలు నిజమని తలఁచి హమీద్‌ఖానును ముందిడుకొని కొందఱు భటులు చాందబీబీ యంతఃపురమున జొచ్చి యామెను జంపిరి. ఇట్టు హిందూస్థానపు ఇతిహాసములోఁ బ్రసిద్ధురాలయిన స్త్రీరత్నముయొక్క చరితము ముగిసెను. ఈమె ప్రథమమునందు విజాపురమున మఱఁది కొమారుఁడగు ఇబ్రాహీమ్ ఆదిల్ షహా చిన్నతనమున నతని కొఱకు ఆదిల్ శాహిని రక్షించెను. పిమ్మట అహమ్మద్‌నగరమున తన

తమ్ముని మనుమఁడగు బహదురు కొలకు నిజామ్‌శాహీ సంరక్షణమును మిగుల కుశలతతోఁ జేసి సార్వభౌముఁడగు అక్బరుయొక్క కుమారుని సైన్యములను దిరగఁగొట్టెను. కాని తుదకు రాజ్యమునం దంతటను మూర్ఖులుండుటవలన నామె యోగ్యత నెఱుఁగక మిగుల నన్యాయముగా నామెను జంపిరి. నేఁటివఱకును దక్షిణమున స్త్రీల శౌర్యమునుగూర్చి ప్రసంగించునప్పుడు చాందబీబీ యొక్క శౌర్యమునే ప్రథమున శ్లాఘింతురు.

# ధనలక్ష్మి

---

ఈ సాధ్వీస్త్రీ బడోదా రాజ్యములోని బెల్పా గ్రామవాసుఁడగు జగన్నాథలక్ష్మీరాముని కోడలు; శివరాముని కూఁతురు. ధనలక్ష్మి యత్తపేరు మహాలసను. ఈమె ధార్మికయు, వినయవతియు, వివేకశీలయు విద్యావతియునై తనకోడలగు ధనలక్ష్మికిని నాగుణములనే గఱపుచుండెను. కొమారుఁడగు గిరిజాశంకరునకుఁగూడ బాల్యమునుండి విద్యాబుద్ధులు నేర్పి యతని సద్గుణవంతునిఁ జేసెను. ధనలక్ష్మి వివాహానంతరము జగన్నాథలక్ష్మీరామునికి గౌరవము హెచ్చుచుండెను. మహాలసకు నెల్లప్పుడును స్త్రీనీతిపుస్తకములను జనుపుచు స్త్రీలకు సద్బోధ చేయుచు నీతి, భక్తి, ధర్మములపైఁ గీర్తనలను రచియించి బాలురకును, బాలికలకును నేర్పుటయందధిక శ్రద్ధగలదియై యుండెను. ఇట్టి సద్గుణవతియగు నత్తచేతిక్రింద నుండిన కోడలు మిగుల సత్తమురాలగుట యొకయాశ్చర్యము గాదు. ధనలక్ష్మి యత్తగారి యందధిక ప్రేమ గలదియయి యెన్నఁడును పుట్టినింటికిఁ బోవనిచ్ఛయింపదయ్యె. ఒకానొకప్పుడు పుట్టినింటివారు తనను బలవంతముగాఁ దీసికొనిపోయినను మూఁడు నాలుగుదినములచటనుండి మరల నత్తయొద్దికి వచ్చినంగాని యామె మనసు సంతసింపదయ్యె. ఇట్లా యత్తకోడండ్రు తల్లిబిడ్డల కంటె నధికప్రీతి కలవారలయి యుండిరి. ఇదిగదా యత్తకోడండ్రుండ

వలసిన విధము. ఇప్పుడు కోడండ్రు బాధించెడి యత్తలకును, అత్తల నవమానించు కోడండ్రకును వీరిచరిత్ర మనుకరణీయము. ఏగృహమున నత్తకోడండ్రిద్దఱును దమతమధర్మములను దప్పక నడుచుచుందురో యాగృహమునందు సుఖమున కేమికొఱంత? ధనలక్ష్మి యత్తమామలకును, భర్తకును నుపచారములు చేసి వారిచే దీవనల నంది పతివ్రతా ధర్మములను దప్పక పాలింపుచుండెను. అత్తవలెనే ధనలక్ష్మికిని గృహోపయోగకరములగు పుస్తకములను, ఇతర గ్రంథములను చదువుటయం దిచ్ఛ యధికముగా నుండెను. ఇంతియగాక యామె తాఁ జదివిన గ్రంథములయందలి సారాంశమునంతను మఱవక తన హృదయమునఁ బదిలపఱచుచుండెను. ఇట్లా యత్తకోడండ్రగు నాయిరువురు పతివ్రత లుండుటవలన నాగృహంబు బహుశోభావంతంబయి యానందసాగరమున నోలలాడుచుండెను. కాని పతివ్రతల పరీక్ష సంకటసమయంబునంగాని కాదని కాఁబోలును పరమేశ్వరుఁడు వారిపైఁ గష్టము తెచ్చిపెట్టెను.ఆప్రకార మెట్లనినఁ వి.శ. ౧౯౩౯వ సంవత్సరము చైత్ర శుద్ధమునందు జంబూసరవాసుఁడగు విశ్వనాథుఁడనువారి బంధువునియింట రెండుపెండ్లిండ్లు జరిగెను. ఆవివాహమునకు ధనలక్ష్మియు గౌరీశంకరుండును బోయిరి. ఖంబాత్ లో వివాహమయినవెనుక పెండ్లివారందఱును జంబూసరమునకు వచ్చుటకయి పడవలో నెక్కిరి. రెండువివాహములవారును గలిసినందువలన నాపడవలో జనులు బహుమందియుండిరి. ఈపడవలోనివారు జంబూసరమునకుఁ జేరుటకు ఖంబాత్ నుండి కావీ రేవువఱకును సముద్రములో రావలసియుండిరి. పడవ

రేవు విడిచి కొంతదూరఁ జరిగినపిదపఁ దుఫాను (గాలివాన) ప్రారంభమాయె సముద్రమునం దలలు మిన్నంట సాగెను. అంత నాపడవలోని జనులందఱు మిక్కిలి భయంబు నొంది యాప్తులం గలిసి యేడ్చువారును పరమేశ్వరుని బ్రార్థించువారును పడవమునింగినఁ జత్తుమను భయముచే మూర్ఛిల్లువారును నైయుండిరి. పడవవాండ్రు జనుల కెంత ధైర్యము చెప్పినను నా తుపానును గనివారు ధైర్య మవలంబింపఁజాలరయిరి. కాని ధనలక్ష్మిమాత్రము ధైర్యమును విడువకుండెను. ఆమె చిన్ననాఁడు పడవలోఁ గూర్చుండునపుడు జాగ్రతగాఁ గూర్చుండవలయుననియు, పడవలో మునగకట్టె లుంచుదురనియు ఒకసేరు మునగకట్టె యొక మనుష్యుని నీళ్లలో తేల్చఁగలదనియు, మునగకట్టెను బట్టుకొని యొక పడవవాఁడు సముద్రములో మూఁడుదినములుండినను నాకట్టె వానిని ముంచలేదనియు 'అరేబియను-నైట్సను గ్రంథములోఁ జదివియుండెను. ఈమాట యా సమయమునందు ధనలక్ష్మికి జ్ఞాపకము వచ్చి యాకట్టెను శోధించి తీసికొనెను. తదనంతర మామె తనచీరను బాగుగా పుట్టగోచిఁ బెట్టి బిగియించెను. అప్పుడు పడవ మునుఁగుటకు సిద్ధముకాగా నామె తనభర్తతోడ నాకట్టెను బట్టుకొని సముద్రములోనికిఁ దిగెను. గిరిజాశంకరుఁ డొకచేత నాకట్టెను రెండవచేత నగలపెట్టెను బట్టుకొని యున్నందున నతని ధ్యాన మాకట్టెను గట్టిగాఁ బట్టుకొనుటకంటెను నగలపెట్టెను భద్రముగాఁ బట్టుకొనుటయందు విశేషముగా నుండెను. అదిచూచి యామె భర్తచేతి నుండి యాపెట్టెను దీసి యోడలో నొకచిలుక కొయ్యకు తగిలించెను. తరువాత నాపతిపత్ను లిద్దఱు నాకట్టెను బట్టు

కొని సముద్రములోఁ బోవుచుండిరి. పడవలో మిగిలిన వారందఱును మునిఁగిపోయిరి. ఈదంపతులు సముద్రములోఁ బడిపోవునప్పుడు వారినోళ్ళలోనికి నీరు పోవుచుండెను. అప్పుడు నదిలో సహితము దిగక యొడ్డుననుండి స్నానము చేయు నాగిరిజాశంకరుని భయమునకు మితము లేదయ్యెను. కాని యట్టిసంకటసమయమునను ధైర్యమును విడువక ధనలక్ష్మి తన భర్తకు ధైర్యము చెప్పుచు నతని పిఱికితనముఁ బోఁగొట్టుచు నీత నేర్చినదిగాన కొంతదూరము మీఁదుచు నాకట్టె యాధారమువలనఁ బోవుచుండెను. అంతలో వారిసమీపమున 'హరిశంకరుఁ' డను నొకచిన్నవాఁడు మునిఁగి నీళ్ళపైకిఁ దేలి హరినిఁ బట్టుకొనియెను. అప్పు డాకట్టె ముగ్గురిని తేల్చఁజాలక మునుఁగున ట్లగుపడఁగా దానిని గనిపెట్టి ధనలక్ష్మి యుపకారబుద్ధి గలదయి తనభర్తకును హరిశంకరునకును నాకట్టెను పట్టుకొనిపోవు విధము చెప్పి తా నొకతె చచ్చి యిరువురు బ్రాహ్మణులు బ్రతుకుట శ్రేష్ఠమని తలఁచి యాకట్టె వారికి నిచ్చి తా నీదుకొని పోవఁదొడఁగెను. ఆహా! ఈమె పరోపకారబుద్ధి నేనోళ్ళఁ బొగడినను నత్యుక్తి యగునా? ఈమె కట్టె విడిచి కొంచెముదూరము వచ్చిన వెంటనే యొకగొప్ప యల వచ్చి యామెను ముంచెను. ఆమె నీళ్ళలో మునుఁగుట నెఱిఁగినదిగాన నప్పుడు మునిఁగియుండు పరమేశ్వరుని దయవలన మరలఁ బైకి రాఁగలిగెను. ధనలక్ష్మి నీటిలోనుండి బైటికి వచ్చునప్పటికి నామెపతి యామెకు దృగ్గోచరుఁడు గాఁడయ్యె. అంత నామె తనపతిని రక్షించుమని పరమేశ్వరుని ననేకవిధములఁ బ్రార్థించి కనులు విప్పునప్పటి కామెకు సమీపముననే

మునిఁగిన యోడ తేలుచున్నట్లగుపడెను. అపు డామె తన కాలికిఁ బడవ త్రాడొకటి తాకఁగా దాని యాధారము వలన నాపడవసమీపమునకుఁ బోయి తననగల పెట్టెను కాలితోఁ దీసికొని కాలికే తగిలించుకొని యచట నొకకట్టె యగుపడఁగా దానినిఁ బట్టుకొని యొంటికాలితో నీఁదుచుఁ బోవసాగెను. అప్పుడు సముద్ర ముప్పొంగి మిగుల భయంకరముగా నుండెను. కాని ధనలక్ష్మి తనధైర్యమును విడువక యొక కాలితో నీళ్ళను త్రోయుచు చేతులతో నీఁదుచుఁ గొంత దూర మరిగెను. అప్పు డామె కాలుసేతులు మిగుల తీపులు పుట్టినందున నిఁక బ్రతుకుట దుస్తరమని తోఁచి నగల పెట్టెను సముద్రములో విడిచి రెండుకాళ్ళతో నీదఁ దొడఁగెను. ఇట్లీఁదుచు నామె కారేపునకుఁ గ్రోసెఁడుదూరము వఱకును వచ్చెను! కాని యచట సముద్ర మామెను ముందుకు నీఁదనీయక వెనుకకు లాగఁ జొచ్చెను. ధనలక్ష్మి తన యావచ్ఛక్తిని వినియోగించి ముందున కీదఁ బ్రయత్నించు చుండెను. ఇంతలో నొక గొప్పయల వచ్చి యామె నాకాశమున కెగరవేసెను. ఆమె యెగిరినపుడు దూరమున నెవరో మునిఁగిపోవుచున్నట్ల లనామె కగుపడెను. పిదప నామె సముద్రములోనం బడి తన కగుపడినవాఁడు తనభర్త యయియుండునని చింతించి యతని ప్రాణమును గాపాడ తనకు శక్తి లేనందువలన నతనిని గాపాడుటకయి పరమేశ్వరుని వేఁడుకొనియెను. ఆహా! అట్టి సంకట సమయమునందు సహితము పతివ్రతాతిలకము పతి క్షేమమును చింతింప మఱచినది కాదు! ఇట్లు పరమేశ్వరుని వేఁడుకొని యతఁడే తనపతినిఁ గాపాడు నని నమ్మి యామె

ధైర్యమవలంబించి యా కట్టెను ద్రోసికొనుచు రేవునకు నర క్రోసు దూరమువఱకు వచ్చెను. అప్పుడు సూర్యుఁడు పశ్చిమాద్రిపయి నస్తమింపు చుండెను. ఆసమయమున విశ్వనాథుఁడు వియ్యాలవారిని నోడలోనుండి దింపి తనగ్రామమునకుఁ గొనిపోవుటకై బండ్లనుదీసికొని యా రేవునకు వచ్చియుండెను. అప్పుడచటఁ దమతమబండ్లను గడుగు బండ్లవాండ్లును, సముద్రమునందలి యోడలలో సరకుల నెక్కించువారును, వచ్చిన సరకులను దించువారునునుండి రేవు మిగుల కోలాహలముగా నుండెను. ధనలక్ష్మికి రేవు కాన వచ్చినందున నచటిజనుల వైపునకుఁజూచి కేక వేసి చెయ్యివిసరి సైఁగచేసెను. కాని యచటికి రేవరక్రోసెడు దూరముండినందున నచటిజనుల కీమె సైఁగ కానుపింపదయ్యె. తదనంతర మామె తనరెండు చేతుల నెత్తి సైఁగచేయుఁగా నచటనున్న బాడివాఁడొకఁడు చూచి యొకమనుష్యుఁడు సముద్రములోఁ గొట్టుకొని వచ్చుచున్నాఁడని యతఁడచటి బెస్తలతోఁ జెప్పెను. కాని యపుడు తుపాను సమయమై సముద్ర మల్లకల్లోలముగా నున్నందున సాహసించి సముద్రములోనికిఁ బోవుట కెవ్వరు నొప్పకుండిరి. ఇంతలోఁ బాటుసమయమైనందున ధనలక్ష్మిని సముద్రము మరల వెనుకకుద్రోయఁ జొచ్చెను. అప్పు డామె యీఁదుటకు శక్తిచాలక ప్రాణములపై నాశను విడిచి పరమేశ్వరుని స్మరణ చేయుచుండెను. అది చూచి యొక బెస్త మిగుల దయ గల వాఁడయి పుట్టగోచిని బిగించి సముద్రములోనం దుమికి యీదుచు నామెను సమీపించి ‘యమ్మా నిన్ను నేను రక్షింప వచ్చితిని; నీవు ధైర్యము విడువకుమ’ని యామెతో ననెను.

అందుకు ధనలక్ష్మి 'నాయనా నేనెప్పుడు నధైర్యపడను. నా కీదుట బాగుగాఁ దెలియునుగాని చాలదూరమునుండి యీఁదు చు వచ్చుటవలన మిక్కిలి బలహీననైతిని. నీవు నాకీసమయమున సహాయము చేయుము' అని యడిగెను. అప్పుడా బెస్త యామె చేతనున్న కట్టెను ముందుకుఁ ద్రోసికొని పోవుటలో నామెకు సహాయుఁడై యామెను రేవుకుఁ జేర్చెను. ధనలక్ష్మివలన జరిగిన సంగతిని విని విశ్వనాథుఁడు మిగుల శోకాకులమానసుఁడయి యామె నొక విప్రుని గృహమున కనిచి తాను పడవటీలను వేయించుకొని సముద్రము నొడ్డున నంతను వెదకఁ బోయెను.

ధనలక్ష్మియు నావిప్ర గృహమునకరిగి తనపతి బ్రతికి వచ్చిన జాడఁ గానక నతఁడాసముద్రమున మునిఁగి ప్రాణములను విడిచెనని తలఁచి తాను బ్రతికివచ్చినందునకై మిగుల దుఃఖింపసాగెను. అప్పుడచటి వారందఱును ఆమెను గని 'తల్లీ! నీవు నడిసముద్రమునం బడినయెను ధైర్యమును విడువక యిరువురి ప్రాణముల సంరక్షించు నీవు ప్రాణములతో నిచటికి వచ్చితివి. నీయద్వితీయధైర్యము నేమనవచ్చును? ఇట్లయ్యును నీవిపుడు ధైర్యమును విడుచుట యుక్తముగాదు. నీ కిప్పుడన్నియు శుభసూచకములే కానుపించుచున్నవి. నీ వింత సేపు సముద్రములో నీదివచ్చినను నీ నుదుటి*కుంకుమ చెరగ లేదు. కావున నీసౌభాగ్యము శాశ్వతముగా నుండును అని ధైర్యము చెప్పిరి. కాని యాపతివ్రత భర్తపై మనసునుంచి

* కొందఱు స్త్రీలు నుదుటికి మైనము రాచి దానిపై కుంకుమ పెట్టుకొనెదరు. అది నీటిలోనైనను చెరగదు.

శోకింపుచు నేమియుఁ దినక, త్రాగక తదేకధ్యానముతో నుండెను. ఇంతలో నాగ్రామములోని పోలీసుబంట్రోతు జరగిన వర్తమానమును వ్రాసికొనుటకై ధనలక్ష్మియున్న గృహమునకు వచ్చి తానే ధనలక్ష్మిని సముద్రములో నుండి తీసినట్లు కైఫియ్యతువ్రాసి యిమ్మనెను. కాని నీతివిశారదయైన ధనలక్ష్మి యసత్యమాడక బెస్తవాఁడు తనను రక్షించెనని నిజమయిన సమాచారమును వ్రాసియిచ్చెను. ఇంతలో నామెకు భర్త బ్రతికివచ్చుచున్నాఁడని పోలీసువారివలన వర్తమానము తెలిసి యపరిమితానందభరితయై యామెభర్త నెదుర్కొనఁ బోవునంతలో నతఁడే గృహమునకు వచ్చెను. అప్పుడా యిరువురును పరస్పర సందర్శనమువలన మితిలేని యానందము గలవారలైరి. ధనలక్ష్మి పతికి నమస్కరింపఁగా నతఁ డామె నెత్తి యాలింగనము చేసికొని యామె సముద్రమునం దగుపఱచిన ధైర్యమునకును, ఆమె తనప్రాణములకుఁ దెగించియైనను దమ యిరువురి ప్రాణములను గాపాడినందునకును నామెను బహువిధముల స్తుతియించెను. అంత వారందఱును భోజనములను జేసిరి. ఈవార్త యాగ్రామమంతటను దెలియఁగాఁ బ్రజలు మూఁకలుగట్టి వచ్చి ధనలక్ష్మినింగని నమస్కరించి కేవలము లక్ష్మీదేవినిగా భావించి స్తుతియించిరి. అప్పు డామె వారితో మీరు నన్నేల స్తుతియించెదరు? సర్వరక్షకుఁడగు జగదీశ్వరుని స్తుతియించినఁ గృతార్థులయ్యెదరు; అని వారిలో స్త్రీలకుఁ బతివ్రతా ధర్మములను గూర్చి కొంత యుపన్యసించెను. ఆమఱునాఁడు వారు స్వగ్రామమునకుఁ బోయిరి. వీరచటికరిగి జరిగిన వర్తమానమునంతను జెప్పఁగా విని ధనలక్ష్మి యత్త మామ

లధిక హర్షితులై కోడలినిం గని నీవు మాపాలిటి భాగ్యదేవత వని కొనియాడిరి. అప్పుడు బడోదాసంస్థానములో నాయబ్ సుబాగానుండిన హర్శివల్ దొరగారీ వర్తమానమంతయు విని స్వయముగా వెళ్ళి ధనలక్ష్మిని దర్శించి కొనియాడెనంట. ఈమె వర్తమానమంతయు నప్పటి గుజరాతి వార్తాపత్రికలయందుం బ్రకటింపంబడియె.

# విద్వత్కుటుంబము

---

ఈకుటుంబమున నందఱును విద్వాంసులేగాన దీని కీపేరు పెట్టితిని. ఈకుటుంబమును గుఱించి నమ్మఁదగిన చరిత్ర మెక్కడను దొరకలేదు. కాని లోకులు వీరి కథ నిట్లు చెప్పుదురు. పూర్వము ద్రావిడదేశమున వేదపూశి యను భవిష్యవాదియొక్కఁడుండెను. ఆయన యొకదినము రాత్రి తనవాకిట నిలిచియుండఁగా నొకనక్షత్రము మాలవాడ వైపున రాలుటఁ జూచెను. మఱునటిదినమున నిద్ర లేచి వేదపూశి మాలవాడలో నెవరయిన నీళ్ళాడిరాయని తెలిసికొనఁగా నాఁటిరాత్రి యా చుక్క రాలిన సమయముననే యొకమాలదాని కొకయాఁడు బిడ్డ పుట్టెనని తెలియవచ్చెను. అది విని యావిప్రుఁ డాకన్యక తనకోడలగునని తెలిసికొని మిగుల చింతించెను. అంత నాతఁడు కులమువారి సమ్మతిని ఆపిల్ల తండ్రిని రప్పించి నీబిడ్డను విడిచెదవా లేక బ్రాహ్మణకులమును నాశము చేసెదవాయని యడుగఁగా వాఁడు బ్రాహ్మణకులమును జెఱుప నిష్టములేక తనకూఁతుఁ దెచ్చి యాబ్రాహ్మణునకు నొప్పగించెను. అప్పుడాయన నాశిశువును జంపనొల్లక నొకపెట్టెలో భద్రపఱచి యాపెట్టెను కావేరిలో విడిచెను. ఆపెట్టె కావేరిలో బహుదూర మరిగి యొకఘట్టమునం జేరెను. ఆఘట్టమునం దపుడొక విద్వాంసుఁడు స్నానమునకు వచ్చి యాపెట్టెలో నున్న యా

బిడ్డను గని సంతతి లేనివాఁ డగుటవలన నాబాలను గొనిపోయి పెంచి విద్యాబుద్ధులు చెప్పుచుండెను.

ఇచటఁ గొన్ని దినములకు విధివశమున వేదమాళి గతించెను. అందువలన నాతని పుత్రుఁడగు పిరలీ విద్యాభ్యాసమునకై విదేశమునకుఁ బోవలసినవాఁ డాయెను. అట్లాతఁడు తిరుగుచు నీ పిల్లయున్న బ్రాహ్మణునియింటికివచ్చెను. ఆబ్రాహ్మణుఁ డా చిన్నవానికిఁ దన పెంపుడుకూఁతు నియ్యఁదలఁచి యాతనిం దనయింట నుంచుకొని సమస్తవిద్యలు గఱపెను. అటుపిమ్మట నాబ్రాహ్మణుని పెంపుడు కూఁతునకును, పిరలీకిని వివాహ మగుట వారు అన్యోన్యానురాగము గలిగియుండిరి. ఇట్లు కొన్ని దినములు గడచినపిదప నొకదిన మా చిన్నది దొరకిన సంగతి పిరలీకిఁ దెలిసెను. అంత నాతఁడీ చిన్నది తనతండ్రి కావేరిలో విడిచిన మాలపిల్లయని తెలిసికొని మిగుల చింతించి భార్యకును, మామగారికిని దెలియకుండ నొక నాఁటిరాత్రి లేచి పలాయితుఁడయ్యెను. మఱుసటిదినమున నాకన్యక తనభర్తను గానక చింతనొంది మిగుల వృద్ధగు తనతండ్రి యాజ్ఞనుబొంది పెనిమిటిని వెదకఁబోయెను

ఇట్లామె వెదకుచుంబోయి యొకచోట నాతనిఁ గనెను. అప్పు డామె యింటికిరండని యెంత వేఁడుకొనినను పిరలీ విననందున నాచిన్నది విసిగి యాతనితో నరుగసాగెను. ఇట్లాదంపతులు కొన్నిదినము లరిగినపిదప నొకచోట భార్య నిదురించియుండఁగా నామెను వదలి పిరలీ మరల నరిగెను. తదనంతర మామె లేచి తనప్రాణేశ్వరుని వెదకుచుండెను. ఇంతలో నొకధనవంతుఁ డామె కగుపడి

యీమె వృత్తాంతమునంతను దెలిసికొని యీమెను తనపుత్రిక నుగా భావించి తనగ్రామమునకుఁ దోడ్కొని పోయెను. ఈమె పోయిన స్వల్పకాలముననే యీ ధనవంతుఁడు కాలముచేసెను. ఆయన తన మరణకాలమునందు తనకుఁగల ధనము తనకొడుకులకుఁ సమానముగా నిమెకుఁ బంచియిచ్చెను. ఆధనముతో నీమె రెయొక యన్నసత్రముకట్టి పాంధులకు నన్నదానము చేయుచుండెను. ఈప్రకారము కొన్నిదినములు గడచినవెనుక నాసత్రమునకు పిరిలీవచ్చుట తటస్థించెను. అంతనామె తనయలవాటు ప్రకారము నతిథిని సత్కరించి యాతనికి నన్నపానాదుల నిచ్చెను. భోజనానంతర మాతఁడు ఆమెవృత్తాంతము నడిగి తెలిసికొని యామె తనపత్నియని గుర్తించెను. అపుడామెయొక్క సత్ప్రవర్తనముఁగని యాతనికి మిగుల జాలిపుట్టెనుగాని మరలఁ దనను వెంబడించునను భీతిచేత తనసంగతి యామె కెఱుక పఱుపకుండెను.

మఱునాఁ డాతఁడు ప్రయాణముగు పోవుచుండఁగా నామె యాతని నంపుటకుఁ బైటికి వచ్చి మిగుల నుపచార వచనములతో నతనిని సాగనంపఁ జొచ్చెను. అప్పుడామె వినయభాషణమువలన పిరిలీ మిగుల దయగలవాఁడై తనభార్యకుఁ దను నెఱిఁగించెను. అప్పు డాయన నామాట నీవు వినవలయుననియు, నిన్ను నే నెప్పుడును విడువననియు భార్యతోఁ బ్రమాణముజేసెను. అంత నామెయు పిరలీయుఁ గలిసి మెలిసి యుండిరి. కొన్నిదినము లాదంపతు లచటనుండి మరల దేశాటనము చేయసాగిరి. అట్లు తిరుగుకాలములో వారికిఁ గ్రమముగా అవ్వయక్, ఆపగ్గా, వాలీజ్, మురగ్గాలను నలుగురు

కూఁతులును, తిరువళ్ళేర్, అధికమాన్, కపిలర్, అను ముగ్గురు పుత్రులును గలిగిరి. వీర నందఱిని వీరలీ యాజ్ఞవలన నాతని భార్య పుట్టిన చోటులనే విడిచిపోవు చుండెను. ఈపిల్లలందఱు వేరువేరు జాతులవారలకు దొరకి వారిచేఁ బెంచఁబడి మిగుల విద్వాంసులైరి. వా రందఱిలోనఁ బెద్దది అవ్వయార్. ఈమెను తలిదండ్రు లరణ్యమున విడిచిపోఁగా నొకవిద్వాంసుఁడు కొని పోయెను. ఆవిద్వాంసునిపే రెచటను గానరాదు. ఆయన యీమెకు విద్యాబుద్ధులు చెప్పి గొప్ప పండితను జేసెను. ద్రావిడమునం దీమె గొప్పకవయిత్రి. ఈమెకు నీతిశాస్త్రము, జ్యోతిశ్శాస్త్రము, వైద్యశాస్త్రము, భూగోళశాస్త్రము, రసాయనవిద్య మొదలయిన విద్యలలో మిగుల ప్రవీణురా లయ్యెను. ఈమె ఆయావిషయములలో నొక్కొక్క గ్రంథము రచియించెను. ఆగ్రంథము లిప్పుడును ద్రావిడదేశమునందు పాఠశాలలో బాలురకు నేర్పుదురఁట. ఇందువలననే యీభాషయందలి యీమె పాండిత్యము వెల్లడియగుచున్నది. ఈమె కల్పవిద్యాప్రభావమువలన ౨౪౦ సంవత్సరములు జీవించెనని యొకవదంతి గలదు. ఈమె తనజన్మమంతయు కన్యాత్వముననే గడపెను. ద్రవిడదేశమునం దీమెను మిగుల పూజ్యురాలినిగా లోకులు మన్నింతురు.

రెండవదియగు ఆపగ్గా;— ఈమె అవ్వయార్ చెల్లెలు. ఈమెయు ద్రావిడజాతి కవయిత్రి. ఈమె ఆర్కాట్ మండలములోని ఊటకాఁడు అనుగ్రామమునందు జన్మించెను. జననీజనకు లామె నచటనే విడిచిపోయిరి. తదనంతర మీమె నొక రజక స్త్రీ పెంచెను. తదనంతర మీమెకు విద్యాబుద్ధు లెట్లు

వచ్చెనో తెలియదుగాని యీమె ద్రావిడమున నీతిశాస్త్రము నొకదానిని రచియించెను. ఈమెయు యావజ్జన్మము వివాహము చేసికొనలేదు.

మూఁడవదియగు వాలీజ్:— ఈమె అవ్వయక్ రెండవ చెలియలు. తల్లిదండ్రు లీమెను విడిచి చన కాక్ వాక్ కులమువా రీమెను బెంచిరి. ఈమె యనేక ద్రావిడకావ్యములను రచియించెను.

నాల్గవదియగు ముదగ్గా:— ఈమె అవ్వయర్ గారి మూఁడవ చెలియలు. ఈమె యొక వర్తకుల యింటఁ బెరిగెను. ఈమెయు ద్రావిడమున ననేక కావ్యములను రచియించెను. వీరందఱు తమ నిజమైనకులము నెఱుఁగకున్నను దమవిద్యా ప్రభావము వలననే జగత్ప్రసిద్ధలైరి. కాన విద్యవలననే మనుష్యులు పూజ్యతను గాంతురుగాని కులము వలనఁ గాదని తెలియుచున్నది.

## మహారాణి స్వర్ణమయి

బరిద్వాన్ ప్రాంతమునందున భట్టకోలను గ్రామమునందు నీచరిత్రనాయిక యగు మహారాణీస్వర్ణమయిగారు ౧౮౨౭వ సంవత్సరమున జన్మించెను. ౧౮౩౮వ సంవత్సరమున నీమెకు పదునొకండు సంవత్సరముల ప్రాయము వచ్చినందున నీమెను కాసిం బాజారు రాజకుటుంబములో విఖ్యాతిగాంచిన రాజా కిసన్నాధ రాయిబహద్దరుగారికి నిచ్చి యీమెను జననీజనకులు వివాహముచేసిరి. స్వర్ణమయి భర్తయగు రాజా కిసన్నాధరాయ బహద్దరుగారు రాజవంశస్థు లగుటచేత మహారాణీగారికి మిగుల మంచి సంబంధము దొరకెనని చెప్పుటకు సందియము లేదు. కాని పాప మామెను యీభాగ్యము చిరకాలమనుభవించుటకు నోచుకొనదయ్యెను. వివాహానంతరము కొద్దిదినములకే రాజుగారికి మనోభ్రమణము గలిగినందున వారు ౧౮౪౪వ సంవత్సరమున నాత్మహత్యచేసుకొనిరి. లేతవయస్సునందే మహారాణికిదియెట్టి ఘోరదుఃఖము ప్రాప్తించెనో చదువరులే యూహించుకొనఁగలరు. పతిమరణమేకాక యింకొక గొప్పయాపదకూడ నీమెకు సంప్రాప్తమయ్యెను. ఆమె పెనిమిటి మతిభ్రమణము గలిగి మృతినొందినందున నాయన తన యాస్తిని నంతను నప్పుడు రాజ్యము చేయుచుండిన "ఈస్టు ఇండియాకంపెనీ" వారికిం జెందునట్టుగా తనమరణశాసనమునందు వ్రాసిపోయెను. కాని

తనభార్య విషయమై యాశాసనమునం దేమియు వ్రాసియుండ లేదు. ఈమరణశాసనము ప్రకారము రాజాగారి సొత్తంతయు కంపెనీవారు స్వాధీనపరచుకొనిరి. ఇట్లు యౌవనకాలమునందే పతివియోగము, ధననాశమును సంభవించినప్పటికిని రాణిగా రత్యంతధైర్యము నవలంబించి యీయాపదలతోఁ బోరాడుటకు నిశ్చయించిరి. తనసొమ్మును పహరించిరని మహారాణిగారు "ఈస్టు ఇండియాకంపెనీ" వారిమీఁద "సుప్రీంకోర్టు"లో నభియోగము తెచ్చిరి. భర్త చిత్తచాంచల్యము కలిగినప్పుడు వ్రాసినదికావున నామరణశాసనము చెల్లఁగూడదని యచ్చట తీర్పుచేయఁబడినందున స్వర్ణమయి గారికిఁ దిరిగి తమ సొత్తంతయు లభించినది.

ఇట్లు పోయిన సంస్థానమంతయు స్వప్రయత్నముచేతఁ దిరిగి సంపాదించిన పిమ్మట మహారాణిగారు తనధనమును సద్వ్యయము చేయ నారంభించిరి. సంతతౌదార్యముచే నీమె యుభయావాశములకును, దనసంస్థానమునకును భూషణతుల్యురాలాయెను. సత్కార్యముల కీమె చేయు నధిక ధనవ్యయమును జూడఁగా నిధన మీమెదికాక యీమెయొద్ద నెవ్వరైనను దాఁచిన ధనము నీమె యిట్లు పంచిపెట్టుచున్నదియేమో యని సందేహము కలుగుచుండెను. ఈమె ఫలాపేక్ష లేక చేయుదానధర్మములందఱికి నీమెయందు మహాగౌరవమును గలుగఁజేయుచుండెను. ఒకటియని చెప్పనేల? ఈమె కేవలము ఔదార్యముయొక్క భౌతికావతారమనియే చెప్పవచ్చును. స్వర్ణమయి గొప్ప విద్వాంసురాలుగాదు; గొప్పశాస్త్రములను చూడలేదు. ఐనను దేశక్షేమమునకును, ప్రజల సౌఖ్యమున

కును నత్యంతావశ్యకమైన పరోపకారమును విద్యయందీమె యసమానమైన పాండిత్యమును సంపాదించి యుండెనని మాత్రము చెప్పవచ్చును. ఆపన్నులను విపత్తునుండి తొలఁగించుట, అనాథవితంతుపుల నేత్రంబులనుండి ప్రవహించు కన్నీటినాపుట, క్షుధార్తులగువారికి నన్నము పెట్టుట, వస్త్రహీనులకు వస్త్రము లొసంగుట, ఇండ్లు లేనివారికి గృహదానము చేయుట, విద్య నెఱుఁగని వారికి విద్యాదానము చేయుట, గ్రంథకర్తలను సన్మానించి వారిచే సద్గ్రంథములఁ జేయించుట, వ్యాధిగ్రస్తుల కౌషధంబు లిప్పించుట మొదలగు పరోపకార కృత్యంబులు చేయుట కెట్టివిద్యానైపుణ్యము కావలయునో యట్టివానియందు సున్నగమయి పారంగతయయి యుండెను. ఈరాణికి సంతానము లేకపోయినను నీమె విశ్వమే తన కుటుంబ మని యెంచుచుండెగాన నాపదయందుఁ జిక్కుకొనువా రందఱు నీమె సంతానమనియే చెప్పనచ్చును. అయితేయీమె స్త్రీయైనందున యుక్తాయుక్తవివేచనము లేక దానము చేయు చుండెనని యెంచఁగూడదు. స్వర్ణమయి పాత్రాపాత్రములఁ గనుఁగొనియే మఱి దానము చేయుచుండెను. ఈమె మంత్రి యగు రాయరాజీవలోచన్ రాయబహద్దరుగారు గొప్ప విద్వాంసులును, ప్రజ్ఞావంతులును, పరోపకారదక్షులును నై యుండినందున దానము చేయునెడ రాణిగారి కెప్పుడును సహాయులయి యుండుచుండిరి. రాణిగారి ధార్మికబుద్ధి యిట్టిదని చెప్ప నిలవిగాదు స్వర్ణమయిగారు స్వహస్తముతో దానము చేయని దిన మొకటి యయినను గానరాకుండెను.

ఈమె చేయుధర్మకార్యముల సంగతి విని దొరతనము వారీమె కనేకపర్యాయము లనేకబిరుదముల నొసంగిరి. ఈమె యౌదార్యము విక్టోరియాచక్రవర్తిని గారికిఁగూడ బాగుగాఁ దెలియును. మహారాణిగారి పరోపకారమునకు శ్రీచక్రవర్తిని గారుమిగుల సంతోషించి యీదేశమునం దిదివఱ కెవ్వరికి నియ్యని "క్రౌన్ ఆఫ్ యిండియా" యను పదవిని స్వర్ణమయి గారికినిచ్చిరి. ధనసంపన్నలయినస్త్రీలు సాధారణముగాఁ దమ యన్నదమ్ములు మొదలయిన బంధువులకు సహాయము చేయుదురు. కాని తదితరులకుఁ జేయరు. కాని స్వర్ణమయిగారియందుమాత్రము బాంధవపక్షపాతము, స్వజాతిపక్షపాత మన్న మాట లేశమాత్రమైనను లేకుండెను. ఆమె సర్వజనులను సమదృష్టితోఁ నరయుచుండెను.

౧౮౮౭వ సంవత్సరమున రాణిగారికిఁ దమయాస్తియంతయు స్వాధీనమయ్యెను. అదివఱకు సంస్థానముమీఁద విశేషఋణము పెరిగియుండెను. స్వర్ణమయి తెలివిగల మంత్రిని నియమించికొని కొద్దిదినములకే సంస్థానమునకుఁ గల ఋణమంతయుఁ దీర్చివేసెను. ఇంతియకాక ప్రతిసంవత్సరమును వచ్చు నాదాయమునుగూడఁ బెంచెను. కాని యిట్లధికముగ వచ్చుధనమును రాణిగారు నగలకుఁగాని మఱియేవ్యర్థకార్యములకుఁగాని వెచ్చింపక రాజ్యమునందలి ప్రజల నాగరికత వృద్ధిచేయుటకును, పన్నులభారముచే నణఁగిపోవుచున్న వ్యవసాయదారులకును సహాయము చేయుటకును, నింక నెన్నియో మంచికార్యములకును వినియోగించిరి. మహారాణిగారు చేయు మహాకార్యములం జూచి ౧౮౭౧వసంవత్సరమున దొర

తనమువారు ఒక గొప్పసభ జరిగించి యందు సువర్ణమయి గారికి "మహారాణి" యనినబిరుదు నొసంగిరి. ౧౮౭౪ వ సంవత్సరమున హిందూదేశమునందంతట గొప్పక్షామము కలిగి యన్నము లేక ప్రజలు నాశము నొందుచుండినప్పుడు మహారాణిగారు వేలకొలఁది కుటుంబములకు నన్నదానము చేసి యనేకులను మృత్యుముఖమునుండి విడిపించిరి. అన్నివిధముల నుత్తమురాలగు నీమెకుఁ బ్రభుత్వము వారు "మీ సంస్థానమునకు మీరు ముం దేర్పఱుపఁ బోవువారసుదారునికిఁ గూడ మేము 'మహారాజా' యను బిరుదు నొసంగితి"మని తెలియఁజేసిరి.

౧౮౭౮ వ సంవత్సరమునందు "మెంబరు ఆఫ్ ఇంపీరియల్ ఆర్డర్ ఆఫ్ ది క్రౌన్ ఆఫ్ ఇండియా" యను బిరుదు రాణిగారి కొసంగఁబడియె. ఆసమయమున దొరతనమువారు కాసింబాజారులోని రాజగృహమునందు రమ్యమయిన గొప్ప సభ చేసి రాజప్రతినిధి గారికి బదులుగా పీకాకుదొరగారు స్వర్ణమయిగారి నప్పుడు సంబోధించి యీప్రకారము వక్కాణించిరి :—

"పరోపకారార్థమై తమ రనేక పర్యాయములు గొప్ప ధనరాసులు వెచ్చించిన సంగతి దొరతనమువారు విని తమను గౌరవించుటకై తమకీబిరుదు నిచ్చుచున్నారు...౧౮౭౧ వ సంవత్సరమునుండి ౧౮౭౯ వ సంవత్సరమువఱకు తమరు ౯,౨౯౦౦ రూపాయిలు జనహితకార్యములకయి వ్యయపఱచితిరి. ఈ ధనము తమయాదాయముయొక్క షష్ఠాంశమునకంటె నధికమయినది. ఇంతియకాక దానము చేయునప్పుడు తమరు చూపెడు వివేచనాశక్తి, దూరదర్శిత్వము మొదలయినవాని

విషయమయి తమరి నెంత కొనియాడినను దక్కువగనే. ఈ దేశమునందు దానపరులలో నిష్కామబుద్ధిచే దానము చేయువారు బహుస్వల్పముగా నున్నారు. కడమ వారందఱును సహాయము చేయవలసిన కార్యముయొక్క యోగ్యతను జూచి ధన మీయక తమకత్యంత కీర్తి కలుగవలెనను నభిలాషచేత ధర్మముఁ జేయుదురు. తమరుమాత్ర మట్లు గాదు. తమరు కుడిచేతఁ జేయు దానము నెడమచేతి కయినను దెలియకుండఁ జేసెదరు..........ఒక్క దాన ధర్మములయందే కాక మీకు సంస్థాన నిర్వాహకత్వమునందును దక్షత చూపించుచునే యున్నారు. అందువలననే మీజమీందారీ కడమవానివలె యప్పులలో మునిఁగి తేలుచుండక దినదినాభివృద్ధిఁ గాంచుచున్నది”

ఇట్లు పీకాకుదొరవారు చెప్పినవానిలో నేదియు నతిశయోక్తి కాదు. ఈమె చచ్చుటకుఁ బూర్వము కొన్ని సంవత్సరములనుండియుఁ దనయాదాయమునుండి ప్రతి సంవత్సరము ఒకలక్షరూపాయిలు లోకహితకార్యములకయి వ్యయపఱుప నిశ్చయించియుండిరి. దేశమునం దెచ్చట నేయాపద సంభవించినను లేక మఱి యేపుణ్యకార్యము చేయవలసి వచ్చినను స్వర్ణమయిగారు తా ముందడుగిడి వెనుకఁదీయక ధనమును వ్యయపఱుచు చుండిరి. ఇట్టి వనితలే కదా తమ సుగుణముల చేత నొక తమదేశపు గరితలకే కాక ప్రపంచమం దంతటనున్న స్త్రీవర్గమునకు గౌరవమును గీర్తియును దెచ్చెదరు. ఈసద్గుణరాశి ౧౮౯౭వ సంవత్సరమున పరలోకమున కేఁగెను. ఈమె యనంతరము రాజ్య మీమె యత్తగారి వశమయ్యెను.

# వనలతా దేవి

బంగాళ దేశమునందలి నదియా జిల్లాలోఁ గృష్ణనగర మను గ్రామమున శశిపాద బనర్జీయను బ్రాహ్మమతావలంబి పోష్టాఫీసులో సూపరింటెండెంటుగా నుండెను. ఈమహనీయుఁ డనేక సంవత్సరములనుండి హిందూవితంతు శరణాలయము నొక దానిని స్థాపించియున్నాఁడు. ఈ యౌదార్యవంతుని బిడ్డ లందఱును సత్కార్యములనే చేయుచున్నారు. వనలతాదేవి యీతనిపుత్రి. ఈమె ౧౮౭౯వ సంవత్సరము డిశంబరు ౨౨వ తేదిని కృష్ణనగరమున జన్మించెను చిన్నతనమునుండియే యీమె మిగుల సద్గుణవతియు, దయాశాంతాదిగుణసహితయు నయి యుండెను. ఈమె బుద్ధిసూక్ష్మతను గని శశిపాద బనర్జీగా రీమెకు బాల్యమునుండియే విద్య నేర్ప మొదలుపెట్టిరి. ఈమె యెనిమిది సంవత్సరముల దయినప్పటినుండియుఁ గవిత్వశక్తి యీమె కలవడియెను. వనలతాదేవికి సేవా, ప్రేమ, వైరాగ్యములను నిగుణత్రయం బెంతయుఁ బ్రియంబైయుండె. ఆమె నడవడిలోను, కవిత్వములోను, ఉపదేశమునందును ముఖ్యముగా నీమూఁడు శబ్దములు గానవచ్చుచుండెను. ఈమెకుఁగల మాతృపితృభక్తియు, పతిప్రేమయు మిగులస్తుత్యములు. పదమూఁడు సంవత్సరముల వయస్సున వనలతాదేవి వరాహనగరమునందలి వితంతు శరణాలయములో 'సుమతీ సమితి' యను నొక స్త్రీ సమాజము నేర్పఱచెను. అంత చిన్నవయస్సుననే యీమె తన తోడి బాలికలతో నేర్పఱచిన యీసమాజమునకు మర్యాద

గల యనేకకుటుంబములలోని ప్రౌఢ స్త్రీలును సామాజికు రాండ్రైరి. ఆసమాజముయొక్క యుద్దేశములను గని ప్రవీణు లగు పురుషులును మెచ్చుచుండిరి. ఈసభ నానాఁటికి వృద్ధిఁ బొంది యనేక స్త్రీజనోన్నతకార్యములను జేయఁ గలుగుచున్నది. వనలతాదేవి బ్రహ్మమతావలంబిని యైనను నామె సద్గుణ సదుద్దేశములవలన నామె యన్నిమతములవారికి నిష్టురాలు గానే యుండెను. ఈమె యాదివారపు పాఠశాలను స్థాపించి ప్రతి భానువారము బాలురకును బాలికలకును, మంచి నీతులను గఱపుచుండెను. నాఁటిదినమున నామె తానురచియించిన యనేక నీతిపరములగు పద్యములను, హృద్యములగు కీర్తనలను వారికినేర్పి వారిచే మరల వానిఁ జదివించి యప్పుడప్పుడా బాలకులకుఁ దెలియునట్టుల బోధపరములగు నుపన్యాసముల నిచ్చుచు వారి మనసులయందు నీతి జ్ఞానములు పాదుకొనునటులఁ జేయుచుండెను. ఆమె యాబాలకులకు వినోదముగ నుండునటుల గద్యపద్యరూపములగు నాటకములను రచియించి యాపిల్లలచే నానాటకముగ నాడించి యందుమూలమున వారికిఁ గొంతసద్గుణములను నేర్పుచుండెను. ఆదివారము నాఁడీమె యొద్దికి వచ్చుటకు బడిపిల్లలందఱెంతో సంతోషపడుచుండిరి.

ఈమె మూఁడు సంవత్సరములనుండియు 'సుమతీ సమాజా'అను మతంబున నంతఃపురమనుమాసపత్రి'కను స్త్రీలకొఱకై ప్రచురపఱచుచుండెను. ఆ మాసపత్రికకు లేఖక, ఉపలేఖక, కార్యదర్శులందఱును స్త్రీలే! ఈపత్రికలోని సంగతులును స్త్రీలకత్యంతోప యుక్తములుగా నుండును. దీని యంతః

స్వరూపమువలనే బాహ్యస్వరూపమును మిగుల నందముగానుండును. సాధారణముగా నీ మాసపత్రిక ప్రతి బంగాలీకుటుంబీకులును దెప్పించుచుందురు. వనలతాదేవిచే స్థాపింపఁబడిన ఈ సమాజము వలనను, నీ మాసపత్రిక వలనను స్త్రీలు స్వతంత్రముగా నేకార్యమును జేయలేరను కొందఱి యభిప్రాయము భ్రమయేమనియు స్త్రీలు విద్యనుగాంచి బుద్ధివికాసమునుగాంచినచోఁ బురుషుల సహాయ మొంతమాత్రము నక్కఱలేక యేయనేక సత్కార్యములను గ్రంథరచనలను జేయఁగలరనియు నందఱకును దెల్లంబయ్యె! వనలతాదేవి స్త్రీలయున్నతినే సదా గోరుచున్నందుకై యనేక యుపాయములను జేసెను. ఆమె మరణమునకుఁ బూర్వము కొన్ని మాసములనుండి విశేషరోగగ్రస్తగా నుండియు నంతఃపురమునకు వ్యాసములును, బద్యములును వ్రాయుచునే యుండెను. ఆమె మరణసమయమునందును "అంతఃపురము; సుమతీసమితి" యను రెండుశబ్దముల నుచ్చరించి వాని శాశ్వతమును గోరుచుఁ బ్రాణముల విడిచెను.

ఈమెకుంగల గృహకృత్యములయందలి శ్రద్ధయుఁ, బతియందలి యనురాగమును, శిశుపోషణమునందలి నేర్పును మిగుల వర్ణనీయములు. ఈమె సాధారణముగా గృహకృత్యములను దానే నెఱవేర్చుచుండెను. రుగ్ణతలో నుండినప్పుడు సహిత మీమె యింటికిఁ గావలసిన వస్తువులను దానే తెప్పించుచు, నింట నేమివండవలసినదియుఁ దానే చెప్పుచు నింటి యందుండువారి యందఱ క్షేమము నరయుచుండెను. ఆమె రుగ్ణతలో సహిత మింటి కర్చులను వ్రాయుటమానక తలాపున నొక పుస్తకమును, పెన్సలును నుంచికొనుచుండెను.

వనలతాదేవి తనభర్తను సేవలను దైవతుల్యునిగా భావించి యతని పనిని నౌకరులచేఁ జేయింపక తానే చేయుచుండెను. ఆమె పతిభక్తిని గాంచినవా రందఱు నిజమయిన పతిభక్తియనిన నిదియేగదాయని మెచ్చుచుండిరి. వ్యాధిలోనుండి భర్తకుఁ దాను భోజన మిడలేని సమయమునందు సహిత మామె భర్తకును, గుమారునకును దనయెదుట భోజనము పెట్టించుచుండెను. ఈమె మరణదినమునం దీమె భర్తకుఁ గొంచెము దేహమస్వస్థముగా నుండెను. ఈమె మరణమున కరగంటకు ముందు భర్త వెచ్చని చొక్కా దొడిగికొనకుండుటను జూచి "మీశరీర మస్వస్థముగానుండినను మీరు వెచ్చనిబట్టలు తొడిగికొనక యేలయుంటిర"ని యాయంగీని తెప్పించి యాతని కిప్పించి తొడిగికొనునట్లు చేసెను. తనమరణవేదన నొకమూల నుంచి పతికళ్యాణమునే గోరునీకాంతయొక్క పతిభక్తి నెంతఁ గొనియాడినను దీఱదు. అనేకులను కొడుకులకును, గూఁతులనుగని వారినిఁ దననేర్పుచేఁ బెంచి పెద్దవారినిఁజేసి తనకుఁగల శిశుపాలనము నందలి నిపుణతను వెల్లడింపఁ దనకు సమయము చాలకున్నను నీమె మిగుల దక్షతతోఁ బెంచి విడిచిపోయిన మూఁడుసంవత్సరముల బాలుని చర్యలు చూచినచో నామెకుఁ దెలిసిన మాతృకర్తృత్వ మహత్వ మితరమాతలకుఁ దెలియుట దుస్తరమని యందఱకును దోఁచును. అంత చిన్న శిశువు తనతల్లి యాజ్ఞప్రకారము వర్తించుచుండెను. ఇంత చిన్న వయసుననే వాని తల్లి వాని కెన్నోనీతులను గఱపెను. వనలతాదేవికిఁ దన రుగ్ణత కుదురదని స్పష్టముగాఁ దెలిసినపిదప నొకదినమునం దెవ్వరును లేనిసమయమునఁ దనచిన్నికొమరునిఁ దనయొద్దికిఁ

బిలిచి "నాయనా! నాశరీరమున రోగము హెచ్చెను. అది యిచటఁ బాగుకాదు. నేనుపరమేశ్వరుని సన్నిధికరిగిన నాబాధ నివారణమగును. తదనంతరము బాగయి వచ్చెదను. నేను పోవునపుడు నీవు ఏడ్వక సంతోషముగా బుద్ధి కలిగియుండుము." అని చెప్పఁగా నాబాలుఁ డౌననియెను! తదనంతర మామె ౧౯౦౦వ సంవత్సరము నవంబరు ౩వ తేది రాత్రి స్వర్గస్థయయ్యెను. ఆమెకొఱకై యామెబంధువు లందఱును విలపించుచుండిరి. అప్పు డాశిశువు తల్లిమాటల యందలి విశ్వాసము వలన నెంతమాత్రము నేడువక గులాబిమొదలగు పూవులను దెచ్చి తల్లిశవముపై నుంచి "యమ్మా దేవునిసన్నిధికిఁ బొమ్ము బాగయిరమ్ము" అని చెప్పి యామెను గొనిపోయిన పిదప నేడ్చువారినిఁ గని "మీరేల యేడ్చెదరు? మాయమ్మ రోగమిచట కుదరనందున దేవునికడకరిగెను. అచట బాగయి మరల రాఁగలదు. ఇట్లని నాతోఁ జెప్పిపోయినది" యని తన ముద్దుమాటలతోఁ జెప్పెను. ఈవనలతాదేవి మరణము కామె బంధువులే కాక యామెను గనినవారును, నామె సద్గుణములను విన్నవా రందఱును మిగుల దుఃఖించుచున్నారు. ఈమెకు మరణసమయమున నిరువదియొకటవ సంవత్సరము. ఈమె యింత యల్పవయస్సునచే మృతినొందుట దేశముయొక్క దురదృష్టమనియే చెప్పవలయును.

# గణపాంబ

ఈమె బేతరాజునకు భార్య; గణపతిదేవునకుఁ గూతురు ఈగణపతిదేవుఁడు క్రీ. శ. ౧౨౮౯వ సంవత్సరమునుండి ౧౨౬౨వ సంవత్సరమువఱకును నోరుగంటిరాజ్యముఁ బాలించిన రాజేయైయుండినచోనిగణపాంబరుద్రమదేవికిఁ గూతురైయుండును. కానియిందునకుఁ బ్రబలనిదర్శనము లేవియుఁగానరాకున్నవి. గణపాంబయుఁదనపతి మరణానంతరమునందాతని యేలుబడిలో నుండిన యాఱువేలగ్రామములనుమిగుల నేర్పుతోఁబాలించెను. ఆమె మిక్కిలి యౌదార్యవతియై యనేకవిధములైన ధర్మకార్యములను జేసెను. ఈమె ధర్మకృత్యములను జరితమును దెలుపు శిలాశాసనమొకటి కృష్ణామండలములోఁ జేరియున్న గుంటూరు తాలుకాలోనున్నది. దానిలోని కొన్ని సంగతుల నిందుఁ బొందుపఱచెదను.

"మిగుల ప్రసిద్ధిఁగాంచిన కాకతీయవంశమునందు అనేక ప్రభువులు రాజ్యము చేసినమీఁదట వైరిభీకరుఁడగు బేతరాజు సింహాసనారూఢుఁడయ్యెను. శివునకుఁ బార్వతివలెను, విష్ణువునకు లక్ష్మివలెను, ఈబేతరాజునకు గణపాంబ ధర్మపత్నియయ్యెను. ధర్మకటకపురిని మిక్కిలి యోగ్యముగాఁ బాలించి బేతరాజు కీర్తిశేషుఁడయ్యెను. తదనంతరం బాతనిభార్యయగు గణపాంబ సింహాసనమెక్కెను. ఈమె భర్తయొక్క సుగతి

నభిలషించి యాయనపేరిట ధన్యకటక పురమునం దొక దేవాలయము నిర్మించెను. ఈ యుద్దేశముతోనే యీరాణి బంగారు శిఖరముగల యింకొకగుడిని గట్టించి దానిలో బేటేశ్వరుఁడను లింగమును బ్రతిష్ఠింపఁజేసెను. ఈగుడికి నైయీదేవి ఫలవంతమగు బీనదీవియను గ్రామము నొసంగెను. ఈమహనీయురాలు ధన్యకటకపురిలో ౧౨గురు బ్రాహ్మణోత్తములకు ౧౨ భూపసతులును ౧౨ గృహములును దాన మొసంగెను. ఈమె తనతండ్రియగు గణపతిదేవుని పేర గణపేశ్వరుని(శివుని) యాలయమొకటి కట్టించెను. ఈగుడికై యీరాణిచింతపాడు గ్రామము నొసంగెను. ఈ రాణిహస్తములు సతతము శివుని నర్చించుటయందే వినియోగించెను. శివుని మాహాత్మ్యమును బ్రకటించు శ్లోకములే యామె కానందము నిచ్చుచుండెను. ఈ రాణి వేదములయం దధిక విశ్వాసముకలది కావుననే విశాల రాజ్యక్లేశము కలిగియున్నను ఆనందముతో దినములు గడపెను. రెండవపార్వతి యనఁదగిన యీమె మహాత్మ్యము నెవ్వరు తగినట్టుగ వర్ణింపఁగలరు?" ఈ మహనీయురాలిచరితమును గుఱించి యింతకంటె నధిక మేమియుఁ దెలియదు కాన విధిలేక మిగులచింతతో దీనిని ముగించుచున్నదాన.

Vedam and Co., Printers, 13, Oil Monger Street, Madras.